www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



సంచలన సూర్యవంశీ

పిన్న వయసులో ఐపీఎల్ శతకం

14 ఏళ్ల 'రాజస్థాన్' చిన్నోడి ఘనత

35 బంతుల్లో 7 ఫోర్లు, 11 సిక్స్‌లతో శతకం

ఐపీఎల్ ఆరంభమైన మూడేళ్లకు పుట్టాడు.. ఇప్పుడు అదే ఐపీఎల్‌లో సంచలనానికి కేంద్ర బిందువు అయ్యాడు 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ. సోమవారం గుజరాత్ టైటాన్స్‌తో మ్యాచ్‌లో సుడిగాలి ఇన్నింగ్స్‌తో చరిత్ర సృష్టించాడు. 35 బంతుల్లోనే సెంచరీ చేసి పలు రికార్డులు బద్దలు కొట్టాడు. 10

మంగళవారం | 29-4-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 | సంచిక (Issue) : 13 | శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్ల పక్షం, తిథి: విదియ సా.5:32 తదుపరి తదియ, నక్షత్రం: కృత్తిక రా.6:47 తదుపరి రోహిణి, వర్జ్యం: ఉ.8:12-9:37, దుర్ముహూర్తం: ఉ.8:25-9:15, రా.10:14-10:58, అమృతఘడియలు: సా.4:40-6:04, రాహుకాలం: మ.3:00-4:30, సూర్యోదయం: 5:53, సూర్యాస్తమయం: 6:31 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



కశ్మీర్‌కు మళ్లీ కళ

తిరిగి వస్తున్న పర్యాటకులు

ప్రత్యేక డిస్కౌంట్లు ఇస్తున్న హోటళ్లు

పర్యాటకులకు భద్రతా సిబ్బంది, స్థానికుల అండ

భారత్ దాడి తథ్యం!

మా ఉనికికి ముప్పు వస్తే అణ్వస్త్ర ప్రయోగం జరుపుతాం

'రాయిటర్స్' ఇంటర్వ్యూలో పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా

స్థానిక టీవీ చానల్‌కిచ్చిన మరో ఇంటర్వ్యూలో మాట మార్పు

యుద్ధం జరిగే అవకాశం ఉందని.. వచ్చే 3-4 రోజులే కీలకం అని మాత్రమే అన్నానని.. తన మాటల్ని వక్రీకరించారని వెల్లడి

పాక్‌కు తుర్కియే అండ.. ఆరు సి-130 విమానాల అందజేత

ఉగ్రవాదులను సరిహద్దులకు దూరంగా తరలిస్తున్న పాక్

మోదీతో రాజ్‌నాథ్ భేటీ.. సరిహద్దుల్లో భద్రతపై వివరణ

ఉగ్రవాదులను తీవ్రవాదులంటారా?.. బీబీసీపై కేంద్రం ఫైర్

చిక్కినట్లే చిక్కి.. తప్పించుకుంటున్న పహల్గాం ఉగ్రవాదులు

ఇస్లామాబాద్, ఏప్రిల్ 28: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో.. తమ దేశంపై భారత్ సైనిక దాడి తథ్యమని పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ముహమ్మద్ ఆసిఫ్ రాయ్‌టర్స్ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సంచలన వ్యాఖ్యలు చేశారు. భారత్ దాడి చేసే అవకాశాల గురించి పాక్ సైన్యం ప్రభుత్వానికి వివరించిందని.. అందుకే తమ దళాలను బలోపేతం చేసుకున్నామని చెప్పారు. పాకిస్థాన్ పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉందన్న ఆయన.. తమ ఉనికికి ప్రత్యక్ష ముప్పు వాటిల్లే పరిస్థితి వచ్చినప్పుడు మాత్రమే

మిగతా 2వ పేజీలో...

ఇక నేవీలోనూ రాఫెల్ సత్తా!

త్వరలోనే భారత్‌కు 26 రాఫెల్ మెరైన్ జెట్‌లు

వాటిలో 22 సింగిల్ సీటర్లు.. 4 ట్విన్ సీటర్లు

రూ.63 వేల కోట్లతో ఫ్రాన్స్‌తో భారీ ఒప్పందం



రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులను దెబ్బతీయడమే వైసీపీ లక్ష్యం! ఇందులో భాగంగా... ఉర్సా క్లస్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌పై బురదజల్లుతోంది. తమపై జరుగుతున్న విష ప్రచారంతో ఉర్సా యాజమాన్యం తీవ్ర విచారం వ్యక్తం చేసింది. ఏపీలో పెట్టుబడులపై పునరాలోచన చేయాలని భావిస్తున్నట్లు పేర్కొంది.

ఉర్సా క్లస్టర్స్ అనామక కంపెనీ అన్నట్లుగా వైసీపీ చిత్రీకరిస్తోంది. అదే నిజమైతే... తెలంగాణ ప్రభుత్వం ఈ సంస్థను తమ రాష్ట్రానికి ఎందుకు ఆహ్వానిస్తుంది? ఇటీవల దావో‌స్‌లో జరిగిన ఎకనమిక్ ఫోరంలో ఇదే కంపెనీతో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఒప్పందం కుదుర్చుకోవడం నిజం కాదా?

కేంద్ర సంస్థలకు కోట్లలో వసూలు చేసి, సొంత మనుషులకు చౌకగా భూములు ఇచ్చినట్లు జగన్ రోత పత్రిక పిచ్చి రాతలు రాసింది. నిజానికి... అమరావతి పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటిదాకా ఎవరికీ ఉచితంగా భూములు కేటాయించలేదు. కేంద్ర ప్రభుత్వ సంస్థలు అమరావతిలో తమ కార్యాలయాల ఏర్పాటుకు ఆసక్తి చూపించాయి. దీంతో... ప్రభుత్వం ధర నిర్ణయించి అమరావతిలో భూమి కేటాయించింది. దీనిని ఇతర పరిశ్రమలకు రాష్ట్రంలో మరెక్కడో కేటాయించిన భూములతో ముడిపెట్టి విషం చిమ్మడం జగన్ పత్రికకే చెల్లింది.

రాష్ట్ర ప్రగతిపై పగ!

బుసలు కొడుతున్న వైసీపీ విషనాగు



పెట్టుబడులను అడ్డుకోవడమే లక్ష్యం

నాడు కియ, అమరావతి.. నేడు ఉర్సా

భూ కేటాయింపులపై దుష్ప్రచారం

ఉర్సాకు రూ.కోటి, రూ.50 లక్షలకు భూమి కానీ.. 99 పైసలకే ఇచ్చినట్లు జగన్ అసత్యాలు

విశాఖలో రూ.కోటికే నాడు వైసీపీ కేటాయింపులు

నేడు ప్రభుత్వం అదే విధంగా కేటాయిస్తే గగ్గోలు

ఉర్సా క్లస్టర్స్ అంతర్జాతీయ సంస్థ..

దావో‌స్‌లో ఒప్పందం కుదుర్చుకున్న తెలంగాణ

అయినా అనామకం అన్నట్లుగా వైసీపీ అవాకులు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

అధికారంలో ఉన్న ఐదేళ్లూ పారిశ్రామికవేత్తలను బెదరగొట్టడం, పెట్టుబడిదారులను తరిమివేయడం!

అధికారం పోయాకా... అదే పని! పెట్టుబడులపై తప్పుడు ప్రచారంతో విషం చిమ్మడం! 'మళ్లీ మేమొస్తాం' అంటూ భయపెట్టడం!

వైసీపీ నేతల తప్పుడు మాటలు... జగన్ రోత పత్రికలో తప్పుడు రాతలు! అప్పుడూ.. ఇప్పుడూ... జగన్ లక్ష్యం ఒకటే! ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు రావొద్దు! రాష్ట్రం అభివృద్ధి చెందొద్దు! 2014-19 మధ్య అమలు చేసిన కుట్రలకు ఇప్పుడు మళ్లీ తెరలేపారు. అవగాహన లేని మాటలు... అర్ధ సత్యాలు...

మిగతా 14వ పేజీలో...

కొన్ని శక్తులు కుట్రలు చేస్తున్నాయి 13

అభివృద్ధిపై బురద చల్లుతున్నాయి

వాటి పట్ల అప్రమత్తంగా ఉండండి

ప్రజలనూ అప్రమత్తం చేయండి

త్వరలోనే ఇండస్ట్రియల్ పార్కులు

కూటమి నేతలతో సీఎం టెలికాన్ఫరెన్స్

ఇదే రాజధాని!

అమరావతిపై పార్లమెంటులో చట్టం చేయిస్తా

అదనపు భూసమీకరణపై అపోహలొద్దు.. రైతులకు సీఎం భరోసా

అమరావతి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): అమరావతిని అంతర్జాతీయ స్థాయి నగరంగా చూడాలంటే ఫేజ్-2 భూసమీకరణ తప్పనిసరి అని ముఖ్యమంత్రి చంద్రబాబు రాజధాని రైతులకు తెలిపారు. సోమవారం సాయంత్రం రాజధాని రైతులు, రైతుకూలీలతో ఉండవల్లి నివాసంలో చంద్రబాబు సుమారు గంటన్నరపాటు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన రాజధాని అభివృద్ధిపై రైతుల అపోహలకు సవివరంగా సమాధానాలు ఇచ్చారు. అమరావతిని ఏకైక రాజధానిగా గుర్తిస్తూ పార్లమెంటులో చట్టం చేయిస్తానని రైతులకు హామీ ఇచ్చారు. రాజధాని అవసరాలకు అదనంగా భూమిని సమీకరించాల్సి ఉంటుందని వివరించారు. "గతంలో

మిగతా 13వ పేజీలో...





అమరావతి అభివృద్ధి విషయంలో తామంతా సీఎం వెంటే అంటూ చేతులెత్తి మద్దతు తెలుపుతున్న రాజధాని రైతులు

ఉద్యోగులు కాదు.. ఉద్యోగాలిచ్చేవారు కావాలి

దేశంలోని 7 బెస్ట్ వర్సిటీలు రాజధానిలోనే

అమరావతి అన్‌స్టాపబుల్

క్వాంటమ్ వ్యాలీగా ఏపీని మలుస్తా

విద్యార్థులతో ముఖ్యమంత్రి చంద్రబాబు

విట్‌లో 4 బ్లాకులు ప్రారంభించిన సీఎం

ఇప్పుడంతా నాలెడ్జ్ ఎకానమీదే భవిష్యత్తు.. ఈ రంగంలో రాష్ట్రాన్ని అగ్రభాగంలో నిలపాలి. అందువల్ల నాకు ఇప్పుడు కావాల్సింది లక్షల రూపాయల జీతాలు తీసుకునే ఉద్యోగులు కాదు.. ఇప్పుడు సంస్థలు స్థాపించే ఎంటర్‌ప్రెన్యూర్లదే రాజ్యం. ఉద్యోగాలు కల్పించేవారే ఇప్పుడు నాకు కావాలి. ఐటీ మాదిరిగా రాబోయే కాలమంతా క్వాంటమ్ కంప్యూటర్లదే. క్వాంటమ్ వ్యాలీకి అమరావతి కేరాఫ్ అడ్రస్ కానుంది. ఐటీ కోసం సిలికాన్ వ్యాలీవైపు చూసినట్లే క్వాంటమ్ టెక్నాలజీ కోసం ప్రపంచమంతా ఏపీవైపు చూడాలి. అందుకు తగిన విధంగా తీర్చిదిద్దుతా.. ఇన్నోవేషన్ హబ్‌గా మార్చుతా.

\- సీఎం చంద్రబాబు


13

బీజేపీ రాజ్యసభ అభ్యర్థిగా

పాకా సత్యనారాయణ

సాయిరెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన సీటు

భీమవరానికి చెందిన బీసీ నేతకు అవకాశం

ప్రస్తుతం పార్టీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ చైర్మన్

45 ఏళ్లుగా పార్టీకి సేవలు.. విధేయుడిగా పేరు

నేడు కూటమి తరపున నామినేషన్ దాఖలు


14

మిథున్‌రెడ్డి బెయిల్‌పై ఉన్న ఉద్రిక్తత

సరిహద్దుల్లోనూ లేదు!

ఒక్క వ్యాజ్యంపై నలుగురు సీనియర్ లాయర్లు వాదనలు వినిపిస్తారా?

సుప్రీంకోర్టు ధర్మాసనం వ్యాఖ్యలు

ఎంపీకి మధ్యంతర రక్షణ కొనసాగింపు

2 మేయర్ పీఠాలు టీడీపీ కైవసం



విశాఖ మేయర్‌గా ఎన్నికైన పీలా శ్రీనివాసరావు

విశాఖలో పీలా, గుంటూరుకు కోవెలమూడి

కుప్పం, తుని, పాలకొండ చైర్‌పర్సన్ స్థానాలూ టీడీపీ ఖాతాలోకే 13

'సహకార' పదవులు భర్తీ

10 డీసీసీబీ, 10 డీసీఎంఎస్‌లకు చైర్మన్లు

టీడీపీకి తొమ్మిదేసి.. జనసేనకు ఒక్కోటి

2-3 రోజుల్లో ప్రభుత్వ ఉత్తర్వులు

కాకినాడ, ఏలూరు, ఒంగోలు పెండింగ్

త్వరలోనే వాటికీ నియామకాలు

పీఏసీఎస్‌లకు పర్సన్ ఇన్‌చార్జులు? 3

జెత్వానీ ఎవరో తెలీదు!

కుక్కల విద్యాసాగర్ కూడా నాకు తెలియదు

నేను జిల్లా అధికారిని కాదు..

దర్యాప్తు అధికారిని అంతకన్నా కాదు

సీఐడీ ప్రశ్నలకు పీఎస్ఆర్ జవాబులు

విచారణకు సహకరించని సీనియర్ ఐపీఎస్

నేటితో పోలీసు కస్టడీ పూర్తి



విజయవాడ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): 'నేను జిల్లా అధికారిని కాదు.. ఏ కేసులోనూ దర్యాప్తు అధికారిని అంతకన్నా కాదు.. నాకేమీ తెలియదు..' సీఐడీ విచారణలో సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు చెప్పిన సమాధానాలివి. ముంబై నటి కాదంబరి జెత్వానీ గానీ, వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్ గానీ తనకు తెలియదని చెప్పారు. అధికారులు అడిగిన ప్రశ్నలకు ఆయన దాటవేత ధోరణిలో

మిగతా 14వ పేజీలో...





రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి పద్మ పురస్కారాలు అందుకుంటున్న నాగేశ్వర్‌రెడ్డి, బాలకృష్ణ

నాగేశ్వర్‌రెడ్డికి పద్మవిభూషణ్.. బాలయ్యకు పద్మభూషణ్

71 మందికి పద్మ పురస్కారాల అందజేత

రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా ప్రదానం

పురస్కారాలు అందుకున్న నలుగురు తెలుగువారు

మాడుగుల నాగఫణిశర్మ, అప్పారావుకు పద్మశ్రీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పద్మ పురస్కారాల ప్రదానోత్సవం రాష్ట్రపతి భవన్‌లో కనుల విందుగా జరిగింది. 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్రం దేశవ్యాప్తంగా 139 మందికి పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ పురస్కారాలను ప్రకటించింది. వారిలో 71 మందికి

మిగతా 12వ పేజీలో...



డీఎస్సీలో గందరగోళం! 12

'ఫిజికల్ సైన్స్' టీచర్ పోస్టుకు బీఎస్సీ అభ్యర్థులకు అర్హత నో

సైన్స్ సబ్జెక్టే లేని బీసీఏ వారికి అర్హత

ఉద్యోగార్థుల ఆందోళన


పహల్గాం పార్కులో ఆదివారం విదేశీ పర్యాటకుల సందడి

కశ్మీరుకు మళ్లీ కళ

పహల్గాం, ఏప్రిల్ 28: అందమైన పైన్ చెట్లు, ఆకర్షించే ప్రదేశాలతో మినీ స్విట్జర్లాండ్‌గా గుర్తింపు పొందిన పహల్గాంలో తిరిగి సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయి. ఏప్రిల్ 22న ఉగ్రవాదులు దాడి చేసి 26 మందిని బలిగొన్న తర్వాత కొన్ని రోజులపాటు స్తబ్దుగా ఉన్న ఆ ప్రాంతంలో ఆంక్షలు ఎత్తివేయడంతో మళ్లీ దేశీయులతో పాటు విదేశీ పర్యాటకులు సందడి చేస్తున్నారు. లిద్దర్ నది ఒడ్డున ఉన్న ప్రముఖ సెల్ఫీ పాయింట్ వద్ద ఫొటోలు దిగుతూ సరదాగా గడుపుతున్నారు. అలాగే అక్కడి ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్నారు. పర్యాటకులను ఆకర్షించేందుకు అక్కడి హోటళ్లు కూడా ప్రత్యేక డిస్కౌంట్లను అందజేస్తున్నాయి. పహల్గాంను చూసేందుకు కోల్‌కతా నుంచి వచ్చిన పర్యాటకుడు జయ్‌దీప్ ఘోష్ ఓ మీడియా చానల్‌తో మాట్లాడుతూ, "పహల్గాంలో ఆంక్షలు ఎత్తివేశారని తెలుసుకొని మేము శుక్రవారం రోజు ఇక్కడకు వచ్చాం. మార్కెట్‌తో పాటు ఇంకా కొన్ని దుకాణాలు మూసి ఉన్నప్పటికీ, ప్రస్తుతం ఇక్కడ మొత్తం సాధారణంగానే ఉంది. కాల్పులు జరిగిన బైసరన్ లోయ ప్రాంతాన్ని మినహాయించి మిగతా అన్ని ప్రదేశాలను చూశాం. ఇక్కడి సెక్యూరిటీ సిబ్బంది, స్థానిక ప్రజలు మాకు ఎంతో సహకరిస్తున్నారు." అని చెప్పారు. ఉగ్రవాదుల దాడికి ముందు పహల్గాంకు రోజుకు 3 వేల నుంచి 5 వేల మంది పర్యాటకులు వచ్చేవారు.

పహల్గాంపై నోరెత్తవద్దు!

» కాంగ్రెస్ నేతలకు అధిష్ఠానం హెచ్చరిక

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28: కాంగ్రెస్ అధిష్ఠానం ఎట్టకేలకు కళ్లు తెరిచింది. పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాద దాడి అంశంపై నోరెత్తవద్దని, వివాదాస్పద వ్యాఖ్యలు చేయొద్దని పార్టీ నేతలను ఆదేశించింది. ఉగ్రవాద దాడి, సింధు జలాల ఒప్పందం సస్పెన్షన్‌పై తమ నేతలు కొందరు పాకిస్థాన్‌కు మద్దతుగా మాట్లాడుతుండడం.. 26 మంది పర్యాటకులను హత్య చేస్తే తేలిగ్గా తీసుకోవడం.. వారిని చంపేముందు ఉగ్రవాదులు మతం అడగలేదనడం.. తమ వారి హత్యలను కళ్లారా చూసిన బాధితులే మతి చలించి మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించడం.. దీనిపై బీజేపీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించడంతో రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో నేతలెవరూ బహిరంగంగా ఎలాంటి వ్యతిరేక ప్రకటనలు చేయొద్దని రాహుల్, ఖర్గే ఆదేశించారని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు.

బీబీసీ వార్తాసంస్థకు కేంద్రం హెచ్చరిక

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28: బీబీసీ వార్తా సంస్థను కూడా కేంద్ర ప్రభుత్వం హెచ్చరించింది. 'పాకిస్థాన్ సస్పెండ్స్ వీసాస్ ఫర్ ఇండియన్స్ ఆఫ్టర్ డెడ్లీ కశ్మీర్ అటాక్స్ ఆన్ టూరిస్ట్స్' అంటూ ఆ సంస్థ పెట్టిన హెడ్డింగ్‌పై అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆ కథనంలోనే ఉగ్రవాదులను తీవ్రవాదులుగా పేర్కొనడమేంటని ప్రశ్నిస్తూ విదేశాంగ శాఖలోని ప్రచార విభాగం బీబీసీ భారత్ హెడ్ మార్టిన్‌కు ఒక లేఖ రాసింది. ఇకపై బీబీసీ ప్రసారాలను పర్యవేక్షిస్తుంటామని స్పష్టం చేసింది. కాగా, పాకిస్థాన్‌కు చెందిన 16 యూట్యూబ్ చానళ్లను మన దేశంలో నిషేధిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత రెచ్చగొట్టే కథనాలను, మతపరంగా సున్నితమైన కంటెంట్‌ను ప్రసారం చేస్తున్నందున ఈ చానళ్లపై నిషేధం విధించినట్లు ప్రభుత్వం తెలిపింది. హోం శాఖ సిఫారసు మేరకు డాన్, సామా టీవీ, బోల్ న్యూస్, రాఫ్తర్, జీయో న్యూస్, సునో న్యూస్ తదితర 16 యూట్యూబ్ చానళ్ల ప్రసారాలను భారత్‌లో నిషేధించారు.

యూపీ గాయని నేహా రాథోడ్‌పై దేశద్రోహం కేసు



లఖ్‌నవూ, ఏప్రిల్ 28: ఉత్తరప్రదేశ్‌కు చెందిన జానపద గాయని నేహా సింగ్ రాథోడ్‌పై పోలీసులు దేశద్రోహం కేసు నమోదు చేశారు. పహల్గాం విషాదం నేపథ్యంలో ఓ వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని ఆమె చేసిన సోషల్ మీడియా పోస్టులు రెచ్చగొట్టేలా ఉన్నాయని, ఇవి దేశ సమగ్రతకు హాని కలిగిస్తాయంటూ అభయ్ ప్రతాప్ సింగ్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుతో ఈ కేసు నమోదైంది. దీనిపై నేహా స్పందించారు. తనపై కేసు నమోదు చేసిన ప్రభుత్వం వాస్తవ అంశాల నుంచి దృష్టి మళ్లించాలనుకుంటోందన్నారు. "పహల్గాం దాడికి ప్రతిస్పందనగా ప్రభుత్వం ఇప్పటి వరకు ఏం చేసింది? నాపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడమా? మీకు ధైర్యం ఉంటే వెళ్లి ఉగ్రవాదుల తలలు తీసుకురండి " అని పేర్కొంటూ ఆమె ఎక్స్‌లో సోమవారం ఓ వీడియో షేర్ చేశారు.

నింగిలో మన గూఢచారి

» జూన్‌లో ఈవోఎస్-09 ఉపగ్రహ ప్రయోగం

» భారత్-పాక్ సరిహద్దుపై 24 గంటలూ నిఘా

సూళ్లూరుపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్-పాకిస్థాన్ సరిహద్దుపై నిఘా పెంచాలని భారత్ భావిస్తోంది. దీనికోసం పగలూ, రాత్రీ తేడా లేకుండా 24 గంటలూ.. నిఘా పెట్టే ఓ గూఢచారి ఉపగ్రహాన్ని ప్రయోగించేందుకు ఇస్రో సిద్ధమవుతోంది. దీనికోసం జూన్‌లో అత్యాధునిక ఈవోఎస్-09 ఉపగ్రహాన్ని రోదసిలోకి పంపేందుకు సన్నాహాలు చేస్తోంది. శ్రీహరికోట నుంచి పీఎస్ఎల్వీ-సీ61 రాకెట్ ద్వారా ఈ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి పంపనుంది. సీ-బ్యాండ్ సింథటిక్స్ ఎవర్చర్ రాడార్‌ను అమర్చిన ఈవోఎస్-09 ఎలాంటి వాతావరణ పరిస్థితుల్లోనైనా అధిక రిజల్యూషన్‌తో కూడిన భూ ఉపరితల చిత్రాలను తీయగలదు. భారత్‌కు ఇప్పటికే అంతరిక్షంలో 50కి పైగా ఉపగ్రహాలు ఉన్నాయి. ఇప్పుడు రాడార్ ఇమేజింగ్ శాటిలైట్ వాటికి జతకలవనుంది. ఇప్పటికే అధునాతన కార్టోశాట్-3 ఉపగ్రహం లోయర్ ఎర్త్ ఆర్బిట్‌లో తిరుగుతూ ఫొటోలు అందిస్తోంది. కానీ ఇది రాత్రి వేళల్లో పనిచేయదు. దీంతో శత్రువులు తమ ఆయుధాలను రాత్రి వేళల్లో తరలించగలుగుతున్నారు. తాజాగా పీఎస్ఎల్వీ-సీ61 రాకెట్ ద్వారా ప్రయోగించబోయే హైఎండ్ ఈవోఎస్-09 నుంచి శత్రువులు రాత్రి వేళల్లో కూడా తప్పించుకోలేరు. ఈ ప్రయోగానికి సంబంధించి షార్‌లోని ప్రథమ ప్రయోగ వేదిక వద్ద పీఎస్ఎల్వీ-సీ61 రాకెట్ అనుసంధాన పనులు శరవేగంగా జరుగుతున్నాయి. జూన్ తొలివారంలో ఈ ప్రయోగాన్ని చేపట్టేందుకు ఇస్రో సన్నాహాలు చేస్తోంది.

గోరంట్ల మాధవ్‌కు బెయిల్

» ఆయన అనుచరులకు కూడా..

గుంటూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పోలీసుల అదుపులో ఉన్న నిందితుడిపైన, ఎస్కార్ట్ పోలీసులపైనా దాడికి పాల్పడిన కేసులో నిందితులైన వైసీపీ నేత మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌కు, ఆయన అనుచరులకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ నెల 10న టీడీపీ కార్యకర్త చేబ్రోలు కిరణ్‌కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్న సమయంలో కిరణ్‌పై, పోలీసు కార్యాలయంలో పోలీసులపై మాధవ్, ఆయన ఐదుగురు అనుచరులు దాడికి పాల్పడ్డారు. దీనిపై అదే రోజు నగరంపాలెం పోలీసు స్టేషన్లో కేసు నమోదు చేయడమే గాక వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ నెల 11న అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించడంతో ఆరుగురినీ రాజమండ్రి కేంద్ర కారాగారానికి తరలించారు. కోర్టు ఆదేశాలతో ఈ నెల 23న మాధవ్‌ను పోలీసులు రెండ్రోజులు కస్టడీకి తీసుకున్నారు. 24న విచారణ ముగిశాక తిరిగి రాజమండ్రి జైలుకు తరలించారు. మరోసారి ఆయన్ను కస్టడీకి ఇవ్వాలని నగరంపాలెం పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మాధవ్ తరపు న్యాయవాదులు కూడా బెయిల్ పిటిషన్ వేశారు. ఇరువర్గాల వాదనల అనంతరం సోమవారం గోరంట్ల మాధవ్, ఆయన అనుచరులకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. అయితే ప్రతి శనివారం పోలీసు స్టేషన్లో హాజరై రిజిస్టర్‌లో సంతకం చేయాలని షరతు విధించింది. పూచీకత్తులు సమర్పించిన అనంతరం మంగళవారం వారు రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి విడుదలయ్యే అవకాశం ఉంది.

పాక్‌పై భారత్ దాడి తథ్యం!

(మొదటి పేజీ తరువాయి)

అణ్వాయుధాలను వాడతామని స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో తాము తీసుకోవాల్సిన వ్యూహాత్మక నిర్ణయాలను తీసుకున్నామని పేర్కొన్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో.. తాము తమ మిత్రదేశాలైన గల్ఫ్ దేశాలు, చైనాను సంప్రదించామని, అమెరికా, బ్రిటన్ సహా పలు దేశాలకు పరిస్థితుల గురించి వివరించామని చెప్పారు. అరేబియన్ గల్ఫ్‌లోని కొన్ని మిత్రదేశాలు తమతోపాటు భారత్‌తో కూడా మాట్లాడాయని తెలిపారు. అమెరికా మాత్రం ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవడానికి సిద్ధంగా లేదని చెప్పారు. అయితే.. ఆ తర్వాత కాసేపటికే ఆయన మాట మార్చారు. 'పాక్‌పై భారత్ దాడి తథ్యం' అనే మాటే తాను అనలేదని పాకిస్థాన్‌కు చెందిన 'సమా టీవీ'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. యుద్ధం జరిగే అవకాశం స్పష్టంగా ఉందని.. దీనికి సంబంధించే వచ్చే 2, 3, 4 రోజులే అత్యంత కీలకమని మాత్రమే తాను అన్నానని.. ఈ నాలుగు రోజుల్లో ఏమీ జరగకపోతే ప్రమాదం తప్పినట్టే అన్నానని వెల్లడించారు. "(యుద్ధ) ప్రమాదం అయితే స్పష్టంగా ఉంది. కానీ.. అది తథ్యమని నేను చెప్పలేదు" అని ఆయన స్పష్టం చేశారు. చుట్టుపక్కల దేశాలు ఈ ముప్పును తప్పించడానికి ప్రయత్నిస్తున్నాయని.. దేశ సార్వభౌమాధికారానికి భంగం కలిగే పరిస్థితి వస్తే ఎలాంటి యుద్ధపరిస్థితినైనా ఎదుర్కోవడానికి పాక్ 100 శాతం సిద్ధంగా ఉందని తేల్చిచెప్పారు.

తుర్కియే మద్దతు..

భారత్-పాక్ మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకొన్న సమయంలో.. పాకిస్థాన్‌కు తుర్కియే మద్దతు తెలిపింది. మిలటరీ హార్డ్‌వేర్‌తో పాటు ఆరు సి-130 విమానాలను ఇస్లామాబాద్‌కు పంపింది. ఇరుదేశాల మధ్య ఉన్న సరిహద్దు రక్షణ సహకారంలో భాగంగానే తుర్కియే యుద్ధ సామగ్రిని అందించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ విమానాలు చేరుకున్న విషయాన్ని పాక్, తుర్కియే వర్గాలు ధ్రువీకరించాయి. ఇదిలా ఉండగా.. భారత సరిహద్దుల వెంబడి ఉన్న కీలక వైమానిక స్థావరాలను పాక్ క్రియాశీలం చేసింది. పెస్సి, స్కర్దు, స్వాత్ స్థావరాల్లో ఎఫ్-16, జే-10, జేఎఫ్-17 యుద్ధ విమానాలను మోహరించింది.

పహల్గాం దాడి వివరాలు సేకరించిన ఎన్ఐఏ

బెంగళూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పహల్గాంలో ఉగ్రవాదుల దాడి వివరాలను సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ భరత్ భూషణ్ భార్య సుజాత, మంజునాథరావు భార్య పల్లవి నుంచి ఎన్ఐఏ అధికారులు సేకరించారు. ఉగ్రదాడిలో భరత్ భూషణ్, మంజునాథరావు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. బెంగళూరు మత్తికెరె ప్రాంతంలోని సుందరనగర్‌లో భరత్‌భూషణ్ ఇంటికి ఎన్ఐఏ అధికారులు ఆదివారం వెళ్లారు. శివమొగ్గలోని మంజునాథరావ్ ఇంటికి సోమవారం వెళ్లారు. కాల్పులకు ముందు ఉగ్రవాదులు ఏం మాట్లాడారు?, వారు ముఖాలు ఎలా ఉన్నాయి? వంటి వివరాలు సేకరించారు.

సింధు జలాల నిల్వకు 2 ప్రాజెక్టులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28: సింధు నదీ జలాలను నిల్వ చేసుకునేందుకుగాను రెండు ప్రాజెక్టులను భారత్ నిర్మిస్తోందని సింధు నదీ జల వ్యవహారాల మాజీ కమిషనర్, సింధు జలాల ఒప్పందానికి పదేళ్లు టెక్నికల్ కన్సల్టెంట్‌గా పని చేసిన ఏకే బజాజ్ తెలిపారు. సింధూ జలాల ఒప్పందంపై రెండేళ్ల క్రితమే తిరిగి చర్చలు జరపడానికి ప్రభుత్వం ఒక ఫ్రేమ్‌వర్క్‌ను సిద్ధం చేసినట్టు ఎన్డీటీవీ ఇంటర్వ్యూలో బజాజ్ తెలిపారు. మరోవైపు సింధు నది వ్యవస్థపై రెండు కొత్త నీటి నిల్వ ప్రాజెక్టుల (పకుల్దుల్ ప్రాజెక్టు, బర్సర్ ప్రాజెక్టు) పనులను ప్రభుత్వం వేగవంతం చేసిందన్నారు.

పాక్ ఆర్మీ బంకర్లలో ఉగ్రవాదులు

పహల్గాం దాడి నేపథ్యంలో భారత్ చేపట్టిన చర్యలు, నియంత్రణ రేఖ (ఎల్వోసీ) అవతల ఉగ్ర స్థావరాలపై కన్నేయడంతో.. పాకిస్థాన్ అప్రమత్తమైంది. ఉగ్రవాదులను పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే) సరిహద్దుల సమీపంలోని లాంచ్‌ప్యాడ్‌ల (భారత్‌లోకి చొరబడేందుకు సిద్ధంగా ఉన్న ఉగ్రవాదులను తాత్కాలికంగా ఉంచే స్థావరాల) నుంచి భద్రమైన ప్రదేశాలకు తరలిస్తోంది. ముఖ్యంగా కేల్, సార్ది, దుధ్నియాల్, అత్మకం, జురా, లిపా, పచ్చిబన్, కహుటా, కొట్లి, ఖుయిరట్టా, మంధార్, నికైల్, చమన్‌కోట్, జాన్‌కోట్ తదితర ముఖ్యమైన ఉగ్ర శిక్షణ కేంద్రాల్లోని సుమారు 200 మంది ఉగ్రవాదులను.. పాక్ ఆర్మీ బంకర్లు, రహస్య స్థావరాలకు తరలించినట్టు సమాచారం. అంతేకాదు ఉగ్రవాద శిక్షణ శిబిరాలను కూడా సరిహద్దులకు దూరంగా పీఓకే లోపలి ప్రాంతాలకు మార్చుతున్నట్టు తెలిసింది. భారత్ అకస్మాత్తుగా విరుచుకుపడవచ్చనే ఆందోళనతో పాటు, ఉగ్రవాద వ్యవహారాలు బయటికి పొక్కకుండా పాక్ ఈ చర్యలు చేపట్టినట్టు భారత నిఘా వర్గాలు చెబుతున్నాయి. పీఓకేలో ఇప్పటివరకు సుమారు 42 ఉగ్రవాద లాంచ్‌ప్యాడ్‌లను గుర్తించినట్టు సమాచారం. శిక్షణ పొందిన ఉగ్రవాదులను వీటిలో సిద్ధంగా ఉంచుతారు. ఆయుధాలు, ఆహారాన్ని అందజేస్తారు. వీటిలోని ఉగ్రవాదులు అదను దొరకగానే భారత్‌లోకి చొరబడతారు.

చిక్కినట్లే చిక్కి.. తప్పించుకుంటున్నారు

» పహల్గాం ఉగ్రవాదులను నాలుగు సార్లు గుర్తించిన భద్రత బలగాలు

జమ్మూ, ఏప్రిల్ 28: పహల్గాం ఉగ్రవాదులు భద్రత బలగాలకు చిక్కినట్లే చిక్కి.. తప్పించుకుంటున్నారు. ఉగ్రదాడిలో నలుగురు పాల్గొన్నట్లు ఇప్పటికే తేలింది. వీరిలో ఇద్దరు పాకిస్థానీలు. స్థానికులు అందిస్తున్న సమాచారం, నిఘా వర్గాల సూచనలతో భద్రత బలగాలు వీరి కోసం గాలిస్తుండగా.. నాలుగు సార్లు పక్కా లొకేషన్‌ను ట్రాక్ చేశారు. అయితే.. బలగాలు అక్కడికి వెళ్లేలోపు.. ఉగ్రవాదులు అక్కడి నుంచి దట్టమైన అడవుల్లోకి పారిపోయారు. "ఉగ్రవాదులను తొలుత పహల్గాం సమీపంలోని తెహస్లీ వద్ద గుర్తించాం. భద్రత బలగాలు అక్కడికి చేరుకునేలోపు.. వారు అడవుల్లోకి పారిపోయారు. కల్గాం అడవుల్లో వారి ఉనికి ఉన్నట్లు గుర్తించి, అక్కడికి వెళ్లగా.. ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. భద్రత బలగాలు ఎదురుకాల్పులు జరపడంతో అడవుల్లోకి పారిపోయారు. ఆ తర్వాత కొకెర్నాగ్‌లో, అక్కడికి సమీపంలోని ఓ గ్రామంలో ఉగ్రవాదులున్నట్లు గుర్తించినా, వారు పారిపోయారు" అని ఓ సైనికాధికారి జాతీయ మీడియాకు తెలిపారు. మరోవైపు జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) కూడా ఉగ్రవాదులను ట్రాక్ చేస్తోంది. పహల్గాం దాడి సమయంలో ఉగ్రవాదులు ఇద్దరు పర్యాటకుల సెల్‌ఫోన్లను తస్కరించారు. కమ్యూనికేషన్ కోసం వాటిని ఉపయోగించే అవకాశాలున్నాయి. దీంతో.. ఆ ఫోన్లపైనా నిగా కొనసాగుతోందని అధికారులు తెలిపారు.

5లక్షల మంది పాక్ యువతులు పెళ్లి చేసుకొని భారత్‌లో

పాక్ ఉగ్రవాదానికి ఇది కొత్తరూపం: దూబే

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే కీలక వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్‌కు చెందిన 5లక్షల మంది యువతులు.. పెళ్లి చేసుకోవడం ద్వారా భారత్‌లోకి ప్రవేశించారని అన్నారు. భారత పౌరసత్వం కూడా లేకుండానే వారు ఇక్కడ నివసిస్తున్నారని తెలిపారు. ఇది పాకిస్థాన్ ఉగ్రవాదానికి కొత్త రూపం అని 'ఎక్స్'లో దూబే పేర్కొన్నారు. భారత్‌లోకి ఈ రూపంలో చొరబడ్డ శత్రువులతో ఎలా పోరాడగలమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వీరి వీసాలపై దర్యాప్తు జరిపించాలన్నారు.

లోకం తీరు



ఇక నేవీలోనూ రాఫెల్ సత్తా!

63 వేల కోట్లతో 26 రాఫెల్ మెరైన్ జెట్‌ల కొనుగోలుకు ఫ్రాన్స్‌తో భారత్ ఒప్పందం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28: భారత్-పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న తరుణంలో మన నౌకాదళ సామర్థ్యాన్ని మరింత పెంచే దిశగా కీలక ముందడుగు పడింది. వాయుసేనకే పరిమితమైన రాఫెల్ యుద్ధ విమానాలు త్వరలోనే భారత నేవీకి కూడా అందనున్నాయి. నౌకాదళం కోసం 26 రాఫెల్ మెరైన్ యుద్ధ విమానాలు కొనుగోలు చేసేందుకు ఫ్రాన్స్‌తో భారత్ భారీ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు రూ.63వేల కోట్ల రూపాయల విలువైన మెగా డీల్‌పై ఇరుదేశాలు సోమవారం సంతకాలు చేశాయి. ఇది ఇరు ప్రభుత్వాల మధ్య నేరుగా కుదిరిన ఒప్పందం. వర్చువల్‌గా జరిగిన ఈ కార్యక్రమంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, రక్షణ శాఖ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్, నేవీ వైస్ చీఫ్ అడ్మిరల్ కె స్వామినాథన్ పాల్గొన్నారు. స్వదేశీ విమానవాహక యుద్ధ నౌక ఐఎన్ఎస్ విక్రాంత్‌లో రాఫెల్ జెట్లను మోహరించేందుకు ఫ్రాన్స్ రక్షణ సంస్థ డసాల్ట్ ఏవియేషన్ నుంచి భారత్ ఈ విమానాలు కొనుగోలు చేయనుంది. ప్రధాని మోదీ నేతృత్వంలోని భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఎస్) ఈ కొనుగోలుకు ఆమోదం తెలిపిన మూడు వారాల్లోనే ఈ డీల్ కుదరడం గమనార్హం. ఒప్పందంలో భాగంగా.. భారత నౌకాదళానికి 22 సింగిల్ సీటర్లు, నాలుగు ట్విన్ సీటర్లతో కూడిన మొత్తం 26 రాఫెల్ మెరైన్ యుద్ధ విమానాలను డసాల్ట్ ఏవియేషన్ 37 నుంచి 65 నెలల్లోగా డెలివరీ చేయాల్సి ఉంటుంది. అంటే 2031 నాటికి ఈ 26 యుద్ధవిమానాల డెలివరీలు పూర్తవుతాయని అంచనా వేస్తున్నారు.



జిప్‌లైన్‌పై రైడ్ చేస్తూ సెల్ఫీ వీడియో!

» తెలియకుండానే ఉగ్రదాడిని రికార్డ్ చేసిన పర్యాటకుడు!


పహల్గాం, ఏప్రిల్ 28: పహల్గాం ఉగ్రదాడికి సంబంధించి ఓ కొత్త వీడియో వెలుగులోకి వచ్చింది. అహ్మదాబాద్‌కు చెందిన ఓ పర్యాటకుడు జిప్‌లైన్‌పై రైడ్ చేస్తూ సెల్ఫీ వీడియో తీసుకోగా అందులో ఉగ్రదాడికి సంబంధించిన దృశ్యాలు రికార్డయ్యాయి. జిప్‌లైన్‌పై ప్రయాణిస్తూ అతడు కేరింతలు కొడుతుండగా, దిగువన ఉన్న వ్యక్తుల కేకలు, తుపాకీ శబ్దాలు అందులో రికార్డయ్యాయి. అలాగే ఉగ్రవాదుల దాడికి భయపడి పర్యాటకులు పరుగెడుతున్న దృశ్యాలు, దాడిలో గాయపడిన ఓ వ్యక్తి నేలకొరిగిన దృశ్యాలు రికార్డయ్యాయి. అయితే తన చెవులు కప్పి ఉంచడం వల్ల దిగువన జరుగుతున్న విషయాలేవీ ఆ పర్యాటకుడు గుర్తించలేదు. కాగా, రైడ్‌కు ముందు జిప్‌లైన్ ఆపరేటర్ వ్యవహార శైలి తీరుపై పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాగా, పహల్గాం ఉగ్రదాడికి ముష్కరులు చైనా మెసేజింగ్ యాప్‌లను వాడినట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు వెల్లడించాయి. ఈ యాప్‌ల సాయంతోనే ఉగ్రవాదులు భారత సరిహద్దుకు అవల ఉన్నవారితో సమచారాన్ని పంచుకున్నాయని, ఆదేశాలు అందుకున్నాయని వివరించాయి. ఈ యాప్‌లను 2020లో గల్వాన్ ఘర్షణ అనంతరం భారత్ నిషేధించిందని పేర్కొన్నాయి. గల్వాన్ ఘర్షణ తర్వాత ఇండియా నిషేధం విధించిన చైనా మెసేజింగ్ యాప్‌ల్లో వీచాట్, క్యూక్యూ ఇంటర్నేషనల్ ఉన్నాయి.

మృతదేహాలను చూపి రాష్ట్ర హోదా డిమాండ్ చేయను

పర్యాటకుల భద్రతకు నాదే బాధ్యత

» క్షమాపణ చెప్పడానికిక్కూడా నా వద్ద మాటల్లేవు

» జమ్ము కశ్మీర్ అసెంబ్లీ ప్రత్యేక సమావేశాల్లో సీఎం ఒమర్



శ్రీనగర్, ఏప్రిల్ 28: పహల్గాం ఉగ్ర దాడిని రాజకీయం చేయదలచుకోలేదని, అమాయకుల మృతదేహాలను చూపి రాష్ట్ర హోదాను డిమాండ్ చేయాలనుకోవడం లేదని జమ్ము కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా వ్యాఖ్యానించారు. ఉగ్ర దాడిపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. అసెంబ్లీ ప్రత్యేక సమావేశాల్లో సోమవారం ఆయన మాట్లాడారు. "కొద్ది రోజుల కిందటే పెళ్లి చేసుకున్న నేవీ అధికారి భార్యను నేనెలా ఓదార్చగలను? మేం చేసిన నేరం ఏమిటని బాధితుల కుటుంబాలు అడుగుతున్నాయి. అందుకు నా దగ్గర జవాబు లేదు. జమ్ము కశ్మీరులో శాంతి భద్రతలకు మేం ఇన్‌చార్జి కాదు. కశ్మీరుకు పర్యాటకులను ఆహ్వానించాం. వారి భద్రతకు నాదే బాధ్యత. కానీ, పర్యాటకులకు క్షమాపణ చెప్పడానికి కూడా నా దగ్గర మాటల్లేవు. అయినా, ప్రస్తుత పరిస్థితిని రాష్ట్ర హోదా డిమాండ్ చేయడానికి ఉపయోగించుకోదలచుకోవడం లేదు. మృతదేహాలను చూపి రాష్ట్ర హోదాను డిమాండ్ చేయను. అంత నీచ మనస్తత్వం నాది కాదు. దానిని మరో సందర్భంలో డిమాండ్ చేస్తాం" అని వ్యాఖ్యానించారు. ఉగ్ర దాడిని తీవ్రంగా ఖండిస్తూనే మృతుల పేర్లను అసెంబ్లీలో చదివి వినిపించారు. పర్యాటకుల భద్రత తమ బాధ్యతని, కానీ ఈ దాడి తమను చేష్టలుడిగేలా చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ, "ఇంత విషాదంలోనూ ఓ ఆశా కిరణం ఉంది. ఇటువంటి దాడికి వ్యతిరేకంగా గత 26 ఏళ్లలో ఎవరూ బయటకు వచ్చి నిరసనలు తెలిపిన దాఖలాలు లేవు. స్వచ్ఛందంగా పోస్టర్లు, బ్యానర్లు పట్టుకుని ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కశ్మీరు వ్యాప్తంగా మసీదుల్లో నివాళులర్పించారు. ఇది చాలా కీలక పరిణామం. ప్రజలు సహకరిస్తే ఉగ్రవాదం అంతమవుతుంది. ఇది దానికి ఆరంభం మాత్రమే" అని ఆయన వ్యాఖ్యానించారు. తుపాకులతో ఉగ్రవాదాన్ని నియంత్రించగలమని, కానీ, ప్రజలు సహకరించినప్పుడే అది అంతమవుతుందని చెప్పారు.

మోదీతో రాజ్‌నాథ్ 40నిమిషాలు భేటీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28: రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సోమవారం ప్రధాని మోదీతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత సరిహద్దుల్లో భద్రతా ఏర్పాట్లు, ఉగ్రవాదుల కోసం కొనసాగుతున్న వేట తదితర అంశాలను సమగ్రంగా వివరించారు. ఈ ఇరువురి సమావేశం సుదీర్ఘంగా 40నిమిషాల పాటు కొనసాగింది. అంతకుముందు రాజ్‌నాథ్‌తో భారత ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేదీ సమావేశమయ్యారు. కశ్మీర్‌లో ముఖ్యంగా పహల్గాంలో క్షేత్రస్థాయిలో పరిస్థితులను వివరించారు. ఈ నెల 22న పహల్గాం ఉగ్రదాడిలో 26మంది చనిపోయారు.

తండ్రి భారతీయుడు.. తల్లి పాకిస్థానీ

» 19 ఏళ్లుగా పాకిస్థాన్ పౌరసత్వంతోనే కూతురు

» శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో ఉంటున్న యువతి ఇప్పటికీ లాంగ్ టర్మ్ వీసానే

» కేంద్రం వద్ద పౌరసత్వ దరఖాస్తు పెండింగ్

» పహల్గాం ఘటన నేపథ్యంలో వెలుగులోకి..

ధర్మవరం రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ పౌరసత్వం ఉన్న ఓ యువతి 19 ఏళ్ల నుంచి శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలో ఉంటోంది. తండ్రి ఇండియన్, తల్లి పాకిస్థానీ కావడం, కార్గిల్ యుద్ధ సమయంలో తల్లి పాకిస్థాన్‌లో ప్రసవించడంతో ఆ యువతి విచిత్రమైన పరిస్థితిని ఎదుర్కొంటోంది. ధర్మవరం పట్టణంలోని చంద్రబాబునగర్‌కు చెందిన రఫీక్ అహ్మద్ ఆయుర్వేద వైద్య నిపుణుడు. బళ్లారికి చెందిన ఇతడి మేనమామ మహబూబ్ పీరాన్.. దేశ విభజన సమయంలో బళ్లారి నుంచి పాకిస్థాన్‌కు వెళ్లిపోయాడు. అహ్మద్ 1989లో మేనమామ కూతురు జీనత్ పీరాను వివాహం చేసుకున్నాడు. రఫీక్, జీనత్ దంపతులకు మొదట ఇక్కడే కుమారుడు జన్మించాడు. జీనత్ 1998లో రెండోసారి గర్భం దాల్చింది. ఆ సమయంలో తన తండ్రి ఆరోగ్యం బాగాలేకపోవడంతో చూసేందుకు జీనత్ కరాచీ వెళ్లింది. అదే సమయంలో కార్గిల్ యుద్ధం జరగడంతో ఆమె వెంటనే భారత్‌కు తిరిగిరాలేకపోయింది. ఈ క్రమంలో 1999లో కూతురు రంశా రఫీక్‌కు జన్మనిచ్చింది. 2005లో ఆమె తన కూతురిని తీసుకుని ధర్మవరంలో ఉన్న భర్త వద్దకు వచ్చింది. దాదాపు ఏడేళ్లపాటు అక్కడే ఉండటంతో రంశాకు పాకిస్థాన్ ప్రభుత్వం అక్కడి పౌరసత్వాన్ని ఇచ్చింది. ఇక్కడికి వచ్చినప్పుడు రంశాకు తల్లిదండ్రులు లాంగ్ విజిట్ వీసా తీసుకున్నారు. ప్రస్తుతం రంశా రఫీక్ వయసు 26 ఏళ్లు. ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు ధర్మవరంలో చదువుకుంది. ప్రస్తుతం అనంతపురంలోని ఓ ప్రైవేటు కాలేజీలో బీ ఫార్మసీ ఫైనల్ ఇయర్ చదువుతోంది. ఇప్పటికీ ఆమె పాకిస్థాన్ పౌరసత్వంతోనే ఉంటోంది. లాంగ్ విజిట్ వీసా 2029 వరకు ఉంది. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో దేశంలో ఉన్న పాకిస్థాన్ పౌరుల వివరాలను సేకరిస్తున్న క్రమంలో రంశా పౌరసత్వం విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ మాట్లాడుతూ.. రంశా రఫీక్‌కు లాంగ్‌టర్మ్ వీసా ఉందని, ఆ వీసా కింద దేశంలో ఉండవచ్చనే కేంద్ర ప్రభుత్వ ఆదేశాలున్నాయని స్పష్టం చేశారు. కాగా, షెహనాజ్ అనే మరో పాకిస్థానీ కూడా ధర్మవరంలో ఉంటున్నారని, అతడి గురించి దర్యాప్తు చేస్తున్నామని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.


శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో రఫీక్ అహ్మద్ నివాసం


రఫీక్ తండ్రి రఫీక్ అహ్మద్

నిబంధనల మేరకే ఉంటోంది: రంశా తండ్రి

నా కూతురు పాకిస్థాన్‌లో పుట్టడంతో ఆ దేశ పౌరసత్వం వచ్చింది. లాంగ్ టర్మ్ వీసా ఉన్న పాకిస్థానీలు దేశంలో ఉండవచ్చన్న కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకే నా కూతురు దేశంలో ఉంటోంది. ఇక్కడికి వచ్చాక భారత పౌరసత్వం కోసం కేంద్ర హోం అఫైర్స్ డిపార్ట్‌మెంట్‌కు దరఖాస్తు చేసుకున్నాం. ఇంకా రాలేదు. ఈ విషయాన్ని జిల్లా పోలీసు అధికారులను కలిసి వివరించాం. నేను భారతీయుడ్ని. ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నాను.

దూసుకొచ్చిన మృత్యువు

తిరుపతి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం...ఐదుగురి మృతి



కంటైనరు కిందకు దూసుకెళ్లిన కారు

- ముందు వెళుతున్న కంటైనర్ లారీని ఢీకొన్న కారు
- మృతుల్లో ఒకరిది హోసూరు.. నలుగురిది బెంగళూరు

పాకాల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా పాకాల మండలం తోటపల్లి వద్ద పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపై సోమవారం మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ముందు నెమ్మదిగా వెళుతున్న కంటైనర్ లారీని వెనుక నుంచి కారు ఢీకొట్టి లారీ కిందకు దూసుకుపోయింది. ఈ దుర్ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఏడుగురిలో డ్రైవర్ సహా ఐదుగురు అక్కడికక్కడే దుర్మరణం చెందగా మిగిలిన ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. బెంగళూరుకు చెందిన గీతమ్మ (51), విజయలక్ష్మి (50), సహన (34), ఎస్ఆర్ రజని (27) తమిళనాడులోని హోసూరులో జీఆర్‌బీ డెయిరీ ప్రొడక్ట్స్‌లో ఉద్యోగులు. తిరుమల, శ్రీకాళహస్తి ఆలయాలు దర్శించుకుని రావాలని ఈ నలుగురూ హోసూరులో కారు అద్దెకు తీసుకుని గత శనివారం తిరుమల వచ్చారు. వారి వెంట గీతమ్మ కుమారుడు లేఖన్ గౌడ (11), డ్రైవర్ త్యాగరాజన్ కుమారుడు క్రిస్విన్(15) కూడా ఉన్నారు. శనివారం తిరుమల చేరుకుని ఆదివారం కూడా అక్కడే ఉన్నారు. సోమవారం ఉదయం శ్రీకాళహస్తి వెళ్లి ముక్కంటిని దర్శించుకుని స్వస్థలానికి తిరుగు ప్రయాణమయ్యారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో పాకాల మండలం తోటపల్లి వద్ద కారు వేగంగా వెళుతూ ముందు జార్ఖండ్ రాష్ట్రం రాంచీ నుంచి బెంగళూరు వెళుతున్న కంటైనర్ లారీని వెనుక వైపు నుంచి ఢీకొంది. ఆ ధాటికి కారు కంటైనర్ కిందికి దూసుకుపోయి నుజ్జునుజ్జు అయింది. క్రేన్ సాయంతో పోలీసులు, స్థానికులు కంటైనర్ కింద ఇరుక్కుపోయిన కారును అతికష్టమ్మీద వెలుపలికి తీశారు. డ్రైవర్ త్యాగరాజు, విజయలక్ష్మి, సహన, ఎస్ఆర్ రజని, గీతమ్మ కుమారుడు లేఖన్ గౌడ అక్కడికక్కడే మృతిచెందారు. గీతమ్మ, డ్రైవర్ త్యాగరాజు కుమారుడు క్రిస్విన్ తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద స్థలాన్ని కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అతి వేగానికి తోడు డ్రైవర్ నిద్రమత్తు కూడా ప్రమాదానికి కారణమై ఉండొచ్చని అనుమానిస్తున్నారు. రోడ్డుప్రమాదంలో ఐదుగురు మృతిచెందడం పట్ల ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు.

రేపే అప్పన్న చందనోత్సవం

- తెల్లవారుజామున 4 గంటల నుంచి భక్తులకు దర్శనం

సింహాచలం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సింహాచలం శ్రీవరాహ లక్ష్మీనృసింహ స్వామి ఈనెల 30న భక్తులకు నిజరూపంలో దర్శనం (చందనోత్సవం) ఇవ్వనున్నారు. చందనోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 29వ తేదీ సాయంత్రం ఆరు గంటల నుంచి అప్పన్న దర్శనాలను నిలిపివేస్తారు. దీపారాధన, మూర్తి కలశారాధన, రాత్రి ఆరాధనలు జరిపి సుమారు 11 గంటలకు పవళింపు సేవ కావించి కవాట బంధనం చేస్తారు. రాత్రి ఒంటి గంటకు సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొపుతారు. 1.30 గంటలకు విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం నిర్వహిస్తారు. ఆ తరువాత ఏడాది పొడవునా స్వామి వారిపై పూతగా ఉండే చందనాన్ని తొలగించి, ప్రభాత ఆరాధన చేస్తారు. తెల్లవారుజామున 3.00 గంటలకు ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు కుటుంబ సభ్యులకు తొలిదర్శనం కల్పిస్తారు. 3.30 గంటల నుంచి 4 గంటల నడుమ ప్రభుత్వం, తిరుమల తిరుపతి దేవస్థానం తరపున సంప్రదాయ వస్త్ర సమర్పణలు ఉంటాయి. తెల్లవారుజామున 4 నుంచి రాత్రి 7 గంటల వరకు భక్తులను దర్శనం కల్పిస్తారు. రాత్రి 9.30 గంటలకు శ్రీవైష్ణవ స్వాములచే సహస్ర ఘటాభిషేకం, విశేష పూజాదులు నిర్వహించి నివేదనలు సమర్పిస్తారు. అనంతరం తొలివిడతగా మూడు మణుగుల చందనం సమర్పిస్తారు.

మల్లికార్జునుని సేవలో హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ వి.శ్రీనివాస్ దంపతులకు స్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈఓ శ్రీనివాసరావు

శ్రీశైలం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల మల్లికార్జున స్వామి, భ్రమరాంబాదేవి అమ్మవార్లను సోమవారం హైకోర్టు నాయమూర్తి జస్టిస్ వి.శ్రీనివాస్ సతీసమేతంగా దర్శించుకున్నారు. న్యాయమూర్తి దంపతులు స్వామికి రుద్రాభిషేకం, భ్రమరాంబా దేవికి కుంకుమార్చన నిర్వహించారు. ఆశీర్వచన మండపంలో వేదపండితులు న్యాయమూర్తి దంపతులను ఆశీర్వదించగా, అధికారులు స్వామి అమ్మవార్ల శేషవస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు.

రేపు శ్రీవారి సేవ జూన్ కోటా విడుదల

తిరుమల, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి సేవ జూన్ నెల కోటాను టీటీడీ బుధవారం ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఉదయం 11 గంటలకు సాధారణ సేవ, మధ్యాహ్నం 12 గంటలకు నవనీతసేవ (మహిళలకు మాత్రమే), ఒంటి గంటకు పరకామణిసేవ (పురుషులకు మాత్రమే) విడుదల చేయనున్నారు. ఇక, కొత్తగా ప్రవేశపెట్టిన 'గ్రూప్ లీడర్ సేవ'ను 2 గంటలకు విడుదల చేయనున్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు గ్రూప్‌లీడర్ సేవ

ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనల మేరకు సత్యసాయి సేవాసంస్థ, ఆర్ట్ ఆఫ్ లివింగ్ వంటి సంస్థల్లో భక్తుల స్వచ్ఛంద సేవలను టీటీడీ అధికారులు అధ్యయనం చేసిన తర్వాత టీటీడీలో గ్రూప్ లీడర్ సేవను ప్రవేశ పెడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో పదవీ విరమణ పొందిన ఉద్యోగులు ఈ సేవలో పాల్గొనవచ్చు. 70 ఏళ్ల లోపు వయసున్నవారిని అనుమతిస్తారు. శ్రీవారి సేవకుల పర్యవేక్షణ బాధ్యతలు వీరికి అప్పగిస్తారు. 15 రోజుల నుంచి మూడు నెలల దాకా వీరు ఈ సేవలో పాల్గొనాల్సి ఉంటుంది.

ఓవైపు ఎండలు.. మరోవైపు వర్షాలు

- మరో 4 రోజులు అనిశ్చితి!

విశాఖపట్నం, అమరావతి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఎండ తీవ్రత, ఉక్కపోత ప్రభావంతో వాతావరణ అనిశ్చితి నెలకొని.. సోమవారం ఉత్తర కోస్తాలో పలు చోట్ల ఈదురుగాలులు, పిడుగులతో వర్షాలు కురిశాయి. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ జిల్లాల్లో మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రంగా ఉంది. కొన్నిచోట్ల గాలులకు మామిడి, జీడి మామిడి తోటలు దెబ్బతిన్నాయి. అల్లూరి జిల్లా దళపతిగూడలో 46, అనకాపల్లి జిల్లా గొలుగొండలో 34, దార్లపూడిలో 26.5 మి.మీ. వర్షపాతం నమోదైంది. కోస్తా, సీమల్లోని మిగిలిన ప్రాంతాల్లో వేడి వాతావరణం కొనసాగింది. మరో 4 రోజులు ఇదే పరిస్థితి కొనసాగుతుందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. సోమవారం కడప జిల్లా సిద్దవటంలో 41.1, ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెంలో 41, నంద్యాల జిల్లా రుద్రవరంలో 40.6, తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో 40.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

దెబ్బతిన్న పంటలు

అనంతపురం అర్బన్: ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. కోతకొచ్చిన వరి, మొక్కజొన్న పంటలను ధ్వంసం చేశాయి.

'సహకార' పదవులు భర్తీ

10 డీసీసీబీ, 10 డీసీఎంఎస్‌లకు చైర్మన్లు

టీడీపీకి తొమ్మిదేసి.. జనసేనకు ఒక్కోటి

2-3 రోజుల్లో ప్రభుత్వ ఉత్తర్వులు

- కాకినాడ, ఏలూరు, ఒంగోలు పెండింగ్
- త్వరలోనే వాటికీ నియామకాలు
- పీఏసీఎస్‌లకు పర్సన్ ఇన్‌చార్జులు?

అమరావతి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం సహకార రంగంలోని నామినేటెడ్ పోస్టులను భర్తీ చేసింది. 10 జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ)లు, 10 జిల్లా సహకార మార్కెట్ సంఘాల(డీసీఎంఎస్)కు సోమవారం చైర్మన్లను ప్రకటించింది. ఇందులో టీడీపీకి తొమ్మిదేసి దక్కగా.. ఒక డీసీసీబీ, ఒక డీసీఎంఎస్‌ను జనసేనకు ఇచ్చారు. తూర్పుగోదావరి (కాకినాడ), పశ్చిమగోదావరి(ఏలూరు), ప్రకాశం(ఒంగోలు) డీసీసీబీలు, డీసీఎంఎస్‌లను పెండింగ్‌లో పెట్టారు. త్వరలోనే వీటికీ చైర్మన్లను నియమిస్తారని టీడీపీ వర్గాలు తెలిపాయి. 2024 ఎన్నికల్లో టీడీపీ కూటమి విజయం కోసం కష్టపడి పని చేసిన నేతలను గుర్తించి.. నామినేటెడ్ పోస్టుల భర్తీలో అవకాశం కల్పిస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లుగా మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, ఇతర నేతలకు అవకాశం కల్పించారు. బీజేపీకి కూడా ఒక్కొక్కటి దక్కుతుందని చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాల స్థాయిలో కొనసాగుతున్న డీసీసీబీలు, డీసీఎంఎస్‌లకు ప్రస్తుతం జాయింట్ కలెక్టర్లు అధికారిక పర్సన్ ఇన్‌చార్జులుగా వ్యవహరిస్తున్నారు. సహకార సంస్థలకు రైతు వర్గానికి చెందిన నేతలను పాలకవర్గంలో నియమించడం ద్వారా వ్యవసాయ అనుబంధ రంగాలకు మెరుగైన సేవలు అందుతాయన్న ఉద్దేశంతో డీసీసీబీ, డీసీఎంఎస్‌లకు నామినేషన్ పద్ధతిలో చైర్మన్లను నియమిస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. వాస్తవానికి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘా(పీఏసీఎస్)లకు ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ఎన్నికైన చైర్మన్ల నుంచి డీసీసీబీ, డీసీఎంఎస్‌లకు పాలక వర్గాలను ఎన్నుకోవాలి. కానీ గత ప్రభుత్వం 1964 సహకార చట్టంలోని సెక్షన్ 30(7)ఏ ప్రకారం ఎన్నికలు నిర్వహించలేనప్పుడు ఆరు నెలల కాల వ్యవధితో పర్సన్ ఇన్‌చార్జి కమిటీ(పీఐసీ)లను నియమించవచ్చన్న వెసులుబాటుతో ఐదేళ్ల పాటు అనధికార పీఐసీలను కొనసాగించింది. అయితే చంద్రబాబు సీఎం అయ్యాక సహకార సంఘాల కంప్యూటరీకరణ సాగుతున్నందున పీఏసీఎస్‌లకు సహకార శాఖ అధికారులను, డీసీసీబీ, డీసీఎంఎస్‌లకు జాయింట్ కలెక్టర్లను అధికారిక పీఐసీలుగా నియమించారు. ఇప్పుడు డీసీసీబీ, డీసీఎంఎస్‌లకు చైర్మన్లను ప్రకటించింది. సంబంధిత ఉత్తర్వులు 2-3 రోజుల్లో జారీ కానున్నాయి. అలాగే త్వరలో పీఏసీఎస్‌లకు అనధికార పీఐసీలను నియమించనున్నట్లు సమాచారం. ఉమ్మడి రాష్ట్రంలో సహకార సంస్థలకు ప్రత్యక్ష ఎన్నికలు చివరిసారిగా 2013 జనవరిలో జరిగాయి. ఐదేళ్లకోసారి జరగాల్సిన ఎన్నికలను.. హైకోర్టు చెప్పినా పుష్కర కాలంగా ప్రభుత్వాలు నిర్వహించకుండా నామినేటెడ్ పాలక వర్గాలను కొనసాగిస్తున్నాయి.

డీసీసీబీ	చైర్మన్	పార్టీ
శ్రీకాకుళం	సివ్వల సూర్యనారాయణ	టీడీపీ
విశాఖపట్నం	కోన తాతారావు	జనసేన
విజయనగరం	కిమిడి నాగార్జున	టీడీపీ
గుంటూరు	మక్కెన మల్లికార్జునరావు	టీడీపీ
కృష్ణా	నెట్టెం రఘురాం	టీడీపీ
నెల్లూరు	దనుంజయరెడ్డి	టీడీపీ
చిత్తూరు	ఆమస రాజశేఖర్‌రెడ్డి	టీడీపీ
అనంతపురం	కేశవరెడ్డి	టీడీపీ
కర్నూలు	డి.విష్ణువర్ధన్‌రెడ్డి	టీడీపీ
కడప	బి.సత్యనారాయణరెడ్డి	టీడీపీ

డీసీఎంఎస్	చైర్మన్	పార్టీ
శ్రీకాకుళం	అవినాశ్ చౌదరి	టీడీపీ
విశాఖపట్నం	కొట్నే బాలాజీ	టీడీపీ
విజయనగరం	గంపా కృష్ణ	టీడీపీ
గుంటూరు	వడ్రాణం హరిబాబు	టీడీపీ
కృష్ణా	బండి రామకృష్ణ	జనసేన
నెల్లూరు	గోనుగోడు నాగేశ్వరరావు	టీడీపీ
చిత్తూరు	సుబ్రహ్మణ్యంనాయుడు	టీడీపీ
అనంతపురం	నెట్టెం వెంకటేశ్వరరావు	టీడీపీ
కర్నూలు	జి.నాగేశ్వర యాదవ్	టీడీపీ
కడప	ఎర్రగుండ్ల జయప్రకాశ్	టీడీపీ

విశాఖ మెట్రోపై కదలిక!

- కన్సల్టెంట్ కోసం ప్రభుత్వం ప్రకటన
- మే 5న ప్రి-బిడ్డింగ్ సమావేశం
- తొలి దశకు రూ.11,498 కోట్లు అవసరం
- 3 కారిడార్లు, 46.23 కి.మీ...

హనుమంతవాకలో ప్రధాన డిపో

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం మెట్రో రైలు ప్రాజెక్టుకు కదలిక వచ్చింది. ప్రాజెక్టు నిర్మాణానికి కన్సల్టెంట్ కావాలంటూ తాజాగా ప్రభుత్వం ప్రకటన జారీ చేసింది. బిడ్డింగ్‌లో పాల్గొనే వారితో మే ఐదో తేదీన మంగళగిరి నుంచి ఆన్‌లైన్ సమావేశం నిర్వహించబోతున్నారు. ఈ ప్రాజెక్టు తొలి దశ అమలుకు రూ.11,498 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. దీనికి 99.75 ఎకరాలు కావాలని, భూ సేకరణకు మరో రూ.882 కోట్లు అవసరమని తేల్చారు. విశాఖ మెట్రోకు 100 శాతం నిధులు సమకూర్చాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరుతోంది. అయితే అట్నుంచి ఎలాంటి సమాధానమూ లేదు. సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక (డీపీఆర్)ను ఆమోదించారా?, లేదా? అనే దానిపైనా స్పష్టత లేదు. కానీ కేంద్రం పూర్తిగా సహకరిస్తుందనే ఆశాభావంతో ముందుకువెళుతున్నారు. ఇక, విశాఖలో మొదట మూడు కారిడార్లు నిర్మించాలని ప్రతిపాదించారు. మొత్తం రూట్ పొడవు 46.23 కిలోమీటర్లు. ఇందులో మొదటిది స్టీల్ ప్లాంట్ నుంచి కొమ్మాది వరకూ 34.4 కి.మీ. దీని పరిధిలో 290 స్టేషన్లు వస్తాయి. రెండో కారిడార్ గురుద్వారా నుంచి పాత పోస్టాఫీసు వరకూ 5.07 కి.మీ. పొడవు ఉంటుంది. ఈ మార్గంలో ఆరు స్టేషన్లు ఉంటాయి. మూడో కారిడార్ తాటిచెట్లపాలెం నుంచి చిన్నవాల్తేరు వరకు 6.75 కి.మీ. ఉంటుంది. ఇందులో ఏడు స్టేషన్లు వస్తాయి. ఇక, విశాఖ మెట్రో రైలు కార్పొరేషన్.. లైట్ మెట్రో రైళ్లను నిలిపి ఉంచడానికి, ఆపరేషన్లు నిర్వహించడానికి హనుమంతవాక జంక్షన్‌లో 35 ఎకరాల్లో ప్రధాన డిపో ఏర్పాటు చేయనుంది. ఇక్కడి నుంచే మెట్రో రైళ్లను ఆపరేట్ చేస్తారు. దీనికి అనుబంధంగా విశాఖపట్నం విమానాశ్రయం సమీపాన కాకానినగర్‌లో మరో 35 ఎకరాల్లో అనుబంధ డిపో ఉంటుంది.

లైట్ మెట్రో.. తొలుత రెండే కార్లు

ప్రయాణికుల రద్దీ, ఇక్కడి అవసరాలను దృష్టిలో ఉంచుకొని తొలుత లైట్ మెట్రో కార్ (లఘు రైలు) నడపాలని నిర్ణయించారు. తొలి దశలో ప్రతి కారిడార్‌లోనూ రెండే రైళ్లు నడుపుతారు. ప్రయాణికుల సంఖ్య పెరిగితే అదనంగా 3,4 కార్లు జత చేస్తారు. లైట్ మెట్రో కార్లయితే సౌకర్యవంతంగా ఉంటాయి. ఇంధన వ్యయం, శబ్దకాలుష్యం కూడా తక్కువగానే ఉంటుంది.

అభివృద్ధి పనులపై నియంత్రణ స్థానిక సంస్థలకే!

- మున్సిపల్ నిధుల వినియోగానికి మార్గదర్శకాలు

అభివృద్ధి వ్యయంలో ఎస్సీ, ఎస్టీ, మహిళలకూ వాటా

అమరావతి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పట్టణ స్థానిక సంస్థల్లో మున్సిపల్ నిధుల వినియోగానికి సంబంధించి ప్రభుత్వం సమగ్ర మార్గదర్శకాలు విడుదల చేసింది. పబ్లిక్‌హెల్త్, శానిటేషన్, నీటి సరఫరా, మౌలిక వసతుల కల్పనకు పట్టణ స్థానిక సంస్థలు పూర్తి ఆర్థిక నియంత్రణ కలిగేలా మార్గదర్శకాలు రూపొందించారు. కొత్త విధానం ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చింది. పట్టణ స్థానిక సంస్థల్లో నిధుల వ్యయాన్ని రెండు కేటగిరీలుగా విభజించారు.

నిర్వహణ వ్యయం: పారిశుధ్య కార్మికులు, తాగునీటి సరఫరా కార్మికుల వేతనాలు, వాహనాల మరమ్మతులు, విద్యుత్ చార్జీలు, క్రిమిసంహారక మందుల కొనుగోలు, రోడ్లు, డ్రైన్లు, వీధిలైట్లు, కమ్యూనిటీ టాయ్‌లెట్లు, పార్కులను నిర్వహణ వ్యయంగా పరిగణిస్తారు.

మూలధన వ్యయం: కొత్త రోడ్లు, డ్రైన్లు, వాటర్ పైప్‌లైన్లు, మురుగునీటి ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, డంపింగ్ యార్డులు, కంపోస్టింగ్ యూనిట్లు, ఫాగింగ్ మెషిన్ల కొనుగోలు, చిన్న వీధిలైట్లు ఏర్పాటు, కార్యాలయాలు, కమ్యూనిటీ హాళ్లు, శ్మశానాల నిర్మాణాలను మూలధన వ్యయంగా పరిగణిస్తారు.

మున్సిపల్ కార్పొరేషన్లు తమ రాబడుల నుంచి కనీసం 30 శాతం నిధులను మూలధన వ్యయం కోసం ఖర్చు చేయవచ్చు. సెలక్షన్ అండ్ స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీలు 28, గ్రేడ్-1, 2 మున్సిపాలిటీలు 25, గ్రేడ్-3, నగర పంచాయతీలు 20 శాతం ఖర్చు చేయవచ్చు. నాన్ గ్రాంట్ ఆదాయాల నుంచి కనీసం 30 శాతం ప్రజారోగ్యం కోసం వాడుకోవచ్చు. నిల్వ నిధులను తాగునీటి సరఫరాకు 20, డ్రైనేజీకి 13, రోడ్లకు 19, వీధిలైట్లకు 7, రిక్రియేషన్ సౌకర్యాలకు 10, మార్కెట్‌లు, భవనాలు, కమ్యూనిటీ హాళ్లు, టాయ్‌లెట్లకు 17 శాతం నిధులు వినియోగించుకోవచ్చు. కనీసం 40 శాతం నిధులను పట్టణాల్లో మురికివాడల్లో మౌలిక వసతులు, జీవనోపాదుల వృద్ధికి వాడుకోవచ్చు. మొత్తం వార్షిక ప్రణాళికలోని 17.10 శాతం షెడ్యూల్ కులాలకు, 5.33 శాతం షెడ్యూల్ తెగలకు కేటాయించాలి. అభివృద్ధి వ్యయం ఎస్సీలకు 15, ఎస్టీలకు 7.5, మహిళలు, పిల్లలకు 5 శాతం ఖర్చు చేస్తారు. వీధిలైట్లకు, తాగునీటి వనరులకు విద్యుత్ చార్జీల చెల్లింపులు మొదటి ప్రాధాన్యంగా ఉండాలి. ఈ బిల్లులు చెల్లించేవరకూ ఏ ఇతర బిల్లులు చెల్లించరాదు.

'ఆప్కోస్'పై మంత్రివర్గ ఉపసంఘం

- సభ్యులుగా నారాయణ, లోకేశ్, పయ్యావుల

అమరావతి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ అవుట్ సోర్సింగ్ సర్వీసెస్ కార్పొరేషన్(ఆప్కోస్)పై ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. రాష్ట్ర ప్రభుత్వ విభాగాల్లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను నియమించుకునే ప్రస్తుత వ్యవస్థపై సమీక్షించేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉపసంఘంలో మున్సిపల్ మంత్రి నారాయణ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఉన్నారు. ప్రస్తుత వ్యవస్థ కంటే మరింత జవాబుదారీగా, సమర్థవంతంగా, పారదర్శకంగా అవుట్ సోర్సింగ్ సిబ్బంది నియామకాలు, వారి సంక్షేమాన్ని ఎలా పెంపొందించాలన్న దానిపై నివేదిక ఇవ్వనుంది.

ఎక్సైజ్‌లో 'ట్రాక్' విధానంపై కమిటీ

అమరావతి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మద్యం సీసాల ట్రాక్ అండ్ ట్రేస్, ఇంటిగ్రేటెడ్ ఎక్సైజ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ అమలుకు ఉన్నత స్థాయి కమిటీని నియమిస్తూ ఎక్సైజ్ శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీలో ఎక్సైజ్ డైరెక్టర్, పరిశ్రమల శాఖ అదనపు డైరెక్టర్, ఆర్థిక శాఖ అదనపు డైరెక్టర్, ఐటీ శాఖ డైరెక్టర్ సభ్యులుగా ఉన్నారు. 15 రోజుల్లో ఈ కమిటీ నివేదిక సమర్పించనుంది.

ప్రాజెక్టుల భద్రతపై దృష్టి సారించండి

- డ్యాం సేఫ్టీ అథారిటీ సూచన

అమరావతి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రాజెక్టుల భద్రతపై దృష్టి సారించాలని జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ప్రభుత్వానికి సూచించింది. అథారిటీ చైర్మన్ అనిల్ జైన్, డైరెక్టర్ గిరిధర్‌లతో కూడిన బృందం సోమవారం విజయవాడకు వచ్చింది. సచివాలయంలో జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు, రాష్ట్ర డ్యాం సేఫ్టీ అథారిటీ చైర్మన్ కుమార్ తదితరులతో సమావేశమైంది. జైన్ బృందం మంగళవారం శ్రీశైలం ప్లంజ్‌పూల్ ప్రాంతాన్ని పరిశీలిస్తుంది.

పబ్లిక్ నోటీసు
ఆంధ్రప్రదేశ్ నందు ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల విలీనం
ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ ఏర్పాటు
ఇందుమూలముగా సాధారణ ప్రజలు, ఖాతాదారులు మరియు సంబంధిత వారందరికి తెలియజేయునది ఏమనగా భారత ప్రభుత్వం, ఆర్థిక మంత్రిత్వ శాఖ జారీ చేసిన ది.05-04-2025 నాటి గెజిట్ నోటిఫికేషన్ నెం. ఎస్.ఓ.1625(ఇ) ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న ఈ క్రింద పేర్కొన్న నాలుగు ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు (RRB) ఒకే ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుగా విలీనం చేయబడతాయి.
1. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ (APGB)
2. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ (APGVB)
3. చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ (CGGB)
4. సప్తగిరి గ్రామీణ బ్యాంక్ (SGB)
ది.01-05-2025వ తేది నుండి పైన పేర్కొన్న ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు ఈ క్రింద పేర్కొన సంస్థ పేరుతో పనిచేస్తాయి :
ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్,
ప్రభుత్వ సంస్థ ప్రాయోజిత బ్యాంక్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
★ వినియోగదారులకు ముఖ్య గమనిక :
★ మీ యొక్క ఖాతా నెంబర్‌లు, ఐఎఫ్ఎస్‌సి కోడ్‌లు లేదా బ్రాంచ్ చిరునామాలలో ప్రస్తుతానికి ఎటువంటి మార్పు లేదు.
★ ఇప్పటికే ఉన్న అన్ని డిపాజిట్ ఖాతాలు, ఋణాలు & సేవలు నిరంతరాయంగా కొనసాగుతాయి.
★ వినియోగదారులు తమ చెక్‌బుక్‌లు, పాస్‌బుక్‌లు, ఎటియం కార్డులు మరియు డిజిటల్ సేవలను ఉపయోగించుకొనవచ్చును.
★ కొత్తగా ఏర్పాటైన బ్యాంక్ మెరుగైన కార్యాచరణ సామర్థ్యంతో నిరంతరాయ బ్యాంకింగ్ సేవలను అందిస్తుంది.
❖ ఇతర వివరాల కోసం : మీ దగ్గరలోని బ్యాంకు యొక్క శాఖను సంప్రదించగలరు. మీ యొక్క నిరంతర మద్దతుకు మేము మీకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాము. ప్రజా ప్రయోజనార్థం జారీ చేసినవారు.
ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ (APGB) | ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ (APGVB) | చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ (CGGB) | సప్తగిరి గ్రామీణ బ్యాంక్ (SGB)

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

వెలుగుబాట

'ఒక వ్యక్తిగా నేను అంతరిక్షానికి ప్రయాణిస్తున్నప్పటికీ, అది 140 కోట్ల మంది భారతీయుల యాత్ర అని మనఃపూర్వకంగా విశ్వసిస్తున్నా'నని శుభాంశు శుక్లా అన్నారు. నలభై సంవత్సరాల అనంతరం అంతరిక్షానికి ప్రయాణించనున్న ద్వితీయ భారతీయుడు శుక్లా. రాబోయే వారాలలో ఫ్లోరిడాలోని కెన్నెడీ స్పేస్ సెంటర్ నుంచి ఇంటర్నేషనల్ స్పేస్ సెంటర్‌కు వెళ్లనున్న యాక్సియమ్–2 మిషన్ పైలట్‌గా ఆయన రోదసీయాత్ర చేయనున్నారు. వచ్చే ఏడాది భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) గగన్‌యాన్ మిషన్‌లో మహాఆకాశంలోకి వెళ్లనున్న ప్రప్రథమ భారతీయ వ్యోమగాముల బృందంలో కూడా శుక్లా ఒకరు. యువ భారతీయుల మేధో శక్తి సామర్థ్యాలకు శుక్లా, గగన్‌యాన్‌లు వైయక్తిక, సాముదాయిక ప్రతీకలు. భారతీయ అంతరిక్ష పరిశోధనా పథ నిర్దేశకులు వేసిన వెలుగుబాటల వల్లే ఈ సమున్నత, సాహసిక యాత్రలు సాధ్యమవుతున్నాయి. ఈ దృష్ట్యా, గత శుక్రవారం నాడు 84 ఏళ్ల వయసులో మరణించిన ఖగోళ భౌతిక శాస్త్రవేత్త, ఇస్రో మాజీ డైరెక్టర్ డాక్టర్ కృష్ణస్వామి కస్తూరి రంగన్, ఆయన జీవిత కృషి సంస్మరణకు, శుభాంశు శుక్లా, గగన్‌యాన్ ప్రస్తావన ఒక సముచిత నాందీ వాక్యమవుతుంది.


సమాజాభివృద్ధే అంతరిక్ష పరిశోధనలు ధ్యేయంగా ఉండాలని దృఢంగా విశ్వసించిన శాస్త్రవేత్త కస్తూరి రంగన్. ఇస్రో ఆరంభంలోనే ఆ సంస్థలో చేరిన రంగన్ మొదటి రెండు ప్రయోగాత్మక భూపరిశీలన ఉపగ్రహాలు భాస్కర–1, 2ల రూపకల్పన, ప్రయోగాలకు సారథ్యం వహించారు. తొలి రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహం ఐఆర్ఎస్–1 ఆయన నేతృత్వంలోనే రూపుదిద్దుకున్నది. ఇస్రో శాటిలైట్ సెంటర్ డైరెక్టర్‌గా ఆయన దూరదృష్టి కారణంగానే భారతీయ భాషలలో కేబుల్ టీవీ కార్యక్రమాలు కోట్లాది కుటుంబాలకు అందుబాటులోకి వచ్చాయి. భారతీయ టీవీ కార్యక్రమాలు ప్రపంచవ్యాప్తంగా పలుదేశాలకు చేరడం మొదలయింది. స్పేస్ ఫర్ సొసైటీ అన్న ఇస్రో లక్ష్య స్ఫూర్తితో టెలిఎడ్యుకేషన్‌కు ఎడ్యుశాట్, టెలిమెడిసిన్, కమ్యూనికేషన్‌కు ఇన్సాట్, జిశాట్ ఉపగ్రహాలు, ధరిత్రి వనరుల పరిశోధనకు రిసోర్స్‌శాట్, వాతావరణ పరిశోధనలకు మెట్‌శాట్, ఖగోళ అన్వేషణలకు ఆస్ట్రోశాట్ మొదలైన వాటిని ఆయన సారథ్యంలోనే రూపొందించి ప్రయోగించడం జరిగింది. ఇవన్నీ గ్రామీణాభివృద్ధి, ప్రాకృతిక విపత్తుల నిర్వహణ, జాతీయ సంధాయతకతకు విశేషంగా తోడ్పడ్డాయి. భారతదేశ రోదసీ ఆకాంక్షల సాఫల్యానికి మేధో స్వావలంబనకు ఆయన చేసిన దోహదం అద్వితీయమైనది.

ఇస్రో డైరెక్టర్ (1994–2003)గా ప్రతిష్ఠాత్మక పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్‌ను పరిపూర్ణంగా తీర్చిదిద్దారు. అలాగే జియో సింక్రోనస్ శాటిలైట్ లాంచ్ వెహికల్‌ను కూడా జయప్రదంగా పరీక్షించారు. పీఎస్ఎల్‌విని ఉపయోగించడం ద్వారా చంద్రుని కక్ష్యలోకి ఉపగ్రహాన్ని పంపవచ్చని 1999లో వెలువరించిన ఒక చరిత్రాత్మక ప్రసంగంలో కస్తూరిరంగన్ ప్రతిపాదించారు. నాటి వాజపేయి ప్రభుత్వం ఆ ప్రతిపాదనకు సానుకూలంగా ప్రతిస్పందించింది. చంద్రయాన్‌కు అంకురార్పణ జరిగింది. భారతదేశ ఈ మొదటి చంద్రయాత్ర అక్టోబర్ 2008లో ప్రారంభమై ఆగస్టు 2009 దాకా కొనసాగింది. చంద్రునిపై నీటి అణువుల ఉనికిని నిర్ధారించడం చంద్రయాన్–1 సాధించిన గొప్ప విజయం. భారతదేశ వైజ్ఞానిక ప్రతిభాపాటవాలకు అది అద్దం పట్టింది. చంద్రయాన్ విజయ స్ఫూర్తితో ఇస్రో శాస్త్రవేత్తలు 2013లో మంగళయాన్ (మార్స్ ఆర్బిటర్ మిషన్) జయప్రదంగా నిర్వహించారు. అంగారక గ్రహ కక్ష్యలోకి ఉపగ్రహాన్ని పంపించిన మొదటి ఆసియా దేశంగా భారత్ ఖ్యాతిగాంచింది. పదవీవిరమణ అనంతరం రాజ్యసభసభ్యుడుగా నియమితుడైన కస్తూరి రంగన్ ఇండో–అమెరికన్ పౌర అణు ఒప్పందం పార్లమెంటు ఆమోదం పొందేందుకు తన వాదనలతో తోడ్పడ్డారు. జాతీయ విద్యా విధానం–2020 రూపకల్పనలో కూడా కీలక పాత్ర వహించారు. భారతదేశ మొట్టమొదటి ఉపగ్రహం ఆర్యభట్టను రూపొందించి, ప్రయోగించిన బృందంలో సభ్యుడుగా ఉన్న నాటినుంచి చంద్రయాన్, మంగళ్‌యాన్‌లకు స్ఫూర్తినిచ్చి, ప్రాతిపదికలు నిర్మించిన నాటిదాకా భారతీయ అంతరిక్ష పరిశోధనా కార్యక్రమాలపై కస్తూరి రంగన్ ముద్ర చెరిపివేయలేనిది. ఆయన మేధో కృషి జాతికి జ్ఞానేంద్రియం, దేశ భవిష్యత్తుకు శాశ్వత వెలుగుబాట.

డిజిటల్ లైంగిక నేరాలపై చట్టమేదీ?

స్మార్ట్‌ఫోన్లు, ఇంటర్నెట్, సోషల్ మీడియాను వాడుకుని మహిళలపై డిజిటల్ హింస పెరుగుతున్నది. మహిళలు, బాలికల అభ్యంతరకర ఫొటోలను, వీడియోలను వారి అనుమతి లేకుండా వ్యాప్తిచేయడం లైంగిక వేధింపుల కంటే తీవ్రంగా విస్తరిస్తున్నది. ఈ తరహా నేర విధానం (మోడస్ ఒపెరాండి)పై ఉక్కుపాదం మోపి ఈ నేరాలను అరికట్టాలి. ఇందుకు తక్షణ కర్తవ్యంగా– ఈ నేరస్థులను కఠినంగా శిక్షించేందుకు చట్టం రూపొందించాలి. అప్‌లోడ్ అయిన ఫొటోలను, వీడియోలను త్వరగా తొలగించే సాధనాలను, మార్గాలను గుర్తించాలి. వాటిని బాధితులకు అందించాలి.

అభ్యంతరకర వీడియోలను అప్‌లోడ్ చేస్తున్నప్పుడే గుర్తించి, తొలగించగలిగే సామర్థ్యం యూట్యూబ్ వంటి వేదికలకు ఉంది. ఈ వేదికలు కృత్రిమ మేధస్సుతో పాటు మానవ పర్యవేక్షణను కూడా ఉపయోగిస్తున్నాయి. కానీ, వాట్సాప్ వంటి వేదికలు ఎండ్–టు–ఎండ్ ఎన్‌క్రిప్షన్‌తో గోప్యతకు పెద్దపీట వేయడంతో అక్కడ అభ్యంతరకర సమాచారాన్ని ముందస్తుగా గుర్తించడం గాని, ప్రభుత్వ పర్యవేక్షణ గాని దాదాపు అసాధ్యం. ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్ప వాట్సాప్ చర్యలు తీసుకోలేదు (అప్పుడు కూడా చివరి ఐదు సందేశాలు మాత్రమే పరిశీలనకు వెళ్తాయి). దీనివల్ల ఫిర్యాదు అందని పక్షంలో హానికరమైన కంటెంట్ విచ్చలవిడిగా వ్యాప్తి చెందే ప్రమాదం ఉంది.



ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం – 2000, సెక్షన్ 67ఎ ప్రకారం, అసభ్యకర ఫొటోలు, వీడియోలు షేర్ చేసిన వారికి ఐదేళ్ల వరకు జైలు శిక్ష విధించవచ్చు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (మధ్యవర్తి మార్గదర్శకాలు, డిజిటల్ మీడియా ఎథిక్స్ కోడ్) నియమాలు –2021 ప్రకారం చట్టవిరుద్ధమైన సమాచారాన్ని తొలగించడానికి సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు త్వరితగతిన చర్యలు తీసుకోవాలి. వ్యక్తిగత ఫిర్యాదుల కోసం ఫిర్యాదు అధికారిని నియమించి 24 గంటల్లోగా చర్య తీసుకోవాలి. కానీ ఇవి సరిపోవు. ప్రత్యేకంగా డిజిటల్ లైంగిక వేధింపులను అరికట్టేందుకు మరింత కఠినమైన, నిర్దిష్టమైన చట్టాల అవసరం ఉంది. సైబర్ నేరాలపై ఫిర్యాదుల కోసం 'నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్' (నంబర్: 1930)ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే, దీనికి ఆర్థిక నేరాలపైనే ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయి. దానితో ఈ పోర్టల్ డిజిటల్ లైంగిక వేధింపులపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టలేకపోతోంది. డిజిటల్ వ్యక్తిగత డేటా పరిరక్షణ చట్టం–2023, సెక్షన్ 12(3) ద్వారా అభ్యంతరకర సమాచారం, ఫొటోలు, వీడియోలను ఇంటర్నెట్ నుంచి తొలగించాలని కోరే హక్కును పౌరులకు కల్పించింది. దీని ఉల్లంఘనలపై రూ.50కోట్ల వరకు జరిమానా విధించే అధికారం 'డేటా పరిరక్షణ బోర్డు'కు ఉంటుంది. ఈ చట్టం ఇంకా అమలులోకి రావాల్సి ఉంది.

అంతర్జాతీయంగా పలు దేశాలు డిజిటల్ హింసను అరికట్టేందుకు మెరుగైన చర్యలు తీసుకున్నాయి. మనమూ ఆ ఉదాహరణలను పరిగణనలోకి తీసుకుని కఠినమైన చట్టాన్ని రూపొందించాలి. మెక్సికో, ఆస్ట్రేలియా తరహాలో అభ్యంతరకర వీడియోలు, ఫొటోలను మొదట పోస్ట్ చేసే వారినే కాకుండా, వాటిని ఫార్వర్డ్ చేసే వారిని కూడా కఠినంగా శిక్షించాలి. సోషల్ మీడియా సంస్థలు చట్టాలకు అనుగుణంగా నడుచుకునేలా, ఫిర్యాదులపై తక్షణమే స్పందించేలా చూడాలి. జర్మనీ తరహాలో భారీ జరిమానాలు విధించేలా నిబంధనలను కఠినతరం చేయాలి. ఆస్ట్రేలియా 'ఇ–సేఫ్టీ కమీషనర్' తరహాలో ఆన్‌లైన్ వేధింపులపై ఫిర్యాదులను స్వీకరించి, కంటెంట్‌ను వేగంగా తొలగించేందుకు, బాధితులకు సహాయం అందించేందుకు ప్రత్యేక వ్యవస్థలను బలోపేతం చేయాలి.

అంతేగాక పోర్నోగ్రఫీ నియంత్రణపై కూడా దృష్టిపెట్టాలి. అనేక లైంగిక నేరాల విషయంలో నిందితులపై పోర్నోగ్రఫీ ప్రభావం బైటపడింది. పశ్చిమ బెంగాల్ వైద్యురాలి హత్యాచారం కేసులో నిందితుడు పోర్నోగ్రఫీకి బానిస అని తేలింది. ఇప్పటికే బాలల పోర్నోగ్రఫీపై నిషేధం అమల్లో ఉంది. చైనా, యూఏఈ వంటి దేశాలు పోర్నోగ్రఫీపై పూర్తి నిషేధాన్ని అమలు చేస్తున్నాయి. ఈ దేశాలు మహిళలకు, బాలలకు భద్రమైనవిగా పేరు పొందాయి. కొంతకాలం పాటు మన దేశంలో కూడా పోర్నోగ్రఫీపై నిషేధం విధించి, తద్వారా ఇమేజ్ బేస్డ్ అబ్యూజ్‌ను కూడా నిరోధించవచ్చనే ఆలోచనను పరిశీలించాలి. కేవలం చట్టాలు, సాంకేతిక నియంత్రణలే కాకుండా సామాజిక దృక్పథంలో కూడా మార్పు రావాలి. పురుషులందరినీ భావి నేరస్థులుగా ఒకే గాటన కట్టే మూస ధోరణి కన్నా, మహిళలను గౌరవించే, వారి సాధికారతను కోరుకునే పురుషులను యువతకు ఆదర్శంగా చూపాలి.

– శ్రీనివాస్ మాధవ్

కశ్మీర్‌లో ఏది ఓడాలి? ఏది గెలవాలి?





■ రాహుల్ కుమార్

మారణకాండలూ కిరాతక కాల్పివేతలూ చరిత్రను గుర్తుకుతెస్తాయి. ఆ చరిత్ర వెనకున్న దారుణ భావాలపై దృష్టిపడేలా చేస్తాయి. పహల్గాం ఘోరకలిపై క్షోభించని హృదయం లేదు. గర్హించని మనసు లేదు. ఆగ్రహం చెందని ఆత్మలేదు. కన్నీరు కార్చని కన్నులు లేవు. మానవత్వం ప్రేరేపించే ఈ స్పందనలతో సమస్య తీరిపోదు. భవిష్యత్తు దారుణాలను ఆపనూలేవు. రాజకీయ లక్ష్యాల కోసం సాగించే రాక్షసాలనూ నిలువరించలేవు. మరోవైపు తక్షణ ప్రతీకారాలూ ప్రతిచర్యలూ మొదలయ్యాయి. హృదయాగ్నులను తాత్కాలికంగా చల్లార్చటం కూడా కొన్ని సందర్భాల్లో కావాల్సి వస్తుంది. కానీ సమస్య మూలాల్లోకి వెళ్లే సమాంతర చర్యలు చేపడితేనే వాటికీ సార్థకత లభిస్తుంది.

మతతత్వం రాజకీయాలను ప్రభావితం చేస్తున్నంత వరకూ తీవ్రవాదాలు నిరంతరం ఊపిరి పోసుకుంటూనే ఉంటాయి. కశ్మీర్ సమస్య చుట్టూ ఆవరించిన తీవ్రవాదం ఆ తత్వం నుంచే ప్రేరణ పొందుతోంది. దుశ్చర్యలన్నీ అందులో నుంచే తన్నుకొస్తున్నాయి. అందుకే విశాల దృష్టితో సమస్యను చూడటం మొదలుపెడితేనే కష్టమైనా, కొంత నష్టమైనా శాశ్వత పరిష్కార మార్గం కనపడుతుంది. మతదృక్పథంలో ఎంతటి వైషమ్యాలూ, ద్వేషాలూ, అమానవీయ ధోరణులూ గూడుకట్టుకుంటాయో గ్రహించటానికి పాకిస్థాన్ సైన్యాధిపతి ఆసిమ్ మునీర్ ఇటీవల చేసిన వ్యాఖ్యలే నిదర్శనం. పహల్గాం దారుణానికి ముందూ, తర్వాత కూడా మునీర్ చేస్తున్న వ్యాఖ్యలు యథాలాపంగా చేసినవిగా అనుకోలేం. 1940ల నుంచీ బలం పుంజుకున్న మతతత్వ భావాల నుంచే అలాంటి వ్యాఖ్యలు పుట్టుకొస్తున్నాయి.

1940లకు ముందు కూడా మతతత్వ భావాలు ఉన్నాయి. రెండో ప్రపంచయుద్ధం ముమ్మరంగా సాగుతున్న రోజుల్లో అవింకా ఇంకా బలపడ్డాయి. పాక్ సైన్యాధ్యక్షుడు పదేపదే ప్రస్తావిస్తున్నట్లుగా ముస్లింలు, హిందువులు అన్నిరకాలుగా వేర్వేరనీ ఇరువురూ ఒక రాజ్యవ్యవస్థలో ఇమడలేరనే భావన మతతత్వ సిద్ధాంతంలో కీలకం. 1940లో మహ్మద్ అలీ జిన్నా చేసిన లాహోర్ ప్రసంగంలో అది బలంగా వ్యక్తమైంది. దాన్నే మునీర్ లాంటి వాళ్లు పదేపదే వల్లెవేస్తున్నారు. నిజానికి జిన్నా మతతత్వాన్ని నూటికి నూరుపాళ్లూ విశ్వసించారని చెప్పలేం! ప్రత్యేక పాకిస్థాన్ ఏర్పడాలనే లక్ష్యానికి అది కావాల్సి వచ్చింది. జిన్నా ప్రకటన తర్వాత రాజకీయాలు పూర్తిగా మారిపోయాయి. ఆ తర్వాత అడుగులన్నీ దేశ విభజన దిశగానే పడ్డాయి. మైనారిటీలకు అనేక రక్షణలను కల్పించి, అధికారంలో సముచిత వాటా ఇచ్చి, ఉన్నత పదవులకు పోటీపడటానికి అన్ని అవకాశాలనూ అందించి, హిందువులు, ముస్లింలు సామరస్యంగా మనగలిగే రీతిలో గట్టి రాజ్యాంగబద్ధమైన ఏర్పాట్లు చేసుకుందామని ఎన్ని ప్రతిపాదనలు చేసినా జిన్నా అంగీకరించలేదు. అందుకు జిన్నా సమర్థించుకున్న తీరును తెలుసుకోవాలనుకుంటే లాహోర్ ప్రసంగం లోతుల్లోకి వెళ్లాలి. 1990ల తర్వాత ఇంటాబయటా పెరుగుతున్న భిన్నరకాల మతతత్వాలను అర్థం చేసుకోటానికీ అది అత్యవసరం. సారంలో మతతత్వాల మధ్య పెద్ద తేడా ఉండదు.

హిందువులూ ముస్లింలూ ఏక రాజ్యవ్యవస్థలో సామరస్యంతో జీవించగలరని ఎవరు చెప్పినా జిన్నా తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య లౌకిక విధానాలతో భిన్న మతాల ప్రజలకు సమానహక్కులు కల్పిస్తే ఐక్యంగా ఉండొచ్చన్న ప్రతిపాదనను జిన్నా కొట్టిపడేశారు. అట్లా సాధ్యం అవుతుందని చెప్పిన ఆనాటి కాంగ్రెస్ నాయకులకు అసలు హిందూ–ముస్లిం మతాల మూల సారమే అర్థం కావటంలేదనీ విమర్శించారు. జిన్నా దృష్టిలో ఇస్లాం, హిందూ మతాలు.. భిన్న దేవతారాధనలకూ, భిన్న విశ్వాసాలకూ పరిమితమైనవే కావు. అవి మతాలు కావనీ భిన్న సామాజిక వ్యవస్థలనీ సూత్రీకరించారు. సామాజిక వ్యవస్థ అంటే సమాజ మనుగడకు అవసరమైన అన్ని కార్యకలాపాలనూ భావాలనూ ఇముడ్చుకున్న ఒక వ్యవస్థ. అనేక సంబంధాల సమాహారమైన ఒక ఏర్పాటు. అది మనుషుల స్థానాలను నిర్దేశిస్తుంది. ఆ స్థానాల్లో కుదురుకుని జీవించేలా విలువలను బోధిస్తుంది. నీతులను ఖాయపరుస్తుంది. పాపపుణ్యాలను స్పష్టం చేస్తుంది. అసమానతలను సమర్థించే భావాలను కలిగి ఉంటుంది.. కష్టనష్టాలకు దైవిక కారణాలను పేర్కొంటుంది. అధికారాలకు హద్దులనూ అర్హులనూ నిర్దేశిస్తుంది. ఒకనాటి సగటు భారతీయ గ్రామాన్ని చూస్తే సామాజిక వ్యవస్థకు సంబంధించిన ప్రధాన రూపురేఖలన్నీ స్పష్టంగా కనపడతాయి. హిందువులకూ ముస్లింలకూ పూర్తి భిన్నంగా ఉండే వ్యవస్థగా దాన్ని భావించలేం. ముస్లిం భూస్వాములకు ఆధిపత్యం ఉండేచోట భిన్న సామాజిక వ్యవస్థ ఉంటుందనీ అట్లాగే హిందూ భూస్వాములకు ఆధిపత్యం ఉన్నచోట వేరే సామాజిక వ్యవస్థ ఉంటుందనీ చెప్పేందుకు భారత్ చరిత్రలో ఆధారాలు కనపడవు. ఒక మతాన్ని పాటించేవారు ఎక్కువగా ఉన్నచోట సాంస్కృతిక పరమైన ఆచారాలు, కట్టుబాట్లు భిన్నంగా ఉండొచ్చు. అంతమాత్రాన భిన్నమతాలు పాటించే వారందరూ ప్రత్యేకమైన సామాజిక వ్యవస్థలో ఉన్నట్లుగా భావించలేం. గ్రామాలకైనా నగరాలకైనా ఇదే వర్తిస్తుంది.

జిన్నా దృష్టిలో వేర్వేరు మతాలను అవలంబించేవారు ఒకే జాతిగా ఉండలేరు. అందుకు అవసరమైన జాతీయ ఐక్యతా భావాన్ని ఏర్పరుచుకోలేరు. సహానుభూతిని సృష్టించుకోలేరు. కష్టనష్టాలకు ఒకరీతిగా స్పందించలేరు. ఉమ్మడి ప్రమాదాలప్పుడూ ఊపివేసే ఉమ్మడి ఉద్వేగ భావన కనపడదు. అనుసరించే మతసంస్కృతి భిన్నమైంది కాబట్టి సమష్టి భావన నెలకొనదు. అందుకే జాతీయ భావాలతో ముస్లింలూ, హిందువులూ ఎదగగలరని అనుకోవటం ఒక కల.. అపోహ మాత్రమే. దీన్ని గ్రహించకపోవటమే అన్ని సమస్యలకూ మూలం. ఆ అపోహనూ ఆ కలనూ వీడి పొరపాటును సరిదిద్దుకోకపోతే భారతదేశం వినాశం వైపు నడుస్తుంది. ఇట్లా మౌలికంగా భిన్న మతాలపై ఆధారపడిన రెండు వేర్వేరు నాగరికతలకు.. హిందువులూ, ముస్లింలూ చెందుతారనీ జిన్నా వ్యాఖ్యానించారు. ఒక రాజ్యంలో వీళ్లు కలిసి ఉంటే సంఘర్షణలు తప్పవని జిన్నా 1940ల్లో సూత్రీకరించారు. అమెరికా రాజకీయ శాస్త్రవేత్త శామ్యూల్ హంటింగ్‌టన్ 1990లో బాగా ప్రచారంలోకి తీసుకొచ్చిన భిన్న నాగరికతల సంఘర్షణల భావనకూ దీనికీ పెద్ద తేడా కన్పించదు. అంబేద్కర్ కూడా ముస్లింలు ప్రత్యేక దేశం కోరుకోవటంలో తప్పులేదంటూ గట్టి వాదనే చేశారు. ముస్లింలీగ్ వాదనపై అంబేద్కర్ చేసిన విశ్లేషణ ఆయన రచనలు– ప్రసంగాల ఎనిమిదో సంపుటంలో స్పష్టంగా ఉంది.

ఇక జిన్నా ప్రకారం... ముస్లిం సాహిత్యం వేరు. తాత్వికత వేరు.. అభిరుచి వేరు.. ప్రేరణగా తీసుకునే మూలాలు వేరు.. కావ్యాలు వేరు... కథనాలు వేరు... ముస్లిం వీరులు వేరు... శత్రువులు వేరు.. విషాదాలు వేరు.. ఇంకా చెప్పుకోవాలంటే ఒకరి (హిందువులైనా, ముస్లింలైనా) విజయం ఇంకొకరికి పరాజయం అవుతుంది... ఇలాంటి విరుద్ధ భావనలు, చరిత్రలు కలిగిన రెండు జాతులను ఒక దేశంలో కలిపి ఉంచటం, అందులోనూ ఒకదాన్ని మెజారిటీగా మరొకదాన్ని మైనారిటీగా కలిపి ఉంచటం ఏ విధంగానూ వాంఛనీయం కాదు.

జిన్నా ఈ మాటలు చెప్పి 85 ఏళ్లు అయింది. విశాల ప్రజాస్వామ్య దృష్టితో వీటిని అంగీకరించటం కష్టం. అన్నిటినీ మతమే నిర్ణయిస్తుందని భావిస్తే ఆధునిక నాగరికతకు అర్థమే ఉండదు. ఆర్థిక, సాంకేతిక, విజ్ఞాన శాస్త్రాల్లో వచ్చిన అనేక మార్పులు మతాలు ప్రాణప్రదంగా భావించే ఎన్నో భావాలను మార్చివేశాయి. ఏక భాష, ఏక మతం, ఏక ప్రాంతం ఆధారంగా తలెత్తిన జాతీయ రాజ్యాలు (నేషన్ స్టేట్స్), జాతీయవాదాలు (నేషనలిజమ్స్) మారణకాండలకూ, యుద్ధాలకూ, ఉన్మాద రాజకీయాలకు పలుచోట్ల కారణమయ్యాయి. ఈనాటి జాతీయ రాజ్యాల గతంలో ఎంతో హింస ఉంది. అల్పసంఖ్యాకుల అణచివేత ఉంది.

బహుళ సంస్కృతుల పట్ల సహనం, సమానత్వం చూపాలనీ మతాధిక్య రాజ్యాంగాలు ఉండకూడదనే భావన బలపడినచోటే ప్రజాస్వామ్యాలు నిలబడ్డాయి. ఏక మతాధిక్యతే రాజ్యాంగానికి ఆధారమైన చోట నియంతృత్వాలు రాజ్యమేలుతున్నాయి. 78 ఏళ్ల మన ప్రజాస్వామ్యం మనగలగటానికి బహుళ సంస్కృతుల పట్ల సహనమే ప్రధానకారణం. ఆ సహనానికి కల్పించిన రాజ్యాంగబద్ధతే మనల్ని జిన్నా భావాల నుంచి దూరంగా ఉంచుతోంది. ప్రస్తుతానికి దూరంగా ఉన్నంత మాత్రాన ప్రమాదం తొలగిపోయిందన్న భరోసాలేదు. 1940ల్లో జిన్నా, 1990ల్లో శామ్యూల్ హంటింగ్‌టన్ చేసిన సూత్రీకరణలను నిజం చేయటానికి జరుగుతున్న ప్రయత్నాలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరంగా మారాయి. జిన్నా ఆలోచనలు ఇస్లాం మతాన్ని అనుసరించిన వారికే పరిమితం కాలేదు. ఆ భావాలకు నకళ్లు, ప్రతిధ్వనులూ బలంగా వ్యాపించటం మన ప్రజాస్వామ్యానికి సవాలుగా మారాయి. మతం సర్వోన్నతమని, స్వమతం నుంచే సమస్త ప్రేరణ పొందాలని, ప్రతినాయకులందరూ ఇతర మతాల్లోనే ఉన్నారని చెలరేగిపోతున్న ప్రచారమే ఇందుకు నిదర్శనం.

ముస్లింలు అధికులుగా ఉన్న కశ్మీర్ తమకే చెందాలనే పాకిస్థాన్ చేస్తున్న వితండవాదన వెనుక ఉన్నది 1940ల్లో పురుడుపోసుకున్న మతతత్వమే. మతతత్వం ఉన్నచోట ప్రజాస్వామ్య నిర్ణయాలకు తావుండదు. ప్రజల అభీష్టాలకు విలువుండదు. అన్యమతస్థులను అసమానంగా, కర్కశంగా, అమానవీయంగా చూడటం ద్వారానే మతతత్వం మనుగడ సాగిస్తుంది. కశ్మీర్ ప్రజలు దాన్ని తిరస్కరించేలా చేయటంలోనే అసలు విజయం ఉంటుంది. పహల్గాం సంఘటనకు ప్రతీకార చర్యలు... సింధూ నదీజలాల ఒప్పందం నుంచి వైదొలగటంతో మొదలై మరెన్నింటి దాకానో వెళ్లొచ్చు. పాక్‌ను చక్రబంధనం చేయొచ్చు. ఛిన్నాభిన్నం చేసే వ్యూహాలకు పదును పెట్టొచ్చు. కశ్మీర్ వ్యవహారాల నిపుణులందరూ ఏమేమీ చేయాలో జాబితాలూ ఇస్తున్నారు. వారందరూ ముఖ్యమైందిగా చెప్పేదీ ఒకటుంది. అది.. కశ్మీరీల హృదయాలను గెలుచుకోవటం! ఆ గెలుపే తీవ్రవాదుల ఓటమిని ఖాయం చేస్తుంది. కశ్మీర మహాచరిత్రకారుడైన కల్హణుడు అన్నట్లుగా కశ్మీరును ఆధ్యాత్మికంగా గెలుచుకోవటం ఒకనాడు కష్టం అయివుండొచ్చు. ఆధునిక ప్రజాస్వామ్యంలో తగినంత ఉదారత ప్రదర్శిస్తే అది అసాధ్యం కాదు. అందుకు ఇప్పటిదాకా వేసిన అడుగులు మాత్రం సరిపోవు!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

> **పహల్గాం సంఘటనకు ప్రతీకార చర్యలు... సింధూ నదీజలాల ఒప్పందం నుంచి వైదొలగటంతో మొదలై మరెన్నింటి దాకానో వెళ్లొచ్చు. కశ్మీర్ వ్యవహారాల నిపుణులందరూ చెప్పేదీ ఒకటుంది. అది.. కశ్మీరీల హృదయాలను గెలుచుకోవటం! ఆ గెలుపే తీవ్రవాదుల ఓటమిని ఖాయం చేస్తుంది. కశ్మీర మహాచరిత్రకారుడైన కల్హణుడు అన్నట్లుగా కశ్మీరును ఆధ్యాత్మికంగా గెలుచుకోవటం ఒకనాడు కష్టం అయివుండొచ్చు. ఆధునిక ప్రజాస్వామ్యంలో తగినంత ఉదారత ప్రదర్శిస్తే అది అసాధ్యం కాదు. అందుకు ఇప్పటిదాకా వేసిన అడుగులు మాత్రం సరిపోవు!**

> **జిన్నా దృష్టిలో వేర్వేరు మతాలను అవలంబించేవారు ఒకే జాతిగా ఉండలేరు. జాతీయ ఐక్యతా భావాన్ని ఏర్పరుచుకోలేరు. సహానుభూతిని సృష్టించుకోలేరు. కష్టనష్టాలకు ఒకరీతిగా స్పందించలేరు. అనుసరించే మతసంస్కృతి భిన్నమైంది కాబట్టి సమష్టి భావన నెలకొనదు. అందుకే జాతీయ భావాలతో ముస్లింలూ, హిందువులూ ఎదగగలరని అనుకోవటం ఒక కల.. అపోహ మాత్రమే.**

అలుపెరుగని పద్యం 'మెట్టు'



ఆయనో అలుపెరుగని పద్యం. సింహపురి సాహితీ భీష్ముడు. తన ప్రసంగ గంభీరతతో మృదు మధుర భాషణంతో నెల్లూరు సాహితీలోకంలో ధ్రువతారగా వెలిగిన నేపథ్యం ఆయన సొంతం. ఆయనే ప్రబంధ కర్త, పద్య కళాపరిషత్ సారథి మెట్టు రామచంద్రప్రసాద్. వి.ఆర్. కళాశాల విశ్రాంత ఆంధ్రోపన్యాసకునిగా పేరుగాంచిన ప్రతిభామూర్తి. సినీకవి వెన్నెలకంటి, గాయకుడు గిరీశం వంటివారు శిష్యబృందంలో ఉన్నారు. పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తన గురువు హనుమజ్జానకీరామశర్మ పేర ఇచ్చే అవార్డును ఈ మధ్యనే నెల్లూరు టౌన్ హాలులో వెంకయ్యనాయుడు చేతుల మీదుగా అందుకున్నారు రామచంద్ర ప్రసాద్. 2007లో పద్య కళాపరిషత్ స్థాపించిన నాటి నుంచి గరికపాటి నరసింహారావు, మేడసాని మోహన్ లాంటి ఉద్దండుల చేత ఉపన్యాసధారలో సింహపురీయుల్ని ముంచెత్తిన ఋషితుల్యుడు. తిక్కన పుట్టినగడ్డపై జన్మించి, పద్దెనిమిది పర్వాల మహాభారతాన్ని ఒక్కో ఆశ్వాసం ఒక్కొక్కరి చేత చెప్పించి మెప్పించిన ధీరోదాత్త హృదయుడు రామచంద్రప్రసాద్. పోలూరి హనుమజ్జానకీరామశర్మ పుస్తకాలపై ప్రసంగాలను అలుపెరుగక అందించిన సాహితీ కృషీవలుడు ఆయన.

సుశీల, మహాప్రస్థానం– నవలలు; ఏడుకొండలవాడు, బస్సులో ప్రయాణం, ఒక్క రాత్రి... మొదలైన నాటికలు; చదరంగం, రోగుల గాథలు, సోమరి జీవులు మొదలగు కథానికలు; కలల రాణి, విజ్ఞానదీపాలు అనే గేయాలు రచించి వచించారు ఆయన. అయితే ఇవన్నీ అముద్రితాలు కావడం బాధాకరం. మరో రోగుల గాథలు, విజ్ఞానదీపాలు తప్ప ఆనాటి ఆయన రచనలన్నీ కాలగర్భంలో కలిసిపోయాయి. ఆయన రాసిన శివగామిని ప్రబంధ లక్షణాలతో అలరారిన మహోన్నత పద్యకావ్యం. 1967లో రచించిన ఈ గ్రంథం ప్రథమ ముద్రణ 1971లోను, ద్వితీయ ముద్రణ 2019లోనూ, తృతీయ ముద్రణ 2020లోనూ జరిగి, పండిత కవుల చేత ప్రశంసలనందుకున్నది. ఈ ఏప్రిల్ 22న సెలవంటూ వెళ్ళిపోయిన రామచంద్రప్రసాద్, సాహితీ లోకానికి చేసిన సేవలు చిరస్మరణీయం. ఆయన అముద్రిత రచనల్ని అచ్చువేయడమే ఆయనకు మనమిచ్చే నివాళి.

– చిన్ని నారాయణరావు

ప్రజావ్యూహం!

అటవీసంపద–ఖనిజాల వేటలో
ప్రజా ఉద్యమాల అణచివేతలో
అడవిబిడ్డల ప్రాణాలను
హరించడమే– తప్ప
వొడ్డుకు చేర్చలేని శస్త్రచికిత్స
ఇప్పుడు కొనసాగుతున్న
సైనిక ఆపరేషన్– కగార్!

ఈ అసమ అరణ్య యుద్ధంలో
క్షేత్రస్థాయి నిజాన్ని మరచి
రక్తమోడిన యాభై సంవత్సరాల
'ప్రజాయుద్ధం' సాధించినదెంత?

అడవిమూలాల అంచులపై
కొండలపై ఆత్మరక్షణే కావొచ్చు,
మందుపాతరలు పేలిన ఫలితం
చీలిన అవయవాలు– కండరాలు–
నేలంతా చిందిన రక్తం!

ప్రతీకార 'కగార్' కక్షతో
మారుమోగే తుపాకుల మోతలో
సంజాయిషీ లేని
సర్కారి హింసాకాండకు
ఇకనైనా ముగింపు పలకాలి,
ఇరువైపులా శాంతి చర్చలే మార్గాంతరం,
పోరాటశక్తుల ఆత్మవిశ్వాసాన్ని
వెల్లడించడమే ప్రజావ్యూహం!!

– నిఖిలేశ్వర్

ఇంజనీర్ల సలహా మండలి తక్షణావసరం!

కూతురు పెళ్లి, గంగ జాతర, పంట నూర్పిళ్లు, కుమ్మూ దుమ్మూ అన్నీ ఒకేసారి వచ్చి పడ్డాయనే సామెత ఉంది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో సాగునీటి రంగం– ప్రధానంగా అంతర్ రాష్ట్ర జల వివాదాలు– ఇలాంటి దురవస్థనే ఎదుర్కొంటున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా అంతర్ రాష్ట్ర జల వివాదాలపై అవసరమైన మేరకు దృష్టి పెట్టడం లేదు. రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో అంతర్ రాష్ట్ర జల వివాదాల్లో సమగ్ర అవగాహన గల ఇంజనీరింగ్ వింగ్ ఉండాలి. సాధారణంగా ఇటువంటి వింగ్ జల వనరుల శాఖ కన్నా ముఖ్యమంత్రి అధీనంలో వుండాలి. కేసీఆర్ వ్యవహార సరళి అందరికీ నచ్చకున్నా గతంలో తెలంగాణలో అటువంటి వింగ్ ముఖ్యమంత్రి అధీనంలో పని చేసేది. ఆ సమయంలో మన రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా కేసీఆర్‌తో చెట్టాపట్టాలేసుకు తిరిగినా ఆయన హయాంలోనూ ఈ విధానం అమలులో లేదు. ఇప్పుడు కూడా చంద్రబాబు నాయుడు వద్దా ఇది లేదు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో గోదావరి బనకచర్ల అనుసంధానం లాంటి భారీ సాగునీటి పథకం అమలుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సకల యత్నాలు చేస్తున్నా ఇటువంటి ఏర్పాటు లేకపోవడంతో కొన్ని ఇబ్బందులు తప్పడం లేదు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ తదుపరి రాష్ట్ర జల వనరుల శాఖలో పని చేసి ఉద్యోగ విరమణ చేసిన పలువురు నిపుణులైన ఇంజనీర్లు మనకు ఉన్నారు. వీరి సేవలు రాష్ట్ర ప్రభుత్వం ఉపయోగించుకొంటే మెరుగైన సత్ఫలితాలు పొందవచ్చు. వాస్తవంలో గోదావరి బనకచర్ల అనుసంధాన పథకాన్ని నవ్యాంధ్ర రిటైర్డ్ ఇంజనీర్స్ అసోసియేషన్ ప్రప్రథమంగా తెరమీదకు తెచ్చింది. గోదావరి కృష్ణ అనుసంధానం అంటూ కేసీఆర్, జగన్మోహన్‌రెడ్డి డ్రామాలాడిన సమయంలో అసోసియేషన్ తరపున ఈ ప్రతిపాదనతో జగన్మోహన్‌రెడ్డికి లేఖ రాశారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గోదావరి బనకచర్ల అనుసంధానం ప్రముఖంగా తెర మీదకు తెచ్చినపుడు కూడా ఈ అసోసియేషన్ విలువైన సూచన చేస్తూ ముఖ్యమంత్రికి లేఖ రాసింది. ఇలా మనకు గతంలో ఇరిగేషన్ శాఖలో పని చేసి ఉద్యోగ విరమణ చేసిన ప్రముఖులైన ఇంజనీర్లు ఉన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవ తీసుకొని ఇలాంటి వారితో సలహా మండలి ఏర్పాటు చేస్తే ఎంతో ఉపయుక్తం. కొత్త పథకాలకు డీపీఆర్‌లు రూపొందించే సమయంలోనూ, ట్రిబ్యునల్ వద్ద గాని గ్రీన్ ట్రిబ్యునల్ సుప్రీంకోర్టుల్లో కేసుల విచారణ సందర్భంలో సలహా మండలి సభ్యుల సేవలు ఉపయోగపడతాయి.

కూటమి ప్రభుత్వం తన హయాంలో ఎన్నెన్నో భారీ సాగునీటి ప్రాజెక్టులు చేపట్టినా బచావత్ ట్రిబ్యునల్ అవశేష ఆంధ్రప్రదేశ్‌కు చేసిన కేటాయింపులు కాపాడుకోవడంపైనే రాష్ట్ర సాగునీటి రంగం భవిష్యత్తు ఆధారపడి ఉంది. ఇందులో ఏం తప్పిదం జరిగినా రాష్ట్ర ప్రభుత్వం నింద మోయవలసి ఉంది. పైగా జగన్మోహన్‌రెడ్డి, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రజల ముందు ముద్దాయిలుగా నిలబడవలసి ఉంటుంది. గోదావరి బనకచర్ల అనుసంధానం, పోలవరం లాంటి పది ప్రాజెక్టులు కూడా బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపుల ముందు దిగదుడుపే.

ఇప్పటివరకు వెలువడిన వార్తల మేరకు ట్రిబ్యునల్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తరపున వాదనలు సమర్థవంతంగా వినిపించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ముఖ్యమంత్రి స్థాయిలో సమీక్షా సమావేశం జరగలేదు. అవతల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండు సమావేశాలు, జలవనరుల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి రెండు సమీక్షా సమావేశాలు నిర్వహించారు. తుదకు ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రైనా అలాంటి సమావేశం నిర్వహించినట్లు వార్తలు వెలువడలేదు. మరోవేపు అసలు ట్రిబ్యునల్ నియామకాన్నే సుప్రీంకోర్టులో సవాల్ చేసిన కేసు ఆ మధ్య విచారణకు వచ్చింది. కాని తర్వాత ఏమైనదీ తెలియదు. రాష్ట్ర విభజన చట్టం మేరకు రెండు రాష్ట్రాల మధ్య జల వివాదాలు పరిష్కారం కావలసి వుండగా 1956 అంతర్ రాష్ట్ర జల వివాద చట్టం కింద ట్రిబ్యునల్ నియామకం సరికాదనే వాదనతో కేసు నడుస్తోంది. అతి ముఖ్యమైన ఈ కేసులను ఢిల్లీ స్థాయిలో పర్యవేక్షణకు నిపుణులైన ఇంజనీరింగ్ అధికారులు నియమింపబడినట్లు కించిత్తు సమాచారం కూడా లేదు.




> **రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో అంతర్ రాష్ట్ర జల వివాదాల్లో సమగ్ర అవగాహన గల ఇంజనీరింగ్ వింగ్ ఉండాలి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ తదుపరి రాష్ట్ర జల వనరుల శాఖలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన పలువురు నిపుణులైన ఇంజనీర్లు మనకు ఉన్నారు. వీరి సేవలు రాష్ట్ర ప్రభుత్వం ఉపయోగించుకొంటే మెరుగైన సత్ఫలితాలు పొందవచ్చు.**

ఇదిలా ఉండగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న గోదావరి బనకచర్ల అనుసంధాన పథకాన్ని సుప్రీంకోర్టులో సవాల్ చేస్తామని ఇటీవల తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రకటించారు. ముఖ్యమంత్రి ఇంత పట్టుదలగా ఉన్న ఈ పథకం గురించి సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం కెవియట్ వేయవలసి ఉంది.

వంశధార ట్రిబ్యునల్ తీర్పు గురించి ఇటీవల కేంద్ర జలశక్తి శాఖకు చెందిన ఒక డాక్యుమెంట్ సరికొత్త సమాచారం తెలియజేసింది. వంశధార ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టులో కేసులు నడుస్తున్నాయి. గాని సుప్రీంకోర్టు స్టే ఇవ్వలేదు. అయినా ట్రిబ్యునల్ తీర్పు గెజెట్ నోటిఫికేషన్ జరగలేదు. ఒకింత ఆశ్చర్యమే. 2010లో నియమింపబడిన ట్రిబ్యునల్ 2017 సెప్టెంబర్‌లో మధ్యంతర తీర్పు ఇచ్చింది. 2018లో ఒడిషా సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది. కాని స్టే ఇవ్వలేదు. తిరిగి ట్రిబ్యునల్ తన తీర్పుకు వివరణ ఇస్తూ 2019లో మరో తీర్పు ఇచ్చింది. ఆ వెంటనే ఒడిషా మరో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది. అంతిమంగా ట్రిబ్యునల్ 2021 జూన్‌లో తుది తీర్పు ఇస్తే ఒడిషా ప్రభుత్వం మరో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది. కాని సుప్రీంకోర్టు స్టే ఇవ్వలేదు. 2021లో ట్రిబ్యునల్ తుది తీర్పు వచ్చిన తర్వాత ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి కేంద్ర జల వనరుల శాఖ మంత్రికి సెప్టెంబర్‌లో లేఖ రాసి చేతులు దులుపుకున్నారు. ఇప్పటికీ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. వంశధార ట్రిబ్యునల్ ఆంధ్రప్రదేశ్‌కు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. నేరెడి వద్ద బ్యారేజీతో పాటు సైడ్‌వేర్ నిర్మాణానికి అనుమతి ఇచ్చింది. ఈ తీర్పు అమలు జరిగితే స్వల్ప వ్యయంతో వంశధార నాగావళి నదుల అనుసంధానం సులభతరమౌతుంది. రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ కెవి సుబ్బారావు ద్వారా తెలిసిన (ఆర్టికల్‌లో) సమాచారమేమంటే తీర్పు వెలువడిన అనంతరం చీఫ్ సెక్రటరీ ఒడిషా వెళ్లి ఒక కమిటీ తీర్పుకు అంగీకరించారని అనంతరం ఎవరూ దీని విషయం పట్టించుకోలేదట. కాని జగన్మోహన్‌రెడ్డి హయాంలో జరిగిన ఒక సమీక్ష సమావేశంలో సుప్రీంకోర్టులో కేసు పరిష్కారమైతే తప్ప ముందుకు వెళ్లలేమని రాష్ట్ర జల వనరుల శాఖాధికారులు తెలియజేశారు. ఇందులో ఏది వాస్తవమో కొమ్ములు తిరిగిన నేతలు శ్రీకాకుళం జిల్లాలో ఉన్నా ఎవరూ పట్టించుకోలేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన వారి సేవలు ఈ సందర్భంగా ఉపయోగించుకొంటే ఇలాంటి మరుగుపడిన అనేక అంశాలు వెలుగుచూస్తాయి.

■ వి. శంకరయ్య
విశ్రాంత పాత్రికేయులు





పచ్చగా కళకళలాడుతున్న ప్రధాన రహదారి

అందంగా అమరావతి



ఆకాశమంత ఆనందం

గుల్లలమోద క్షిపణి పరిశోధనా కేంద్రానికి తొలగిన అడ్డంకులు

- కేంద్రంతో పాటు రెండోదశ పనుల ప్రారంభానికి సన్నాహాలు
- మే 2న ప్రధాని నరేంద్రమోదీతో వర్చువల్‌గా చేసేందుకు ఏర్పాట్లు

గుల్లలమోద క్షిపణి పరీక్షా కేంద్రం అందుబాటులోకి వచ్చే సమయం ఆసన్నమైంది. అమరావతి పునర్నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి మే 2న ప్రధానమంత్రి నరేంద్రమోదీ రానుండగా, క్షిపణి పరీక్షా కేంద్ర రెండోదశ పనులను ఆయనతో వర్చువల్‌గా ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. గత వైసీపీ హయాంలో నిర్లక్ష్యంగా వదిలేసిన ఈ కేంద్రాన్ని కూటమి ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో తిరిగి పట్టాలెక్కించారు. డీఆర్‌డీవో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించతలపెట్టిన క్షిపణి పరీక్ష కేంద్రం కోసం రాబోయే ఐదారేళ్లలో దాదాపు రూ.20 వేల కోట్లు ఖర్చు చేయనున్నారు. దీంతో భవిష్యత్తులో దివి ప్రాంతం అభివృద్ధివైపు పరుగులు తీస్తుందని స్థానికులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు.

6లో

పునర్నిర్మాణ శంకుస్థాపనకు ప్రత్యేక ఏర్పాట్లు

ప్రధాని మోదీ రానుండటంతో చకచకా పనులు

- ఇప్పటికే పూర్తయిన ప్రధాన వేదికలు, గ్యాలరీలు
- మోదీ రోడ్డు షో కోసం ప్రత్యేక రోడ్డు నిర్మాణం
- నందనవనాలుగా మారిన ప్రధాన రహదారులు

అమరావతికి వచ్చేవారి కోసం సూచిక బోర్డులు



సభావేదిక వద్దకు రోడ్డు నిర్మాణం



సిద్ధమైన ప్రధాన వేదిక

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : అమరావతి పునర్నిర్మాణ శంకుస్థాపనకు కౌంట్‌డౌన్ మొదలైంది. వచ్చేనెల 2వ తేదీన వెలగపూడిలో జరిగే ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాల్గొననుండటంతో సభా ప్రాంగణాన్ని అందంగా ముస్తాబు చేస్తున్నారు. పనులన్నీ తుదిదశకు చేరుకున్నాయి. ముఖ్యంగా మూడు వేదికల పనులు పూర్తయ్యాయి. సాంస్కృతిక కళావేదికను సంప్రదాయబద్ధంగా సిద్ధం చేశారు. లక్షా ఇరవై వేలమంది కూర్చునేలా మూడు భారీ వేదికలు ఏర్పాటయ్యాయి. వీటిలో గ్యాలరీ పనులన్నీ పూర్తిచేశారు. వీఐపీలు కూర్చోవటానికి సోఫాలు, అధికారులు కూర్చోవటానికి వీలుగా ఫోమ్ కుర్చీలు, ప్రజలు కూర్చోవటానికి వీలుగా కుర్చీలను సిద్ధం చేశారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని పెద్ద ఎత్తున కూలర్లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రధానమంత్రి దిగే హెలిప్యాడ్ నుంచి వేదికకు చేరుకునే వరకూ రోడ్డు మార్గాన్ని బీటీ రోడ్డుగా అభివృద్ధి చేశారు. ప్రధాన రహదారులను మొక్కలతో ముస్తాబు చేశారు. అమరావతికి వచ్చేవారు ఎటు వెళ్లాలో తెలుసుకునేలా అధునాతన డైరెక్షన్ బోర్డులు కూడా ఏర్పాటు చేశారు.

నెట్టెంకు పట్టం

కేడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా నియామకం

జగ్గయ్యపేట శ్రేణుల్లో ఆనందోత్సాహాలు



నెట్టెం రఘురాం

జగ్గయ్యపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా సహకార కేంద్రబ్యాంకు చైర్మన్‌గా విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాంను నియమిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. అధిష్ఠానం నుంచి సోమవారం ఆయనకు సమాచారం అందటంతో నెట్టెం మంగళగిరిలోని కార్యాలయానికి వెళ్లారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం, వివాదాలకు దూరంగా ఉండటం, సమర్థనీయతతో పాటు ముక్కుసూటిగా వ్యవహరించే వ్యక్తి కావడం, చంద్రబాబుతో ఉన్న అనుబంధం, గత సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి కృష్ణాజిల్లాకు విజయం చేకూర్చడంలో కీలకపాత్ర పోషించినందుకే నెట్టెంను ఈ పదవి వరించింది.

ఆవిర్భావం నుంచి టీడీపీలోనే..

టీడీపీ ఆవిర్భావం నుంచి నెట్టెం రఘురాం సేవలందిస్తున్నారు. ఎల్ఎంబీ బ్యాంకు డైరెక్టర్‌గా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన 1985లో జగ్గయ్యపేట నుంచి పిన్న వయస్సులోనే ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత 1989లో కాంగ్రెస్ ప్రభంజనంలోనూ విజయం సాధించా రు. 1994లో వరుసగా మూడుసార్లు విజయం సాధించి జగ్గయ్యపేట నుంచి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా రికార్డు సాధించారు. కమ్యూనిస్టులు, కాంగ్రెస్ కంచుకోటగా ఉన్న జగ్గయ్యపేటలో టీడీపీకి గట్టి పునాది వేశారు. 1996లో కొంతకాలం

మిగతా 6లో..

ప్రభుత్వ భూమిని పంచుకున్నారు

బూదవాడ ల్యాండ్ సీలింగ్ భూములపై ప్రైవేట్ వ్యక్తులు, రెవెన్యూ అధికారుల కన్ను

- 1975లోనే 40 ఎకరాలు ప్రభుత్వానికి అందజేసిన యజమాని
- స్వాధీనం చేసుకోకుండా వదిలేసిన రెవెన్యూ అధికారులు
- భూములపై ప్రైవేట్ వ్యక్తుల దృష్టి.. అధికారులతో కలిసి కొట్టేసే కుట్ర
- రూ.25 కోట్ల విలువైన భూమిని తక్కువకు అమ్మేయాలనే పన్నాగాలు
- కలెక్టర్ దృష్టిపెట్టి పేదలకు అందజేస్తే ఉపయోగకరం



బూదవాడలోని ప్రభుత్వ భూములు

ప్రభుత్వ భూమికే టెండర్ పెట్టారు. ప్రభుత్వానికి చెందాల్సిన మిగులు భూమిని ప్రైవేట్ వ్యక్తులతో కలిసి రెవెన్యూ అధికారులు చెరపట్టారు. బినామీ పేర్లతో అమ్ముకుంటూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోరా.. అని స్థానికులెవరైనా ప్రశ్నిస్తే ఆక్రమణదారులకు నోటీసులు ఇస్తున్నామంటారు. కానీ, ప్రభుత్వ భూములు మాత్రం ఒక్కొక్కటిగా అన్యాక్రాంతమవుతున్నాయి. నోటీసులతో కాలక్షేపం చేయటం తప్ప ఆ భూములను స్వాధీనంలోకి తీసుకోవటానికి రెవెన్యూ యంత్రాంగం సాహసించట్లేదు. జిల్లా జాయింట్ కలెక్టర్ సెలవుల్లో ఉండటంతో ఆమె వచ్చేలోపు మొత్తం భూములను అన్యాక్రాంతం చేసేందుకు కుట్ర చేస్తున్నారు. రూ.25 కోట్ల విలువ చేసే ఈ ప్రభుత్వ భూములను కాపాడుకోవటానికి కలెక్టర్ లక్ష్మీశ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : జగ్గయ్యపేట మండలం బూదవాడ గ్రామంలో భూ గరిష్ఠ పరిమితి చట్టం (ల్యాండ్ సీలింగ్ యాక్ట్) కింద ప్రభుత్వానికి సంక్రమించిన భూములను ప్రైవేట్ వ్యక్తులు, కొందరు రెవెన్యూ అధికారులు లోపాయికారీగా పంచేసుకున్నారు. ఉమ్మడిగా బినామీ పేర్లతో అమ్మకాలు సాగిస్తున్నారు. బూదవాడ గ్రామంలోని సర్వే నెంబర్ 31, 74, 44, 29/2, 29/1, 321/1లో భూ గరిష్ఠ పరిమితి చట్టం (ల్యాండ్ సీలింగ్ యాక్ట్) ప్రకారం దాదాపు 40 ఎకరాలు ప్రభుత్వానికి దక్కింది. 1975వ సంవత్సరంలో షైలా సీతారామిరెడ్డి ఈ భూములను ల్యాండ్ సీలింగ్ యాక్ట్ కింద ప్రభుత్వానికి ఇచ్చారు. అప్పటి నుంచి ఈ భూములను రెవెన్యూ

మిగతా 6లో..

ఎవరికి వారు వాటాలు

రెవెన్యూ శాఖలో ఎప్పటికప్పుడు తహసీల్దార్లు మారిపోతుంటారు. తహసీల్దార్లుగా వచ్చిన వారిలో సగంమంది ఈ స్థల ఆక్రమణదారులతో చేతులు కలిపారు. వారు బదిలీ అయిన తర్వాత వచ్చిన కొత్త తహసీల్దార్లలో కొందరు భూములు అమ్మిన క్రమంలో వాటాలు పుచ్చుకున్నారని తెలుస్తోంది. ఈ మొత్తం వ్యవహారంలో జగ్గయ్యపేట నియోజకవర్గంలో పాతుకుపోయిన ఓ వీఆర్వో కీలకంగా ఉన్నాడు.

కరెంట్ కనికట్టు!

గుడివాడలో కొడాలి నాని అండ్ గ్యాంగ్ మరో ధనకార్యం

ప్రైవేట్ వెంచర్‌కు విద్యుత్ శాఖ నిధులు

- 60 పోల్స్, 2 ట్రాన్స్‌ఫార్మర్లు, కండెన్సర్ కేబుల్స్‌కు రూ.30 లక్షలు
- నయాపైసా చెల్లించకుండా పనులు చేయించుకున్న గ్యాంగ్
- వెంచర్‌లోని లబ్ధిదారుల పేరిట దరఖాస్తు చేసి మోసం
- సహకరించిన విద్యుత్ శాఖలోని ఏడీఈ, ఈఈ
- బదిలీల నేపథ్యంలో రూ.6 లక్షల సొంత నిధులు చెల్లింపు



కొడాలి నానీకి చెందిన వెంచర్‌లో కరెంట్ పోల్స్

వైసీపీ హయాంలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని మాజీమంత్రి కొడాలి నాని సాగించిన మరో ధనకార్యం వెలుగులోకి వచ్చింది. గుడివాడ మండలం లింగవరం గ్రామంలో కొడాని నానీకి చెందిన ఓ వెంచర్‌కు నయాపైసా చెల్లించకుండా అప్పనంగా విద్యుత్ శాఖ నుంచి రూ.30 లక్షలు ఖర్చు చేయించారు. స్థానిక ఏడీఈ, ఈఈ సహకారంతో అప్పట్లో పనులు చేయించుకున్న గడ్డంగ్యాంగ్ ఇప్పటి వరకు ఆ సొమ్మును చెల్లించలేదు.

- కథనం 6లో

ప్రధాని పర్యటనకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

- రాష్ట్ర సాధారణ పరిపాలనశాఖ ప్రధాన కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా

8లో

తోటలో ఆటలు

సూరంపాలెంలో మాజీ రౌడీషీటర్ లీలలు

- మామిడి తోటలే డెన్‌గా పేకాట, వ్యభిచారం, బెట్టింగ్‌లు
- ఫుట్‌బాల్ ఆటగాడి హత్యకేసులో ప్రధాన నిందితుడు
- అప్పట్లో రౌడీషీట్ తెరిచిన పటమట పోలీసులు
- తాజాగా రౌడీషీట్ తొలగించడంతో అంఘిక కార్యకలాపాలు



గౌతమ్

అతను వాలీబాల్ ఆటగాడు. అంతకంటే ముఖ్యంగా ఓ మాజీ రౌడీషీటర్. ఓ ఫుట్‌బాల్ ఆటగాడి హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఇతనిపై పోలీసులు రౌడీషీట్ తొలగించడంతో పేట్రేగిపోతున్నాడు. గన్నవరంలోని సూరంపాలెంలో మామిడి తోటలే కేంద్రంగా డెన్‌ను ఏర్పాటుచేసుకుని బెట్టింగులతో పాటు కోడిపందేలు, పేకాట, వ్యభిచార కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గన్నవరంలోని సూరంపాలెంలో మామిడి తోటలే కేంద్రంగా ఓ మాజీ రౌడీషీటర్ వ్యవహారాలు నడిపిస్తున్నాడు. బెట్టింగులు పరుగులు తీయిస్తున్నాడు. ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్‌లో అధికారులు రౌడీషీట్ ఎత్తివేయడంతో పేట్రేగుతున్న అతడు తన వ్యవహారాలను చక్కబెట్టడానికి మరో రౌడీషీటర్‌ను సహాయకుడిగా పెట్టుకున్నాడు. ఇదీ కంపా గౌతమ్ అలియాస్ బాబీ వ్యవహారం. గుణదల పాత పంచాయతీ కార్యాలయం వద్ద ఉండే గౌతమ్ వాలీబాల్ ఆటగాడు. ఓ యువతి విషయంలో రేగిన వివాదంతో కొన్నాళ్ల క్రితం ఫుట్‌బాల్ ఆటగాడు ఆకాశ్‌ను మరికొంతమంది స్నేహితులతో కలిసి చంపేశాడు. జక్కంపూడి కాలనీకి చెందిన గ్యాంగ్‌ను తీసుకుని ఆకాశ్ తన స్నేహితులతో ఉండగా హత్య చేశాడు. దీనిపై పటమట పోలీసులు కేసు నమోదు చేసి

మిగతా 6లో..

షీట్ ఎలా మాయం?

హత్యలు, గొడవల్లో పాల్గొనే వారిపై పోలీసులు.. రౌడీషీట్ తెరుస్తారు. చోరీలు పదేపదే చేసేవారిపై క్రైం షీట్ తెరుస్తారు. అనుమానితులపై సస్పెక్ట్ షీట్ తెరుస్తారు. ప్రతి ఆదివారం స్టేషన్లలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు వీరు హాజరుకావాలి. ఆ తర్వాత టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలి. ఒకసారి రౌడీషీట్ తెరిచాక దాన్ని తొలగించడానికి చాలా ప్రక్రియ ఉంటుంది. ఒకసారి రౌడీషీట్ తెరిచాక అప్పటికి చేసిన నేరంపై తప్ప మరో కేసు నమోదు కాకూడదు. కేసు విచారణ పూర్తయి అందులో నిర్దోషిగా బయటకు వచ్చిన తర్వాత మాత్రమే షీట్‌ను తొలగించాల్సి ఉంటుంది. ఫుట్‌బాల్ ఆటగాడు ఆకాశ్ హత్యలో ప్రధాన నిందితుడిగా ఉన్న గౌతమ్ అలియాస్ బాబీపై కేసు ఇంకా కోర్టు విచారణలో ఉండగానే షీట్‌ను తొలగించారు. కోర్టు ఆదేశాలతో ఈ షీట్‌ను తొలగించినట్టు పోలీసులు చెబుతున్నారు. గౌతమ్‌పై ఇతర జిల్లాల్లోనూ కేసులు ఉన్నాయి. సత్యసాయి జిల్లాలో కియా పోలీస్‌స్టేషన్‌లో బెట్టింగ్ కేసులు ఉన్నాయి. ఇదికాకుండా హైదరాబాద్ కమిషనరేట్‌లోనూ గౌతమ్‌పై ఈ తరహా కేసులు ఉన్నాయి. అయినా అతడిపై ఉన్న షీట్‌ను తొలగించడం గమనార్హం. గౌతమ్‌ను పోలీసులు తేలిగ్గా తీసుకుంటే, తోటల్లో ఉన్న బ్యాచ్‌లు నగరంలోకి అడుగుపెట్టే ప్రమాదం లేకపోలేదు.

చాట్ మాటుగా..

- ఇన్‌స్టాలో ఫేక్ అకౌంట్లతో యువకులకు వల
- అందమైన డీపీలు పెట్టి పరిచయం
- తొలుత మాటలు.. తర్వాత ప్రేమ పలుకులు
- అమాయకులను గుర్తించి డబ్బు డిమాండ్
- వరుసగా అందినకాడికి వసూళ్లు
- చందర్లపాడులో మోసపోయిన యువకులు



● అందమైన యువతి ఫొటో డీపీగా ఉన్న ఓ ఇన్‌స్టా అకౌంట్‌లో చందర్లపాడుకు చెందిన ఓ యువకుడు కొంతకాలంగా చాట్ చేస్తున్నాడు. మొదట్లో తనకు పెళ్లి కాలేదని చెప్పిన ఆ యువతి.. ఇటీవల మాట మార్చింది. తనకు పెళ్లైందని, అయినా మీరంటే ఇష్టమని చెప్పింది. తర్వాత వ్యవహారం వాట్సాప్ కాల్స్ వరకూ వెళ్లింది. తనకు అర్జెంటుగా డబ్బు అవసరమని, తిరిగి ఇచ్చేస్తానని చెప్పడంతో ఆ యువకుడు ఆమె ఖాతాకు రూ.లక్షన్నర పంపాడు. ఇలా.. ఆమె తరచూ డబ్బు అడుగుతుండటంతో ఆ యువకుడు ముఖం చాటేశాడు. దీంతో ఆ యువతి మరో రకంగా మాట్లాడటం మొదలుపెట్టింది. చాటింగ్ తన భర్త చూశాడని, తనను చంపుతాడంటూ మెసేజ్‌లు పెట్టింది. తన చిన్ననాటి మిత్రుడితో కలిసి హోటల్‌కు భోజనానికి వెళ్లానని, అది చూసిన తన భర్త స్నేహితుడిని చంపేశాడని తెలిపింది. ఈ క్రమంలోనే ఆ యువతి అక్కనంటూ మరో యువతి కాల్ చేసింది. నీ చాటింగ్ వల్ల నా చెల్లిపై ఆమె భర్త హత్యాయత్నం చేశాడని, ప్రస్తుతానికి ఆమె పరిస్థితి ఆందోళనగా ఉందని తెలిపింది. కొన ఊపిరితో ఉన్న ఆమెను రక్షించేందుకు రూ.2 లక్షలు కావాలని అడిగింది. తీవ్ర భయాందోళనకు గురైన ఆ యువకుడు విషయాన్ని తన స్నేహితులకు చెప్పాడు. ఇక్కడ ఆశ్చర్యపోవాల్సిన విషయం ఏవిటంటే.. ఆ యువతితో తన స్నేహితుల్లో మరికొంతమందితో కూడా చాట్ చేసిన విషయం బయటపడింది. ఇదంతా ట్రాప్ అని తెలుసుకున్న ఆ యువకుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తక్షణమే సదరు నెంబర్‌కు సేవలు నిలిపివేయాలని సూచించిన పోలీసులు బాధితుడి ఫిర్యాదు మేరకు దర్యాప్తు ప్రారంభించారు.

నందిగామ/చందర్లపాడు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ఇన్‌స్టా, వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి మాధ్యమాలతో యువతీ యువకులకు వలవేస్తూ కొందరు భారీగా డబ్బు గుంజుతున్నారు. సోషల్ మీడియా వేదికగా తొలుత పరిచయ పోస్టులు పెడతారు. అందమైన రూపం ఉన్న అబ్బాయిలు, అమ్మాయిల ఫొటోలను డీపీలుగా పెడుతుండటంతో ఆకర్షితులవుతున్న యువతీయువకులు వారితో చాటింగ్ చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. అవతలివైపు నుంచి చాట్ చేస్తున్నది ఆడ, మగా.. అనే విషయాన్ని కూడా తెలుసుకోవట్లేదు. కొద్దిరోజుల చాటింగ్ అనంతరం పరిచయం కాస్త ప్రేమగా మారుస్తున్నారు. ఆ తర్వాత వ్యవహారం అశ్లీలంవైపు వెళ్తోంది. అనంతరం డబ్బు డిమాండ్ చేయడం వంటివి చేస్తున్నారు. అమాయకులైతే వారి మాటలు నమ్మేసి

మిగతా 6లో..

ఎవరి దారి వారిదే..!

- అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమాలపై వేర్వేరుగా సమావేశాలు
- తిరువూరు ఎమ్మెల్యేతో కలిసిరాని పలువురు నేతలు

6లో

కిచెన్ గార్డెన్ నిధులు హాంఫట్‌పై మంత్రి లోకేశ్ పేషీ ఆరా!

- ఇద్దరు ఎంఈవోలకు షోకాజ్ నోటీసులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

6లో



సోమనాథ్‌కు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న ఏఈవో

దుర్గమ్మ సేవలో డాక్టర్ సోమనాథ్

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మను సోమవారం ఏపీ స్పేస్ టెక్నాలజీ సలహాదారు, ఇండియన్ స్పేస్ రిసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) మాజీ చైర్మన్ డాక్టర్ ఎస్.పి.సోమనాథ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించగా వేద పండితులు ఆయనకు వేద ఆశీర్వచనం అందజేశారు. ఏఈవో చంద్రశేఖర్ ఆయనకు అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేష వస్త్రం, అందజేశారు.

అర్జీల పరిష్కారంలో స్పష్టతకు ప్రాధాన్యమివ్వండి

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : స్పష్టమైన సమాచారంతో మరల పునరావృతం కాకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించేలా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలకు అధికారులు సిబ్బంది నుంచి స్పష్టమైన సమాచారం తీసుకొని తిరిగి పునరావృతం కాకుండా సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. జవాబుదారీతనంతో అర్జీలను పరిష్కరించాలని కలెక్టర్ తెలిపారు. అర్జీల స్వీకరణలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, డీఆర్‌డీఏ పీడీ ఎఎన్‌వి నాంచారరావు, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.





బ్యాంకు ఖాతాదారులకు డిజిటల్ అరెస్టులు, సైబర్ నేరాలపట్ల అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సైబర్ నేరాలపై అప్రమత్తం

» పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు

గుణదల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో అక్షరాస్యులున్నప్పటికీ అప్రమత్తంగా లేకపోవడం వల్లనే సైబర్‌క్రైమ్.. డిజిటల్ అరెస్టుల నేరాలు పెరిగిపోతున్నాయని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు అన్నారు. ఈ తరహా నేరాలకు చెక్‌పెట్టాలంటే ప్రజలను చైతన్యవంతం చేయాలని, జిల్లా వ్యాప్తంగా బ్యాంకు ఖాతాదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ క్రమంలో నందిగామ, తిరువూరు స్టేషన్ల పరిధిలో అక్కడి సిబ్బందితో కలిసి బ్యాంకు ఖాతాదారులకు సోమవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్ట్ పేరుతో నకిలీ ఫోన్ కాల్స్ వీడియో కాల్స్ ద్వారా ప్రజలను భయభ్రాంతులను చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి ఘటనల్లో అనుమానం వస్తే తక్షణం సమాచారం ఇవ్వాలని బ్యాంకు అధికారులను కోరారు.



ఏడీఏ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతు సంఘాల నేతలు

ఆ కంపెనీలపై చర్యలు తీసుకోండి

» రైతుసంఘాల నేతల డిమాండ్

మైలవరంరూరల్, ఏప్రిల్ 28, (ఆంధ్రజ్యోతి) : అనుమతి, నాణ్యతలేని మొక్కజొన్న విత్తనాలు విక్రయించి రైతులను మోసగించిన సీజెంటా, కారంటెక్, శ్రీకర్, సిరి తదితర కంపెనీలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రైతుసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మైలవరం ఏడీఏ కార్యాలయం ఎదుట రైతుసంఘాల నాయకులు, రైతులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడుతూ, మైలవరం, రెడ్డిగూడెం, జి.కొండూరు తదితర మండలాల్లోని అనేక గ్రామాల్లో నాణ్యత లేని విత్తనాలను రైతులకు అంటగడుతున్నారన్నారు. సీడ్ పండించిన రైతులకు తెలియకుండానే వారిపొలాల్లో ఉన్న విత్తనాలను అక్రమంగా తరలించుకుపోతున్నారని, డబ్బులు అడిగితే ఇవ్వకుండా బెదిరిస్తున్నారన్నారు. ఏడీఏకు వినతిపత్రం అందజేసిన వారిలో మాజీ సర్పంచ్ రాము, ఉల్లిబోయిన గోపాలరావు, తిరుపతిరావు, రామారావు తదితరులు ఉన్నారు.

కిచెన్ గార్డెన్ నిధులు హాంఫట్‌పై మంత్రి లోకేశ్ పేషీ ఆరా!

» ఇద్దరు ఎంఈవోలకు షోకాజ్ నోటీసులు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

జగ్గయ్యపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : 'కిచెన్ గార్డెన్ నిధులు హాంఫట్' కథనానికి విద్యాశాఖ అధికారులు స్పందించారు. బాధ్యులైన ఇద్దరు ఎంఈవోలకు షోకాజ్ నోటీసులు జారీచేశారు. 'ఆంధ్రజ్యోతి' కథనంపై మంత్రి లోకేశ్ పేషీ నుంచి సమాచారం కోరటంతో సోమవారం ఆగమేఘాల మీద షోకాజ్ నోటీసులు సిద్ధం చేశారు. విజయవాడ రూరల్ ఎంఈవో వెంకటరత్నం, సెంట్రల్ ఎంఈవో సాంబశివరావులను 24గంటల్లో సంజాయిషీ ఇవ్వాలని డీఈవో సుబ్బారావు కోరారు. వెంటనే కిచెన్ గార్డెన్ అక్విటెన్స్ రిజిస్టర్ కార్యాలయానికి సమర్పించకపోతే క్రమశిక్షణ చర్యలకు ఆర్జేడీకి నివేదించనున్నట్టు పేర్కొన్నారు.

హెచ్‌ఎంలకు బుజ్జగింపులు..

విజయవాడరూరల్ పరిధిలో ఉన్న మండలాల్లోని హెచ్‌ఎంలకు ఎంఈవో సన్నిహితులు ఫోన్‌లు చేసి బుజ్జగిస్తున్నట్టు తెలిసింది. ఆ నిధులను త్వరలోనే సర్దుబాటు చేయిస్తామని, అక్విటెన్స్‌లు పంపాలని వేడుకుంటున్నారు. ఇప్పటికే వత్సవాయి మండలం నుంచి 10మంది హెచ్‌ఎంలు అక్విటెన్స్ ఇచ్చేసినట్టు సమాచారం.

జగ్గయ్యపేట వ్యవహారంపై గుంభనం!

జగ్గయ్యపేటలో కిచెన్ గార్డెన్ నిధుల పంపిణీ ఓ యూనియన్ నేతల ద్వారా జరగటంపై డీఈవో కార్యాలయం గుంభనంగా ఉంది. మండలంలో యూనియన్ నేత ద్వారా ఎంఈవో-1 పంపిణీ చేయటం, అక్విటెన్స్‌లు రాకపోయినా స్పందించకపోవటం చర్చనీయాంశమైంది.

» గుల్లలమోద క్షిపణి పరిశోధనా కేంద్రానికి తొలగిన అడ్డంకులు
» మే 2న వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని మోదీ
» తిరిగి పట్టాలెక్కనున్న భారీ ప్రాజెక్టు
» దివి ప్రాంతంలో అభివృద్ధి పరుగులు



ఆకాశమంత ఆనందం

గుల్లలమోద దివి ప్రాంతం

అవనిగడ్డ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : నవ్యాంధ్ర మణిహారంలాంటి గుల్లలమోద క్షిపణి పరీక్షా కేంద్రం ఎట్టకేలకు పట్టాలెక్కనుంది. అమరావతి పర్యటనలో భాగంగా మే 2న ప్రధాని మోదీ క్షిపణి పరీక్షా కేంద్రం రెండో దశ పనులను వర్చువల్‌గా ప్రారంభించనుండటంతో దివి వాసుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే బందరు ఆర్డీవో స్వాతి నాగాయలంక మండలంలో పర్యటించి క్షిపణి పరీక్షా కేంద్రం వద్ద ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. బాలాసోర్ కంటే మెరుగైన సదుపాయాలతో క్షిపణి పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని 2011లో డీఆర్డీవో నిర్ణయం తీసుకోగా, దేశంలోని అనేక ప్రాంతాలను పరిశీలించిన అధికారులు 2012లో గుల్లలమోద అనుకూలమైనదిగా గుర్తించారు. 2017లో నాటి తెలుగుదేశం ప్రభుత్వం 381 ఎకరాల భూమిని క్షిపణి పరీక్షా కేంద్రం కోసం కేటాయించగా, 2018లో ఈ ప్రాంతాన్ని సీఆర్‌జెడ్ నుంచి మినహాయిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవటంతో తొలిదశ పనులు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే కేటాయించిన 381 ఎకరాల భూమి చుట్టూ ప్రహరీ నిర్మాణం, పరిపాలన భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. 2019లో రెండో దశ పనులకు కేంద్రం అనుమతులిచ్చినప్పటికీ నాటి వైసీపీ ప్రభుత్వం ఈ విషయాన్ని పట్టించుకోకపోవటంతో ప్రాజెక్టు అటకెక్కింది. 2021 మధ్య నాటి డీఆర్డీవో చైర్మన్ సతీష్‌రెడ్డి ఈ ప్రాంతాన్ని సందర్శించి గన్నవరం సమీపంలో అతిథి గృహాల నిర్మాణం, ముఖ్య శాస్త్రవేత్తల నివాస సముదాయాల కోసం స్థలం కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరగా, నాటి సీఎం జగన్మోహన్ రెడ్డి ఈ విషయాన్ని పక్కన పెట్టడంతో ప్రాజెక్టు పనులు అటకెక్కాయి. అనంతరం ఈ ప్రాజెక్టును గుజరాత్, తమిళనాడుకు గానీ తరలించాలని భావించినప్పటికీ రక్షణ వ్యవహారాల పరంగా గుల్లలమోద ప్రాంతం అత్యంత అనువైన ప్రాంతం కావటంతో 2024లో జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన కూటమి ప్రభుత్వాన్ని మరోమారు డీఆర్డీవో అధికారులు సంప్రదించగా, ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి ప్రాజెక్టును తిరిగి పట్టాలెక్కించారు.

రూ. 20 వేల కోట్లతో ప్రాజెక్టు పనులు

డీఆర్డీవో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించతలపెట్టిన క్షిపణి పరీక్ష కేంద్రం కోసం రాబోయే సంవత్సరాల్లో సుమారు రూ.20 వేలకోట్లు ఖర్చు చేయనున్నట్టు తెలుస్తోంది. గుల్లలమోద క్షిపణి పరీక్షా కేంద్రం, అవనిగడ్డ, నాగాయలంక మండలాల్లో ఏదో ఒకచోట టౌన్‌షిప్ నిర్మాణం చేపట్టాలని డీఆర్డీవో భావిస్తోంది. 2018లోనే టౌన్‌షిప్ నిర్మాణం కోసం అవనిగడ్డలోని కొన్ని ప్రాంతాలను అధికారులు పరిశీలన చేసినప్పటికీ స్థానిక రైతులు అడ్డు చెప్పారు. టౌన్‌షిప్ నిర్మాణం కోసం ప్రభుత్వం పచ్చజెండా ఊపినట్టు తెలియవస్తున్నది.

మారనున్న దివి ప్రాంత రూపురేఖలు

డీఆర్డీవో రూ.20వేల కోట్లతో నిర్మించ తలపెట్టిన క్షిపణి పరీక్షా కేంద్రంతో ఈ ప్రాంతంలో అభివృద్ధి పరుగులు తీస్తుందని దివి వాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు రావటంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలతోపాటు దివి ప్రాంతంలో మౌలిక సదుపాయాలు మెరుగుపర్చటం, రోడ్డు కనెక్టివిటీ పెరగటం, ఈ ప్రాంతం మచిలీపట్నం పోర్టుతో అనుసంధానం అయ్యే అవకాశాలు మెరుగుపడతాయని, తద్వారా దివి ప్రాంతం నవ్యాంధ్ర ప్రదేశ్ అభివృద్ధిలో కీలకంగా మారుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. జనవరి నెలలోనే ప్రధాని నరేంద్ర మోదీ పనులు ప్రారంభిస్తారని ముందుగా భావించినప్పటికీ అమరావతిలో జరిగే శంకుస్థాపన కార్యక్రమంలో ఈ పనులను ప్రారంభిస్తారని ఆర్డీవో స్వాతి తెలిపారు. వర్చువల్‌గా ప్రారంభం జరిగే ప్రాంతంలో శంకుస్థాపన ఫలకం ఏర్పాటు, ఆ ప్రాంత వాసులను సమీకరించటం, తదితర పనులపై కలెక్టర్ బాలాజీ ఆదేశాలతో అధికారులు ఇప్పటికే ఎంఐసీ అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ సమీర్ శర్మతో కలిసి ఏర్పాట్లు చేస్తున్నారు.

నెట్టెంకు పట్టం

(5వ పేజీ తరువాయి)

మద్యనిషేధ, ఎక్సైజ్ శాఖ మంత్రిగా పనిచేశారు. జగ్గయ్యపేట నుంచి తొలిసారి కేబినెట్‌లో చోటు దక్కించుకున్న నేతగా రికార్డు సాధించారు. 1999, 2004 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చెందిన ఆయన.. ప్రస్తుత ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యను రంగంలోకి దింపారు. 2014 ఎన్నికల్లో తాతయ్య విజయానికి కృషి చేశారు. 2019 ఎన్నికల తర్వాత విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడిగా నెట్టెం బాధ్యతలు చేపట్టి పార్టీని మరింత బలోపేతం చేశారు. 2024 ఎన్నికల్లో జిల్లాలోని అన్ని స్థానాల్లో కూటమికి తిరుగులేని ఆధిక్యం లభించడంలో ఆయన కీలకపాత్ర పోషించారు. ఆయనకు ఎమ్మెల్సీ స్థానం ఇస్తారని అందరూ భావించారు. కానీ, అనూహ్యంగా చంద్రబాబు కేడీసీసీ బ్యాంకు పదవికి నెట్టెం పేరును ప్రకటించారు. కేబినెట్ హోదా కలిగిన ఆప్కాబ్ చైర్మన్‌గా చేస్తానని కూడా చంద్రబాబు ఆయనకు హామీ ఇచ్చినట్టు తెలుస్తోంది. ఇంతకుముందు జగ్గయ్యపేట నుంచి కేడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా నెట్టెం రఘురాం బావ తొండెపు దశరథ జనార్ధన్ ఎన్నికయ్యారు. ఆ తర్వాత ఆయన ఆప్కాబ్ చైర్మన్‌గా, నాప్కాబ్ వైస్ చైర్మన్‌గా జాతీయ స్థాయిలో పనిచేశారు. అనంతరం వైసీపీ హయాంలో జగ్గయ్యపేట నుంచి తన్నీరు నాగేశ్వరరావు ఏడాదిపాటు కేడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా పనిచేశారు. ఇప్పుడు తిరిగి ఇదే నియోజకవర్గం నుంచి నెట్టెంకు అవకాశం లభించడం విశేషం.నెట్టెం రఘురాంకు కేడీసీసీ బ్యాంకు చైర్మన్ పదవి ఇవ్వడంతో జగ్గయ్యపేట నియోజకవర్గంలోని టీడీపీ శ్రేణుల్లో ఆనందోత్సాహాలు వెల్లువెత్తుతున్నాయి. రఘురాంకు సముచిత స్థానం కల్పించాలని నియోజకవర్గ పార్టీ అనేకసార్లు ఏకగ్రీవ తీర్మానాలు కూడా చేసింది.

ప్రభుత్వ భూమిని పంచుకున్నారు

(5వ పేజీ తరువాయి)

యంత్రాంగం స్వాధీనం చేసుకోవట్లేదు. ఈ స్థలంపై కన్నేసిన ప్రైవేట్ వ్యక్తులు కొందరు వివాదం లేపి అడ్డుకుంటూ వస్తున్నారు. క్రమేణా సదరు ప్రైవేట్ వ్యక్తులతో రెవెన్యూ అధికారులు కుమ్మక్కయ్యారు. ఈ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటే ఎవరికి ప్రయోజనమని, చెరిసగం దామాషాగా పంచుకుని, విక్రయించుకుని లబ్ధి పొందవచ్చన్న ఆలోచన చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు సీలింగ్ భూమిని జిల్లా రెవెన్యూ యంత్రాంగం స్వాధీనం చేసుకోలేదు. ఈ భూమిని స్వాధీనం చేసుకోవటానికి గతంలో ఉమ్మడి రాష్ట్రంలో ఉండగానే అప్పటి విజయవాడ రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఉన్న సబ్ కలెక్టరేట్ కార్యాలయంలోనే ఫైల్ (సీసీ నెంబర్ 713/జేపీటీ/75) నడిచింది. ఈ ఫైల్‌పై ఉన్నతాధికారులు దృష్టి పెట్టలేదు. గత కలెక్టర్ ఢిల్లీరావు హయాంలో ఈ భూముల స్వాధీనంపై కదలిక వచ్చింది. ప్రైవేట్ వ్యక్తులకు నోటీసులు ఇచ్చారు. అయితే, అప్పట్లో జగ్గయ్యపేట తహసీల్దార్ వీరిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కిందటి వైసీపీ హయాంలో సదరు ప్రైవేట్ వ్యక్తులు అప్పటి ప్రభుత్వ పెద్దలను ఆశ్రయించారు. ఈ సలహా కూడా అప్పట్లో రెవెన్యూ అధికారులే ఇచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి. వైసీపీ పెద్దల జోక్యం, వారి ఒత్తిళ్లతో ఆ తర్వాత ఈ భూములవైపు జిల్లా యంత్రాంగం కన్నెత్తి చూడలేదు. ఇదే అదనుగా భావించిన ప్రైవేట్ వ్యక్తులు.. రెవెన్యూ అధికారులతో మంతనాలు జరిపి బినామీ పేర్లపై తమ స్వాధీనంలో ఉన్న భూములను అమ్మకానికి పెట్టారు. ఎకరం రూ.30 లక్షల చొప్పున అమ్మటం ప్రారంభించారు. వాస్తవానికి ఇక్కడ ఎకరం రూ.65 లక్షల వరకు ఉంది. దీనిని బట్టి చూస్తే ఈ భూముల ధర సుమారు రూ.25 కోట్లు పలుకుతుంది.

ప్రైవేట్ వ్యక్తుల్లో వారసులు

ప్రైవేట్ వ్యక్తుల్లో.. ఈ భూములను భూ గరిష్ఠ పరిమితి చట్టం కింద ఇచ్చిన వ్యక్తి వారసులు కూడా ఉన్నారని తెలుస్తోంది. వారసుల్లో కొందరు రెవెన్యూ అధికారులను సంప్రదించి 'ఈ భూములను ప్రభుత్వం తీసుకుంటే ఏం వస్తుంది..' అని చెప్పి ప్రసన్నం చేసుకున్నారని తెలుస్తోంది. దీంతో అప్పటి నుంచి అటు ప్రైవేట్, ఇటు రెవెన్యూ అధికారుల ఆధీనంలోకి భూములు వెళ్లాయని సమాచారం.

పేదల ఇళ్ల స్థలాలకు ఉపయోగించుకుంటే మేలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలన్న నిర్ణయాన్ని తీసుకుంది. అవసరమైన భూముల వేట కూడా సాగిస్తోంది. ఈ క్రమంలో బూదవాడలోని 40 ఎకరాల భూములు పేదలకు ఇస్తే ఉపయుక్తంగా ఉంటుంది.

ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బెంజిసర్కిల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్‌లోని రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ 2025-26 విద్యాసంవత్సరంలో ట్రిపుల్‌ఐటీ(ఐఐటీ)లో ఆరేళ్ల బీటెక్ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నది. మే 20 సాయంత్రం 5గంటల వరకు www.rgukt.in, ఏపీ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. నూజివీడు(ఏలూరుజిల్లా), ఆర్కేవ్యాలీ(ఇడుపులపాయ, వైఎస్ఆర్ జిల్లా), ఒంగోలు(ప్రకాశంజిల్లా), శ్రీకాకుళం(శ్రీకాకుళంజిల్లా)లోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌ల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. జనరల్ అభ్యర్థులు దరఖాస్తు రుసుం రూ.300, రిజర్వ్ కేటగిరీ రూ. 200, ఇతర రాష్ట్రాల అభ్యర్థులు రూ.1000 చెల్లించాల్సి ఉంది. రిజర్వేషన్, పదో తరగతిమెరిట్, అర్హత పరీక్షలో మార్కుల ఆధారంగా అడ్మిషన్‌లు ఉంటాయని అధికారులు తెలిపారు.

కారును ఢీకొట్టిన టిప్పర్

» ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురికి తీవ్ర గాయాలు

మైలవరంరూరల్, ఏప్రిల్ 28, (ఆంధ్రజ్యోతి) : టిప్పర్ టైరు పంక్చర్ అయి ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టగా ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన సోమవారం పుల్లూరు శివారు బాడవ టోల్‌ప్లాజా సమీపంలో జరిగింది.



దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన వెనిగళ్ల వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులతో కారులో విజయవాడ వెళుతున్నాడు. ఈ క్రమంలో ఇబ్రహీంపట్నం నుంచి తిరువూరు వెళుతున్న టిప్పర్ టైర్‌కు పంక్చర్ కావడంతో అదుపుతప్పి వేగంగా కారును ఢీకొట్టింది. ప్రమాదంలో కారు నడుపుతున్న వెనిగళ్ల వెంకటేశ్వరరావు కాళ్లు విరిగిపోయాయి. అతడి భార్య నాగలక్ష్మి, కొడుకు లోకేష్‌కుమార్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను మైలవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం విజయవాడకు తరలించినట్టు మైలవరం ఎస్ఐ కె.సుధాకర్ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. ప్రమాదంలో కారు ధ్వంసం కాగా, సకాలంలో ఎయిర్ బెలూన్లు ఓపెన్‌కావడంతో ప్రాణహాని తప్పినట్టు స్థానికులు చెబుతున్నారు.

చాట్‌మాటుగా..

(5వ పేజీ తరువాయి)

అడిగినంత సమర్పించుకుంటున్నారు.

మధ్యతరగతి యువకులే టార్గెట్

మధ్యతరగతి యువకులే ఇటువంటి ట్రాప్‌లో ఎక్కువగా పడుతున్నారు. అప్పు చేసి మరీ అడిగినంత సొమ్ము ఇస్తున్నారు. మరికొందరైతే తన భర్త తనను కత్తితో పొడిచి వెళ్లిపోయాడని, కొన ఊపిరితో వైద్యశాలలో ఉన్నానని, త్వరగా డబ్బు కావాలని ఆవేదనతో చెబుతుండటంతో నిజమేనని నమ్మి భారీ వడ్డీలకు అప్పుతెచ్చి గుట్టుచప్పుడు కాకుండా అందజేస్తున్నారు. అయితే, వారు సొమ్ము చెల్లించేది ఎవరికో కూడా తెలియని స్థితిలో యువకులు ఉండటం గమనార్హం. ఇలా గ్రామాలు, పట్టణాలు, నగరాలు అనే తేడా లేకుండా యువకులు బలైపోతున్నారు. సైబర్ నేరాలపై పోలీసులు నిరంతరం అవగాహన కల్పిస్తున్నా హనీట్రాప్‌లో పడి యువకులు అల్లాడిపోతున్నారు.

కరెంట్ కనికట్టు!

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గుడివాడ మండలం లింగవరం గ్రామ పంచాయతీ పరిధిలోని కల్యాణమండపం వెనుక ప్రాంతంలో మాజీ మంత్రి కొడాలి నాని, ఆయన అనుచరులు కలిసి సర్వే నెంబర్లు 239/1బీ, 2, 240/1బీ, 3, 244/1, 2ఏ, 2బీ, 3, 4, 5, 245/1, 2, 3, 246, 247/1, 2, 3లో మొత్తం 25.44 ఎకరాల విస్తీర్ణంలో లేఅవుట్ వేశారు. ఈ లే అవుట్‌లో ప్లాట్లను అమ్మిన గడ్డం గ్యాంగ్ ఇంతవరకు లబ్ధిదారులకు అప్పగించలేదు. ఇదే వెంచర్‌లో కొడాలి నాని అండ్ గ్యాంగ్ సాగించిన మరో స్కామ్ ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. వెంచర్‌లో విద్యుత్ లైన్లు వేసేందుకు విద్యుత్ శాఖ ద్వారా రూ.30 లక్షలు ఖర్చు చేయించారు. తన తాబేదారుగా ఉన్న అప్పటి అసిస్టెంట్ డిప్యూటీ ఇంజనీర్ (ఏడీఈ) వెంకటేశ్వరరావు ద్వారా ఈ ఖర్చు చేయించినట్టు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం రాకముందే ఏడీఈ వెంకటేశ్వరరావు మచిలీపట్నం బదిలీ అయ్యారు. ఒక ఇంటికి కనెక్షన్ ఇవ్వాలంటేనే నానా నిబంధనలు పెట్టే విద్యుత్ శాఖ అధికారులు ఏకంగా ఒక వెంచర్‌కు నయాపైసా కట్టకుండా రూ.30 లక్షలు ఖర్చు చేయటం విడ్డూరంగా ఉంది. అడగటమే ఆలస్యం అన్నట్టుగా విద్యుత్ పోల్స్, కండక్టర్స్, ట్రాన్స్‌ఫార్మర్స్ ఏర్పాటు చేశారు. అప్పట్లో నాని వెంచర్‌లో విద్యుత్ లైన్లు వేయటం కోసం పది విద్యుత్ స్తంభాల ఏర్పాటు పేరుతో విద్యుత్ శాఖకు దరఖాస్తు చేయించారు. అది కూడా అందులో ప్లాట్లు కొనుగోలు చేసిన లబ్ధిదారుల పేరుతో దరఖాస్తు చేయించారు. ఇలా దరఖాస్తు చేయించి, అలా విద్యుత్ పోల్స్ వేయించేశారు. మొత్తం 60 విద్యుత్ పోల్స్, రెండు ట్రాన్స్‌ఫార్మర్లను ఎలాంటి డబ్బు కట్టించుకోకుండానే నాటి ఏడీఈ వేయించారు. వెంచర్‌లో ప్రతి 50 మీటర్లకు ఒక విద్యుత్ పోల్ వేశారు. ఈ లెక్కన 60 విద్యుత్ పోల్స్‌ను 3 కిలోమీటర్ల పరిధిలో వేశారు. ఈ స్తంభాలకు మూడు లైన్ల చొప్పున కండెన్సర్ కేబుల్స్‌ను వేశారు. వీటి మొత్తం ఖర్చు రూ.30 లక్షలు. ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టకుండా తెలివిగా లబ్ధిదారులతో దరఖాస్తు చేయించి.. తమ స్వకార్యాన్ని పూర్తి చేసుకున్నారు. లబ్ధిదారులతో దరఖాస్తు చేయించాలన్న సలహా కూడా అప్పట్లో విద్యుత్ శాఖ అధికారులే ఇచ్చినట్టు ఆరోపణలు వస్తున్నాయి.

బదిలీలకు అడ్డు అని..

2023లో అంతర్గత బదిలీల నేపథ్యంలో ఏడీఈ వెంకటేశ్వరరావు బదిలీ కావటానికి ఈ వ్యవహారం ఇబ్బందిగా మారింది. రూ.30 లక్షల బకాయి ఉండటంతో ఆయన బదిలీకి అడ్డుగా పరిణమించింది. దీంతో తానే రెండు ఎస్టిమేట్ల కింద ఒక్కో దానికి రూ.3 లక్షలు చొప్పున రెండింటికి రూ.6 లక్షలు చెల్లించినట్టు తెలుస్తోంది. తాత్కాలిక పేమెంట్ రావటంతో ఆయన బదిలీకి మార్గం సుగమం కాగా మచిలీపట్నం వెళ్లిపోయారు.

ఈఈ డైరెక్షన్‌లోనే..

ఈ బాగోతంలో స్థానిక ఏడీఈతో పాటు అప్పటి ఈఈ పాత్ర కూడా ప్రధానంగా ఉందని తెలుస్తోంది. అప్పట్లో కొడాలి నాని మంత్రి కావటంతో ఆయన చెప్పిందే శాసనం అన్నట్టుగా ఈఈ రామకృష్ణ వ్యవహరించారని తెలుస్తోంది. అప్పట్లో ఎస్ఈగా మురళీమోహన్ ఉన్నారు. ఆయన దృష్టికి తీసుకెళ్లకుండానే ఈఈ డైరెక్షన్ మేరకు ఏడీఈ వెంకటేశ్వరరావు వెంచర్‌కు మెటీరియల్‌ను తరలించినట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారం ఈఈ బదిలీకి కూడా ఇబ్బందికరంగా మారుతుందన్న ఉద్దేశంతోనే ఏడీఈతో బలవంతంగా డబ్బు కట్టించినట్టు తెలుస్తోంది. ఆ తర్వాత ఈఈ కూడా బదిలీపై మచిలీపట్నం వెళ్లిపోయారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ఖర్చుకే చెల్లింపులు

వాస్తవంగా ఏడీఈ తాను కట్టిన సొంత డబ్బు కొడాలి నాని వెంచర్‌లో వేసిన రెండు ట్రాన్స్‌ఫార్మర్లకే సరిపోయింది. 60 పోల్స్, 3 కిలోమీటర్ల కండెన్సర్ కేబుల్స్‌కు రూ.24 లక్షల చెల్లింపులు జరగలేదు. లబ్ధిదారుల పేరుతో వెంచర్ మొత్తం విద్యుత్ పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్స్ వేసి ప్రభుత్వం దిగిపోయే వరకు పైసా కూడా వసూలు చేయలేదు. రూ.30 లక్షల విలువచేసే మెటీరియల్‌ను కొడాలి నాని వెంచర్‌కు ఖర్చుపెట్టి, ఆ తర్వాత ఆ మొత్తాన్ని డ్యామేజీ లాస్‌లో చూపించాలన్న ప్రయత్నం చేసినట్టు తెలిసింది. ఈ పథకం బెడిసికొట్టడంతో ఏడీఈ చేతి చమురు వదిలించుకోక తప్పలేదు.

2న మోదీ సభకు కృష్ణా జిల్లా నుంచి లక్ష మంది

» అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమ ఏర్పాట్లపై నేతలు, అధికారుల సమీక్ష

మచిలీపట్నం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : రాజధాని అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమం విజయవంతం చేయడానికి అన్ని చర్యలు తీసుకోవాలని కూటమి నేతలు నిర్ణయించారు. రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షలమంది కార్యక్రమానికి వస్తారని అంచనా ఉందన్నారు. కృష్ణాజిల్లా నుంచి లక్షమంది హాజరయ్యేలా అంచనాలు రూపొందించినట్టు తెలిపారు. మే 2న ప్రధానమంత్రి మోదీ రాజధాని పునర్నిర్మాణ కార్యక్రమానికి వస్తున్న నేపథ్యంలో కార్యక్రమ విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ చాంబరులో సోమవారం మంత్రి రవీంద్ర అధ్యక్షతన మంత్రులు వాసంశెట్టి సుభాష్, బీసీ జనార్ధనరెడ్డి, వంగలపూడి అనిత, ఎమ్మెల్యేలు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు రవీంద్ర, జనార్ధనరెడ్డి మీడియాతో మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని లేకుండా చేసిందన్నారు. మూడు రాజధానుల పేరుతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కుట్రలు చేసి అమరావతిలో అభివృద్ధి పనులను నిలిపివేశారన్నారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షమేరకు రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు రూపకల్పన చేశారన్నారు. ప్రధాని చేతులమీదుగా ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. మంత్రులు వాసంశెట్టి సుభాష్, వంగలపూడి అనిత మాట్లాడుతూ, వేసవి కావడంతో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, కాగిత కృష్ణప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావ్, బోడే ప్రసాద్, మాజీమంత్రి పీతల సుజాత, మాజీ ఎమ్మెల్సీ బుద్దా నాగజగదీశ్వరప్రసాద్, కలెక్టర్ బాలాజీ, ఎస్పీ జి.గంగాధరరావు, జేసీ గీతాంజలి శర్మ, నేతలు, అధికారులు పాల్గొన్నారు.

ఎవరి దారి వారిదే!

» అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమాలపై వేర్వేరుగా సమావేశాలు
» ఎమ్మెల్యే కొలికిపూడితో కలిసిరాని పలువురు నేతలు



దేవదత్ ఆధ్వర్యంలో సమావేశమైన నేతలు

తిరువూరు : అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమం విజయవంతానికి సమష్టిగా కృషి చేస్తామని నియోజకవర్గ టీడీపీ నేతలు అన్నారు. సోమవారం పట్టణంలోని శావల దేవదత్ కార్యాలయంలో పార్టీ సమన్వయ కమిటీ నేతలు సమావేశమయ్యారు.. ఇదే కార్యక్రమంపై ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఫ్యాక్టరీ సెంటర్‌లోని ఒక సమావేశపు హాల్‌లో సమావేశం నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ఎమ్మెల్యే సమావేశంలో కాకుండా విడిగా సమావేశం నిర్వహించుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు తమకు శిరోధార్యమని, పార్టీ కోసం నిత్యం శ్రమిస్తామని, అయితే ఎమ్మెల్యే అధ్యక్షత వహించే కార్యక్రమాలకు దూరంగా ఉంటామని కొందరు ఖరాఖండిగా పేర్కొన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే వల్ల అంతా ఇబ్బందులు పడుతున్నట్టు ఆరోపించారు. నియోజకవర్గ పరిస్థితుల్ని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) దృష్టికి తీసుకువెళ్లాలని కొందరు కోరారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు ఎస్.శ్రీనివాసరావు, గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకటగురుమూర్తి పాల్గొనగా, దేవదత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో శావల దేవదత్, జిల్లా తెలుగురైతు అధ్యక్షుడు చెరుకూరి రాజేశ్వరరావు, నెక్కళపు వెంకటేశ్వరరావు(బద్దె)డాబాశ్రీను, సమన్వయకమిటి సభ్యులు పాల్గొన్నారు.

తోటలో ఆటలు

(5వ పేజీ తరువాయి)

రౌడీషీట్ తెరిచారు.

సూరంపాలెంలో డెన్

ఆకాశ్ హత్య కేసుతో రౌడీషీట్ తెరిచిన తర్వాత గౌతమ్ బుద్ధిమంతుడిగా మారినట్టు వ్యవహరించాడు. గన్నవరం సమీపాన ఉన్న సూరంపాలెంలో ఉన్న మామిడితోటల్లోకి మకాం మార్చాడు. నాడు హత్య కేసులో ఉన్న గ్యాంగ్‌తో అక్కడి నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడు. తోటలో 100 వరకు పందెం కోళ్లను పెంచుతున్నాడు. అక్కడే కోడిపందేలు నిర్వహిస్తున్నాడు. దీంతోపాటు పేకాట, వ్యభిచార కార్యకలాపాలకు తోటలను కేంద్రంగా చేశాడు. వాటితో పాటు బెట్టింగ్ వ్యవహారాలు సాగిస్తున్నాడు. విజయవాడలో తనకు పరిచయం ఉన్న వారిని బెట్టింగ్‌లోకి వచ్చేలా చేశాడు. ఫ్లంటర్ల నుంచి డబ్బు వసూలు చేయడానికి తనతో పాటు కేసులో ఉన్న నిందితులను ఉపయోగించుకుంటున్నాడు. ఈ వసూళ్లలో జక్కంపూడి కాలనీకి చెందిన కనపర కపిల్‌దేవ్ కీలకంగా వ్యవహరిస్తున్నాడు. అతడిపైనా పటమట పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. గౌతమ్ వ్యవహారాలపై నిఘా పెట్టిన పోలీసులు స్టేషన్‌కు రావాలని సమాచారం పంపారు. తనపై షీట్ లేనప్పుడు ఎందుకు రావాలని పోలీసులను ఎదురు ప్రశ్నించాడు. అక్కడితో ఆగకుండా ఓ ఏసీపీ స్థాయి అధికారి పేరు చెప్పి సమాచారం పంపిన పోలీసులను బెదిరించినట్టు తెలిసింది.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	135,144, 155
చికెన్ విత్ స్కిన్	260
చికెన్ స్కిన్‌లెస్	270

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 435



అమ్మవారి దయతో నగరం సుభిక్షంగా ఉండాలి

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గంగానమ్మ తల్లి దయతో విజయవాడ నగరం, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఆకాంక్షించారు. సోమవారం ఆయన పటమట ఎన్టీఆర్ సర్కిల్‌లో అమ్మవారి జాతర సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 14వ డివిజన్ అధ్యక్షుడు నర్రా కిషోర్ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వీరంకి ధాన్యకుమారి, గరికపాటి బద్రి, ఎల్లబాబు, సాంబశివరావు, షేక్ ఫాతిమా, తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో రూ.1.70 లక్షల జరిమానా

ఆటోనగర్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో 16 మందిపై నేరం రుజువుకావడంతో వారికి రూ.1.70లక్షలు జరిమానాను 5వ అదనపు కోర్టు ఇన్‌చార్జ్ జడ్జి లెనిన్‌బాబు సోమవారం విధించారని నాల్గో ట్రాఫిక్ సీఐ రమేష్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడపరాదని హెచ్చరించారు. మరోసారి మద్యం సేవించి పట్టుబడితే డ్రైవింగ్ లైసెన్స్‌లను రద్దు చేస్తామని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

రాణిగారితోట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం మంగళవారం ఉదయం 8గంటల నుంచి 10.30 వరకు న్యూ బ్రిడ్జి సెక్షన్, న్యూ బ్రిడ్జి విద్యుత్ ఉపకేంద్రం, 11కేవీ 10ఎంజీడీ ఫీడర్ పరిధిలో విద్యుత్ నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి.రవీంద్రబాబు తెలిపారు. పకీరుగూడెం, ప్రగతినగర్, చంద్రమౌళిపురం, టిక్కిల్ రోడ్, శ్రీరామ్‌నగర్, మొహిద్దీన్ ఎస్టేట్, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం, పోస్టాఫీసు రోడ్డు తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

ప్రభుత్వానికి సహకరించండి

ఖజానా ఉద్యోగులకు తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సూచన

వన్‌టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న ప్రయత్నాలకు ఖజానా ఉద్యోగులు సహకరించాలని తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సూచించారు. సోమవారం తుమ్మలపల్లివారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ ట్రెజరీ అండ్ అకౌంట్స్ సర్వీసెస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం మొదటి కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఖజానా శాఖ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సుమారు 30 ప్రధాన సమస్యలపై చర్చించి వాటి పరిష్కారం కొరకు ప్రభుత్వం దృష్టికి, ఖజానా శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం కోసం నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని అసోసియేషన్ నాయకులు వివరించారు. ఈ సమావేశానికి హాజరైన గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఉద్యోగులందరూ సహకరించాలన్నారు. ఖజానా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. అసోసియేషన్ నూతన రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన జి.రవికుమార్ మాట్లాడుతూ ఖజానా శాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసమే నూతన కార్యవర్గం కృషి చేస్తుందని తెలిపారు. ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే అర్హులైన వారితో భర్తీ చేయాలన్నారు. ఖజానా శాఖ కార్యాలయాలకు సొంత భవనాల నిర్మాణం కోసం నిధులను విడుదల చేయాలని, ఫీడర్ కేటగిరి నుంచి జూనియర్ అకౌంటెంట్లకు పదోన్నతులు కల్పించేందుకు అవరోధంగా ఉన్న జీవో నెం.22కు సవరణ కల్పించాలని కోరారు.



మాట్లాడుతున్న తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

నూతన కార్యవర్గంలో సంఘం సహాయ అధ్యక్షుడిగా కె.శ్రీనివాసరావుతో పాటు ఏడుగురు ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శిగా కె.రాజకుమార్, కార్యనిర్వాహక కార్యదర్శిగా బి.శ్రీనివాసరావు, కార్యదర్శిగా జి.శ్రీనివాస్, ఇద్దరు మహిళలతో కలిపి ఏడుగురు సహాయ కార్యదర్శులు, కోశాధికారిగా ఎల్.వి.గంగాధర్‌లకు నూతన కార్యవర్గంలో చోటు కల్పించారు. నూతన కార్యవర్గ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా డివిజనల్ కో-ఆపరేటివ్ అధికారి పి.కిరణ్ కుమార్, సహాయ ఎన్నికల అధికారిగా గుంటూరు కలెక్టర్ కార్యాలయం తహసీల్దార్ రవికుమార్, ఎన్నికల పరిశీలకులుగా ఒంగోలు రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ పి.హనుమంతరావు వ్యవహరించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కమిషనర్ ధ్యానచంద్ర

కార్పొరేషన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యలను వేగంగా, సమర్థవంతంగా పరిష్కరించడం నగరపాలక సంస్థ ప్రధాన లక్ష్యమని విజయవాడ నగర కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. నగరపాలకసంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంలో కమిషనర్ ఫిర్యాదులను స్వీకరించి మాట్లాడుతూ ఫిర్యాదులపై వెంటనే స్పందించడంతో పాటు, వాటికి శాశ్వత పరిష్కారం కనుగొనడంపై అధికారులకు సూచనలు చేశారు. ఫిర్యాదులు అందిన వెంటనే సంబంధిత శాఖ అధికారులు సమస్యను వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 17 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ ఇంజనీర్ ఆర్. శ్రీనాథ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ జి. సృజన, ఎస్ఈలు పి. సత్యనారాయణ, పి. సత్యకుమారి తదితరులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర



ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీసీపీ ఉదయరాణి

కమిషనరేట్‌లో 78 ఫిర్యాదులు

గుణదల: జిల్లా పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొన్న డీసీపీ ఉదయరాణి బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. నగరంలోని పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన బాధితులు 78 ఫిర్యాలు అందజేశారని తెలిపారు. సదరు సమస్యలను సత్వరమే పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని సంబంధిత పోలీస్ స్టేషన్ల సీఐలకు డీసీపీ ఆదేశాలు జారీ చేశారు.

నగరంలో ఈగల్ టీమ్ విస్తృత తనిఖీ

గుణదల, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): యాంటీ నార్కోటిక్..ఈగల్ టీమ్ బృందాలు సోమవారం నగరంలో విస్తృతంగా తనిఖీలు చేశారు. మొబైల్ సెక్యూరిటీ చెక్ డివైజ్ ద్వారా 14 మంది అనుమానితులను తనిఖీ చేసి పాత కేసుల్లో నిందితుడిగా ఉన్న ఒకరిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్లో అప్పగించారు. 34 మంది అనుమానితులను అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 64 మందిని గుర్తించి అదుపులోకి తీసుకుని వారిని సంబంధిత పోలీస్టేషన్లలో అప్పగించారు. ఏసీపీలు ఎస్.కిరణ్ కుమార్, కె.లలితా కుమారిల పర్యవేక్షణలో సిబ్బంది పాల్గొన్నారు.



బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



నాగర్‌కోయిల్ మేయర్ మహేష్, కమిషనర్ నిశాంత్ కృష్ణతో కార్పొరేటర్ల బృందం

కార్పొరేటర్ల బృందం నాగర్‌కోయిల్ సందర్శన

కార్పొరేషన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : దక్షిణాది రాష్ట్రాల స్టడీ టూర్‌లో భాగంగా సోమవారం నాగర్‌కోయిల్ కార్పొరేషన్‌ను విజయవాడ కార్పొరేటర్ల బృందం సందర్శించింది. ఈ సందర్భంలో మేయర్ మహేష్ మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఏజెన్సీలతో వ్యర్థాలను సేకరిస్తున్నామని, కీ-పర్ఫామెన్స్ ఇండెక్స్ ద్వారా వారి పనితీరును చూస్తున్నట్లు చెప్పారు. కాటా ద్వారా వ్యర్థాలు ఏ ప్రాంతం నుంచి వచ్చిందో జీపీఎస్ ద్వారా వారు ట్రాక్ చేయగలరని తెలిపారు. తద్వారా ఇంటి నుంచి చెత్త సేకరణ వందశాతం జరుగుతుందన్నారు. నాగర్‌కోయిల్ కార్పొరేషన్ కమిషనర్ నిశాంత్ కృష్ణ మాట్లాడుతూ నగరంలో కోణం ప్రాంతంలో ఒక నాలెడ్జ్ సెంటర్‌ను నిర్మించారని, పోటీ పరీక్షలకు సిద్ధపడుతున్న వారికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం విజయవాడ కార్పొరేటర్ల బృందానికి స్వాగతం పలికిన నగర మేయర్ మహేష్, కార్పొరేషన్ కమిషనర్ నిశాంత్ కృష్ణలకు కార్పొరేటర్ల బృందం జ్ఞాపికలు అందజేశారు.

చరిత్రలో నిలిచేలా మోదీకి స్వాగతం పలకాలి

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో మే 2న లక్షకోట్ల రూపాయలతో చేపట్టిన పనుల ప్రారంభానికి విచ్చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీకి చరిత్రలో నిలిచేలా స్వాగతం పలకాలనీ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సూచించారు. సోమవారం తూర్పు పరిధి గురునానక్ కాలనీలోని ఫ్రైడ్‌మాధవ్ హోటల్‌లో ప్రధాని మోదీ పర్యటన ఏర్పాట్లపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ అమరావతి అభివృద్ధికి లక్షకోట్లను కేంద్రం కేటాయించిందని అన్నారు. మే 2న అమరావతికి ప్రధాని మోదీ రానున్నారని, ఆయనకు మనందరం ఘనస్వాగతం పలకాలని పిలుపునిచ్చారు. తూర్పు నుంచి అధిక సంఖ్యలో ప్రజలు ఈ కార్యక్రమానికి హాజరై ప్రధాని మంత్రికి ఘనస్వాగతం పలకాలని, అందుకు కూటమి నాయకులందరూ సహకరించాలని అన్నారు. కూటమి నాయకులు డివిజన్ స్థాయిలో సమావేశాలు నిర్వహించి రాష్ట్రానికి ప్రధాని మోదీ ప్రకటించిన వరాలను ప్రతి ఇంటికి వెళ్లి వివరించి, వారు కూడా సభకు హాజరయ్యేలా చూడాలని అన్నారు. ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు మాట్లాడుతూ ప్రధాని పర్యటనను విజయవంతం చేయడానికి కూటమిలోని ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

ఈ సమావేశంలో జనసేన తూర్పు ఇన్‌చార్జ్ అమ్మిశెట్టి వాసు, బొప్పన భవకుమార్, వెలగపూడి శంకర్‌బాబు, బీజేపీ నాయకులు కోల్లపల్లి గణేష్ టీడీపీ మైనార్టీ విభాగం నాయకులు ఫిరోజ్, కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు,తదితర నాయకులు, డివిజన్ అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.



ఉగ్రదాడిని ఖండిస్తూ ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన

పర్యాటకులపై ఉగ్రదాడి అమానుషం

● **ఏపీ ఎన్‌జీవోస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన**

గవర్నర్‌పేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్ పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడి అమానుషమని, ప్రతి ఒక్కరూ దాడిని ముక్తకంఠంతో ఖండించాలని ఏపీఎన్‌జీవోస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డి. సత్యనారాయణరెడ్డి, కార్యదర్శి పి. రమేష్‌లు అన్నారు. ఉగ్రదాడిని ఖండిస్తూ, దాడిలో అసువులు బాసిన నెల్లూరు వాసి మధుసూదనరావు, ఇతర పర్యాటకుల కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేస్తూ ఏపీ ఎన్‌జీవోస్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి లెనిన్ సెంటర్‌లో కొవ్వొత్తుల ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఉగ్రవాదులకు కులం, మతం లేదని, మారణహోమం సృష్టించడమే వారి లక్ష్యమని, దుశ్చర్యకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని భారత ప్రభుత్వాన్ని కోరారు. ఈ కష్టకాలంలో బాధిత కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ఇవ్వాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. జిల్లా కార్యదర్శి పి. రమేష్ మాట్లాడుతూ ఉగ్రవాదులను, వారికి ప్రోత్సాహం అందిస్తున్న వారిని కేంద్ర ప్రభుత్వం అణచివేయాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ నగర శాఖ అధ్యక్షుడు సీవీఆర్ ప్రసాద్ మాట్లాడుతూ పర్యాటకులపై దాడి పిరికిపందల చర్య అన్నారు. పెద్ద సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగులు ప్రదర్శనలో పాల్గొన్నారు.

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి రాజకీయ అజ్ఞాని

ఏఐసీసీ మెంబర్ వి.గురునాథం విమర్శ

విజయవాడ లీగల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) :కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రాజకీయ అజ్ఞాని అని, తాను పుట్టకముందు జరిగిన విషయాలను ఎవరినైనా అడిగి తెలుసుకోవడం, లేదా పుస్తక పఠనం ద్వారా తెలుసుకొని మాట్లాడాలని ఏఐసీసీ సభ్యులు, పీసీసీ ఉపాధ్యక్షుడు, బార్ మాజీ అధ్యక్షుడు వి.గురునాథం విమర్శించారు. సోమవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ విజయవాడలో ఆదివారం జరిగిన మేధావుల సదస్సులో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో అంబేడ్కర్‌ను ఓడించిందని రాజకీయ అజ్ఞానంతో పలు విమర్శలు చేశారన్నారు. వీటన్నింటిని గురునాథం తీవ్రంగా ఖండించారు. కిషన్ రెడ్డి పుట్టకముందు జరిగిన విషయాలను రాజకీయ మేధావులను అడిగి తెలుసుకొని విమర్శిస్తే బాగుంటుందని గురునాథం ఎద్దేవా చేశారు. 11 ఏళ్లుగా కేంద్రంలో బీజేపీ అధికారంలో వున్నప్పటికీ అంబేడ్కర్ విగ్రహాన్ని ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. రాజ్యాంగం గురించి మాట్లాడే హక్కు ఒక్క కాంగ్రెస్ పార్టీకి, రాహుల్ గాంధీకి మాత్రమే వుందని, దీనికి కారణం కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోనే రాజ్యాంగం రూపకల్పన జరిగిందని గురునాథం తెలిపారు.



విజేతలైన క్రీడాకారులతో నిర్వాహకులు

చెస్ విజేతలకు బహుమతులు

విజయవాడ స్పోర్ట్స్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి):ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కృష్ణా జిల్లా అండర్ 13బాలబాలికల చాంపియన్‌షిప్, ఓపెన్ చెస్ టోర్నమెంట్ పోరంకిలోని విజ్ఞాన భారతి హైస్కూల్‌లో జరిగింది. ఈ టోర్నమెంట్ లో 28మంది క్రీడాకారులు పాల్గొనగా 5రౌండ్లు, బాలికల విభాగంలో 14మంది పాల్గొనగా, 5రౌండ్లు జరిగాయి. అండర్ 13 బాలుర విభాగంలో హర్షిత్ సాయి, అబ్దుల్ ఫెయిజ్, బాలికల విభాగంలో నాగశుభశ్రీ, ప్రహస్థాలు విజయం సాధించారు. ఓపెన్ క్యాటగిరిలో 10 మంది పాల్గొనగా 5రౌండ్లు జరిగాయి, సందీప్, మోనిష్, రుషిల్ సాయి లు విజయం సాధించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ ఫిట్నెస్ డవలపర్ జి.వేణు, కరూర్ వైశ్యా బ్యాంక్ మేనేజర్ కె.శ్రీనివాస్, పి.రేణుక, కె.ఆనంద్, ఫణి కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ అధికారుల తీరుతో..

వెటర్నరీ కాలనీవాసుల ఆవేదన



వెటర్నరీ కాలనీలో నరికివేసిన చెట్టు కొమ్మలు

భారతీనగర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కాలనీలోని మెయిన్, అంతర్గత రోడ్లో ఇరువైపులా ఆహ్లాదకరంగా ఉండి, కాలనీ వాసులకు చల్లని వాతావరణాన్ని అందించే చెట్లను నరికి వేయడంతో వెటర్నరీ కాలనీవాసులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా తరుచూ విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందితో కలసి విద్యుత్ తీగలకు అడ్డు వచ్చిన చెట్ల కొమ్మలను తొలగిస్తూ ఉంటారు. సోమవారం కూడా విద్యుత్ లైన్లు మరమ్మతులలో భాగంగా విద్యుత్ శాఖ సిబ్బంది చెట్ల కొమ్మలకు బదులు చెట్లను సగానికి నరికి వేయడంతో కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి సంఘటన తిరిగి పునరావృతం కాకుండా చూడాలని కాలనీవాసులు ప్రజా ప్రతినిధులను, ఉన్నత అధికారులను కోరుతున్నారు.

సీఈవో రైతుబజార్ల తనిఖీ



పటమట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పటమట, ఏపీఐబీసీ రైతు బజార్లను ఆయా శాఖల ఉన్నతాధికారులు సోమవారం తనిఖీ చేసి రైతుబజారులో రైతులకు, వినియోగదారులకు కనీస అవసరాలైన ఆర్వో వాటర్, టాయిలెట్లు, సీసీ కెమెరాలు, ఎల్ఈడీ డిస్‌ప్లే బోర్డు, తదితర వాటి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతుబజార్ల ముఖ్య కార్యనిర్వహక అధికారి మాధవీలత, మార్కెటింగ్ శాఖ అధికారి మంగమ్మ, రమేష్‌బాబు, పాల్గొన్నారు.

రూ. రెండు కోట్లతో పాయకాపురం చెరువు అభివృద్ధి

కమిషనర్ ధ్యానచంద్ర

పాయకాపురం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పాయకాపురం చెరువును రెండుకోట్ల నిధులతో అభివృద్ధి చేస్తున్నామని నగర కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. సోమవారం కమిషనర్ పాయకాపురం చెరువు, అజిత్‌సింగ్‌నగర్ మాకినేని బసవపున్నయ్య స్టేడియం, కండ్రిక ప్రాతాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించడమే కాకుండా, కాలుష్యం తగ్గే విధంగా మొక్కలు నాటాలన్నారు. అజిత్‌సింగ్‌నగర్ మాకినేని బసవపున్నయ్య స్టేడియంను పరిశీలించిన కమిషనర్ వాకింగ్ ట్రాక్, జిమ్ సామగ్రి, మరుగుదొడ్లు అభివృద్ధి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కండ్రికలో జరుగుతున్న డ్రెయిన్ నిర్మాణపనులను పరిశీలించి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో సీఈ ఆర్ శ్రీనాథ్‌రెడ్డి, చీఫ్ సిటీప్లానర్ సంజయ్ రత్నకుమార్, జాయింట్ డైరెక్టర్ అమృత డాక్టర్ లత ఇంజనీర్లు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులు ప్రారంభం

గవర్నర్‌పేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వేసవి శిక్షణా తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో తెలుగు రచయితల సంఘం కృష్ణా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జీవీ పూర్ణచంద్ మాట్లాడుతూ శిక్షణా తరగతుల్లో పుస్తకాలు చదవడం, డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లీషు వంటి అంశాలు విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచడానికి దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో ఆంధ్ర లయోలా కళాశాల విశ్రాంత అధ్యాపకులు డాక్టర్ గుమ్మా సాంబశివరావు, ఠాగూర్ గ్రంథాలయాధికారి కె. నాగరాజు, గ్రేడ్-1 లైబ్రేరియన్ కె. రమాదేవి, డ్రాయింగ్ టీచర్ స్వాతి పూర్ణిమ, సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

‘ఆ నెల’ జీతం ఇవ్వండి ప్లీజ్!

» కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్ల వినతి

అమరావతి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): గత విద్యా సంవత్సరంలో కాంట్రాక్టు ముగిసిన తర్వాత కూడా తాము పనిచేశామని, దానికి సంబంధించి ఒక నెల వేతనం తమకు రావాల్సి ఉందని కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్లు(జేఎల్) చెబుతున్నారు. ఇప్పటికే చాలా ఆలస్యమైనందున ఆ నెల జీతం ఇవ్వాలని కోరుతున్నారు. కాంట్రాక్టు జేఎల్స్‌కు ఏటా కాంట్రాక్టును రెన్యువల్ చేస్తారు. ఈ క్రమంలో 2024లో 11 నెలల కాలానికే కాంట్రాక్టు రెన్యువల్ చేశారు. అయినప్పటికీ పబ్లిక్ పరీక్షల తర్వాత కూడా ఇంటర్ బోర్డు వీరి సేవలను వినియోగించుకుంది. పేపర్ల మూల్యాంకనం, అడ్మిషన్లు, సప్లిమెంటరీ పరీక్షలు రాసే విద్యార్థులకు సన్నద్ధత తదితర పనులను వారితో చేయించారు. ఈ నేపథ్యంలో తమ సేవలు వినియోగించుకున్నందున 12వ నెలకు కూడా జీతం ఇవ్వాలని కాంట్రాక్టు జేఎల్స్ కోరుతున్నారు. కానీ, కాంట్రాక్టు ప్రకారం 11 నెలలకు జీతం చెల్లించామని, 12వ నెలకు రాదని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఒప్పందం ప్రకారం జీతం ఇవ్వలేమనడం సరైన విధానమే అయినప్పటికీ.. వేసవిలో పలు రకాల పనులను తమతో చేయించారని.. మానవతా దృక్పథంతో అయినా తమకు ఆ నెల జీతం ఇవ్వాలని జేఎల్స్ కోరుతున్నారు.

పాఠశాల విద్యలో అసంబద్ధ విధానాలపై 5 నుంచి ఉద్యమం : ఏపీటీఎఫ్-257

అమరావతి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ప్రభుత్వం విద్యా రంగానికి సంబంధించి.. గత వైసీపీ సర్కారు అనుసరించిన విధానాలనే కొనసాగిస్తోందని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్(ఏపీటీఎఫ్-257) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెన్నుపాటి మంజుల, కె. భానుమూర్తి ఆరోపించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా మే 5 నుంచి ఉద్యమ కార్యాచరణ చేపడుతున్నట్లు తెలిపారు. 5 నుంచి తాలూకా కేంద్రాల్లో నిరసనలు, 9న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, 14న విజయవాడలో రాష్ట్ర స్థాయి ధర్నా చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో 1 నుంచి 5 తరగతులు, ఉన్నత పాఠశాలల్లో 6 నుంచి 10 లేదా 12 తరగతులు ఉండాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా కనీసం ఇద్దరు ఎస్జీటీలను నియమించాలని కోరారు.

డిప్యూటీ స్పీకర్ ఎలా ఉండాలో ఆర్ఆర్ఆర్ తెలుసుకోవాలి : సీపీఎం

విజయవాడ(గవర్నర్‌పేట), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ స్పీకర్‌గా ఏలా ఉండాలో ఉండి నియోజవర్గం ఎమ్మెల్యే రఘు రామకృష్ణం రాజు ముందు తెలుసుకోవాలని, అసెంబ్లీ స్పీకర్ ఎలా హుందాగా వ్యవహరిస్తున్నారో అలా ఉండేలా ఆర్ఆర్ఆర్‌కు మాట్లాడే విధానం నేర్పాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు కోరారు. సోమవారం ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్ఆర్ఆర్ తీరును తీవ్రంగా తప్పుపట్టారు. పేదల ఇళ్లు నేనే కూలగొట్టేస్తా అని రఘురామకృష్ణంరాజు బహిరంగంగా మాట్లాడుతుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కుమారుడి చదువు విషయంలో భర్త మందలించాడని మహిళ ఆత్మహత్య


మేరీలత (ఫైల్)

జగ్గయ్యపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కుమారుడు చదువు విషయంలో భర్త మందలించాడని పాలేటిలో దూకి మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం జరిగింది. పట్టణ పరిధిలో విశాఖ స్టీల్ ప్లాంట్ టౌన్ షిప్‌లో నివాసం ఉంటూ హోంగార్డుగా పనిచేస్తున్న ఇనుపకొండ రవి చంద్రకు భార్య మేరీలత (35), ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు భరత్ చంద్ర జగ్గయ్యపేటలో ఒక ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. మొదటి, రెండు సంవత్సరాల్లో మూడేసి సబ్జెక్టులు ఆగాయి. ఓపెన్ ఇంటర్ పరీక్ష రాయించినా ఫలితం రాకపోవటంతో పిల్లల చదువు గురించి పట్టించు కోవడంలేదని రవిచంద్ర భార్య మేరీలతను మందలించి ఆదివారం రాత్రి డ్యూటీకి వెళ్లాడు. తిరిగి ఉదయం వచ్చే సరికి భార్య కనిపించకపోవటంతో కుమారులు శరత్‌చంద్ర, భరత్ చంద్రలను ప్రశ్నించగా, తాము లేచేసరికి అమ్మ లేదని చెప్పారు. వెంటనే బయట స్నేహితులు, స్థానికులను ఆరా తీయగా పాలేటిపై ఒక మహిళ వెళ్లటం చూశామని చెప్పటంతో జగ్గయ్యపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై రాజు ఈతగాళ్లతో వెతికించగా, మేరీలత భౌతికకాయం లభ్యమైంది. ఆమె మృతదేహాన్ని జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి, కే సు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చదవడంలేదని తల్లి మందలించిందని బాలుడు బలవన్మరణం

జగ్గయ్యపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): చదువుకోవటంలేదని తల్లి మందలించినందుకు 9వ తరగతి విద్యార్థి(14) బలవన్మరణానికి పాల్పడిన ఘటన జగ్గయ్యపేటలో సోమవారం జరిగింది. పట్టణంలో కోదాడ రోడ్డుకు చెందిన బాలుడు చదువుకోకుండా దుర్వ్యసనాలకు లోను కావటంతో ఆగ్రహించిన తల్లి తీవ్రంగా మందలించింది. దీంతో ఆ బాలుడు బాత్‌రూమ్‌లోకి వెళ్లి బాత్‌రూమ్‌లు శుభ్రం చేసే యాసిడ్‌ను తాగాడు. ఎంతకీ బయటకు రాకపోవటంతో తల్లిదండ్రులు గమనించి వెంటనే జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా, అక్కడ నుంచి విజయవాడకు తీసుకెళ్లారు. గుంటూరు జీజీహెచ్‌కు తరలిస్తుండగా మృతి చెందాడు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయండి

» ఫెడరేషన్ ఆఫ్ అన్ ఎయిడెడ్ పాఠశాలల అసోసియేషన్



మాట్లాడుతున్న ఫెడరేషన్ ఆఫ్ అన్ ఎయిడెడ్ పాఠశాలల అసోసియేషన్ రాష్ట్ర శాఖ ప్రతినిధులు కె.తులసీప్రసాద్, చిత్రంలో పరుచూరి శ్రీనివాసరావు, శ్రీకాంత్, భరత్, సుందర్‌రామ్

మొగల్రాజపురం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలలకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఫెడరేషన్ ఆఫ్ అన్ ఎయిడెడ్ పాఠశాలల అసోసియేషన్ రాష్ట్ర శాఖ ప్రతినిధులు కె.తులసీ ప్రసాద్, పరుచూరి శ్రీనివాసరావు, శ్రీకాంత్, భరత్, సుందర్‌రామ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మొగల్రాజపురంలోని ఒక హోటల్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ గడచిన మూడు సంవత్సరాలుగా రైట్ టు ఎడ్యుకేషన్ కింద విద్యార్థులకు ఉచితంగా అడ్మిషన్‌లు ఇచ్చామని, దాని తాలుకా ఫీజులను ప్రభుత్వం రీయింబర్స్ చేయాలని చెప్పారు. 2025-26 సంవత్సరానికి జీవో విడుదల చేశారని, అది విడుదల చేసే ముందు స్టాండర్ట్ ప్రొసీజర్ లేకుండా రాబోయే సంవత్సరానికి ఫీజులు నిర్ణయించకుండా ప్రవేశాల గురించి ప్రకటన చేశారని తెలిపారు. తాము అడ్మిషన్‌లకు వ్యతిరేకం కాదని, గతేడాది 38 వేల అడ్మిషన్‌లు చేశామన్నారు. ఆర్టీఈ యాక్ట్ మీద కోర్టును ఆశ్రయించగా, తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని వెంటనే బకాయిలను విడుదల చేయాలని కోరారు.

“కేవలం పది కిలో మీటర్ల దూరంలో ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం.. అక్కడే హైకానిక్ బ్రిడ్జ్.. దాని మీదుగా రాజధాని అమరావతికి పది నిముషాల్లో చేరుకోవచ్చు.. మా వెంచర్ చుట్టూ అవుటర్ రింగ్ రోడ్డు, ఆ పక్కనే విజయవాడ - ఖమ్మం గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు, ఎర్రుపాలెం - అమరావతి - నంబూరు కొత్త రైల్వే మార్గం వస్తోంది..” అంటూ ఆకర్షణీయమైన బ్రోచర్లతో మాయ చేసేస్తున్నారు కొందరు అనధికార లే అవుట్ల యజమానులు. మ్యాప్‌లు వేసి అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారు. “మాకు అన్ని అనుమతులున్నాయి. ప్లాట్స్ కొన్నవారికి ఎలాంటి ఇబ్బందులు ఉండవు. కామన్ సైట్ ఉంది. 40 అడుగులు, 30 అడుగుల రోడ్లు ఉన్నాయి.” అంటూ ప్రజలను నమ్మించి తమ వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగిస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లాలోని అనధికార లే అవుట్లపై ప్రత్యేక కథనం.




జి.కొండూరు మండలం వెంకటాపురంలో కామన్ సైట్ లేని లే అవుట్

రియల్ మాయ!

ఎన్టీఆర్ జిల్లాలో

- మైలవరం, నందిగామ నియోజక వర్గాల్లో అనధికార లే అవుట్లు
- అనుమతులు లేకుండా యథేచ్ఛగా ప్లాట్ల అమ్మకాలు
- మోసపోతున్న కొనుగోలుదారులు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి


మైలవరంలో వేసిన అనధికార లే అవుట్

(ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం): రాజధాని అమరావతికి కూత వేటు దూరంలో ఉన్న ఎన్టీఆర్ జిల్లా అన్ని విషయాల్లో దినదినాభివృద్ధి చెందుతోంది. ముఖ్యంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం పెద్ద ఎత్తున జరుగుతోంది. అనధికార రియల్ ఎస్టేట్ లే అవుట్లు పుట్ట గొడుగుల్లా వెలుస్తున్నాయి. కూటమి అధికారంలోకి రావడంతో అనధికార లే అవుట్ల ద్వారా అక్రమార్జన చేసే వారికి కలిసొచ్చినట్లయ్యింది. గతంలో తక్కువ ధరకు కొనుగోలు చేసిన భూముల్లో రియల్ ఎస్టేట్ వెంచర్లు వేస్తున్నారు. వీటిలో చాలా వరకు అనధికార లే అవుట్స్ ఉన్నాయి. సీఆర్‌డీఏ అనుమతులు లేకున్నా అన్ని ఉన్నట్లు కలరింగ్ ఇచ్చి, రోడ్లు, డ్రెయినేజీలు నిర్మాణం చేపట్టి, ప్లాట్లుగా వి భజించి అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. ప్రధానంగా జిల్లాలోని మైలవరం, నందిగామ నియోజకవర్గాల్లో ఇలాంటి అనధికార లే అవుట్స్ అనేకం ఉన్నాయి. రాజధాని అమరావతికి మణిహారంగా చెప్పే అవుటర్ రింగ్ రోడ్డు ఈ రెండు నియోజకవర్గాలను కలుపుతూ వెళుతుండటంతో పాటు కృష్ణానదికి ఉత్తర వైపు రాజధానికి అతి సమీపంగా ఉండటంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులకు బాగా కలిసి వచ్చింది. అంతేకాక ఎర్రుపాలెం నుంచి అమరావతి మీదుగా నంబూరు వరకు వేస్తున్న రైల్వే లైన్ సైతం రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, అక్రమ లే అవుట్లు వేసి వి క్రయించుకునే వారికి వరంగా మారింది. మైలవరం - తిరువూరు రోడ్డులో మైలవరం ఊరి చివర ఓ టెంపుల్ సమీపంలో ఇటీవల వేసిన లే అవుట్‌కు ఎలాంటి అనుమతులు లేవు. కంచికచర్ల మండలం పరిటాల గ్రామ పరిధిలో క్వారీలకు అతి సమీపంలో కొందరు బడాబాబులు అనుమతులు లేకున్నా క్రషర్స్, క్వారీస్ బఫర్ జోన్‌లో వెంచర్స్ వేసి ఆన్‌లైన్‌లో మ్యాప్‌ల మీదే అమ్మేసుకొని సొమ్ము చేసుకుంటున్నారు.

సీఆర్‌డీఏ పరిధి కావడంతో వదిలేస్తున్న స్థానిక శాఖలు

లే అవుట్ల అనుమతులు అన్ని సీఆర్‌డీఏ పరిధిలో ఉండటంతో స్థానికంగా ఉన్న పలు రెవెన్యూ, పంచాయతీరాజ్‌శాఖలకు అనధికార లే అవుట్లపై చర్యలు తీసుకునే అవకాశం లేకుండా పోయింది. మొత్తం సీఆర్‌డీఏ చూసుకుంటుందిలే అని స్థానిక ప్రభుత్వశాఖలు మిన్నకుండటంతో ప్లాట్స్ కొనుగోలుదారులు నష్టపోయే పరిస్థితులు నెలకొన్నాయి. అనధికార లే అవుట్ల నిర్వాహకులు అమ్ముకొని సొమ్ము చేసుకున్న తర్వాత కాని అనుమతులు లేవన్న విషయం బయటకు రావడం లేదు. దీంతో ప్లాట్స్ కొనుగోలు చేసిన వారే మునిగిపోతున్నారు. సీఆర్‌డీఏ అధికారులు స్థానిక అధికారులకు తమ నోటీసుకు వచ్చిన లే అవుట్ల గురించి సమాచారం ఇచ్చినా, లేక స్థానికంగా ఉండే ప్రభుత్వ శాఖల అధికారులు సీఆర్‌డీఏ అధికారులకు సమాచారం ఇచ్చినా వినియోగదార్లు మోసపోకుండా ఉంటారనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తం అవుతోంది.

కామన్ సైట్‌నూ అమ్మేస్తున్నారు

ఎకరానికి 10 సెంట్లు చొప్పున ప్రతి లే అవుట్‌లో కామన్ సైట్ వదలాల్సి ఉంటుంది. అయితే చాలా వెంచర్లతో కామన్ సైట్స్ ఉండటం లేదు. కొన్ని చోట్ల కామన్ సైట్లలో దేవాలయాలు కట్టి, మిగిలింది కబ్జా చేస్తున్నారు. కొన్ని చోట్ల కామన్ సైట్ అనేది లేకుండా మొత్తం అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ఇలాంటి అక్రమ లే అవుట్లపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

పోర్టు, గిలకలదిండి హార్బర్ పనులు వేగవంతం

» మంత్రులు జనార్దనరెడ్డి, రవీంద్ర
» రాష్ట్ర అభివృద్ధిలో కీలకం కానున్న మచిలీపట్నం పోర్టు
» పోర్టు, హార్బర్ పనులను పరిశీలించిన మంత్రులు జనార్దనరెడ్డి, రవీంద్ర, అనిత, సుభాష్, ఎమ్మెల్యేలు


నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రులు బీసీ జనార్దనరెడ్డి, కొల్లు రవీంద్ర, వాసంశెట్టి సుభాష్ తదితరులు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: తమిళనాడు రాజధానికి చెన్నై పోర్టు, మహారాష్ట్ర రాజధానికి ముంబయి పోర్టు వలే ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి మచిలీపట్నం పోర్టును అభివృద్ధి చేస్తామని మంత్రులు బీసీ జనార్ధనరెడ్డి, కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నం పోర్టులో జరుగుతున్న పనులను మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, సీఈవో ప్రవీణ్ ఆదిత్య, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు తదితరులతో కలసి సోమవారం వారు పరిశీలించారు. తొలుత మచిలీపట్నం పోర్టు నమూనాలను సందర్శించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోర్టు సౌత్ బ్రేక్ వాటర్ చివరి పాయింట్‌కు చేరుకుని పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్ధనరెడ్డి మాట్లాడుతూ గతంలో పోర్టు పనులు నెమ్మదిగా జరిగాయన్నారు. సీఎం చంద్రబాబు ప్రతినెలా మచిలీపట్నం పోర్టు పనులు జరుగుతున్న విధానంపై సమీక్ష నిర్వహిస్తున్నారని తెలిపారు. పోర్టు నిర్మాణంతో జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందడంతోపాటు, రాజధానికి దగ్గరలోనే ఉన్న పోర్టు కావడంతో ప్రభుత్వం ఈ పోర్టు అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించిందన్నారు. సకాలంలో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు ఆదేశాలు ఇచ్చామన్నారు. మచిలీపట్నం పోర్టు వ్యాపార, వాణిజ్య పరంగా కేంద్ర బిందువుగా ఉంటుందని, భవిష్యత్తులో రాష్ట్ర అభివృద్ధిలో కీలకంగా మారుతుందన్నారు. పోర్టుకు సంబంధించి రోడ్డు కం రైలు మార్గాలను కలిపేందుకు అన్నిరకాల అనుమతులు మంజూరు చేశామని తెలిపారు. తొలి విడతలో నాలుగు బెర్తులను పూర్తి చేస్తామని, రానున్న రోజుల్లో మరిన్ని బెర్తులను నిర్మిస్తామని చెప్పారు. ఇప్పటివరకు 30శాతం పనులు పూర్తయ్యాయని, రూ.3,668.83 కోట్ల అంచనాలతో పోర్టు పనులను కాంట్రాక్టుకు ఇచ్చినట్లు వివరించారు. మచిలీపట్నం పోర్టు గేట్‌వే ఆఫ్ అమరావతిగా మారుతుందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు తదితరులు ప్రసంగించారు.

మార్చి 2026 నాటికి గిలకలదిండి హార్బర్ పనులు పూర్తి

గిలకలదిండి హార్బర్ పనులను మంత్రులు వాసంశెట్టి సుభాష్, వంగలపూడి అనిత, బీసీ జనార్ధనరెడ్డి, కొల్లు రవీంద్ర పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి జనార్ధనరెడ్డి మాట్లాడుతూ ఇప్పటివరకు హార్బర్ పనులు 57 శాతం పూర్తయ్యాయని తెలిపారు. 2026 మార్చి నాటికి పనులు పూర్తిచేసేలా గడువు ను పెంచడం జరిగిందన్నారు. హార్బర్ పనులు పూర్తయితే టూరిజం హబ్‌గా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు మంత్రి కొల్లు రవీంద్ర కృషి చేస్తున్నారని తెలిపారు. సముద్ర ముఖద్వారం పూడికతీతకు సంబంధించి సాంకేతికపరంగా ఎలాంటి పనులు చేయాలనే అంశంపై చెన్నైకి చెందిన నిపుణులతో చర్చిస్తున్నామని, 45 రోజుల వ్యవధిలో ఈ నివేదిక వస్తుందని, ఈ నివేదిక ప్రకారం అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో సముద్రముఖ ద్వారం పూడికతీత పనులను పూర్తిస్థాయిలో చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కాగిత కృష్ణప్రసాద్, వర్ల కుమార్‌రాజా, యార్లగడ్డ వెంకట్రావు, బోడె ప్రసాద్, వెనిగండ్ల రాము, కలెక్టర్ బాలాజీ, మేఘా సంస్థ జీఎం తులసీదాస్, మారిటైమ్, రైట్స్ సంస్థల ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

సూపరింటెండెంట్‌గా ఏవీ రావుకు పూర్తి బాధ్యతలు



ప్రభుత్వాస్పత్రి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రభుత్వా స్పత్రిలో అనస్థీషియా డిపార్ట్ మెంట్‌లో సీనియర్ వైద్యులుగా పనిచేస్తూ, తాత్కాలిక సూపరిం టెండెంట్‌గా కొనసాగుతున్న డాక్టర్ ఏ.వెంకటే శ్వరరావు (ఏవీ రావు)కు సూపరింటె ండెంట్‌గా ప్రభుత్వం పూర్తి బాధ్యతలు అప్ప గించింది. ఆరు ప్రభుత్వం వైద్య కళాశాలలకు కొత్త ప్రిన్సిపాల్స్‌ను, బోధనాస్పత్రులకు ఐదు గురు కొత్త సూపరింటెండెంట్లను నియమిస్తూ వైద్య ఆరోగ్యశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ముగ్గురు ప్రిన్సిపాల్స్, ఒక సూపరిం టెండెంట్‌ను బదిలీ చేసింది. ఖాళీలు ఉన్న చోట ముగ్గురు కొత్త ప్రిన్సిపాల్స్, ఐదుగురు కొత్త సూపరింటెం డెంట్లను వైద్య ఆరోగ్యశాఖ నియమించింది.

నేషనల్ కెనోయ్ స్ప్రింట్ చాంపియన్‌షిప్‌లో గొగులూరి వర్షితకు కాంస్యం



విజయవాడ(స్పోర్ట్స్), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): భోపాల్‌లో ఈ నెల 24 నుంచి 28 వరకు జరిగిన 35వ నేషనల్ కెనోయ్ స్ప్రింట్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రాతినిధ్యం వహించిన విజయవాడకు చెందిన అథ్లెట్ గొగులూరి వర్షిత కాంస్య పతకాన్ని సాధించింది. సబ్ జూనియర్ కే4 500 మీటర్స్ విభాగంలో ఈ పతకం లభించింది. గత అక్టోబర్‌లో కేరళలో నిర్వహించిన ఇంటర్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా మీట్‌లో పలు విభాగాల్లో నాలుగు పతకాలు, గత నెలలో భువనేశ్వర్‌లో జరిగిన ఒడిశా రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ఏడు పతకాలు సాధించి ప్రతిభను సాటింది. ఈ సందర్భంగా వర్షితను పలువురు క్రీడా సంఘాల ప్రతినిధులు అభినందించారు.

ప్రధాని పర్యటనకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

» రాష్ట్ర సాధారణ పరిపాలనశాఖ ప్రధాన కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా


విమానాశ్రయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ముఖేష్‌కుమార్ మీనా, శాంతి భద్రతల ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, ఐజీ అశోక్‌కుమార్, డీఐజీ త్రివిక్రమ్‌వర్మ, కలెక్టర్ బాలాజీ, ఎస్పీ గంగాధరరావు, జేసీ గీంతాజలిశర్మ తదితరులు

హనుమాన్‌జంక్షన్ రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పునఃనిర్మాణ పనులను ప్రారంభించేందుకు ప్రధాని మోదీ మే 2వ తేదీన రాష్ట్ర పర్యటనకు వస్తున్న నేపథ్యంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర సాధారణ పరిపాలనశాఖ ప్రధాన కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా అధికారులను ఆదేశించారు. గన్నవరం విమానాశ్రయంలో సోమవారం సాయంత్రం శాంతి భద్రతల ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, ఐజీ అశోక్‌కుమార్, డీఐజీ త్రివిక్రమ్‌వర్మ, కలెక్టర్ బాలాజీ, ఎస్పీ గంగాధరరావు, జేసీ గీంతాజలి శర్మ, తదితర అధికారులతో కలిసి వీవీఐపీ విరామశాల, కంటైనర్, హెలికాప్టర్ దిగే ప్రదేశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. మంగళవారం ఎస్పీజీ వారు భద్రతా ఏర్పాట్లపై ఏఎస్ఎల్, సమావేశం నిర్వహిస్తారన్నారు. విమానాశ్రయ భవనంలో అగ్నిమాపక యంత్రాలను పరిశీలించాలని, ప్రధానమంత్రి కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కంటైనర్ విరామశాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని దిశానిర్దేశం చేశారు. విద్యుత్ అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. విమానాశ్రయంలో దెబ్బతిన్న టైల్స్‌ను తొలగించి కొత్తవి సిద్ధం చేయాలని చెప్పారు. హైస్పీడ్ అంతర్జాలం, అంబులెన్స్ అందుబాటులో ఉండేలా చూస్తూ వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు వారికి అప్పగించిన పనులను సజావుగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విమానాశ్రయ డైరెక్టర్ ఎం.ఎల్.కె.రెడ్డి, ఆర్డీవోలు బాలసుబ్రహ్మణ్యం, హేలాషారోన్, ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి షాహిద్‌బాబు, అగ్నిమాపక శాఖ అధికారి ఏసురత్నం, ఆర్టీవో శ్రీనివాసరావు, ప్రోటోకాల్ అధికారి మోహన్‌రావు, డ్వామా పీడీ శివప్రసాద్, మార్కెటింగ్ ఏడీ నిత్యానందం, డీపీవో అరుణ, డీఐవో ఫణికుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ గంగాధర్, ఏపీఎంఐపీ పీడీ విజయలక్ష్మి పాల్గొన్నారు.

‘జీవో- 4’ ఉత్తర్వులను సవరించాలి

» టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్.డి.ప్రసాద్



విజయవాడ(స్పోర్ట్స్), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): క్రీడల పట్ల వివక్ష చూపేలా ఉన్న జీవో నెంబర్ 4ను వెంటనే సవరించాలని ఆంధ్రప్రదేశ్ టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్.డి.ప్రసాద్ డిమాండ్ చేశారు. ఇందిరాగాంధీ స్టేడియంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ జీవో క్రీడాకారుల పాలిట శాపంగా మార నుందన్నారు. గ్రామీణ క్రీడలు, వాటర్ స్పోర్ట్స్‌ను అభివృద్ధి చేయాలని సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పదేపదే చెబుతున్నప్పటికీ దానికి విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) అధికారులు పనిచేస్తున్నారని విమర్శించారు. రానున్న రోజుల్లో దీనిపై ఉద్యమం చేయడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం ఉపాధ్యక్షులు ధనియాల నాగరాజు, అట్యాపాట్యా సంఘం కోశాధికారి కృష్ణారెడ్డి, టెన్నిస్ బాల్ క్రికెట్ సంఘం కార్యదర్శి స్వామి తదితరులు పాల్గొన్నారు.

రేపు పాలిసెట్

భారతీనగర్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో 2025-26 పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించే పాలిసెట్ పరీక్షలు బుధవారం నిర్వ హిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కోఆర్డినేటర్, విజ యవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఎం.వి జయసారథి సోమవారం ఒక ప్రకటనలో తెలి పారు. ఎన్టీఆర్ జిల్లాలోని విజయవాడ, నంది గామ, తిరువూరు ప్రాంతాల్లో మొత్తం 18 పరీ క్షా కేంద్రాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. ఉదయం పది గంటల నుంచి విద్యార్థులను అనుమతిస్తారని తెలిపారు. ఒక నిమిషం ఆలస్యం అయినా పరీక్ష కేంద్రంలోకి అనుమతి ఉండదని పేర్కొన్నారు.



అధ్యయనం

ఒకే పరీక్షతో 30 క్యాన్సర్ల గుర్తింపు!

నాసిక్‌లోని హెచ్‌ఎస్‌జి మానవతా క్యాన్సర్ కేంద్రంలోని బహుళ సంస్థాగత పరిశోధక బృందం, ఒకే ఒక రక్తపరీక్షతో క్లోమం, ఊపిరితిత్తులు, అండాశయాలతో సహా 30 రకాల క్యాన్సర్లను కనిపెట్టే విప్లవాత్మకమైన రక్తపరీక్షను అభివృద్ధి చేసింది. ఈ ప్రయోగంలో 6,500 మంది పాల్గొన్నారు. వీరిలో 2,800 మందికి వేర్వేరు దశల్లోని క్యాన్సర్ ఉన్నట్టు నిర్ధారణ అయింది. అలాగే తొలి దశకు చేరువలో ఉన్న క్యాన్సర్ కూడా ఈ పరీక్షలో బయల్పడడం చెప్పుకోదగిన విశేషం. కణితి డిఎన్‌ఎ, లేదా కణాల ఆధారంగా క్యాన్సర్ వ్యాధిని నిర్థారించే పరీక్షలకు భిన్నంగా, ఈ పరీక్ష తొలి దశ క్యాన్సర్లకు సంబంధించి కచ్చితమైన ఫలితాలను అందించగలుగుతోంది. 2030 నాటికి ప్రపంచవ్యాప్త మరణాలకు క్యాన్సర్ ప్రధాన కారకంగా మారుతుందనే అంచనా వేయడం జరిగింది కాబట్టి, ఆ మరణాలను అరికట్టడం కోసం క్యాన్సర్ వ్యాధిని ముందస్తుగా గుర్తించడం అత్యంత ఆచరణీయమైన వ్యూహంగా మారింది. ప్రస్తుత క్యాన్సర్ నిర్థారణ పరీక్షల్లో కేవలం ఐదు రకాల క్యాన్సర్లను మాత్రమే ప్రారంభ దశల్లో గుర్తించే వీలు కలుగుతోంది. కానీ ఈ కొత్త పరీక్షతో 30 రకాల క్యాన్సర్లను కనిపెట్టగలిగే వీలు చిక్కుతోంది. ఫలితంగా ఈ వ్యాధిని ప్రారంభంలోనే కచ్చితత్వంతో నిర్థారించడం ద్వారా వ్యాధి మరింత ముదిరిపోకుండా నిలువరించడంతో పాటు, సమర్థమైన చికిత్సతో ప్రారంభంలోనే ఈ వ్యాధిని తుదముట్టించవచ్చని, క్యాన్సర్ పరిశోధక బృందానికి నాయకత్వం వహించిన డాక్టర్ నాగర్కార్ అంటున్నారు.

ఆహారంలో ఆరోగ్యం

పనసతో ప్రయోజనం



పనసలో పోషకాలకు కొదవ ఉండదు. దీన్లో ఫ్రక్టోజ్, సుక్రోజ్ మొదలైన సహజ చక్కెరలుంటాయి. త్వరిత శక్తిని అందించే వీలున్న ఈ చక్కెరలు వేసవిలో కలిగే నిస్సత్తువ నుంచి కోలుకునేలా సహాయపడతాయి. నీటి శాతం ఎక్కువగా కలిగి ఉండే పనస తొనలతో డీహైడ్రేషన్ తగ్గడంతో పాటు శరీరంలో ఎలక్ట్రొలైట్లు సమం అవుతాయి. విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా కలిగి ఉండే పనస తొనలు తినడం వల్ల వ్యాధినిరోధకశక్తి బలపడుతుంది. పనసలో పీచు ఎక్కువ కాబట్టి జీర్ణసంబంధ సమస్యలు తగ్గుతాయి.

హార్ట్ కేర్



గుండెకు గండం తగ్గిద్దాం

ఒకప్పటి గుండె చికిత్సలు అప్పటికప్పుడు ప్రాణాలు నిలబట్టడమే ధ్యేయంగా సాగేవి. కానీ ఇప్పుడు, కొన్ని దశాబ్దాల పాటు గుండె సమర్థంగా పని చేయడమే లక్ష్యంగా చికిత్సలు సాగుతున్నాయి. కాలానుగుణంగా గుండె చికిత్సలో సాధించిన ప్రగతి, ప్రతిభల గురించీ, హృద్రోగాల పట్ల అవగాహన పెంచుకోవలసిన అవసరం గురించీ సీనియర్ కార్డియోథొరాసిక్ అండ్ హార్ట్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్, స్టార్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్, డాక్టర్ గోపీచంద్ మన్నం ఏమంటున్నారో తెలుసుకుందాం!



ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు గుండె చికిత్సల్లో ఎంతో పురోభివృద్ధిని సాధించాం. చికిత్సల్లో, నైపుణ్యాల్లో ఎంతో పరిణతి పొందాం! ఒకప్పుడు బైపాస్ సర్జరీ అనగానే, వైద్యుల గుండెలు గుబగుబలాడే పరిస్థితి. పరికరాలను కొనే స్తోమత లేక రక్తంలో ఆక్సిజన్, కార్బన్‌డయాక్సైడ్, ఆమ్లం ఏ మోతాదుల్లో ఉన్నాయో తెలుసుకోకుండా, సర్జరీకి పూనుకున్న సందర్భాలు లేకపోలేదు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. బైపాస్ సర్జరీతో పాటు, ఒకటికి, రెండు, మూడు కవాటాలు మార్చడం, బృహద్ధమని, జఠరిక చికిత్సలు ఎంతో సరళతరమైపోయాయి. గుండె తీసి కృత్రిమ గుండెను అమర్చగలిగేంతగా గుండె చికిత్సల్లో పరిణతి సాధించాం! ఉదాహరణకు ఎటువంటి రుగ్మతలు లేకుండా, గుండె రక్తనాళాల్లో మూడు అవరోధాలు ఏర్పడిన వ్యక్తిని, కేవలం ఐదు శాతం ముప్పుతో, ఆ సమస్య నుంచి బయటకు తీసుకురాగలిగే పరిస్థితికి చేరుకున్నాం.

అధునాతన పరికరాలతో...


గుండె సర్జరీ విజయం, గుండె పంపింగ్ మీదే ఆధారపడి ఉంటుంది. పంపింగ్ సామర్థ్యం 65 శాతం ఉన్నప్పుడు చక్కని ఫలితాలు సాధించవచ్చు. కానీ అంతకంటే తక్కువగా 35% పంపింగ్ సామర్థ్యం ఉన్నప్పుడు బెలూన్ పంప్ ఆసరాతో గుండెకు దన్నును పెంచే దశను అందుకున్నాం. అయితే పంపింగ్ సామర్థ్యం వెనకున్న కారణాన్ని కనిపెట్టి, దాన్ని సరిదిద్దే స్థాయికి ఇప్పుడు చేరుకోగలిగాం. రక్త ప్రసరణ లోపం వల్ల గుండె మీద మచ్చ ఏర్పడినప్పుడు కూడా పంపింగ్ సామర్థ్యం దెబ్బతింటుంది. ఈ సమస్యను ఎమ్మారైలో పసిగట్టి, సరిదిద్దడం ద్వారా, బెలూన్ పంప్ ఉపయోగించే అవసరం లేకుండా, 2 నుంచి ఐదు శాతం ముప్పుతో నేడు గుండెకు చికిత్స చేయగలుగుతున్నాం. గుండె గదులకు మరమ్మతు చేసి గుండె సామర్థ్యాన్ని కూడా పెంచగలుగుతున్నాం. గుండె కొట్టుకునే క్రమంలో అవతకవకలు ఉన్నప్పుడు, ఆ సమస్యను సరిదిద్దే 'కార్డియోవెర్టర్ డిఫిబ్రిలేటర్' పరికరాలు కూడా ఇప్పుడు అందుబాటులోకొచ్చాయి. అలాగే మునుపు వాడుకలో ఉన్న రక్తకణాలు, ప్లేట్‌లెట్స్ దెబ్బతినే వీలున్న బబుల్ ఆక్సిజనేటర్లకు బదులుగా మరింత సురక్షితమైన మెంబ్రేన్ ఆక్సిజనేటర్లు కూడా నేడు వాడుకలోకొచ్చాయి.

తక్కువ కోతతో, ఎక్కువ సామర్థ్యంతో...


హార్ట్ లంగ్ యంత్రాన్ని ఉపయోగించకుండానే, గుండె కొట్టుకుంటున్నప్పుడే సర్జరీని ముగించే బైపాస్ చికిత్సా విధానం కూడా అమలవుతోంది. సాధారణంగా గుండె బైపాస్ సర్జరీలో కాలి నుంచి శిరను సేకరించి గుండె దగ్గరి ధమనికి అనుసంధానించి, దాన్ని ధమనిలా ప్రవర్తించమని ఆదేశిస్తూ ఉంటాం. కానీ ఈ క్రమంలో ఆ రక్తనాళం సామర్థ్యం తగ్గిపోయే అవకాశం ఉంటుంది. కాబట్టి ఇప్పుడు ఛాతీ వెనక ఉండే ధమనితో గుండె ధమనిని అనుసంధానించే సర్జరీలు చేస్తున్నాం. ధమనితో శిరను అనుసంధానించడానికి బదులుగా మరొక ధమనినే అనుసంధానించడం వల్ల మన్నిక పెరుగుతుంది. మధుమేహులకు ఛాతీ దగ్గరి ధమనికి బదులుగా, చేతిలోని ధమనిని వినియోగిస్తూ ఉంటాం. అలాగే పెద్ద కోత పెట్టే అవసరం లేకుండా ఎండోస్కోపీ ద్వారా రెండు చిన్న రంధ్రాలతో ధమనిని సేకరిస్తున్నాం. దీంతో కోలుకునే సమయం, నొప్పి, ఇన్‌ఫెక్షన్ అవకాశాలు కూడా తగ్గిపోతున్నాయి. పెరిగే వయసుతో పాటు కవాటాలు కూడా ఇరుకుగా మారి, పూడుకుపోతూ ఉంటాయి. ఇలాంటి సందర్భాల్లో ఈ కవాటాలు చీరుకుపోతూ ఉంటాయి. ఇలాంటప్పుడు కృత్రిమ కవాటాలను అమర్చవలసి వస్తుంది. ఇందుకోసం ఛాతీ ఎముకను కోసే అవసరం లేకుండా, పక్కటెముకల మధ్య ఉన్న జాగా ద్వారా సర్జరీని ముగించే వెలుసుబాట్లు అందుబాటులో ఉన్నాయి. దీంతో రోగి కోలుకునే సమయం తగ్గిపోతోంది. కోత తాలూకు మచ్చలు కూడా ఎబ్బెట్టుగా కనిపించవు. అలాగే కృత్రిమ కావాటాల పరంగా కూడా ఎంతో అభివృద్ధిని సాధించాం. ప్రస్తుతం లోహపు కవాటాలు, కణజాల కవాటాలు వాడుకలోకొచ్చాయి. రెండు లీఫ్స్ కలిగిన లోహపు కవాటాలతో పాటు ఆవు గుండె పైపొరను ఒక కణజాల కవాట పొరగా కుట్టి వాడుకుంటున్నాం. వీటి మీద క్యాల్షియం పేరుకుపోకుండా ఆ పరిస్థితిని నియంత్రించే సాంకేతికతలు కూడా అందుబాటులోకొచ్చాయి. వీటితో గుండె కృత్రిమ కవాటాల ఆయుష్షు 20 ఏళ్లకు పెరిగింది. రెండోసారి, మూడోసారి గుండె సర్జరీలు చేయడం కూడా సులభతరం అయిపోయింది.

లక్షణాలు ఉన్నా, లేకున్నా...

వ్యాధిని అర్థం చేసుకునే తీరు మారడంతో, చికిత్స తర్వాత ఆ వ్యాధి తిరగబెట్టకుండా నియంత్రించే మార్గాలను కనిపెట్టగలుగుతున్నాం. సాధారణంగా గుండె చికిత్స తదనంతరం, సమస్య పూర్తిగా పరిష్కారమైపోయిందని నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించేస్తూ ఉంటారు. కానీ ఇది సరికాదు. అప్పటికి సమస్యను సరిదిద్దినా, ముప్పు ఎప్పటికీ



పొంచి ఉంటుందని ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోవాలి. కాబట్టి గుండెకు ముప్పు తెచ్చిపెట్టే అలవాట్లను మానుకోవాలి. గుండె సమస్య లక్షణాలు ప్రత్యేకంగా ఉండవు. ఛాతీలో అసౌకర్యం, శ్వాస ఇబ్బందిగా మారడం లాంటి లక్షణాలు గుండె సమస్యను చెప్పకనే చెప్తూ ఉంటాయి. అయినా వాటిని వేరొక ఆరోగ్య సమస్యతో ముడిపెట్టేవాళ్లే ఎక్కువ. 'ఆరోగ్యంగానే ఉన్నాను కాబట్టి నాకు గుండె జబ్బు ఎందుకొస్తుంది?' అనే ధీమా కూడా అందర్లో ఉంటోంది. వ్యాధి నిర్ధారణ అయినప్పుడు, 'నిన్నటి వరకూ బాగానే ఉన్నాను, ఇంత హఠాత్తుగా గుండె దెబ్బతినడం ఏంటి?' అని ఆశ్చర్యపోయేవాళ్లూ ఉంటారు. కానీ గుండె జబ్బు ఎవరికైనా, ఎప్పుడైనా రావచ్చు. కాబట్టి 40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఎలాంటి లక్షణాలతో పని లేకుండా, ఏడాదికోసారి గుండె పరీక్షలు చేయించుకోవాలి. ముప్పు ఎక్కువగా ఉన్నవాళ్లు 35 ఏళ్ల నుంచే అప్రమత్తంగా ఉండాలి. ఇసిజితోనే గుండెజబ్బును పసిగట్టే వీలుంది. కాబట్టి సరళమైన ఆ పరీక్షతో గుండె ఆరోగ్యాన్ని పరీక్షించుకోవడం అత్యవసరం.



కుటుంబ చరిత్రలో గుండె జబ్బులున్నవారు, మిగతా వారితో పోలిస్తే ఐదు రెట్లు గుండెజబ్బుల ముప్పును కలిగి ఉంటారు. అధిక రక్తపోటు, మధుమేహం ఉన్నవాళ్లకు గుండె జబ్బుల ముప్పు ఎక్కువ. అలాగే మద్యపానం, ధూమపానం దురలవాట్లు ఉన్న వాళ్లకు కూడా గుండెజబ్బులొచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అలాగే కొందరి కుటుంబాల్లో అధిక కొలెస్ట్రాల్ సమస్య ఉంటుంది. వీళ్లు కూడా అప్రమత్తంగా ఉండాలి.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- ప్రతి ఒక్కరికీ గుండె జబ్బు ముప్పు ఉంటుంది. ప్రధానంగా అందరూ ఈ విషయాన్ని గ్రహించాలి
- ఛాతీలో ఎలాంటి అసౌకర్యం కలిగినా, అది ఏ కారణం వల్ల తలెత్తినా, గుండె జబ్బుగా, తీవ్రంగానే పరిగణించాలి
- దురలవాట్లు, ఒత్తిడి, అస్తవ్యస్థ జీవనశైలి, ఆహారపుటలవాట్లు, కుటుంబ చరిత్ర... వీటితో గుండె దెబ్బతినక ముందే గుండెను క్షేమంగా ఉంచే అలవాట్లు ఏర్పరుచుకోవాలి
- వారంలో కనీసం ఐదు రోజులు కనీసం గంట పాటైనా వ్యాయామం చేయాలి
- సమతులాహారం తీసుకోవాలి
- జవాబుతారీ భాగస్వామిని ఏర్పరుచుకుని, వ్యాయామ ప్రేరణ పొందాలి
- 40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ప్రతి ఏడాదీ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి
- గుండెజబ్బుల ముప్పు ఉన్నవాళ్లు 35 ఏళ్ల నుంచే ఆరోగ్య పరీక్షలు మొదలుపెట్టాలి
- మధుమేహం, అధిక రక్తపోటులను అదుపులో ఉంచుకోవాలి
- అధిక బరువు తగ్గించుకోవాలి

పైబడే వయసుతో వేధించే నాడీసంబంధ రుగ్మతల్లో పార్కిన్సన్స్ ఒకటి. పెద్దలను వేధించే ఈ వ్యాధి, చికిత్సల గురించి వైద్యులు ఇలా వివరిస్తున్నారు.

వదలని వణుకు

ప్రధానంగా డోపమైన్ హార్మోన్‌ను ఉత్పత్తి చేసే మెదడులోని నడీకణాల క్షీణతతో ఈ నాడీ రుగ్మత తలెత్తుతుంది. మెదడులో ఉత్పత్తయ్యే డోపమైన్ అనే న్యూరోట్రాన్స్‌మిటర్ కండరాల కదలికలను నియంత్రించే సంకేతాల సరఫరాకు సహాయపడుతుంది. ఈ నాడీకణాలు దెబ్బతిన్నప్పుడు, శరీర కదలికలను సమన్వయపరిచే, నియంత్రించే మెదడు సామర్థ్యం కుంటుపడుతుంది. దాంతో కొన్ని లక్షణాలు ప్రస్ఫుటంగా కనిపించడం మొదలుపెడతాయి. అవేంటంటే...

కదలికలతో సంబంధం ఉన్న లక్షణాలు

పార్కిన్సన్స్ వ్యాధి ప్రారంభంలో ఈ లక్షణాలు కనిపిస్తాయి. దశలు దాటేకొద్దీ లక్షణాల తీవ్రత కూడా పెరుగుతుంది. అయితే లక్షణాల తీవ్రత పెరిగే వేగం వ్యక్తుల్లో

పార్కిన్సన్స్



శరీరంలో అప్రమేయంగా చోటుచేసుకునే వణుకు ఇది. ఒక చేతిలో, కాలు లేదా వేలిలో మొదలవుతుంది. కొందర్లో విశ్రాంతిలో ఉన్న సమయంలో వణుకు కనిపిస్తుంది

భిన్నంగా ఉంటుంది. లక్షణాలు ఏవంటే...

- **వణుకు:** అప్రమేయంగా చోటుచేసుకునే కదలికలు ఇవి. ఒక చేతిలో, కాలు లేదా వేలిలో మొదలవుతాయి. కొందర్లో విశ్రాంతిలో ఉన్న సమయంలో కదలికలు కనిపిస్తాయి.
- **బ్రాడీకైనీసియా:** కదలికలు క్రమేపీ తగ్గిపోయే పరిస్థితి ఇది. ఎంతో సులభమైన పనులు కూడా చేసుకోలేని స్థితి ఇది. చొక్కాకు గుండీలు పెట్టుకోవడం, నడవడం లాంటి సులభమైన పనులు కూడా కష్టంగా మారి ఎక్కువ సమయం తీసుకుంటూ ఉంటాయి.
- **బిగుసుకుపోవడం:** కండరాలు, ప్రత్యేకించి చేతులు, కాళ్లు, మెడ పట్టుకుపోతాయి. పార్కిన్సన్ రోగుల్లో అత్యంత సాధారణ లక్షణమిది. ఈ ఇబ్బంది నొప్పికి దారి తీస్తుంది. కదలికలు తగ్గిపోతాయి. రోజువారీ పనులు చేసుకోవడం కష్టమైపోతుంది
- **భంగిమ:** వ్యాధి ముదిరేకొద్దీ, ఈ రోగులు సంతులనం కోల్పోతారు. దాంతో నడుస్తూ పడిపోవడం, నిలబడినప్పుడు ముందుకు లేదా వెనకకు ఒరిగిపోతూ ఉంటారు
- **నడక:** అడుగుల మధ్య దూరం తగ్గిపోయి, చిన్న చిన్న అడుగులు వేస్తూ ఉంటారు. నడిచేటప్పుడు చేతుల కదలికలు కూడా తగ్గిపోతాయి

కదలికలతో సంబంధం లేని లక్షణాలు

కదలికలతో సంబంధం లేని లక్షణాలు గుంభనంగా జీవన నాణ్యతను దెబ్బతీస్తాయి. ఈ లక్షణాలు ఏవంటే...

- **మెదడు సామర్థ్యం సన్నగిల్లడం:** జ్ఞాపకశక్తి సమస్యలు, ఏకాగ్రత నిలపలేకపోవడం, ఆలోచనలు నెమ్మదించడం
- **కుంగుబాటు:** మెదడులోని రసాయనాలు క్రమం తప్పడం వల్ల మానసిక భావోద్వేగాల మీద అదుపు కోల్పోవడం, కుంగుబాటు, ఆందోళనలు వేధిస్తాయి
- **నిద్రలేమి:** నిద్రలేమి, రాత్రివేళ తరచూ నిద్ర మెలకువ అయిపోవడం, రెస్ట్‌లెస్ లెగ్ సిండ్రోమ్, పీడకలలు వేధిస్తూ ఉంటాయి.
- **జీవక్రియలు:** రక్తపోటు నియంత్రణ, జీర్ణశక్తి, చమట పట్టడం లాంటి జీవక్రియలు కూడా క్రమం తప్పుతాయి. నిలబడినప్పుడు రక్తపోటు పడిపోవడం, మలబద్ధకం లేదా అధిక లాలాజలం లాంటి సమస్యలు కూడా వేధిస్తాయి.
- **మాట, మింగుడు సమస్యలు:** ఈ వ్యాధి కండరాలను దెబ్బతీస్తుంది కాబట్టి మాట్లాడడానికీ, మింగడానికీ తోడ్పడే కండరాలు ప్రభావితమై, మాట బొంగురుగా మారుతుంది. పదాలను కూర్చడం కష్టమవుతుంది. మింగడంలో ఇబ్బందులను ఎదుర్కోవడం వల్ల అంతిమంగా ఆహారం గొంతులో అడ్డుపడే పరిస్థితి తలెత్తే ప్రమాదం ఉంటుంది.

వ్యాధి నిర్ధారణ

పార్కిన్సన్స్‌ను నిర్ధారించే ఏకైక పరీక్ష అంటూ ఏదీ లేదు. వైద్య చరిత్ర, భౌతిక పరీక్షలతోనే ఈ వ్యాధిని నిర్ధారించాల్సి ఉంటుంది. ఈ లక్షణాలకు ఇతరత్రా రుగ్మతలను కారణం కాదని నిర్ధారించుకోవడం కోసం ఎమ్మారై లేదా సిటి స్కాన్‌లు అవసరమవుతాయి.

చికిత్స ఇలా...

ఈ రుగ్మతను పూర్తిగా నయం చేసే చికిత్సలేవీ లేకపోయినప్పటికీ, లక్షణాలనూ, వ్యాధి పురోగతినీ నెమ్మదించి, జీవన నాణ్యతను పెంచే మందులు, థెరపీలు, సర్జరీలు అందుబాటులో ఉన్నాయి.

- **లెవొడొపా:** ఈ మందు మెదడులో డోపమైన్‌గా మారుతుంది. ఇది వణుకును తగ్గిస్తుంది.
- **డొపమైన్ ఎగోనిస్ట్స్:** ఈ మందులు మెదడులోని డోపమైన్‌ను అనుకరిస్తాయి. పార్కిన్సన్స్ ప్రారంభ దశలో లేదా లెవొడొపాకు అదనంగా ఈ మందులు వాడుకోవాల్సి ఉంటుంది.
- **ఎమ్‌ఎఒ-బి ఇన్హిబిటర్స్:** మెదడులో డోపమైన్ విచ్ఛిన్నమైపోకుండా నివారిస్తుంది. దీన్ని కూడా లెవొడోపాతో కలిపి వాడుకోవాలి
- **సిఒఎమ్‌టి ఇన్హిబిటర్స్:** ఈ మందులు లెవొడొపా ప్రభావాన్ని పెంచుతాయి
- **అమాంటడీన్, యాంటీకోలినెర్జిక్స్:** వణుకు, బిగదీసుకుపోవడం లాంటి లక్షణాలు తగ్గుముఖం పడతాయి.



డాక్టర్ రూపమ్ బోర్గోహైన్
సీనియర్ న్యూరాలజిస్ట్ అండ్ డైరెక్టర్,
పార్కిన్సన్స్ డిసీజ్ అండ్ మూవ్‌మెంట్ డిజార్డర్ రీసెర్చ్ సెంటర్,
యశోద హాస్పిటల్స్, హైటెక్ సిటీ,
హైదరాబాద్

పరిశోధన

ఈ నూనెలతో రొమ్ము క్యాన్సర్

వృక్షాధారిత నూనెలను విపరీతంగా ఉపయోగించడం వల్ల ఇన్‌ఫ్లమేషన్ పెరిగి, రొమ్ము క్యాన్సర్ ముప్పు పెరుగుతుందని ఒక కొత్త పరిశోధనలో తేలింది. వివరాలు తెలుసుకుందాం!

వృక్షాధారిత నూనెల్లో ఉండే లినోలిక్ ఆమ్లం రొమ్ము క్యాన్సర్ కణాల పెరుగుదలకు తోడ్పడుతుందని న్యూయార్క్‌లోని వీల్ కార్నెల్ మెడికల్ స్కూల్ పరిశోధనలో తేలింది. సాధారణ క్యాన్సర్లతో పోల్చితే, లినోలిక్ ఆమ్లం కారక రొమ్ము క్యాన్సర్ వేగంగా విస్తరించడంతో పాటు, ఈ క్యాన్సర్‌తో ప్రాణాలతో బయటపడే అవకాశాలు కూడా తక్కువగా ఉంటాయని ఈ మెడికల్ స్కూల్ చేపట్టిన పరిశోధనలో వెల్లడైంది. ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్ అయిన లినోలిక్ ఆమ్లం, సోయాబీన్, పొద్దుతిరుగుడు నూనెలతో పాటు, పోర్క్‌లో కూడా ఉంటుంది. ఈ ఆమ్లం చికిత్సకు లొంగని ట్రిపుల్ నెగిటివ్ రొమ్ము క్యాన్సర్ పెరుగుదలను ప్రోత్సహిస్తుందని పరిశోధకులు కనిపెట్టారు. ఈ పరిశోధన, ఆహార



కొవ్వులు, క్యాన్సర్ల మధ్య సంబంధాన్ని స్పష్టం చేయడానికి సహాయపడడమే కాకుండా, నిర్దిష్ట పోషకాహారం నుంచి క్యాన్సర్ రోగులు అదనపు ప్రయోజనాన్ని ఎలా పొందవచ్చో తెలుపుతుంది.

అప్రమత్తం

మామిడి పండ్లు కొంటున్నారా?

ఇది మామిడి పండ్ల సీజన్. ఎక్కడ చూసినా నోరూరించే మామిడి పండ్లే కంటపడుతూ ఉంటాయి. అలాంటప్పుడు వాటిని తినకుండా ఉండలేం! అయితే ఆ పండ్లు సహజసిద్ధంగా పండినవేనా? లేదంటే అందుకోసం రసాయనాలను ఉపయోగించారా? ఎలా తెలుసుకోవాలి?

మామిడి పండ్లను మగ్గించడం కోసం క్యాల్షియం కార్బైడ్ అనే రసాయనాన్ని ఉపయోగిస్తూ ఉంటారు. ఈ రసాయనం ఆరోగ్యానికి హానికరం. కాబట్టి ఆ రసాయనం ఆనవాళ్లను ఇలా కనిపెట్టాలి. క్యాల్షియం కార్బైడ్ ఉపయోగించిన మగ్గించిన మామిడి పండ్లు, మొత్తంగా ముదురు పసుపురంగులో ఉంటాయి. వాటి పైన ఆకుపచ్చ రంగు అక్కడక్కడా ఉంటుంది. లేదంటే ఎక్కడా కనిపించదు. సహజసిద్ధంగా పండిన మామిడి పండ్లు తొడిమ దగ్గర తీపి వాసన వెదజల్లుతాయి. కానీ కృత్రిమంగా పండించినవి సింథటిక్ వాసన వెలువరిస్తాయి. అరమగ్గినట్టు కనిపిస్తున్నా, తాకినప్పుడు మరీ మెత్తగా ఉంటే, అవి క్యాల్షియం కార్బైడ్‌తో పండించినవి అని అర్థం. మామిడి పండులో ఒక భాగం పండిపోయి, మెత్తగా ఉండి, మిగతా పండంతా గట్టిగా ఉన్నా ఇలాగే అర్థం చేసుకోవాలి. తెలుపు లేదా బూడిదరంగులోని పొడి పండ్ల మీద పైపొరగా పరుచుకుని ఉన్నా, ఆ పండ్లను అనుమానించాలి. పండ్ల



మీద ముడతలు ఉన్నా, కృత్రిమంగా పండించినట్టు అనుమానించాలి. క్యాల్షియం కార్బైడ్‌తో నోరు, చర్మం, గొంతు మండుతాయి. ఎక్కువ పరిమాణాల్లో తీసుకున్నప్పుడు తలతిరుగుతుంది. కాబట్టి ఇలాంటి దుష్ప్రభావాలకు దూరంగా ఉండాలంటే, సహజసిద్ధంగా మగ్గించిన మామిడి పండ్లనే ఎంచుకోవాలి.

హాయర్ ఇండియాపై అంబానీ ఆసక్తి



రేసులో సునీల్ మిట్టల్, బర్మన్లు సైతం..

న్యూఢిల్లీ: హాయర్ ఇండియాలో వాటా కొనుగోలు చేసేందుకు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) కూడా బరిలోకి దిగినట్లు తెలిసింది. చైనాకు చెందిన కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల తయారీ దిగ్గజం హాయర్ భారత అనుబంధ విభాగమే హాయర్ ఇండియా. ప్రస్తుతం హాయర్ తన భారత వ్యాపారంలో స్థానిక భాగస్వామిని చేర్చుకునేందుకు 51 శాతం వరకు వాటా విక్రయించాలని చూస్తోంది. ఈ డీల్‌లో భాగంగా కంపెనీ విలువను 200-230 కోట్ల డాలర్ల (రూ.17,000 -19,550 కోట్లు) స్థాయిలో లెక్కగట్టే అవకాశం ఉంది. కాగా, హాయర్ ఇండియాలో వాటాను దక్కించుకునేందుకు అంబానీతో పాటు భారతీ ఎయిర్‌టెల్ ఛైర్మన్ సునీల్ మిట్టల్, డాబర్ ప్రమోటర్లైన బర్మన్ల కుటుంబం, అమిత్ జాతియా, టీకే గోయెంకా కూడా పోటీలో ఉన్నట్లు సమాచారం. టీవీ, ఏసీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మెషీన్, వాటర్ హీటర్, మైక్రోవేవ్ ఓవెన్ తదితర ఉత్పత్తులను విక్రయిస్తున్న హాయర్ ఇండియా గత ఏడాది రూ.8,900 కోట్ల విక్రయాలను నమోదు చేసింది. ఈ ఏడాదిలో విక్రయాలు రూ.11,500 కోట్లకు పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది.

రిలయన్స్ జోరు.. మార్కెట్లో హుషారు

సెన్సెక్స్ 1,006 పాయింట్లు అప్
5.27% పెరిగిన ఆర్ఐఎల్ షేరు



మళ్లీ 80,000 ఎగువకు సూచీ

రూ.93,000 కోట్లు పెరిగిన ఆర్ఐఎల్ విలువ

ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు సోమవారం భారీగా లాభపడ్డాయి. భారత్-పాక్ సరిహద్దుల్లో ఉద్రిక్తతల కారణంగా గత వారాంతంలో ఏర్పడిన నష్టాలను పూర్తిగా పూడ్చుకోగలిగాయి. సెన్సెక్స్ 1,005.84 పాయింట్లు (1.27 శాతం) ఎగబాకి 80,218.37 వద్దకు చేరగా.. నిఫ్టీ 289.15 పాయింట్లు (1.20 శాతం) వృద్ధితో 24,328.50 వద్ద ముగిసింది. అంచనాలను మించిన ఆర్థిక ఫలితాలు ప్రకటించిన రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్)తో పాటు బ్యాంకింగ్, ఫార్మా, ఎనర్జీ, ఆటో రంగ షేర్లలో మదుపరులు భారీగా కొనుగోళ్లు జరపడం ఇందుకు దోహదపడింది. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల(ఎఫ్ఐఐ) పెట్టుబడులు కొనసాగడమూ మార్కెట్‌కు కలిసివచ్చింది. ఈ అనూహ్య ర్యాలీలో ఈక్విటీ మదుపరుల సంపదగా భావించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.4.52 లక్షల కోట్లు పెరిగి రూ.426.10 లక్షల కోట్ల(5 లక్షల కోట్ల డాలర్లు)కు చేరింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 23 రాణించాయి. మార్కెట్ దిగ్గజం ఆర్ఐఎల్ షేరు ఏకంగా 5.27 శాతం ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. సన్‌ఫార్మా 3.08 శాతం లాభపడగా.. టాటా స్టీల్, ఎం అండ్ ఎం, ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంక్, టాటా మోటార్స్ షేర్లు 2 శాతానికి పైగా పెరిగాయి. హెచ్‌సీఎల్ టెక్, అల్ట్రాటెక్ సిమెంట్ మాత్రం ఒక శాతానికి పైగా నష్టపోయాయి.

బీఎస్ఈలోని మిడ్‌క్యాప్ సూచీ 1.34 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.39 శాతం వృద్ధి నమోదు చేశాయి. రంగాలవారీ సూచీల్లో ఎనర్జీ 3.02 శాతం లాభపడింది. ఆయిల్ అండ్ గ్యాస్ 2.90 శాతం పెరిగింది. క్యాపిటల్ గూడ్స్, హెల్త్‌కేర్, మెటల్, బ్యాంకెక్స్, రియల్టీ సూచీలు 1.93 శాతం వరకు పెరిగాయి. ఐటీ, ఫోకస్డ్ ఐటీ ఇండెక్స్ మాత్రం నేలచూపులు చూశాయి.

సెన్సెక్స్‌లో అత్యధిక వెయిటేజీ కలిగిన ఆర్ఐఎల్ షేరు 5 శాతానికి పైగా పుంజుకోవడంతో కంపెనీ మార్కెట్ విలువ ఒక్క రోజులోనే రూ.92,629 కోట్లు పెరిగి దాదాపు రూ.18.52 లక్షల కోట్లకు చేరుకుంది. 2024 జూన్ 3 తర్వాత ఆర్ఐఎల్ షేరుకిదే అతిపెద్ద ఒక్కరోజు లాభం. ఈ మార్చితో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ మెరుగైన లాభాలు ప్రకటించడం ఇందుకు తోడ్పడింది.

ఎల్‌జీ ఇష్యూ వాయిదా

దక్షిణ కొరియా ఎలక్ట్రానిక్స్ దిగ్గజం ఎల్‌జీ తన భారత అనుబంధ విభాగమైన ఎల్‌జీ ఇండియా ఐపీఓను వాయిదా వేసుకున్నట్లు ఇండస్ట్రీ వర్గాలు తెలిపాయి. వచ్చే నెల రెండో వారంలో ఇష్యూను ప్రారంభించాలని కంపెనీ భావించినప్పటికీ, స్టాక్ మార్కెట్లో ఒడుదుడుకుల నేపథ్యంలో కనీసం 3 నెలలు ఆగాలని నిర్ణయించుకున్నట్లు ఆ వర్గాలు వెల్లడించాయి.

వచ్చే ఏడాది భారత మార్కెట్లోకి డెంగ్యూ వ్యాక్సిన్

క్యూడెంగా పేరుతో అందుబాటులోకి

'బయోలాజికల్-ఈ'తో కలిసి విడుదల చేయనున్న తకెడా ఫార్మా

ముంబై: వచ్చే ఏడాది కల్లా భారత మార్కెట్లోకి డెంగ్యూ వ్యాక్సిన్ అందుబాటులోకి రానుంది. జపాన్‌కు చెందిన తకెడా ఫార్మాస్యూటికల్స్.. హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే 'బయోలాజికల్ ఈ (బీఈ)'తో కలిసి 'క్యూడెంగా' పేరుతో ఈ వ్యాక్సిన్‌ను మన దేశంలో తయారు చేసి మార్కెట్ చేయనుంది. తకెడా ఫార్మా ఉన్నతాధికారి ఒకరు ఈ విషయం వెల్లడించారు. కంపెనీ ప్రస్తుతం మనుషులపై ఈ వ్యాక్సిన్ ప్రభావాన్ని పరీక్షిస్తోంది. ఈ పరీక్షలు పూర్తయిన వెంటనే భారత్‌తో పాటు 40కిపైగా దేశాల్లో ఈ వ్యాక్సిన్ అందుబాటులోకి రానుంది. మూడు నెలల విరామంతో రెండు డోసులు ఈ వ్యాక్సిన్ తీసుకుంటే డెంగ్యూ రాకుండా అడ్డుకోవచ్చని తకెడా చెబుతోంది. ఇప్పటికే ప్రయోగాత్మకంగా కోటి డోసుల వ్యాక్సిన్ తయారు చేసి వివిధ దేశాలకు సరఫరా చేసింది. మనుషులపై ప్రయోగాలు పూర్తయిన తర్వాత తాను ఉత్పత్తి చేసే ఈ వ్యాక్సిన్‌లో సగ భాగం బీఈ ద్వారా తయారు చేయించాలని తకెడా భావిస్తున్నట్టు సమాచారం.

విమ్టా ల్యాబ్స్ 1:1 బోనస్ ఇష్యూ

క్యూ4 లాభం రూ.18 కోట్లు

బయోలాజిక్స్ కాంట్రాక్ట్ ఆర్ అండ్ డీలోకి అడుగు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): విమ్టా ల్యాబ్స్.. వాటాదారులకు 1:1 నిష్పత్తిలో బోనస్ షేర్లు జారీ చేస్తున్నట్లు ప్రకటించింది. అర్హులైన వాటాదారులందరికి రూ.2 ముఖ విలువతో కూడిన ప్రతి షేరుకు ఒక షేరును జారీ చేయనున్నట్లు వెల్లడించింది. కంపెనీ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం)లో వాటాదారుల అనుమతికి లోబడి ఈ షేర్ల జారీ ఉంటుందని తెలిపింది. కాగా గడచిన ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన చివరి త్రైమాసికం (క్యూ4)లో కంపెనీ రూ.96.1 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.18.3 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. మార్చితో ముగిసిన పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను రూ.348.20 కోట్ల ఆదాయంపై రూ.66.8 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో రూ.2 ముఖ విలువతో కూడిన ప్రతి షేరుకు రూ.2 తుది డివిడెండ్‌ను డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది. కాగా కార్యకలాపాల విస్తరణలో భాగంగా బయోలాజిక్స్ కాంట్రాక్ట్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్ అండ్ డీ)లోకి అడుగుపెడుతున్నట్లు విమ్టా ల్యాబ్స్ ప్రకటించింది. నోవెల్ బయోలాజిక్ ఎంటిటీస్, బయోసిమిలర్స్, పెప్టైడ్ ఆధారిత థెరాప్యూటిక్స్‌పై ఈ విభాగం దృష్టి పెడుతుందని తెలిపింది.

సనోఫీతో డాక్టర్ రెడ్డీస్ భాగస్వామ్యం విస్తరణ

త్వరలో మార్కెట్లోకి బేఫోర్టస్ ఔషధం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సనోఫీ హెల్త్‌కేర్‌తో తమ భాగస్వామ్య ఒప్పందాన్ని మరింత విస్తరించినట్లు డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ ప్రకటించింది. తాజా నిర్ణయంతో శిశువుల్లో ఏర్పడే శ్వాసకోశ సంబంధిత వ్యాధి నివారణలో ఉపయోగించే సరికొత్త ఔషధం భారత మార్కెట్లో ప్రవేశపెట్టే అవకాశం తమకు కలిగిందని డాక్టర్ రెడ్డీస్ వెల్లడించింది. బేఫోర్టస్ పేరుతో ఈ ఔషధాన్ని ప్రీ ఫిల్డ్ ఇంజెక్షన్ రూపంలో విడుదల చేయనున్నట్టు తెలిపింది. ఈ ఔషధాన్ని ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో విడుదల చేసే ఆస్కారం ఉందని, గరిష్ఠంగా 24 నెలల వయసు గల చిన్నారుల వరకు అందరికీ ఈ ఔషధాన్ని వినియోగించవచ్చని పేర్కొంది. ఈ ఒప్పందంతో భారత్‌లో బేఫోర్టస్ ఔషధాన్ని పంపిణీ చేసేందుకు తమకు ప్రత్యేక హక్కులు లభిస్తాయని డాక్టర్ రెడ్డీస్ బ్రాండెడ్ మార్కెట్స్ విభాగం సీఈఓ ఎంవీ రమణ తెలిపారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



29వ తేదీ			
హైదరాబాద్	420	విజయవాడ	435
వరంగల్	422	గోదావరి	420
చిత్తూరు	473	విశాఖపట్నం	430
		డజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — పెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	125	విజయవాడ	127
వరంగల్	125	గుంటూరు	125
కరీంనగర్	125	ఒంగోలు	125
మహబూబ్‌నగర్	125	చిత్తూరు	82
కర్నూలు	125	నెల్లూరు	87
విశాఖపట్నం	121	అనంతపురం	87
గోదావరి	127		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	97,530 ▼	89,400 ▼	1,11,000 ▲
విజయవాడ	98,300 ▼	92,200 ▼	99,300 ▼
విశాఖపట్నం	98,340 ▲	89,400 ▼	1,11,000 ▼
రాజమండ్రి	97,530 ▼	89,400 ▼	99,300 ▼
ప్రొద్దుటూరు	97,500 ▲	89,710 ▲	99,000 ▼
ముంబై	95,108 ▼	87,119 ▼	96,426 ▼

యూకో బ్యాంక్ లాభంలో 24% వృద్ధి

క్యూ4లో రూ.666 కోట్లు

కోల్‌కతా: ప్రభుత్వ రంగంలోని యూకో బ్యాంక్ మార్చితో ముగిసిన 2024-25 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.665.72 కోట్ల నికర లాభం ఆర్జించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.537.86 కోట్ల లాభంతో పోల్చితే ఇది 24 శాతం అధికం. త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం ఆదాయం రూ.6,984 కోట్ల నుంచి రూ.8,136 కోట్లకు పెరిగింది. కాగా మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను కన్సాలిడేటెడ్ లాభం రూ.1,671 కోట్ల నుంచి రూ.2,468 కోట్లకు పెరిగినట్టు బ్యాంక్ ప్రకటించింది. మార్చి నాటికి స్థూల మొండి బకాయిలు (ఎన్‌పీఏ) 3.46% నుంచి 2.69 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.89% నుంచి 0.50 శాతానికి తగ్గాయి. ప్రొవిజన్ కవరేజీ నిష్పత్తి 96.69 శాతంగా ఉంది. వార్షిక ప్రాతిపదికన బ్యాంక్ మొత్తం వ్యాపారం 14.12% పెరిగి రూ.5,13,527 కోట్లకు చేరింది. రుణాలు 17.72% వృద్ధితో రూ.2,19,985 కోట్లకు చేరగా డిపాజిట్లు 11.56% వృద్ధితో రూ.2,93,542 కోట్లుగా నమోదయ్యాయి. రిటైల్, వ్యవసాయం, ఎంఎస్ఎంఈ విభాగంలో రుణాలు 25.74% వృద్ధితో రూ.1,22,613 కోట్లకు చేరాయి.



75 శాతానికి ప్రభుత్వ వాటా తగ్గింపుపై కసరత్తు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో 270 కోట్ల ఈక్విటీ షేర్లు జారీ చేయాలని యూకో బ్యాంక్ ప్రణాళికలు రచిస్తోంది. సెబీ నిబంధనలకు అనుగుణంగా బ్యాంకులో ప్రభుత్వ వాటా 75 శాతానికి తగ్గించుకునేందుకు ఈ తాజా ఈక్విటీ షేర్లు జారీ చేయనున్నట్టు బ్యాంక్ ఎండీ, సీఈఓ అశ్వనీ కుమార్ తెలిపారు. ప్రస్తుత బ్యాంక్ షేరు విలువ రూ.31ని పరిగణనలోకి తీసుకుంటే మొత్తం ఇష్యూ సైజు రూ.8,000 కోట్లుగా ఉండనుంది. మార్చి త్రైమాసికంలో బ్యాంక్.. క్యూఐపీ విధానంలో రూ.2,000 కోట్లు సమీకరించింది. దీంతో ప్రభుత్వ వాటా 95.39 శాతం నుంచి 90.95 శాతానికి దిగివచ్చింది.

క్యూ1లో కొలువుల మార్కెట్ భళా

మహిళల నుంచి భారీగా దరఖాస్తులు: అప్నా

న్యూఢిల్లీ: దేశంలో ఉద్యోగ మార్కెట్ గాడిన పడుతోంది. ఈ ఏడాది మార్చితో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో తమ పోర్టల్‌లో 1.81 కోట్ల మంది అభ్యర్థులు ఉద్యోగాల కోసం తమ రెస్యూమ్స్ పోస్టు చేసినట్టు 'ఇండియా ఎట్ వర్క్- క్యూ1 2025' పేరుతో విడుదల చేసిన ఒక నివేదికలో అప్నా జాబ్స్ పోర్టల్ తెలిపింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 30 శాతం ఎక్కువ. గత త్రైమాసికంలో అప్నా పోర్టల్‌కు వచ్చిన రెస్యూమ్స్‌లో 62 లక్షలు మహిళల నుంచి వచ్చాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 23 శాతం ఎక్కువ. కంపెనీలు అనుసరిస్తున్న ఫ్లెక్సిబుల్ వర్క్, నియామకాల్లో స్త్రీలకూ సమాన అవకాశాలు కల్పించడం, బీపీఓ, ఫైనాన్స్, హెచ్ఆర్ రంగాల్లో మహిళలకు పెరుగుతున్న అవకాశాలు ఇందుకు ప్రధాన కారణం.

భారత్‌లో యాపిల్ యాప్ స్టోర్ హవా

న్యూఢిల్లీ: గడిచిన కొన్నేళ్లలో భారత్‌లో యాపిల్ ఐఫోన్లతో పాటు యాపిల్ యాప్ స్టోర్ సేవల వినియోగం గణనీయంగా పెరిగింది. గత ఏడాది యాపిల్ యాప్ స్టోర్ ద్వారా భారత్‌లో ఏకంగా రూ.44,447 కోట్ల (531 కోట్ల డాలర్లు) విలువైన డెవలపర్స్ బిల్లింగ్స్, విక్రయాలు జరిగాయి. అందులో 94 శాతానికి పైగా ఆదాయం డెవలపర్లు, వ్యాపారులకే సమకూరిందని, పైగా అది యాపిల్‌కు ఎలాంటి కమీషన్ చెల్లించాల్సిన అవసరం లేని రాబడి అని యాపిల్ పేర్కొంది.



రాష్ట్రపతి భవన్‌లో సోమవారం జరిగిన పద్మ అవార్డుల ప్రదాన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా పద్మ భూషణ్, పద్మ శ్రీ అవార్డులను అందుకుంటున్న భారత హాకీ మాజీ గోల్‌కీపర్ శ్రీజేష్, క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్

మనోళ్లు 21 మంది

బాక్సింగ్ పసిడి పోరుకు

అమ్మాన్ (జోర్డాన్): జూనియర్ ఆసియా చాంపియన్‌షిప్స్‌లో భారత బాక్సర్లు దుమ్ము రేపుతున్నారు. ఆరుగురు మహిళలు సహా మొత్తం ఏడుగురు బాక్సర్లు అండర్-17 ఫైనల్స్‌లో అడుగుపెట్టారు. ఈ చాంపియన్‌షిప్స్‌లో భారత్ ఇప్పటికే 43 పతకాలు ఖాయం చేసుకోగా అండర్-15, అండర్-17 విభాగాలలో 21 మంది బాక్సర్లు స్వర్ణం కోసం తలపడనున్నారు. అండర్-17 మహిళల కేటగిరీలో అహాన శర్మ (50కి.), ఖుషి చంద్ (44-46కి.), జన్నత్ (54కి.), సిమ్రన్‌జీత్ కౌర్ (60కి.), హరిస్కా (63కి.), అన్షిక (80+కి.) ఫైనల్లో ప్రవేశించారు. పురుషుల అండర్- 17 కేటగిరీలో దేవాన్ష్ (80కి.) పసిడి పతక పోరుకు చేరాడు.

అరవింద్‌కు రెండో స్థానం

వార్సా: గ్రాండ్ ప్రీ చెస్ ర్యాపిడ్ విభాగంలో భారత గ్రాండ్ మాస్టర్ అరవింద్ చిదంబరం రెండో స్థానంలో నిలిచాడు. సోమవారం జరిగిన ఆఖరి మూడు రౌండ్లలో రెండు నెగ్గిన అరవింద్.. ఓ గేమ్‌లో పరాజయం పాలయ్యాడు. దీంతో మొత్తం 9 రౌండ్ల నుంచి 11 పాయింట్లతో రెండో స్థానం దక్కించుకొన్నాడు. కాగా, వ్లాదిమిర్ ఫెడోసివ్ (స్లొవేనియా) కూడా 11 పాయింట్లే సాధించినా.. మెరుగైన టైబ్రేక్ స్కోరుతో అగ్రస్థానాన్ని చేజిక్కించుకొన్నాడు. మరో భారత జీఎం ప్రజ్ఞానంద 10 పాయింట్లతో నాలుగో స్థానం సొంతం చేసుకొన్నాడు.

3 నెలలు 94 మ్యాచ్‌లు

2028 నుంచి ఐపీఎల్ విస్తరణ యోచన



న్యూఢిల్లీ: ప్రపంచ క్రికెట్‌లో అగ్రశ్రేణి లీగ్‌గా కొనసాగుతున్న ఐపీఎల్‌ను మరింతగా విస్తరించే దిశగా కసరత్తు జరుగుతోంది. దీనిలో భాగంగా మ్యాచ్‌ల సంఖ్య, టోర్నీ కాలపరిమితిని పెంచే అవకాశం ఉన్నట్టు సమాచారం. ప్రస్తుతం లీగ్‌లో 74 మ్యాచ్‌లు జరుగుతున్నాయి. అయితే 2028 నుంచి ఈ సంఖ్య 94కు పెంచి, మూడు మాసాల పాటు నిర్వహించే ఆలోచనలో ఉన్నట్టు ఐపీఎల్ చైర్మన్ అరుణ్ ధూమల్ పేర్కొన్నాడు. తాజా మీడియా హక్కుల కాలపరిమితి 2027 వరకు ఉంది. ఆ తర్వాతి ఏడాది నుంచి జరిగే సైకిల్‌తో ప్రారంభించి మరో 20 మ్యాచ్‌లను పెంచేందుకు అవకాశం ఉందని ధూమల్ అన్నాడు. 'ఇదే విషయమై ఐసీసీలో చర్చిస్తున్నాం. అలాగే బీసీసీఐలోనూ అంతర్గతంగా చర్చ జరుగుతోంది. ఈ ఏడాది మ్యాచ్‌లను పెంచే ఆలోచన చేయలేదు. కానీ సమీప భవిష్యత్‌లో నిర్ణయం తీసుకుంటాం' అని ధూమల్ వివరించాడు.

పిల్లాడు పిడుగల్లే..



వైభవ్ సూర్యవంశీ
38 బంతుల్లో 7 ఫోర్లు, 11 సిక్సర్లతో 101 పరుగులు

35 బంతుల్లోనే సూర్యవంశీ శతకం

పిన్నవయసులో టీ20 సెంచరీ

ఐపీఎల్‌లో గేల్ తర్వాత వైభవే..

8 వికెట్ల తేడాతో గుజరాత్ చిత్తు

రాజస్థాన్ ప్లేఆఫ్స్ రేసులోనే..!

జైపూర్: ఇంకా పాలబుగ్గల పసివాడే.. అయితేనేం అంతర్జాతీయ స్థాయి బౌలర్లను చెడుగుడు ఆడేశాడు 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ. కలా.. నిజమా? అనే రీతిన సాగిన ఈ చిచ్చర పిడుగు బ్యాటింగ్ విన్యాసాలను కళ్లారా తిలకించాల్సిందే. గుజరాత్ బౌలర్లు ఇషాంత్, సిరాజ్, ప్రసిద్ధ్, రషీద్, సుందర్, కరీం జనత్ ఇలా ఏ ఒక్కరినీ వదలకుండా కేవలం 38 బంతుల్లోనే 7 ఫోర్లు, 11 సిక్సర్లతో 101 రన్స్‌తో ప్రపంచ క్రికెట్‌ను ఔరా.. అనిపించాడు. ఐపీఎల్ చిరస్మరణీయ ఇన్నింగ్స్‌లో ఒకటిగా నిలిచిన వైభవ్ ఆటలో బౌండరీల రూపంలోనే 94 పరుగులు రావడం మరో విశేషం. అతడి ధాటికి వరుసగా ఐదు ఓటముల తర్వాత రాజస్థాన్ 8 వికెట్ల తేడాతో నెగ్గింది. ఈ మ్యాచ్‌లో ఓడితే ఆర్ఆర్ అధికారికంగా ప్లేఆఫ్స్ నుంచి నిష్క్రమించేది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 209 పరుగులు చేసింది. గిల్ (84), బట్లర్ (50 నాటౌట్), సాయి సుదర్శన్ (39) రాణించారు. తీక్షణకు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో రాజస్థాన్ 15.5 ఓవర్లలో 2 వికెట్లకు 212 పరుగులు చేసి గెలిచింది. జైస్వాల్ (40 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సర్లతో 70 నాటౌట్), పరాగ్ (15 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 32 నాటౌట్) వేగంగా ఆడారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా వైభవ్ నిలిచాడు.

ఆది నుంచీ బాదుడే..: ఈ పిచ్‌పై 210 పరుగుల ఛేదన కష్టమే అనుకున్న చోట.. రాజస్థాన్ స్కోరు ఆరంభం నుంచే రాకెట్ వేగంతో పోటీపడింది. ఓపెనర్లు వైభవ్, జైస్వాల్ తుఫాన్ ఇన్నింగ్స్‌తో చెలరేగారు. ముఖ్యంగా వైభవ్ నాలుగో ఓవర్ నుంచి సాగించిన విధ్వంసం 12వ ఓవర్ వరకు నిరంతరాయంగా సాగింది. ఈ దశలో గుజరాత్ బౌలర్లు అతడికి బంతి వేసేందుకే జంకాల్సి వచ్చింది. ముందుగా ఇషాంత్‌ను లక్ష్యంగా చేసుకున్న తను 6,6,4,6,4తో 28 పరుగులు రాబట్టాడు. దీంతో జీటీ శిబిరం షాక్‌కు గురైంది. ఆ వెంటనే స్పిన్నర్ సుందర్‌ను దించగా అతడినీ వదలకుండా 4,6,6,4తో 21 రన్స్ రాబట్టడమే కాకుండా 17 బంతుల్లోనే ఫిఫ్టీని కూడా పూర్తి చేశాడు. అటు పవర్‌ప్లేలో ఆర్ఆర్ 87 పరుగులతో నిలిచింది. ఐపీఎల్‌లో ఈ జట్టుకిదే అత్యధికం. ఎనిమిదో ఓవర్‌లోనే స్కోరు వంద దాటేసింది. ఇక తొలి ఐపీఎల్ మ్యాచ్ ఆడిన పేసర్ కరీమ్‌కు వైభవ్ పీడకలే మిగిల్చాడు. అతడి మొదటి ఓవర్‌లోనే ఏ బంతినీ వదలకుండా 6,4,6,4,4,6తో 30 పరుగులు రాబట్టడంతో స్టేడియం హోరెత్తిపోయింది. అప్పటికి 94 పరుగులతో ఉన్న వైభవ్ రషీద్ ఓవర్‌లో భారీ సిక్సర్‌తోనే సెంచరీ పూర్తి చేయడం అబ్బురపరిచింది. ఈ ఫీట్‌తో ఇరు జట్ల డగౌట్లతో పాటు ప్రేక్షకుల నుంచి హర్షధ్వానాలు అందుకున్నాడు. చివరికి 12వ ఓవర్‌లో పేసర్ ప్రసిద్ధ్ అవుట్ చేయడంతో వైభవ్ అద్భుత ఇన్నింగ్స్ ముగిసింది. అయితే అప్పటికే తొలి వికెట్‌కు 166 పరుగులు జత చేరడం విశేషం. ఆ తర్వాత రాణా (4) వికెట్ పడినా జైస్వాల్‌కు జత కలిసిన పరాగ్ సైతం వేగం కనబర్చాడు. దీంతో మరో 25 బంతులుండగానే ఈ భారీ ఛేదన పూర్తయ్యింది.



జైస్వాల్ (40 బంతుల్లో 70 నాటౌట్)

టాపార్డర్ షో: గుజరాత్ ఇన్నింగ్స్‌లో ఓపెనర్లు గిల్, సాయి సుదర్శన్ మరోసారి మెరిశారు. చక్కటి సమన్వయంతో జట్టుకు శుభారంభాన్ని అందించారు. ఇరువురి క్యాచ్‌లను ఫీల్డర్లు వదిలేయడం కూడా వీరికి కలిసివచ్చింది. అలాగే వన్‌డౌన్‌లో బట్లర్ బాదుడుకు స్కోరు 200 దాటేసింది. పవర్‌ప్లేలో గిల్-సాయిల అడపాదడపా బౌండరీలతో స్కోరు 53 పరుగులకు చేరింది. ఆ తర్వాత స్పిన్నర్ హసరంగ పరుగులను కట్టడి చేసినా యుధ్‌వీర్ ఓవర్‌లో గిల్ 4,6తో 13 రన్స్ అందించాడు. అలాగే 29 బంతుల్లోనే ఫిఫ్టీని కూడా పూర్తి చేశాడు. అయితే 11వ ఓవర్‌లో సుదర్శన్‌ను తీక్షణ అవుట్ చేయడంతో తొలి వికెట్‌కు 93 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అనంతరం గిల్‌కు జతగా బట్లర్ చేరడంతో స్కోరు రాకెట్ వేగంతో వెళ్లింది. 14వ ఓవర్‌లో గిల్ రెండు సిక్సర్లు బాదగా.. పొదుపుగా బౌలింగ్ వేస్తున్న హసరంగను బట్లర్ బాదేశాడు. అతడి చివరి ఓవర్‌లో 6,6,4,6తో ఏకంగా 24 పరుగులు రాబట్టాడు. రెండో వికెట్‌కు 38 బంతుల్లోనే 74 పరుగులు జత చేరాక గిల్‌ను సైతం తీక్షణ పెవిలియన్‌కు చేర్చాడు. అటు బట్లర్ మాత్రం తన జోరును సాగిస్తూ 18వ ఓవర్‌లో 6,6,4తో 19 రన్స్ అందించాడు. సుందర్ (13), తెవాటియా (9) త్వరగానే అవుటైనా.. చివరి ఓవర్‌లో 13 రన్స్ రావడంతో స్కోరు 200 దాటింది. అలాగే బట్లర్ 26 బంతుల్లోనే సీజన్‌లో నాలుగో అర్ధసెంచరీని పూర్తి చేశాడు.

నేటి మ్యాచ్

ఢిల్లీ x కోల్‌కతా — వేదిక: ఢిల్లీ — రా.7.30 నుంచి

స్కోరుబోర్డు

గుజరాత్: సాయి సుదర్శన్ (సి) పరాగ్ (బి) తీక్షణ 39; గిల్ (సి) పరాగ్ (బి) తీక్షణ 84; బట్లర్ (నాటౌట్) 50; సుందర్ (సి) హెట్‌మయెర్ (బి) సందీప్ 13; తెవాటియా (ఎల్బీ) ఆర్చర్ 9; షారుక్ (నాటౌట్) 5; **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 20 ఓవర్లలో 209/4; వికెట్ల పతనం:** 1-93, 2-167, 3-193, 4-202; **బౌలింగ్:** ఆర్చర్ 4-0-49-1; తీక్షణ 4-0-35-2; యుధ్‌వీర్ 3-0-38-0; సందీప్ 4-0-33-1; పరాగ్ 1-0-14-0; హసరంగ 4-0-39-0.

రాజస్థాన్ రాయల్స్: యశస్వీ జైస్వాల్ (నాటౌట్) 70, వైభవ్ సూర్యవంశీ (బి) ప్రసిద్ధ్ కృష్ణ 101, రాణా (ఎల్బీ) రషీద్ 4, పరాగ్ (నాటౌట్) 32, **ఎక్స్‌ట్రాలు 5, మొత్తం: 15.5 ఓవర్లలో 212/2, వికెట్లపతనం:** 1-166, 2-171, **బౌలింగ్:** సిరాజ్ 2-0-24-0, ఇషాంత్ శర్మ 2-0-36-0, సుందర్ 1.5-0-34-0, ప్రసిద్ధ్ కృష్ణ 4-0-47-1, రషీద్ ఖాన్ 4-0-24-1, కరీమ్ జనత్ 1-0-30-0, సాయి కిషోర్ 1-0-16-0.

టీ20 ఫార్మాట్‌లో శతకం బాదిన అతి పిన్నవయస్కు (14 ఏళ్లు)డిగా వైభవ్.

1 ఐపీఎల్‌లో 200+ ఛేదనను తక్కువ ఓవర్లలో (15.5)నే పూర్తి చేసిన జట్టుగా రాజస్థాన్

ఐపీఎల్‌లో తన తొలి ఓవర్‌లోనే అత్యధిక రన్స్ (30) సమర్పించుకున్న బౌలర్‌గా కరీం జనత్.

2 ఐపీఎల్‌లో రెండో వేగవంతమైన (35 బంతుల్లో) శతకాన్ని నమోదు చేసిన వైభవ్. గేల్ (30 బంతుల్లో) టాప్‌లో ఉన్నాడు.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
బెంగళూరు	10	7	3	0	14	0.521
ముంబై	10	6	4	0	12	0.889
గుజరాత్	9	6	3	0	12	0.748
ఢిల్లీ	9	6	3	0	12	0.482
పంజాబ్	9	5	3	1	11	0.177
లఖ్‌నవూ	10	5	5	0	10	-0.325
కోల్‌కతా	9	3	5	1	7	0.212
రాజస్థాన్	10	3	7	0	6	-0.349
హైదరాబాద్	9	3	6	0	6	-1.103
చెన్నై	9	2	7	0	4	-1.302

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

అర్హత లేకున్నా తహశీల్దార్‌గా!

- రెవెన్యూ, భూ చట్టాలపై అవగాహన లేకున్నా నియామకాలు
- రీ సర్వే డీటీలకు అడహాక్ తహశీల్దార్లుగా బాధ్యతలు
- రెవెన్యూలో మళ్లీ మళ్లీ అవే తప్పులు
- కోర్టు ఆదేశాలను ఉల్లంఘించి మరీ నియామకాలు
- ప్రభుత్వానికి అందిన ఫిర్యాదులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రెవెన్యూశాఖ తీరు మారడం లేదు. ఏ మాత్రం పాలనా అనుభవంలేనివారిని, రెవెన్యూ, భూముల చట్టాలపై కనీసం అవగాహనలేనివారిని తీసుకొచ్చి మండల తహశీల్దార్లుగా నియమిస్తోంది. కూటమి సర్కారు వచ్చిన కొత్తలో ఒకేదఫా 280 మందికి ఆ అవకాశం కల్పించగా అది పెద్ద తప్పని తేలింది. మరోసారి ఇలాంటివి పునరావృతం కానివ్వబోమని చెప్పిన రెవెన్యూశాఖ ఆచరణలో మాత్రం మళ్లీ మళ్లీ అదే తప్పులను చేస్తోంది. తాజాగా ఐదు జిల్లాల పరిధిలో రీ సర్వే డీటీలుగా పనిచేస్తోన్న సీనియర్ అసిస్టెంట్లలో కొందరికి ఏరికోరి తహశీల్దార్లుగా అదనపు బాధ్యతలు అప్పగించింది. ఆయా జిల్లాల పరిధిలో రెగ్యులర్ రెవెన్యూ డీటీలు ఉన్నా వారిని పక్కనపెట్టి, ఏమాత్రం అనుభవం, అవగాహన లేని రీ సర్వేలోని అధికారులను అడహాక్ తహశీల్దార్లుగా నియమించడంపై విమర్శలు వెల్లువెత్తాయి. రాష్ట్రంలో 679 మండలాలు ఉన్నాయి. ప్రతి మండలానికీ తహశీల్దార్ ఉండాలి. మండల మేజిస్ట్రేట్ బాధ్యతలు కూడా ఆ పోస్టుకు ఉన్నాయి. సిబ్బంది కొరత వల్ల కేవలం 399 మండలాల్లోనే రెగ్యులర్ తహశీల్దార్లు ఉన్నారు. ఈ పరిస్థితుల్లో రెవెన్యూలోనే డిప్యూటీ తహశీల్దార్(రెవెన్యూ డీటీ)లను ఇన్‌చార్జి తహశీల్దార్లుగా నియమిస్తుంటారు. అయితే, అధికారిక లెక్కల ప్రకారం 120 మంది రెవెన్యూ డీటీలే ఆ పోస్టుల్లో ఉన్నారు. మిగిలిన 160 మండలాలకు రీ సర్వే డీటీలుగా ఉన్న సీనియర్ అసిస్టెంట్లే అడహాక్ తహశీల్దార్లుగా కొనసాగుతున్నారు. కొందరు అధికారులు వీరిని ఏరికోరి ఆ పోస్టుల్లో కూర్చోబెట్టారు.ఇటీవల రీ సర్వే డీటీల సమావేశంలో వారి పనితీరుపై సీసీఎల్ఏ జయలక్ష్మి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రీ సర్వేపని సరిగ్గా సాగడం లేదని, రైతుల పిటిషన్లను సరిగ్గా పరిష్కరించడం లేదని మండిపడ్డారు. పనిచేయని వారిని సస్పెండ్ చేస్తానని కూడా హెచ్చరించారు. ప్రస్తుతం 650 మండలాల్లో రీ సర్వే పైలెట్ ప్రాజెక్టుగా నడుస్తోంది. అంటే, ప్రతి మండలంలో రీ సర్వే డీటీ సేవలు తప్పనిసరి. ఈ విషయం తెలిసి కూడా కొందరు కలెక్టర్లు రీ సర్వే డీటీలుగా ఉన్న వారిని ఏరికోరి మండలాలకు అడహాక్ తహశీల్దార్లుగా నియమిస్తున్నారు. ఇంకా కొందరు కలెక్టరేట్ల పరిధిలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న వారిని తహశీల్దార్‌గా నియమిస్తున్నారు. ఇటీవలి శ్రీకాకుళం జిల్లాలో ఇద్దరు సూపరింటెండెంట్లకు తహశీల్దార్లుగా పోస్టులు ఇచ్చారు. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించి మరీ ఈ తరహా నియామకాలు చేస్తున్నారని ఆరోపణలున్నాయి. పార్వతీపురం మన్యంలో ఓ రీ సర్వే అధికారిని నిబంధనలకు విరుద్ధంగా అడహాక్ తహశీల్దార్‌గా నియమించినట్లు ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. అనంతపురం జిల్లాలో ఓ డీటీకి వజ్రకరూరు, విడపనకల్లు మండలాలను అప్పగించారు. ఇలా ఆరు జిల్లాల్లో 18 మంది డీటీలకు సగటున రెండు మండలాల బాధ్యతలు అప్పగించడం గమనార్హం.

అంతరిక్ష, రక్షణ రంగాల్లో.. పెట్టుబడులకు

మంచి అవకాశాలు

- దేశంలో ఈ రంగాలు వేగంగా అభివృద్ధి
- ఇస్రో మాజీ చైర్మన్ ఎస్ సోమనాథ్

విజయవాడ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): అంతరిక్ష, రక్షణ రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని, గత పదేళ్లలో ప్రపంచ దేశాల్లో భారత్‌కు ప్రత్యేక గుర్తింపు వచ్చిందని ఏపీ స్పేస్ టెక్నాలజీ గౌరవ సలహాదారు, ఇస్రో మాజీ చైర్మన్ ఎస్ సోమనాథ్ అన్నారు. విజయవాడ నగరంలో సోమవారం జరిగిన రక్షణ, పారిశ్రామిక క్లస్టర్ల రూపకల్పన భాగస్వాముల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏరోస్పేస్, రక్షణ రంగాల్లో పెట్టుబడులకు మంచి అవకాశాలున్నాయని.. పారిశ్రామిక వేత్తలు, స్టార్టప్ కంపెనీలు వాటిపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ఆయా రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పూర్తి సహకారం ఉంటుందన్నారు. చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడని తెలిపారు. రాష్ట్రానికి చెందిన పలు కంపెనీలు శ్రీహరికోటలోని అంతరిక్ష కేంద్రంతో భాగస్వాములయ్యాయని తెలిపారు. దేశంలో రక్షణ రంగ ఉత్పత్తులు పెరిగి, విదేశాలకు విక్రయించే స్థాయికి చేరుకున్నామని.. గతేడాది వాటి ఎగుమతుల ద్వారా రూ.1.75 లక్షల కోట్ల ఆదాయం వచ్చిందని తెలిపారు. విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ.. విభిన్న రంగాల్లో పెట్టుబడులు పెట్టి రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు.



జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో ఇస్రో మాజీ చైర్మన్ సోమనాథ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సతీశ్‌రెడ్డి, ఎంపీ కేశినేని శివనాథ్ తదితరులు

డిఫెన్స్ రంగాన్ని బలోపేతం చేయాలి: సతీశ్‌రెడ్డి

రక్షణ రంగంలో పెట్టుబడులు పెట్టడం ద్వారా గణనీయమైన వృద్ధి సాధించేందుకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని ఏరోస్పేస్ డిఫెన్స్ మాన్యుఫాక్చరింగ్ హబ్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సతీశ్‌రెడ్డి అన్నారు. సీఎం చంద్రబాబుతో గతంలో మాట్లాడినప్పుడు ఏపీని డిఫెన్స్, ఏరోస్పేస్ హబ్‌గా చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారన్నారు. ఆంధ్ర, తెలంగాణ ఆర్మీ మేజర్ జనరల్ అజయ్ విశ్రా, వీసీఎస్ఎండీఏపీఐఐసీ ఐఏఎస్ కిశోర్, ఏపీ ఎంఎస్ఎంఈ సీఈవో విశ్వ, ప్రముఖ, యువ పారిశ్రామిక వేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆజాద్ విచారణకు ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేస్తారా?

- ఏపీ సర్కారును ప్రశ్నించిన సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28: మావోయిస్టు కీలక నేత దునా కేశవరావ్ అలియాస్ ఆజాద్‌ను విచారించేందుకు ప్రత్యేక కోర్టులు ఏర్పాటుచేస్తారా? అని ఏపీ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. మావోయిస్టు పార్టీ ఒడిసా నేత అయిన ఆజాద్.. 2011, మే 18న హైదరాబాద్ పోలీసుల ముందు లొంగిపోయి, జైల్లో ఉన్నారు. కొన్నాళ్ల తర్వాత ఒడిసా అభ్యర్థన మేరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆజాద్‌ను ఆ రాష్ట్రానికి అప్పగించింది. ఆజాద్‌పై ఒడిసా పోలీసులు పదుల సంఖ్యలో కేసులు నమోదు చేశారు. ఉమ్మడి ఏపీ ప్రభుత్వం తనను అప్పగించడంతోపాటు, ఒడిసా పోలీసులు నమోదు చేసిన కేసులను సవాల్ చేస్తూ ఆజాద్ గత ఏడాది డిసెంబరులో సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు ఇరు రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. తాజాగా సోమవారం జరిగిన విచారణలో.. ఆజాద్‌పై పది కేసులు రద్దు చేశామని, మరో 37 కేసులు పెండింగులో ఉన్నాయని ఒడిసా తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఆయా కేసులను విచారించేందుకు ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. ఈ సందర్భంగా జోక్యం చేసుకున్న ఏపీ తరఫు న్యాయవాది..ఆజాద్‌పై తమవద్దా కేసులు పెండింగులో ఉన్నాయని తెలిపారు. దీంతోన్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్. కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం స్పందిస్తూ.. ఆజాద్‌ను విచారించేందుకు ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేస్తారా? అని ఏపీ న్యాయవాదిని ప్రశ్నించింది.

చిత్రజ్యోతి

SINCE 1965

ఆ బాధ్యత దర్శక నిర్మాతలదే

- అల్లు అరవింద్



'కొవిడ్ సమయం నుంచి చాలా మంది ప్రేక్షకులు ఓటీటీలకు అలవాటు పడ్డారు. మార్పును ఎవరూ ఆపలేరు. సినిమా చాలా బాగుంది అని టాక్ వస్తే తప్ప ప్రేక్షకులు థియేటర్లకు రావడం లేదు. అలా చాలా బాగుంది అనిపించేలా సినిమాలు చేయడం దర్శక, నిర్మాతల బాధ్యత' అని అన్నారు ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్. శ్రీవిష్ణు హీరోగా, కేతిక శర్మ, ఇవానా కథానాయికలుగా కార్తిక్ రాజు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'సింగిల్'. అల్లు అరవింద్ సమర్పణలో విద్యా కొప్పినీడి, భాను ప్రతాప్, రియాజ్ చౌదరి నిర్మించారు. మే 9న ప్రేక్షకుల ముందుకు వస్తోన్న సందర్భంగా సోమవారం ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ 'డైరెక్టర్ కార్తిక్ ఈ కథ చెబుతుంటే రెండు గంటల పాటు పగలబడి నవ్వుతూనే ఉన్నాను. సినిమాలో శ్రీ విష్ణు, వెన్నెల కిశోర్ కనిపించినప్పుడు నవ్వులు మామూలుగా ఉండవు. కుటుంబమంతా కలిసి థియేటర్స్‌లో ఎంజాయ్ చేసే సినిమా ఇది' అని అన్నారు. హీరో శ్రీ విష్ణు మాట్లాడుతూ 'ఇంటిల్లిపాదిని కడుపుబ్బ నవ్వించాలనే ప్రయత్నంతో ఈ సినిమా చేశాం. స్ర్కీన్‌ప్లే, స్టోరీ చాలా కొత్త అనుభూతిని ఇస్తాయి' అని అన్నారు. నిర్మాత బన్నీ వాసు మాట్లాడుతూ 'నవ్వించడమే లక్ష్యంగా పెట్టుకొని తీసిన సినిమా ఇది' అని చెప్పారు.

శర్వా సినిమాలో డింపుల్ హయాతి

శర్వానంద్ కథానాయకుడిగా సంపత్ నంది దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. 'శర్వా 38' అనేది వర్కింగ్ టైటిల్. కేకే రాధామోహన్ నిర్మించనున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనుల్లో ఉందీ చిత్రం. త్వరలోనే షూటింగ్ మొదలుకానుంది. 1960ల కాలంలో ఉత్తర తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో సాగే పీరియాడిక్ యాక్షన్ డ్రామా ఇది. ఇందులో శర్వా సరసన అనుపమ పరమేశ్వరన్ నటించనున్నారు. తాజాగా ఈ ప్రాజెక్ట్‌లో డింపుల్ హయాతి ఓ కీలక పాత్ర పోషించనున్నట్లు మేకర్స్ ప్రకటించారు.



శక్తిమంతమైన పాత్రలో...



విజయ్‌సేతుపతి కథానాయకుడిగా పూరిజగన్నాథ్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాను పూరి జగన్నాథ్, చార్మీ కౌర్ సంయుక్తంగా నిర్మించనున్నారు. ఇటీవలె ఈ ప్రాజెక్ట్‌లోకి టబు ఎంటర్ అయ్యారు. తాజాగా, ఈ సినిమాలో ఓ శక్తిమంతమైన పాత్రను కన్నడ నటుడు విజయ్‌కుమార్ పోషించనున్నట్లు మేకర్స్ తెలిపారు. 'వీరసింహా రెడ్డి' సినిమా తర్వాత ఆయన నటించనున్న రెండో తెలుగు సినిమా ఇది. రెగ్యులర్ షూట్‌ను జూన్ నుంచి మొదలుపెడుతున్నారు.

అమెరికాలో కన్నప్ప ప్రచారం




'కన్నప్ప' చిత్రం కోసం అమెరికాలో వరుస ప్రమోషన్స్ చేయనున్నారు మంచు విష్ణు. ఇందులో భాగంగా మే నెల 8 నుంచి అమెరికాలో పలు ప్రచార కార్యక్రమాలు, రోడ్ షోలను ప్లాన్ చేస్తున్నారు. దాదాపు 15 రోజుల పాటు న్యూజెర్సీ, డల్లాస్, లాస్ ఏంజిల్స్‌లో ఇవి జరగనున్నాయి. ఈ ప్రచారంలో చిత్రబృందం పాల్గొననుంది. జూన్ 27న సినిమా విడుదల కానుంది. కాగా, మంచు విష్ణు టైటిల్ రోల్‌లో ముఖేష్‌కుమార్ ఈ సినిమాను తెరకెక్కించారు.

సందడికి మళ్లీ సిద్ధం!



భారతీయ సినిమా చరిత్రలో 'బాహుబలి' చిత్రానికి ఎంతటి ప్రత్యేక స్థానం ఉందో చెప్పక్కర్లేదు. ఈ సినిమా మొదటి భాగం విడుదలై 10 ఏళ్లు అవుతోంది. ఈ సందర్భంగా నిర్మాత శోభు యార్లగడ్డ అభిమానులకు తీపికబురందించారు. ఈ సినిమాను అక్టోబర్‌లో రీ రిలీజ్ చేయనున్నట్లు ఎక్స్ వేదికగా ప్రకటించారు. "ఇది రీ రిలీజ్ మాత్రమే కాదు. ఈ సినిమా పదేళ్లు పూర్తిచేసుకున్నందుకు అభిమానులతో కలసి చేసుకునే వేడుక. మరిన్ని సర్‌ప్రైజ్‌లకు సిద్ధంగా ఉండండి" అని పేర్కొన్నారు. కాగా, 'బాహుబలి: ద బిగినింగ్' 2015లో జూలై 10న విడుదలవ్వగా, రెండో భాగం 2017 ఏప్రిల్ 28న విడుదలైంది.



మలయాళ దర్శకుడు షాజీ.. ఇక లేరు



ప్రముఖ మలయాళ దర్శకుడు, సినిమాటోగ్రాఫర్ షాజీ.ఎన్.కరుణ్ (73) ఇక లేరు. కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆయన, సోమవారం తిరువనంతపురంలో కన్నుమూశారు. 1976లో 'లక్ష్మీ విజయం'తో సినిమాటోగ్రాఫర్‌గా కెరీర్‌ను ఆరంభించిన ఆయన.. కొన్నేళ్లపాటూ పలువురు ప్రముఖ దర్శకులతో పని చేశారు. ఆ తర్వాత 1988లో విడుదలైన 'పిరవి' సినిమాతో మెగాఫోన్ చేతపట్టారు. ప్రపంచవ్యాప్తంగా విశేష గుర్తింపు తెచ్చుకున్న ఆ చిత్రం, ఏకంగా 31 అవార్డులను కైవసం చేసుకుంది. జాతీయ ఉత్తమ చిత్రం, ఉత్తమ నటుడు, ఉత్తమ దర్శకుడు అవార్డులతో పాటు కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రత్యేక ప్రశంసను దక్కించుకుంది. ఆయన తెరకెక్కించిన రెండో చిత్రం 'స్వహమ్' (1994) కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రథమ విభాగంలో పోటీపడింది. మోహన్‌లాల్ కథానాయకుడిగా ఆయన రూపొందించిన మూడో చిత్రం 'వనప్రస్థానం' (1999) సైతం కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్లో ప్రదర్శితమవ్వడం విశేషం.

ఆనందంగా ఉంది



ఈశ్వర్, నైనా సర్వర్ జంటగా రాజేశ్ నాదెండ్ల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'సూర్యాపేట్ జంక్షన్'. అనిల్ కుమార్ కాట్రగడ్డ, ఎన్.శ్రీనివాసరావు నిర్మాతలు. ఇటీవలె విడుదలై రన్ అవుతోన్న ఈ సినిమా సక్సెస్ మీట్‌ను మేకర్స్ నిర్వహించారు. హీరో ఈశ్వర్ మాట్లాడుతూ 'ప్రేక్షకులు చూపించిన ప్రేమ, ఆదరణకు మా ధన్యవాదాలు. పాజిటివ్ టాక్‌తో థియేటర్లకు వచ్చి సినిమా చూస్తున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది' అని అన్నారు.

అమ్మాయి కోసం..



సౌమిత్‌రావు, శ్రేయాసి సేన్ జంటగా నటించిన చిత్రం 'నిలవే'. సౌమిత్‌రావు, సాయి వెన్నం దర్శకత్వం వహిస్తున్నారు. సాయి వెన్నం, గిరిధర్ రావు పోలాటి నిర్మాతలు. సోమవారం ఈ సినిమా టీజర్‌ని మేకర్స్ విడుదల చేశారు. అర్జున్ అనే వ్యక్తి తన ఒంటరి జీవితాన్ని కష్టంగా గడుపుతూ ప్రేమ కోసం తాపత్రయపడుతుంటాడు. అతని జీవితంలో ఓ అమ్మాయి ప్రవేశించి కొత్త కాంతిని తీసుకొస్తుంది. టీజర్‌లో ఆ అమ్మాయి కోసం ఎంతదూరమైనా వెళ్తారు అనే అంశాన్ని ఆవిష్కరించే ప్రయత్నం చేశారు. ఈ చిత్రానికి దిలీప్ కె.కుమార్ సినిమాటోగ్రఫీ, కళ్యాన్ నాయక్ సంగీతం అందిస్తున్నారు.

మనసుని కదిలించింది

-రాజమౌళి



కె.సుధాకర్ రెడ్డి, అరుణ్ రాజ్, పూర్ణ చంద్ర, మౌనికా బొమ్మ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ముత్తయ్య'. భాస్కర్ మౌర్య దర్శకత్వంలో వంశీ కారుమంచి, వృందా ప్రసాద్ నిర్మించారు. మే 1నుంచి ఈటీవీ విన్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా ప్రముఖ దర్శకుడు రాజమౌళి, నిర్మాత శోభు యార్లగడ్డ చేతుల మీదుగా సినిమా ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. మూవీ ట్రైలర్ తన మనసుని కదిలించిందని చిత్రబృందాన్ని రాజమౌళి అభినందించారు.





కృత్తివెంటికి విశిష్ట పురస్కారం

విద్యా రంగంలో అందించిన సేవలకు కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి, కృష్ణా జిల్లాకు చెందిన కృత్తివెంటి శ్రీనివాసరావుకు విశిష్ట పురస్కారాన్ని అందజేస్తున్న ఢిల్లీ సీఎం రేఖా గుప్తా

డీఎస్సీలో గందరగోళం!

- 'ఫిజికల్ సైన్స్' టీచర్ పోస్టుకు బీఎస్సీ అభ్యర్థులకు అర్హత నో
- సైన్స్ సబ్జెక్టే లేని బీసీఏ వారికి అర్హత... ఉద్యోగార్థుల్లో ఆందోళన

అమరావతి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): డీఎస్సీకి అర్హత విషయంలో పాఠశాల విద్యాశాఖ నిర్ణయాలపై అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే డిగ్రీ అర్హత మార్కుల విషయంపై అభ్యర్థుల నుంచి విమర్శలు వస్తున్నాయి. తాజాగా ఫిజికల్ సైన్స్ టీచర్ పోస్టుకు అర్హత విషయంలో పాఠశాల విద్యాశాఖ నిర్ణయం అసంబద్ధంగా ఉందనే వాదన వినిపిస్తోంది. ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు ఇంటర్‌లో ఎంపీసీ చదివి, బీఈడీలో సంబంధిత మెథడాలజీ చదివి ఉండాలనేది అర్హతగా నిర్ణయించారు. కానీ, బీఎస్సీ కంప్యూటర్స్ చదివిన వారికి కెమిస్ట్రీ ఉండదు కాబట్టి బీఎస్సీ కంప్యూటర్స్ చదివిన వారికి అర్హత కల్పించలేదు. అయితే, బ్యాచిలర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్(బీసీఏ) చదివిన వారికి మాత్రం ఆ పోస్టుకు అర్హత కల్పించారు. బీసీఏ మొత్తం కంప్యూటర్స్‌పైనే ఉంటుంది. కెమిస్ట్రీ, ఫిజిక్స్ రెండూ ఉండవు. కానీ బీఎస్సీ కంప్యూటర్స్‌లో ఫిజిక్స్ ఉంటుంది. కెమిస్ట్రీ లేదు కాబట్టి బీఎస్సీ కంప్యూటర్స్ అభ్యర్థులు అనర్హులైతే, బీసీఏ అభ్యర్థులు ఎలా అర్హులయ్యారో చెప్పాలని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. అయితే, బీసీఏ చదివిన వారు ఇంటర్మీడియట్‌లో కచ్చితంగా ఫిజిక్స్, కెమిస్ట్రీ చదివి ఉండాలని నిబంధన పెట్టారు. బీఎస్సీ చదివే వారు కూడా ఇంటర్‌లో ఎంపీసీ చదివే వస్తారు. అలాంటప్పుడు ఈ ద్వంద్వ విధానం ఏంటని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. కాగా, బీసీఏ అభ్యర్థులకు గణితం, ఫిజిక్స్, బయాలజీ స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు అర్హత కల్పించారు. ఈ నేపథ్యంలో బీఎస్సీ చదివిన వారికి కూడా న్యాయం చేయాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

ఇచ్చిన నిధులతో సర్దుకోండి!

- నీటి ప్రాజెక్టుల నిర్వహణపై ఆర్థిక శాఖ సలహా

అమరావతి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): సాగునీటి ప్రాజెక్టుల యాజమాన్య నిర్వహణకు తగిన నిధులిచ్చేందుకు ఆర్థిక శాఖ సమ్మతించడం లేదు. ఈ ఏడాది రూ.344 కోట్లు అడిగితే.. అంత మొత్తం ఇవ్వడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. రూ.200 కోట్లు ఇస్తామని.. వాటితోనే సర్దుకోవాలని.. మిగతా 144 కోట్లతో వచ్చే ఏడాది నిర్వహణ చేపట్టాలని జల వనరుల శాఖకు ఉచిత సలహా ఇచ్చింది. వేసవి సమయంలో యుద్ధ ప్రాతిపదికన ప్రాజెక్టుల నిర్వహణ చేపట్టాల్సి ఉంటుందని జల వనరుల శాఖ తెలిపింది. జగన్ ఐదేళ్ల హయాంలో అలా చేపట్టకపోవడం వల్లే భారీ విధ్వంసం జరిగిందని గుర్తు చేసింది. అయినా ఆర్థిక శాఖ రూ.344 కోట్ల ఫైలును తిప్పిపంపింది. దీంతో ఈ అంశాన్ని జలవనరుల శాఖ సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లింది. దాని వాదనతో ఆయన ఏకీభవించారు. ప్రాజెక్టుల నిర్వహణకు అవసరమయ్యే నిధుల కోసం ప్రతిపాదిత ఫైలును కేబినెట్‌కు పంపితే ఆమోదిస్తానని హామీ ఇచ్చారు. దీంతో ఆ ఫైలును కేబినెట్ సమావేశంలో పెట్టనున్నారు.

వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకిస్తూ భారీ ర్యాలీ

కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఆమోదం తెలిపిన వక్ఫ్ చట్ట సవరణ రద్దు చేయాలని ముస్లిం నాయకులు, వివిధ రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. వక్ఫ్ చట్ట సవరణ వెనక్కి తీసుకోవాలని కోరుతూ సోమవారం ముస్లిం పర్సనల్ లా బోర్డు, ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో కర్నూలు నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ముస్లింలు వేలాదిగా తరలిరావడంతో కలెక్టరేట్ ఎదుట రెండు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ జాకీర్ మౌలానా మాట్లాడుతూ మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం చాలా దుర్మార్గంగా కార్పొరేట్లకు భూములను కట్టబెట్టడానికే వక్ఫ్ చట్టంలో సవరణలు చేసిందన్నారు. - కర్నూలు, ఆంధ్రజ్యోతి



నాగేశ్వర్‌రెడ్డికి పద్మవిభూషణ్.. బాలయ్యకు పద్మభూషణ్

(మొదటి పేజీ తరువాయి)

సోమవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పురస్కారాలను ప్రదానం చేశారు. మిగిలిన వారికి త్వరలోనే అందజేయనున్నారు. ప్రముఖ వైద్యుడు దువ్వూరు నాగేశ్వర్‌రెడ్డి పద్మవిభూషణ్, ప్రముఖ సినీనటుడు నందమూరి బాలకృష్ణ పద్మభూషణ్ పురస్కారాలను అందుకోగా.. సహస్రావధాని మాడుగుల నాగఫణిశర్మ, కళారంగంలో మిరియాల అప్పారావు పద్మశ్రీ పురస్కారాలను స్వీకరించారు. మొత్తం ఏడుగురు తెలుగువారికి ఈ ఏడాది పద్మ పురస్కారాలు లభించగా వారిలో తొలివిడత నలుగురు అవార్డులను అందుకున్నారు. ఐదు దశాబ్దాలుగా చిత్ర పరిశ్రమలో ఉన్న ప్రముఖ సినీనటుడు, రాజకీయనాయకుడిగా బాలకృష్ణను ప్రశంసాపత్రంలో పేర్కొనగా.. డి.నాగేశ్వర్‌రెడ్డిని ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్టు అని, వైద్య పరిశోధనలో అనేక విజయాలు సాధించిన వైద్యుడు అని కొనియాడారు. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా, పౌర విమానయాన మంత్రి కె.రామ్మోహన్ నాయుడు, బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డితో పాటు పలువురు కేంద్ర మంత్రులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. నందమూరి కుటుంబ సభ్యులు, పలువురు అవార్డు గ్రహీతల కుటుంబ సభ్యులతో అశోకా హాలు కళకళలాడింది. బాలకృష్ణ పద్మభూషణ్ పురస్కారాన్ని స్వీకరిస్తుండగా ఆయన సతీమణి వసుంధర, సోదరి నారా భువనేశ్వరి, ఏపీ మంత్రి లోకేశ్, ఆయన సతీమణి బ్రాహ్మణి, ఎంపీ భరత్, ఆయన సతీమణి తిలకించారు. పురస్కారాలు అందుకున్న వారిలో సినీనటులు శేఖర్ కపూర్, అజిత్ కుమార్ ఉన్నారు. సుజుకి కంపెనీ అధినేత ఒసాము సుజుకి, ప్రముఖ గాయకుడు పంకజ్ ఉదాస్, బిహార్ మాజీ డిప్యూటీ సీఎం సుశీల్‌కుమార్ మోదీ, ప్రముఖ మలయాళీ రచయిత వాసుదేవన్ నాయర్ దివంగతులైనందువల్ల వారి కుటుంబ సభ్యులు పురస్కారాలను స్వీకరించారు.



పద్మ పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా రాష్ట్రపతి భవన్ వద్ద సోదరి భువనేశ్వరితో బాలకృష్ణ, ఆయన కుటుంబ సభ్యులు





రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా పద్మ పురస్కారాన్ని అందుకుంటున్న మాడుగుల నాగఫణి శర్మ, మిరియాల అప్పారావు తరఫున పద్మ పురస్కారాన్ని అందుకుంటున్న ఆయన కుమార్తె యడవల్లి శ్రీదేవి

చట్ట నిబంధనలు అనుసరించే

ఎస్సీ వర్గీకరణ

- జాతీయ ఎస్సీ కమిషన్ సైతం వర్గీకరణకు ఆమోదం
- సుప్రీం మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్ణయం
- ఏకసభ్య కమిషన్ నివేదిక ఆధారంగానే ఆర్డినెన్స్
- హైకోర్టుకు నివేదించిన అడ్వొకేట్ జనరల్ శ్రీనివాస్
- కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
- విచారణ ఆరు వారాలకు వాయిదా



అమరావతి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చట్టనిబంధనలకు అనుగుణంగానే నడుచుకుందని అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ సోమవారం హైకోర్టులో వాదనలు వినిపించారు. ఈ క్రమంలో సుప్రీం కోర్టు మార్గదర్శకాలను అనుసరించారని చెప్పారు. జాతీయ ఎస్సీ కమిషన్ సైతం వర్గీకరణకు ఆమోదం తెలిపిందన్నారు. ఏకసభ్య కమిషన్ ఇచ్చిన నివేదిక, చేసిన సిఫారసుల ఆధారంగా ఎస్సీ వర్గీకరణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్(2/2025)ను తీసుకొచ్చిందన్నారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు ఇచ్చింది. ఎస్సీ వర్గీకరణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌ను సవాల్ చేస్తూ విజయవాడకు చెందిన జై భీమ్‌రావ్ భారత్ పార్టీ అధ్యక్షుడు పరసా సురేశ్‌కుమార్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం సోమవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున న్యాయవాది జడ శ్రవణ్‌కుమార్ వాదనలు వినిపించారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పాటించలేదన్నారు. ఎస్సీ ఉపకులాల వెనుకబాటుతనంపై శాస్త్రీయ అధ్యయనం జరపలేదన్నారు. ఏకసభ్య కమిషన్ ఇచ్చిన నివేదికను ప్రజా బాహుళ్యంలో ఉంచలేదని, ప్రజల నుంచి అభ్యంతరాలు కోరలేదని అన్నారు. ఏకసభ్య కమిషన్ నియామకాన్ని సైతం సవాల్ చేస్తూ రిట్ పిటిషన్ దాఖలు చేశామన్నారు. ఈ సమయంలో జోక్యం చేసుకున్న ధర్మాసనం.. ఏకసభ్య కమిషన్‌ను నియమించడంలో తప్పేముందని ప్రశ్నించింది. ఏకసభ్య కమిషన్ ఇచ్చిన నివేదికను ప్రభుత్వం వద్ద నుంచి పొందేందుకు ప్రయత్నం చేశారా..? అని పిటిషనర్‌ను ఆరా తీసింది. నివేదికను పరిశీలించకుండానే ఎస్సీ వర్గీకరణకు కారణాలు పేర్కొనలేదని ఎలా చెబుతారని నిలదీసింది. నివేదిక పొందేందుకు ఎలాంటి ప్రయత్నం చేయకుండానే హడావుడిగా కోర్టును ఆశ్రయించారని వ్యాఖ్యానించింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

జిన్‌పింగ్ ఫోన్ చేశారు: ట్రంప్

- అలాంటిదేం లేదంటూ తోసిపుచ్చిన చైనా

హాంగ్‌కాంగ్: చైనా సహా అనేక దేశాలపై ఇటీవల ప్రతీకార సుంకాలను విధించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ఆ దేశాధ్యక్షుడిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఇటీవల తనతో ఫోన్‌లో మాట్లాడినట్లు ప్రకటించారు. అయితే చైనా ఆ వ్యాఖ్యలను తోసిపుచ్చింది. ఇటీవలి కాలంలో ఇరు దేశాల అధ్యక్షుల మధ్య ఎలాంటి ఫోన్ సంభాషణలు జరగలేదని తేల్చిచెప్పింది. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ తన స్నేహితుడని పలుమార్లు ప్రకటించిన డొనాల్డ్ ట్రంప్.. గతవారం టైమ్ మ్యాగజీన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన గురించి ప్రస్తావించారు. "ఆయన నాకు ఫోన్ చేశారు, దానిని ఆయన బలహీనతగా నేను భావించడం లేదు. నేను ఆ విషయం గురించి స్పందించాలని అనుకోవడం లేదు కూడా.. కానీ ఆయనతో చాలా సార్లు మాట్లాడాను" అని తెలిపారు. కానీ చైనా అధ్యక్షుడితో ఎప్పుడు మాట్లాడారు, ఏ అంశంపై మాట్లాడారనే వివరాలను ట్రంప్ వెల్లడించలేదు. ఈ విషయంపై చైనా విదేశాంగ అధికార ప్రతినిధి గుయో జియాకున్ స్పందించారు. తనకు తెలిసినంత వరకు ఇటీవలి కాలంలో ఇరుదేశాల అధ్యక్షుల మధ్య ఎటువంటి ఫోన్ సంభాషణలు జరగలేదని స్పష్టం చేశారు.

రోబోలు ఐదేళ్లలో సర్జన్లను మించిపోతాయి!

వాషింగ్టన్, ఏప్రిల్ 28: శస్త్రచికిత్సల విషయంలో రోబోలు భవిష్యత్తులో వైద్యులను (సర్జన్లను) మించిపోతాయని ఎలాన్ మస్క్ పేర్కొన్నారు. 'రానున్న కొన్నేళ్లలోనే మంచి సర్జన్లను రోబోలు మించిపోతాయి. ఐదేళ్లలోపే అత్యుత్తమ సర్జన్లనూ మించిన నైపుణ్యం చూపుతాయి. వేగం, కచ్చితత్వంలో రోబోలతో పోటీ పడటం మనుష్యులకు సాధ్యం కాదు' అని ఎక్స్‌లో ఒక పోస్టు పెట్టారు. ఎక్స్‌లో టాక్ షో నిర్వహించే మారియో నఫాల్ అనే వ్యక్తికి ఓ అంశంపై ప్రత్యుత్తరం ఇస్తూ మస్క్ ఈ వ్యాఖ్య చేశారు. కాగా, ఇప్పటికే శస్త్రచికిత్సల్లో రోబోల పనితీరును వెల్లడించే ఓ నివేదికను మారియో షేర్ చేశారు. ఈ నివేదిక ప్రకారం.. 137 సర్జరీల్లో రోబోలను ఉపయోగించగా, రెండు కేసులు తప్ప మిగిలిన అన్నింటినీ అవి విజయవంతంగా పూర్తి చేశాయి. ఆ రెండు కూడా.. ఒక కేసులో సంబంధిత రోబోలో సాంకేతిక సమస్యలు రాగా, మరో కేసులో పేషంట్ పరిస్థితి సంక్లిష్టంగా ఉండటంతో సర్జన్లతోనే ఆపరేషన్ జరిపారు.

కరెంటు లేక స్తంభించిన యూరప్

బార్సిలోనా, ఏప్రిల్ 28: యూరప్‌లోని స్పెయిన్, పోర్చుగల్, ఫ్రాన్స్ దేశాల్లో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం పన్నెండున్నరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో సబ్ వే నెట్‌వర్క్‌లు, మెట్రో స్టేషన్లు, ఫోన్ లైన్లు, ట్రాఫిక్ లైట్లు, ఏటీఎం మిషన్లు పనిచేయడం లేదు. ట్రాఫిక్ లైట్లు పనిచేయకపోవడంతో రోడ్లపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. మొబైల్ ఫోన్ నెట్‌వర్క్లు పనిచేయకపోవడంతో వాయిస్ కాల్స్‌కు అవకాశం లేకుండా పోయింది. ఎలక్ట్రానిక్ పేమెంట్ సేవలు నిలిచిపోయాయి. రైళ్లు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. విమానాశ్రయాల్లో కూడా సేవలు నిలిచిపోయాయి. వీటితో పాటు అనేక సేవలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. యూరోపియన్ విద్యుత్ గ్రిడ్‌లో సమస్య తలెత్తిందని, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు యత్నాలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు.

యెమెన్ జైలుపై అమెరికా దాడి..68మంది మృతి

దుబాయి, ఏప్రిల్ 28: యెమెన్ జైలుపై అమెరికా జరిపిన వైమానిక దాడిలో 68 మంది మరణించగా 47 మంది గాయపడ్డారు. యెమెన్‌లోని సాదా రాష్ట్రంలో అమెరికా వైమానిక దాడులు చేసిందని హౌతీ తిరుగుబాటుదారులు ఆరోపించారు. ఆఫ్రికన్ వలసదారులు ఉన్న జైలులో ఈ దాడులు జరిగాయన్నారు. ఇందులో 68 మంది మృతిచెందగా 47 మంది గాయపడ్డారని వెల్లడించారు. ఈ జైలులో 115 మంది ఖైదీలు ఉన్నట్లు వార్తలొస్తున్నాయి. యెమెన్ రాజధాని సనాలో కూడా అమెరికా వైమానిక దాడులు జరిపిందని, ఈ దాడుల్లో ఎనిమిది మంది మరణించారని హౌతీలు తెలిపారు.

వీసా అక్రమాలపై అమెరికా కన్నెర్ర



భారత దేశ అభ్యర్థుల బ్లాక్ లిస్టింగ్.. మిత్ర దేశాలకూ వివరాలు పంపేచాన్స్

- విద్యార్థులు, పర్యాటక వీసాలపై డేగకన్ను
- ఇప్పటికే 2 వేల మందికి అగ్రరాజ్యం షాక్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28: వీసా అక్రమాలపై అమెరికా కన్నెర్ర చేసింది. ముఖ్యంగా భారత్‌కు చెందిన దరఖాస్తు దారులు మోసాలకు పాల్పడడంపై విచారణ జరుపుతున్న అగ్రరాజ్యం.. దీనిని మరింత వేగవంతం చేయడంతోపాటు లోతుగా కూడా విచారించనుంది. ఈ క్రమంలో విద్యార్థుల వీసాలతోపాటు పర్యాటకుల వీసాలపైనా డేగకన్ను సారించింది. అక్రమాలకు పాల్పడిన అభ్యర్థులను బ్లాక్ లిస్టులో పెట్టడంతోపాటు.. వారి వివరాలను తన మిత్ర దేశాలైన బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా సహా ఇతర దేశాలతో పంచుకోనుంది. తద్వారా ఆయా దేశాలు కూడా వీరికి వీసాలు ఇవ్వకుండా, వారిని బ్లాక్‌లిస్టులో పెట్టేలా చర్యలు తీసుకోనుంది. వీసాల విషయంలో అక్రమాలకు పాల్పడినట్టు గుర్తించిన భారత్‌లోని అమెరికా దౌత్య కార్యాలయం 2 వేల మందికి గత నెలలో అప్పాయింట్‌మెంట్లను రద్దు చేసింది. ఈ క్రమంలో ట్రావెల్ ఏజెంట్లు సహా దరఖాస్తు దారులపై విచారణ చేపట్టింది. తాజాగా ఈ విచారణను మరింత విస్తరించింది. అమెరికా వీసా అప్పాయింట్‌మెంట్ వ్యవస్థతో ఆడుకున్న వారిని ఎట్టిపరిస్థితిలోనూ వదిలి పెట్టబోమని దౌత్యకార్యాలయ అధికారి ఒకరు హెచ్చరించారు. "ఇప్పటి వరకు విద్యార్థి వీసాల విషయంలోనే అక్రమ అప్పాయింట్‌మెంట్లపై చర్యలు తీసుకుంటున్నాం. అయితే, పర్యాటక వీసాల అప్పాయింట్‌మెంట్స్‌లోనూ అక్రమాలు జరిగాయని గుర్తించాం. వాటిపై కూడా చర్యలు తీసుకోనున్నాం" అని ఆ అధికారి తెలిపారు.

ముందస్తు తేదీలతో మోసం!

కరోనా అనంతరం.. దేశవ్యాప్తంగా అన్ని కాన్సులేట్స్‌లో వీసా దరఖాస్తులు కుప్పలు తెప్పలుగా పేరుకుపోయాయి. చెన్నైలోని కాన్సులేట్‌లో పర్యాటక వీసా(బీ-1/బీ-2) అప్పాయింట్‌మెంటు కోసం ప్రస్తుతం 440 రోజుల నిరీక్షణ కొనసాగుతోంది. 2023 అక్టోబరు-2024 సెప్టెంబరు మధ్య ఢిల్లీ దౌత్య కార్యాలయం సహా చెన్నై, హైదరాబాద్, ముంబై, కోల్‌కతా కాన్సులేట్స్ 13.75 లక్షల వీసాలను మంజూరు చేశాయి. వీటిలో 9 లక్షల వీసాలు కేవలం పర్యాటకానికి సంబంధించినవే కావడం విశేషం. ఇది సరికొత్త రికార్డు నమోదు చేసింది. కాగా.. డిమాండ్‌కు తగిన విధంగా వీసాలను మంజూరు చేయలేని పరిస్థితి ఏర్పడడంతో దీనిని అక్రమార్కులు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. సమాంతర వ్యవస్థను ఏర్పాటు చేసుకున్న వీసా ఏజెంట్లు.. ఒక్కొక్కరి నుంచి రూ.60 వేల చొప్పున వసూలు చేసి ముందస్తు తేదీలతో కూడిన దరఖాస్తులతో అభ్యర్థులను మోసం చేశారు.

ఈ పిల్లల పరిస్థితేంటి?

మరోవైపు, అమెరికాలోని హెచ్-1బీ వీసా దారుల పిల్లలకు పెద్దకష్టమే వస్తోంది. హెచ్-1బీ వీసాలపై అగ్రరాజ్యంలో నివసిస్తున్నవారి పిల్లలకు 21 ఏళ్ల వయసు వస్తే.. వారిని మేజర్లుగా గుర్తిస్తారు. దీంతో ఇప్పటి వరకు తల్లిదండ్రులపై ఆధారపడి జీవిస్తున్న వారికి ఇచ్చిన 'హెచ్-4' వీసాలు చెల్లుబాటు కావు. ఈ నేపథ్యంలో వారు కొత్త చట్టపరమైన అవకాశాలను వెతుక్కోవడమో.. లేక దేశం విడిచి వెళ్లడమో చేయాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. అయితే.. 21 ఏళ్ల వయసు వచ్చిన తర్వాత కూడా రెండేళ్ల వరకు వారు అమెరికాలో ఉండేందుకు అవకాశం ఉందని, కానీ రూల్స్ మారుతుండటంతో అనిశ్చితి నెలకొందని అన్నారు.

ట్రంప్‌పై అమెరికా వర్సిటీల నిరసనాస్త్రం

విద్యా రంగం స్వేచ్ఛ విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రాజకీయ జోక్యానికి వ్యతిరేకంగా ఆ దేశంలోని యూనివర్సిటీలు ఏకం అవుతున్నాయి. ట్రంప్ ప్రభుత్వం నుంచి ఫెడరల్ పరిశోధన నిధుల నిలిపివేతకు గురైన హార్వర్డ్ యూనివర్సిటీకి బాసటగా నిలిచాయి. 2.2 బిలియన్ డాలర్ల నిధులను స్తంభింపజేయడానికి వ్యతిరేకంగా హార్వర్డ్ వర్సిటీ ఇప్పటికే ట్రంప్ సర్కార్‌పై దావా వేసిన విషయం తెలిసిందే. తమ ప్రభుత్వ విధానాలను విమర్శించిన లేదా వ్యతిరేకించిన యూనివర్సిటీలే టార్గెట్‌గా ట్రంప్ బెదిరింపులకు పాల్పడుతున్నారని, రాజకీయ జోక్యం చేసుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో వర్సిటీల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురవుతోంది. హార్వర్డ్ వేసిన దావా యూనివర్సిటీల్లో కదలిక తెచ్చింది. ట్రంప్ సర్కార్ ఎన్నడూలేని విధంగా పాల్పడుతున్న 'ప్రభుత్వ అతిక్రమణ'ను ఖండిస్తూ 150కి పైగా యూనివర్సిటీ ప్రెసిడెంట్లు తమ సంతకాలతో ఒక సంయుక్త లేఖను విడుదల చేశారు. ట్రంప్ నుంచి విద్యా రంగ స్వేచ్ఛ, సంస్థాగత స్వయంప్రతిపత్తిని ఉమ్మడిగా కాపాడుకుందామని పిలుపునిచ్చారు. ఫెడరల్ ఫండింగ్ ద్వారా యూనివర్సిటీల పాలసీలను ప్రభావితం చేయాలని ప్రభుత్వం యత్నిస్తోందని, ఇది ప్రజాస్వామ్యానికి పునాది అయిన లిబరల్ ఎడ్యుకేషన్ సూత్రాలకు ప్రత్యక్ష బెదిరింపు అని ఆందోళన వ్యక్తం చేశారు. నిర్మాణాత్మకమైన సంస్కరణకు యూనివర్సిటీలు సిద్ధంగానే ఉన్నాయని, అయితే రాజకీయ అజెండాకు అనుగుణంగా బలవంతం చేయకూడదని లేఖ స్పష్టం చేసింది. ఈ విధమైన వైఖరి విద్యాసంస్థల ప్రధాన విలువలను దెబ్బతీస్తాయని పేర్కొంది.

మూడు రోజులు రష్యా కాల్పుల విరమణ

- మే 8-10 మధ్య రెండో ప్రపంచ యుద్ధ విజయోత్సవాలు
- ఈ 3రోజులు ఉక్రెయిన్‌లో కాల్పుల విరమణకు పుతిన్ ఆదేశం



కీవ్, ఏప్రిల్ 28: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఆశ్చర్యకర రీతిలో ఉక్రెయిన్‌తో యుద్ధానికి తాత్కాలికంగా మూడు రోజుల కాల్పుల విరమణ పాటించాలని తమ సైన్యాలను సోమవారం ఆదేశించారు. మే 8 నుంచి 10 మధ్య కాల్పుల విరమణ ఉంటుందని రష్యా అధ్యక్ష భవనం క్రెమ్లిన్ తెలిపింది. నాజీ జర్మనీపై రెండో ప్రపంచ యుద్ధంలో రష్యా సాధించిన విజయానికి గుర్తుగా మే ఎనిమిదో తేదీ (ఏడో తేదీ అర్ధరాత్రి) నుంచి మే 10 వరకూ కాల్పుల విరమణ కొనసాగుతుందని వెల్లడించింది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఆదేశాల మేరకు మే 9న విజయోత్సవ దినం (విక్టరీ డే) సందర్భంగా మానవత్వ కోణంలో శత్రువులపై పూర్తిస్థాయిలో కాల్పుల విరమణ పాటిస్తున్నామని పేర్కొంది. ఉక్రెయిన్‌తో శాంతి ఒప్పందానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్యవర్తిత్వం వహిస్తున్న నేపథ్యంలో రష్యా తాత్కాలికంగా కాల్పుల విరమణ ప్రకటించడం ఆసక్తికర పరిణామం. కానీ, ఉక్రెయిన్‌తో పూర్తిస్థాయిలో భేషరతుగా కాల్పుల విరమణకు పుతిన్ నిరాకరించారు. ఉక్రెయిన్‌తో శాంతి ఒప్పందం చేసుకోవాలంటే ఆ దేశానికి ఆయుధాల పంపిణీని, అవసరమైన నిధుల సమీకరణకు పాశ్చాత్య దేశాలు మద్దతు నిలిపేయాలని పుతిన్ మెలిక పెట్టారు. కాగా, ఉక్రెయిన్ కూడా పరస్పరం కాల్పుల విరమణ పాటిస్తుందని క్రెమ్లిన్ ఆశాభావం వ్యక్తంచేసింది. తద్వారా యుద్ధానికి చరమగీతం పాడేందుకు ఇరు దేశాల మధ్య ప్రత్యక్ష చర్చలకు ఇది ముందడుగు అవుతుందన్న రష్యా సంకేతాలిచ్చింది. 2022లో యుద్ధం మొదలైనప్పటి నుంచి భేషరతుగా పరస్పరం చర్చలకు సిద్ధమని ప్రకటించడం ఇదే ప్రథమం. కానీ, తమ భూభాగంలోని నాలుగు రీజియన్లను విలీనం చేసుకున్న పుతిన్‌తో ప్రత్యక్ష చర్చలు జరిపేది లేదని ఉక్రెయిన్ తేల్చి చెప్పింది.

పోలీసు భద్రతతో నీట్ ప్రశ్నపత్రాల రవాణా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28 : నీట్ పరీక్షలో ఎటువంటి అవకతవకలు చోటు చేసుకోకుండా కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోంది. ఇందుకు కేంద్ర విద్యాశాఖ అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల కలెక్టర్లు, ఎస్పీలతో వరుసగా సమావేశాలు నిర్వహిస్తోంది. మే 4వ తేదీన ఈ పరీక్షను దేశ వ్యాప్తంగా 550 నగరాల్లోని 5000కు పైగా కేంద్రాల్లో నిర్వహించనున్నారు. గత ఏడాది ఈ పరీక్ష నిర్వహణపై పలు ఆరోపణలు వచ్చిన దృష్ట్యా ఈసారి ఎటువంటి లోపాలు తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. నీట్ ప్రశ్నపత్రాల రవాణా, భద్రతకు అలాగే సమస్యల నివారణకు ఇప్పటికే ప్రతి జిల్లాలో ఏర్పాటు చేసిన సమన్వయ కమిటీలు పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. పరీక్ష కేంద్రాల వద్ద జాతీయ పరీక్ష ఏజెన్సీ(ఎన్టీయే) నియమించే సిబ్బందితోపాటు ఆయా జిల్లాల పోలీసులు తనిఖీలు చేపడతారు. ప్రశ్నపత్రాలు, ఓఎంఆర్ షీట్ల వంటి ముఖ్యమైన వాటిని పూర్తిగా పోలీసు భద్రతతోనే రవాణా చేస్తారు. మోసాలకు పాల్పడకుండా కోచింగ్ సెంటర్లు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లపై నిఘా ఉంచుతారు. అన్ని పరీక్ష కేంద్రాలను డ్యూటీ మేజిస్ట్రేట్‌లు తప్పనిసరిగా తనిఖీ చేయాలి. అలాగే జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు ఆ కేంద్రాల వద్ద ఏర్పాట్లను పరిశీలించాలి.

అశ్లీల చిత్రాలపై నిషేధం కోర్టు పరిధిలో ఉంటుందా?

- సుప్రీంకోర్టు సందేహం
- న్యాయస్థానం ఆదేశాలు ఇవ్వొచ్చు
- సొలిసిటర్ జనరల్ సమాధానం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28: న్యాయ వ్యవస్థ అధికారాల విషయం మరోమారు సుప్రీంకోర్టులో చర్చకు వచ్చింది. కోర్టులు పరిధులు దాటుతున్నాయంటూ విమర్శలు వస్తున్న నేపథ్యంలో కాబోయే ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ సోమవారం ఆ విషయాన్ని ప్రస్తావించారు. ఓటీటీ, సామాజిక మాధ్యమాల్లో అశ్లీల అంశాలను నిషేధించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "నిషేధాలు విధించడం మా పరిధిలోకి రాదు. కార్యనిర్వాహక వ్యవస్థ పరిధిలోకి వస్తుంది. కార్యనిర్వాహక వ్యవస్థ, శాసన వ్యవస్థల్లో జోక్యం చేసుకుంటున్నామని విమర్శలు వస్తున్న నేపథ్యంలో కోర్టులు విచారించగలవా?" అని ప్రశ్నించారు. న్యాయవాది విష్ణు శంకర్ జైన్ ఈ పిటిషన్ వేశారు. దీనిపై జస్టిస్ గవాయ్‌తో పాటు, జస్టిస్ ఆగస్టైన్ మాసిహ్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది.సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ దీన్ని ప్రభుత్వ వ్యతిరేక వ్యాజ్యంగా పరిగణించబోమని తెలిపారు. దీనిపై ఇక్కడే విచారణ జరపాలని కోరారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ కేంద్రానికి, కొన్ని ఓటీటీలు, సోషల్ మీడియా సంస్థలకు నోటీసులు ఇస్తామని తెలిపింది. ఓటీటీలకు సామాజిక బాధ్యత అవసరమని వ్యాఖ్యానించింది.



అమరావతిలోని విట్ క్యాంపస్‌లో నిర్వహించిన వి లాంచ్‌ప్యాడ్ 2025లో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

ఉద్యోగులు కాదు.. ఉద్యోగాలిచ్చేవారు కావాలి

దేశంలోని ఏడు బెస్ట్ వర్సిటీలు రాజధానిలోనే..

అమరావతి అన్‌స్టాపబుల్: చంద్రబాబు

గుంటూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ఏడు బెస్ట్ యూనివర్సిటీలు అమరావతిలో రానున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఇక ఇప్పుడు అమరావతి అన్‌స్టాపబుల్ అంటూ వ్యాఖ్యానించారు. విట్ అమరావతి, ఎస్ఆర్ఎమ్, అమృత్ వంటి సంస్థలు ఇప్పటికే ఉండగా త్వరలో బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, టాటా ఇన్నొవేషన్ సెంటర్ రాబోతున్నాయని వివరించారు. ముఖ్యమంత్రి సోమవారం వీఐటీ అమరావతి యూనివర్సిటీ సోమవారం నిర్వహించిన 'వీ-లాంచ్‌ప్యాడ్ 2025' కార్యక్రమంలో పాల్గొన్నారు. 4 కొత్త హాస్టల్ బ్లాకులను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. 'ప్రపంచ అత్యుత్తమ సంస్థలను, విజ్ఞానాన్ని మీ ముందుకు తీసుకొచ్చి పెడతా.. అందిపుచ్చుకోండి.' అంటూ ఉత్సాహపరిచారు. మంత్రి కందుల దుర్గేశ్, విట్ చాన్స్‌లర్ జీ. విశ్వనాథన్, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు. సీఎం ఏమన్నారంటే..


అమరావతిలోని విట్ వర్సిటీలో మొక్క నాటుతున్న సీఎం చంద్రబాబు

ఆ బాధ్యత తీసుకుంటా..

"విట్ అధినేత విశ్వనాథన్ 20 ఏళ్ల రాజకీయ జీవితంలో అన్నాదురై, కరుణానిధి, ఎంజీఆర్, జయలలితతో కలిసి పనిచేశారు. 2014లో నన్ను కలిసి అమరావతిలో విట్ ఏర్పాటుకు అనుమతి కోరారు. ఆయన 200 ఎకరాలు అడగ్గా, 100 ఎకరాలు ఇచ్చాను. వారికి మరింత భూమి ఇచ్చే బాధ్యత నేను తీసుకుంటా. రాబోయే ఏడేళ్లలో 50 వేల మంది విట్‌లో చదివేలా అభివృద్ధి చేసే బాధ్యత యాజమాన్యం తీసుకోవాలి. ప్రపంచంలోని టాప్ 100 వర్సిటీల్లో విట్ ఉండటం మనకు గర్వకారణం. విట్ విద్యాసంస్థల్లో మన అమరావతి విట్ నెంబర్‌వన్‌గా ఉండాలి."

మేధోసంపత్తి తెలుగువారి సొంతం

'నాలెడ్జ్ ఎకానమీలో ప్రపంచవ్యాప్తంగా భారతీయులు ముందుంటే, అందులో తెలుగువారు ట్రెండ్ సెట్టర్లుగా ఉన్నారు. మన తెలుగువారి జనాభా 5 శాతమే అయినప్పటికీ ఐఐటీల్లో 20 శాతం సీట్లు మనవాళ్లే సాధిస్తున్నారు. సిలికాన్ వ్యాలీ నుంచి స్పేస్ ఎక్స్ వరకు, గూగుల్ నుంచి మైక్రోసాఫ్ట్ వరకు, నాసా నుంచి వాల్ స్ట్రీట్ వరకు అన్ని చోట్లా మన తెలుగువారే సత్తా చాటుతున్నారు. సుందర్ పిచాయ్, సత్య నాదెళ్ల, ఇంద్రానూయీ, అజయ్ బంగా, శాంతను నారాయణ్ వంటి వారు గ్లోబల్ సంస్థల్ని బలోపేతం చేస్తుండటం మనకు గర్వకారణం. అలాంటి మేధోసంపత్తి తెలుగువారి సొంతం. సమాజమే దేవాలయం... ప్రజలే దేవుళ్లు అని నినదించిన ఎన్టీఆర్ స్ఫూర్తితో పీ4కు శ్రీకారం చుట్టాం. టెర్రరిస్టుల కుట్రలు, కుయుక్తులు మనల్ని ఏం చేయలేవు. మన ఐక్యతను దెబ్బతీయలేవు. రాష్ట్రంలోనే అత్యధిక తలసరి ఆదాయం ఉన్న విశాఖను ఆర్థిక రాజధానిగా, తిరుపతిని ఆధ్యాత్మిక నగరంగా తీర్చిదిద్దుతాం. విశాఖకు కొత్త ఎయిర్ పోర్టు, మెట్రోతో పాటు గూగుల్ రాబోతోంది. రాయలసీమలో స్టీల్ ప్లాంట్ నిర్మాణం చేపడతాం. అనంతపురంలో లేపాక్షి మొదలు ఓర్వకల్లు వరకూ నాలెడ్జ్ హబ్‌గా తయారు చేస్తాం. రాయలసీమను డిఫెన్స్, ఎలక్ట్రానిక్, ఆటో మొబైల్స్, డ్రోన్, శాటిలైట్ లాంచింగ్, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో అభివృద్ధి చేస్తాం. భవిష్యత్తు డ్రోన్లదే. ఓర్వకల్లులో డ్రోన్ సిటీ ఏర్పాటు చేస్తాం.

ఇదే రాజధాని!

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి 5 వేల ఎకరాలు భూసేకరణ చేస్తే అంత ఎందుకని చాలా మంది ప్రశ్నించారు. ముందుచూపుతో అంత భూమి సేకరించబట్టే నేడు అంతర్జాతీయ విమానాశ్రయంతోపాటు పెద్ద పెద్ద హోటళ్లు, మాల్స్ వచ్చి అక్కడ భారీ ఎత్తున ఆర్థిక కార్యకలాపాలు పెరిగాయి. అక్కడ చుట్టుపక్కల భూముల ధరలూ పెరిగి రైతులకు మేలు చేకూరింది. అమరావతిలో కూడా అంతర్జాతీయ విమానాశ్రయం, క్రికెట్ స్టేడియం నిర్మాణాలకు మరికొంత భూమి అవసరం. రాజధాని కోసం స్వచ్ఛందంగా భూములు ఇచ్చిన రైతుల అభీష్టానికి వ్యతిరేకంగా, వారికి నష్టం కలిగేలా ఏ కార్యక్రమం.. నిర్ణయం ఉండదు." అని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీఎం ఏమన్నారంటే..

> "అదనపు భూసమీకరణ కారణంగా అమరావతిలో భూముల ధరలు పడిపోతాయనే అపోహలకు గురికావద్దు. అంతర్జాతీయ విమానాశ్రయం వస్తేనే అమరావతి అంతర్జాతీయ నగరంగా ఎదుగుతుంది. లేనిపక్షంలో మున్సిపాలిటీగానే మిగిలిపోతుంది. మీకు అమరావతిని మున్సిపాలిటీగా చూడాలని ఉందా? లేక అంతర్జాతీయ నగరంగా చూడాలని ఉందా? మీ పోరాటమూ, స్థలబలమే అమరావతిని పరిరక్షించాయి. అమరావతి రాజధానిని విధ్వంసం నుంచి అభివృద్ధి వైపు తీసుకెళుతున్నాం."
>
> \- సీఎం చంద్రబాబు

బంధుమిత్ర సపరివారంగా రండి..

"కృష్ణానదిపై మరో మూడు, నాలుగు వారధులు వస్తాయి. ఇన్నర్, ఔటర్ రింగు రోడ్లు వస్తాయి. దీనివల్ల ఇతర ప్రాంతాలకు కనెక్టివిటీ పెరుగుతుంది. రాజధాని విస్తరించడం వల్ల పెద్ద ఎత్తున సంస్థలు, పెట్టుబడులు వస్తాయి. అదనపు భూసమీకరణ కారణంగా ఈ ప్రాంతంలో భూముల ధరలు పడిపోతాయనే అపోహలకు గురికావద్దు. అంతర్జాతీయ విమానాశ్రయం వస్తేనే అమరావతి అంతర్జాతీయ నగరంగా ఎదుగుతుంది. లేని పక్షంలో మున్సిపాలిటీగానే మిగిలిపోతుంది. మీకు అమరావతిని మున్సిపాలిటీగా చూడాలని ఉందా లేక అంతర్జాతీయ నగరంగా చూడాలని ఉందా? అమరావతి రాజధానిని విధ్వంసం నుంచి అభివృద్ధి వైపు తీసుకెళుతున్నాం. ప్రధాని మోదీ మే 2న అమరావతి వస్తున్నారు. అమరావతి ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొనాలి. ప్రధాని సభకు బంధుమిత్ర సపరివారంగా రావాలి."

రైతుల పోరాటం వల్లే అమరావతి సురక్షితం..

"రాజధాని రైతుల త్యాగం కారణంగానే నేడు ప్రపంచ స్థాయి రాజధాని నిర్మాణం చేసుకుంటున్నాం. ఎప్పటికీ రైతుల మంచి మనసును రాష్ట్ర ప్రజలు గుర్తుంచుకుంటారు. దేవతల రాజధాని కాబట్టే కదిలించలేకపోయారు. మే 2 తర్వాత రాజధాని నిర్మాణం వేగవంతమవుతుంది. రైతులకు కేటాయించిన ప్లాట్లను కూడా అభివృద్ధి చేస్తాం." అని చంద్రబాబు భరోసా ఇచ్చారు.

రాజధాని ఉద్యమ ఘట్టాలతో మ్యూజియం

రాజధాని ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన రైతుల త్యాగాలకు గుర్తుగా స్మారకచిహ్నం ఏర్పాటు చేయాలని రైతులు కోరగా, అందుకు సీఎం అంగీకరించారు. శాతవాహన కాలం నుంచి అమరావతి ఉద్యమం వరకు జరిగిన పరిణామలన్నీ క్రోడీకరిస్తూ మ్యూజియం ఏర్పాటు చేస్తామన్నారు. రాజధాని పరిధిలోని గ్రామ కంఠాల్లో ప్రస్తుతం నివాసం ఉంటూ పట్టాల్లేని వారికి పట్టాలివ్వాలని రైతులు కోరగా ఈ కార్యక్రమాన్ని కూడా త్వరలోనే చేపడతామని సీఎం హామీ ఇచ్చారు. అమరావతి ఏకైక రాజధానిగా పార్లమెంటులో చట్టం చేయాలని రాజధాని రైతులు కోరగా సీఎం తప్పకుండా చేస్తామని హామీ ఇచ్చారు. గత 10 ఏళ్లలో హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ఉన్నందునే ఆ ప్రతిపాదన చేయలేకపోయామన్నారు. రైతుల ప్లాట్లకు రుణాలు ఇవ్వడం లేదని ఓ రైతు సీఎంకి ఫిర్యాదు చేశారు. దీనిపై సీఎం స్పందిస్తూ.. వెంటనే బ్యాంకర్లతో మాట్లాడి రుణాలు ఇచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. రాజధాని రైతులకు ఇక్కడ జరుగుతున్న అభివృద్ధిపై నమ్మకం కలిగించేందుకే తాను కూడా ఇక్కడే స్థలం కొని ఇల్లు కట్టుకుంటున్నానని సీఎం తెలిపారు. అనంతరం రాజధాని రైతులు మాట్లాడుతూ.. తమకు ఎలాంటి సమస్యలు లేవని, కేవలం కొన్ని అపోహలు మాత్రమే ఉన్నాయని, వాటిని ముఖ్యమంత్రి తొలగించారని అన్నారు. సమావేశంలో మంత్రులు నారాయణ, అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనిత, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.


సీఎం నివాసంలో జరిగిన సమావేశానికి హాజరైన అమరావతి రైతులు, మహిళలు

కొన్ని శక్తులు కుట్రలు చేస్తున్నాయి

అభివృద్ధిపై బురద చల్లుతున్నాయి

- ప్రజలను అప్రమత్తం చేయండి
- కూటమి నేతలతో సీఎం టెలికాన్ఫరెన్స్

అమరావతి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): "రాష్ట్రానికి పరిశ్రమలు వస్తే యువతకు పెద్దఎత్తున ఉద్యోగాలు వస్తాయి. కానీ కొన్ని వ్యతిరేక శక్తులు కుట్రతో ప్రజలను కావాలనే తప్పుదోవ పట్టిస్తున్నాయి. అభివృద్ధిపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయి. ఈ విషయంలో మనం అప్రమత్తంగా ఉంటూ ప్రజలనూ అప్రమత్తం చేయాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. మే 2న ప్రధాని అమరావతి సభపై సోమవారం కూటమి పార్టీల నేతలతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. చేస్తున్న మంచి పనుల గురించి వివరించే బాధ్యత ఎమ్మెల్యేలు, మంత్రులు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోకున్నా.. ఎన్ని ఇబ్బందులున్నా అధిగమిస్తూ సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి పెట్టామన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ, ముందుకు వెళ్తున్నామని తెలిపారు. వచ్చే నెలలో రైతులకు అన్నదాత కింద పెట్టుబడి సాయం అందిస్తామన్నారు. ఒక కుటుంబం నివసించేందుకు మంచి ఇల్లు ఎలాగైతే ఉండాలో రాష్ట్ర ప్రజలు గర్వంగా చెప్పుకోవడానికి రాజధాని ఉండాలన్నారు. అభివృద్ధి వికేంద్రకరణ ఎన్డీయే విధానం కాబట్టే 2014 నుంచి కేంద్ర విద్యాసంస్థలు ఉత్తరాంధ్ర, కోస్తా, సీమ జిల్లాల్లో ఏర్పాటు చేశామన్నారు. అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తామని, ఇదే తమ విధానమని స్పష్టం చేశారు. తెలంగాణకు హైదరాబాద్, కర్ణాటకకు బెంగళూరు, తమిళనాడుకు చెన్నై రాజధాని నగరాల నుంచే 70 శాతం ఆదాయం వస్తోందని గుర్తు చేశారు. "మనకు కూడా మంచి నగరం ఉంటే రాష్ట్రానికి సమృద్ధిగా ఆదాయం సమకూరుతుంది. అమరావతి అందరిదీ. రాష్ట్రానికి ఆత్మ లాంటిది. మే 2న రాష్ట్రానికి వస్తున్న ప్రధాని మోదీకి ఘనస్వాగతం పలకడంతోపాటు సభను విజయవంతం చేద్దాం. రాజధాని పునర్నిర్మాణ పనులతో అభివృద్ధికి మళ్లీ ఊపిరిపోద్దాం' అని పిలుపిచ్చారు. సభకు తరలివచ్చే ప్రజలకు అసౌకర్యం కలుగకుండా పార్టీ నాయకులు చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా త్వరలోనే 42 నియోజకవర్గాల్లో ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేస్తామని.. రాబోయే రోజుల్లో 175 నియోజకవర్గాల్లోనూ ఏర్పాటు చేసి 'వన్ ఫ్యామిలీ.. వన్ ఎంట్రప్రెన్యూర్' అనే లక్ష్యాన్ని సాధిస్తామన్నారు.

బీజేపీ రాజ్యసభ అభ్యర్థిగా పాకా సత్యనారాయణ

- సాయిరెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన సీటు
- భీమవరానికి చెందిన బీసీ నేతకు అవకాశం
- ప్రస్తుతం పార్టీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ చైర్మన్
- 45 ఏళ్లుగా పార్టీకి సేవలు.. విధేయుడిగా పేరు
- నేడు కూటమి తరఫున నామినేషన్ దాఖలు



అమరావతి/న్యూఢిల్లీ/భీమవరం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): వైసీపీతో పాటు రాజ్యసభ సభ్యత్వానికి విజయసాయి రెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన సీటు బీజేపీ ఖాతాలో చేరనుంది. ఎన్డీయే కూటమి తరఫున బీజేపీ రాజ్యసభ అభ్యర్థిగా పాకా వెంకట సత్యనారాయణ (64)ను ఆ పార్టీ అధిష్ఠానం ఖరారు చేసింది. సోమవారం బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కేంద్ర కార్యాలయ ఇన్‌చార్జి అరుణ్ సింగ్ ఈ మేరకు ప్రకటనలో వెల్లడించారు. ఈ సీటుకు పలువురు పోటీ పడగా బీజేపీ అధిష్ఠానం మాత్రం పార్టీలో నమ్మకస్తుడిగా పేరున్న పాకా సత్యనారాయణకు పట్టం కట్టింది. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన సత్యనారాయణ ప్రస్తుతం రాష్ట్ర బీజేపీ క్రమశిక్షణ సంఘం చైర్మన్‌గా ఉన్నారు. బీసీ(గౌడ) వర్గానికి చెందిన ఆయన దాదాపు 45 ఏళ్లుగా బీజేపీ జెండా మోస్తున్నారు. చదువుకునే రోజుల్లో భీమవరంలోని డీఎన్ఆర్ కాలేజీలో ఏబీవీపీలో చురుగ్గా పనిచేస్తూనే, ఆర్ఎస్ఎస్ కార్యక్రమాల్లో పాల్గొనేవారు. ఆ తర్వాత 1980లో బీజేపీలో చేరారు. భీమవరం పట్టణ పార్టీ అధ్యక్ష పదవితో పాటు జిల్లా, రాష్ట్ర స్థాయిలో పలు హోదాల్లో పనిచేశారు. తొలి నుంచి పార్టీ పట్ల విధేయతతో ఉంటూ వస్తున్నారు. ప్రతి ఎన్నికలోనూ పార్టీ అభ్యర్థుల విజయానికి ప్రణాళికలు వేస్తూ సేవలందించారు. క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా పేరున్న సత్యనారాయణను 2021 నుంచి రాష్ట్ర బీజేపీ క్రమశిక్షణా కమిటీ చైర్మన్‌గా కొనసాగిస్తోంది. గత నెలలో రాష్ట్రంలో భర్తీ అయిన ఐదు ఎమ్మెల్సీ స్థానాల్లో కూటమి నుంచి అనూహ్యంగా బీజేపీకి ఒకటి దక్కింది. బీసీ వర్గానికి చెందిన పాకా సత్యనారాయణకు కచ్చితంగా దక్కుతుందని పార్టీలో పెద్ద ఎత్తున చర్చ జరిగింది. అయితే సోము వీర్రాజుకు దానిని కేటాయించిన పార్టీ పెద్దలు.. తాజాగా రాజ్యసభ స్థానానికి పాకా సత్యనారాయణను ఎంపిక చేశారు. మంగళవారం ఆయన నామినేషన్‌ను దాఖలు చేయనున్నారు. ఇప్పటికే రాష్ట్రం నుంచి బీజేపీ తరఫున ఆర్.కృష్ణయ్య రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

సామాన్య కుటుంబం నుంచి..

1961లో సామాన్య రైతుకుటుంబంలో నరసింహమూర్తి, వెంకట నర్సమ్మ దంపతులకు పాకా సత్యనారాయణ జన్మించారు. ఎంఏ, బీఎల్ చదివారు. న్యాయవాది వృత్తిలో కొనసాగుతున్నారు. భార్య గృహిణి. ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. గడచిన పార్లమెంట్ ఎన్నికల్లో పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం బీజేపీ అభ్యర్థిగా ఆయన పేరును పరిశీలించారు. ఇప్పుడు రాజ్యసభ అభ్యర్థిగా ఎంపిక చేయడంపై పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. రాజ్యసభ సీటు సత్యనారాయణకు దక్కడంతో పశ్చిమగోదావరి జిల్లాకు రాజకీయ ప్రాధాన్యం లభించినట్టయ్యింది. ఇప్పటికే జిల్లాకు చెందిన ఎంపీ భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ కేంద్ర మంత్రివర్గంలో ఉన్నారు.

2 మేయర్ పీఠాలు టీడీపీకే

విశాఖలో పీలా, గుంటూరుకు కోవెలమూడి

కుప్పం, తుని, పాలకొండ చైర్‌పర్సన్ స్థానాలూ టీడీపీ ఖాతాలోకే

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రెండు ప్రధాన నగరాలు, రెండు పట్టణాలు, ఒక నగర పంచాయతీలో టీడీపీ కూటమి పాగావేసింది. విశాఖ, గుంటూరు నగరాల మేయర్ స్థానాలను.. కుప్పం, తుని మున్సిపల్, పాలకొండ నగర పంచాయతీ చైర్‌పర్సన్ పదవులను తెలుగుదేశం పార్టీ కైవసం చేసుకుంది. మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) మేయర్‌గా టీడీపీకి చెందిన 96వ వార్డు కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. జీవీఎంసీ మేయర్‌గా ఉన్న గొలగాని హరి వెంకటకుమారిపై కూటమి కార్పొరేటర్లు ఇటీవల ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో ఆమె పదవి నుంచి వైదొలగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మేయర్ ఎన్నికకు సోమవారం కౌన్సిల్ ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. కూటమి అభ్యర్థిగా పీలా పేరును జనసేన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రతిపాదించగా.. బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు బలపరిచారు. పోటీలో ఎవరూ లేకపోవడంతో పీలా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఆయనకు ధ్రువీకరణ పత్రం అందజేసి మేయర్‌గా ప్రమాణం చేయించారు. బాధ్యతలు స్వీకరించిన పీలాను కూటమి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లతోపాటు అధికారులు, కూటమి నేతలు అభినందించారు. విశాఖ కార్పొరేషన్‌లో 98 స్థానాలుండగా.. గత ఏడాది వరకు వైసీపీకి 59, టీడీపీకి 28, జనసేన 3, బీజేపీ, సీపీఎం, సీపీఐలకు తలొకటి.. నలుగురు స్వతంత్ర కార్పొరేటర్లు ఉండేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పలువురు వైసీపీ కార్పొరేటర్లు టీడీపీ, జనసేనల్లో చేరారు. ప్రస్తుతం టీడీపీకి 48, జనసేనకు 14, బీజేపీకి ఇద్దరు కార్పొరేటర్లు ఉన్నారు. విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌కు 1987లో మొదటిసారి టీడీపీ నుంచి డీవీ సుబ్బారావు మేయర్‌గా ఎన్నికయ్యారు. ఆ తర్వాత ఆ పార్టీ నుంచి ఎన్నికైనది పీలా శ్రీనివాసరావే కావడం విశేషం. ఇక గుంటూరు కార్పొరేషన్ మేయర్‌గా కోవెలమూడి రవీంద్ర(నాని) ఎన్నికయ్యారు. సోమవారం జరిగిన ఎన్నికలో కూటమి తరఫున కోవెలమూడి, వైసీపీ అభ్యర్థిగా అచ్చాల వెంకటరెడ్డి బరిలో నిలిచారు. 2021 కార్పొరేషన్ ఎన్నికల్లో 57 స్థానాలకు గాను వైసీపీకి 47, టీడీపీకి 8, జనసేనకు 2 వచ్చాయి. గత ఏడాది టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక వైసీపీ నుంచి 16 మంది కార్పొరేటర్లు టీడీపీలో, మరో నలుగురు జనసేనలో చేరారు. దీంతో కూటమి బలం 30కి చేరింది. ఎంపీ-కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ముగ్గురు టీడీపీ ఎమ్మెల్యేలు, ఇద్దరు వైసీపీ ఎమ్మెల్సీలు, ఒక టీడీపీ ఎమ్మెల్సీ సహా 61 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. కోవెలమూడికి 34, వైసీపీకి 27 ఓట్లు వచ్చాయి. కోవెలమూడి 7 ఓట్ల మెజారిటీ గెలుపొందినట్లు ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవతేజ ప్రకటించారు. ఈ మేరకు డిక్లరేషన్ ఫామ్‌ను అందజేశారు. నాని పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు మాధవి, నసీర్ అహ్మద్, రామాంజనేయులు తదితరుల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత జీఎంసీ నుంచి ప్రత్యేక వాహనంపై భారీ ర్యాలీ నిర్వహించారు.


తుని చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌తో ఎమ్మెల్యే దివ్య


పాలకొండ నగర పంచాయతీ చైర్‌పర్సన్ మల్లేశ్వరి


పీలా శ్రీనివాసరావు, విశాఖ


కె.రవీంద్ర, గుంటూరు


వి.సెల్వరాజ్,కుప్పం

- సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలోని కుప్పం మున్సిపాలిటీ నాలుగేళ్ల తర్వాత టీడీపీ వశమైంది. ఈ ఎన్నికల్లో 24 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వైసీపీ అభ్యర్థి, వైస్‌చైర్మన్-2 ఎస్‌డీ హఫీజ్‌కు 9 ఓట్లు, టీడీపీ అభ్యర్థి సెల్వరాజ్‌కు 15 ఓట్లు లభించాయి.
- కాకినాడ జిల్లా తుని మున్సిపాలిటీ టీడీపీ ఖాతాలో చేరింది. మున్సిపల్ చైర్‌పర్సన్‌గా టీడీపీ అభ్యర్థి నార్ల భువనసుందరి, వైస్ చైర్మన్‌గా ఆచంట రమేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.
- పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండలో వైసీపీకి పెద్ద షాక్ తగిలింది. జగన్ ఇటీవల పాలకొండ వచ్చి నగర పంచాయతీ కౌన్సిలర్లతో సమావేశం ఏర్పాటు చేసి చైర్‌పర్సన్ పదవి చేజారకుండా చూసుకోవాలని చెప్పినా ఫలితం లేకపోయింది. టీడీపీ అభ్యర్థి ఆకుల మల్లీశ్వరి చైర్‌పర్సన్ పదవికి నామినేషన్ వేశారు. ఇప్పటికి రెండు సార్లు కోరం లేక ఎన్నిక వాయిదా పడింది. సోమవారంనాటి ఎన్నికల్లో మల్లీశ్వరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఏనుగుల గుర్తింపునకు టాస్క్‌ఫోర్స్

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాలతో ఏర్పాటు

అమరావతి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఏనుగుల గుంపుల వల్ల పంటల ధ్వంసం, రైతులు దుర్మరణం చెందుతున్న ఘటనల నేపథ్యంలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశించారు. వరుస ఘటనలపై సోమవారం అటవీ అధికారులతో డిప్యూటీ సీఎం టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. ఇలాంటి ఘటనలపై అప్రమత్తంగా ఉండాలని అధికారులకు చెప్పారు. ఏనుగుల వల్ల ప్రజలకు, ప్రజల వల్ల ఏనుగులకు హాని జరక్కుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏనుగుల రాకపోకలను ట్రాక్ చేయడానికి అధునాత సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని సూచించారు. పవన్ ఆదేశాలతో తిరుపతి డీఎఫ్‌వో వివేక్ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశారు. చిత్తూరు డీఎఫ్‌వో భరణితోపాటు ఫ్లయింగ్ స్క్వాడ్‌కు చెందిన పీలేరు, తిరుపతి డీఎఫ్‌వోలు, బాకరాపేట, పనపక్కం, చిత్తూరు ఈస్ట్, వెస్ట్ పరిధిలోని ఆర్ఎఫ్‌వోల టీమ్‌లు, పది మంది ఎలిఫెంట్ ట్రాకర్స్‌ను టాస్క్‌ఫోర్స్‌లో నియమించారు.

గ్రామ మత్స్య సహాయకుల హేతుబద్ధీకరణ

అమరావతి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): గ్రామ మత్స్య సహాయకుల (వీఎఫ్ఏ) పోస్టులు, బదిలీల విషయంలో ఉమ్మడి జిల్లాలను యూనిట్‌గా తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. పశుసంవర్థక శాఖతో సంప్రదించి, వీఎఫ్ఏ పోస్టులను హేతుబద్ధీకరణ చేయనున్నారు. సచివాలయల క్లస్టర్‌లో ఉన్న వీఎఫ్ఏలను పని ఉన్న గ్రామాలకు మార్చనున్నారు. కొత్త క్లస్టర్‌లో వీఎఫ్ఏ పోస్టు లేకపోతే పశుసంవర్థక సహాయకులను బదిలీ చేస్తారు. ఇన్‌ల్యాండ్, మెరైన్, ఆక్వాకల్చర్ విభాగాల వారీగా సాగు, పని ఉన్న గ్రామాలకే వీఎఫ్ఏలను పరిమితం చేయనున్నారు. వీఎఫ్ఏలను మత్స్యశాఖలోని ఏ పోస్టుకూ బదిలీ చేయరాదని నిర్ణయించినట్లు తెలిసింది.

వేసవి ప్రత్యేక రైళ్లు పొడగింపు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): చర్లపల్లి రైల్వే టెర్మినల్ నుంచి కాకినాడ, నర్సాపూర్ ప్రాంతాలకు ప్రస్తుతం నడుస్తున్న వేసవి ప్రత్యేక రైళ్లను మరికొంత కాలం పొడిగించాలని దక్షిణమధ్యరైల్వే నిర్ణయించింది. ఆయా మార్గాల్లో మొత్తం 36 సర్వీసులను జూన్ 29వరకు పొడిగిస్తున్నామని సీపీఆర్‌ఓ శ్రీధర్ తెలిపారు. చర్లపల్లి నుంచి కాకినాడ మధ్య(07031/07032) ప్రత్యేకరైళ్లు 18, చర్లపల్లి- నర్సాపూర్ మధ్య (07233/07234) ప్రత్యేకరైళ్లు 18 నడుస్తాయని పేర్కొన్నారు.


అమరావతిలో ప్రధాని పర్యటన సందర్భంగా మోదీ కాన్వాయ్ వెళ్లేందుకు వేసిన తారు రోడ్డు

ప్రధాని పర్యటన ఏర్పాట్లపై సీఎస్ సమీక్ష

- విస్తృత ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశం

అమరావతి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మే 2న అమరావతి పనుల పునః ప్రారంభానికి రానున్న ప్రధాని మోదీ పర్యటన ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ సోమవారం అధికారులతో సమీక్షించారు. విస్తృత ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చే ప్రజలందరూ మధ్యాహ్నం 1.30 గంటలకు సభావేదిక వద్దకు చేరుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి బస్సుకు ఒక వ్యక్తిని ఇన్‌చార్జిగా ఉంచి.. ప్రజలను సురక్షితంగా తీసుకువచ్చి, తిరిగి వారి గమ్యస్థానాలకు చేర్చే విధంగా జాగ్రతలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వేసవి దృష్ట్యా సభకు వచ్చే వారందరికీ ఆహారం, తాగునీరు వంటి సౌకర్యాలు ఏర్పాట్లు చేయాలన్నారు. ఎక్కడా ట్రాఫిక్ జామ్ కాకుండా ముందుగానే తగిన ప్రణాళిక చేసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులు, కలెక్టర్లను ఆదేశించారు. ఈ సమావేశంలో ఏర్పాట్ల పర్యవేక్షణ రాష్ట్ర నోడల్ అధికారి వీరపాండ్యన్ ప్రధాని మోదీ పర్యటన కార్యక్రమాన్ని వివరించారు. ప్రధాని 2వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని, తర్వాత హెలికాప్టర్‌లో రాష్ట్ర సచివాలయ ప్రాంగణానికి, అక్కడ నుంచి సభా వేదిక వద్దకు వస్తారని పేర్కొన్నారు. సభ ముగిసిన అనంతరం తిరిగి హెలికాప్టర్‌లో విమానాశ్రయం చేరుకుని ఢిల్లీ బయలుదేరివెళతారని చెప్పారు.

విజయవాడ నేతలతో మంత్రి అచ్చెన్న టెలీకాన్ఫరెన్స్

ప్రధాని పర్యటన ఏర్పాట్లపై మంత్రి అచ్చెన్నాయుడు టెలీకాన్ఫరెన్స్ ద్వారా విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు బోండా ఉమా, గద్దె రామ్మోహన్, సుజనాచౌదరి తదితరులతో మాట్లాడారు.

పద్మభూషణ్ బాలయ్యకు సీఎం అభినందనలు

అమరావతి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పద్మభూషణ్ అవార్డును రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకున్న హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందనలు తెలిపారు. కళా,సేవా,రాజకీయరంగాల్లో తనదైన ముద్ర వేసుకున్న బాలయ్య మరిన్ని నూతన శిఖరాలు అధిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని 'ఎక్స్'లో చంద్రబాబు పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కూడా బాలయ్యకు అభినందనలు తెలిపారు.

బాలకృష్ణకు డిప్యూటీ సీఎం పవన్ శుభాకాంక్షలు

అమరావతి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): హిందూపురం ఎమ్మెల్యే, ప్రముఖ నటుడు నందమూరి బాలకృష్ణ రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మభూషణ్ పురస్కారం స్వీకరించిన సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ హృదయపూర్వక శుభాకాంక్షలు చెప్పారు. తెలుగు చలనచిత్ర పరిశ్రమలో బాలకృష్ణకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. చారిత్రక, పౌరాణిక, జానపద పాత్రల్లో ఆయన నటన ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటుందన్నారు. ప్రజాసేవలో, కళాసేవలో బాలకృష్ణ మరిన్ని మైలురాళ్లు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఆయనతో పాటు పద్మభూషణ్ అవార్డు స్వీకరించిన తమిళ నటుడు అజిత్‌కు కూడా పవన్ అభినందనలు తెలిపారు.

మరెన్నో విజయాలు సాధించాలి: అచ్చెన్న

మరోవైపు బాలకృష్ణ పద్మభూషణ్ అందుకోవడంపై మంత్రి అచ్చెన్నాయుడు సంతోషం వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ వారసుడిగా సినీరంగంలో అడుగుపెట్టి, తనదైన ముద్ర వేస్తూ.. తల్లి బసవతారకం స్మారకంగా క్యాన్సర్ ఆస్పత్రి ద్వారా నాణ్యమైన వైద్యసేవలు అందిస్తున్న ఆయన మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



మండే.. సూరీడు!

పుణ్యక్షేత్రమైన తిరుపతిలో సోమవారం రోజంతా సూర్యుడు నిప్పులు కుమ్మరించాడు. ఎండ తీవ్రత.. ఉక్కపోతతో జనం అల్లాడిపోయారు. సాయంత్రానికీ ఆ వేడి తగ్గలేదు. భగ భగ మండుతూనే సూర్యుడు కొండల్లోకి జారుకున్నాడు.



రోడ్డు పక్కన చెత్త కుప్పల్లో పారేసిన డిస్పోజ్ గ్లాసులను తీసుకుని ఇలా రోడ్డుకిరువైపులా తోరణాలు కట్టారు. గ్లాసులకు రంగులు పూసి వాటిని చెట్లకు అలంకరించారు. దారిపొడవునా కర్రలు పాతి తోరణాల్లాగా కట్టారు. విజయవాడ సమీపంలోని రాయనపాడు గ్రామంలో దర్శనమిచ్చాయి ఈ డిస్పోజ్ గ్లాసుల తోరణాలు.

ఏబీవీ క్వాష్ పిటిషన్‌పై తీర్పు రిజర్వు

» హైకోర్టులో ముగిసిన వాదనలు.. ఏసీబీ కోర్టు విచారణపై స్టే



అమరావతి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): నిఘా పరికరాల కొనుగోలు వ్యవహారంలో తనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం హైకోర్టులో వాదనలు ముగిశాయి. ఇరువైపుల వాదనలు ముగియడంతో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ తీర్పును రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించారు. విజయవాడ ఏసీబీ ప్రత్యేక కోర్టులో విచారణపై స్టే విధిస్తున్నట్లు ప్రకటించారు. భద్రత, నిఘా పరికరాల కొనుగోలుకు సంబంధించి తనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ ఏబీ వెంకటేశ్వరరావు హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం సోమవారం విచారణకు రాగా సీనియర్ న్యాయవాది బి.ఆదినారాయణరావు వాదనలు వినిపించారు. నిఘా పరికరాల కొనుగోలు ప్రక్రియను అప్పటి డీజీపీ ప్రారంభించి, కాంపిటెంట్ అథారిటీ హోదాలో డీజీపీ సాంకేతిక, కొనుగోలు కమిటీలను ఏర్పాటు చేశారన్నారు. డీజీపీ కోరిన మేరకు కమిటీల్లో సభ్యులుగా సీనియర్ అధికారుల పేర్లను పిటిషనర్ సూచించారన్నారు. పరికరాల కొనుగోలు టెండర్ ప్రక్రియలో పిటిషనర్‌కు ఎలాంటి పాత్ర లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీసీఐఎల్)కు నిఘా పరికరాల కొనుగోలు టెండర్ ప్రక్రియను అప్పగించారన్నారు. పరిపాలన, సాంకేతిక కారణాలతో కొనుగోలు నిర్ణయాన్ని డీజీపీ వెనక్కితీసుకొని టెండర్‌ను రద్దు చేశారన్నారు. కొనుగోలు ప్రక్రియ నిలిచిపోవడంతో సేవలు అందించినందుకుగాను ఎస్‌టీసీఐఎల్ రూ.10 లక్షలు మినహాయించుకుందన్నారు. తర్వాత ఆ సొమ్మును కూడా వెనక్కి ఇచ్చిందన్నారు. అవినీతి నిరోధక చట్టంలోని వివిధ సెక్షన్ల కింద పిటిషనర్‌పై నమోదు చేసిన కేసు చెల్లుబాటు కాదన్నారు. ఆంధ్ర, తెలంగాణ మినహా దేశంలోని ఇతర రాష్ట్రాల్లో పిటిషనర్ కుమారుడికి చెందిన ఆకాశం అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ఇజ్రాయెల్ సంస్థకు ప్రతినిధిగా వ్యవహరించారన్నారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో తమకు అనుబంధంగా ఎలాంటి సంస్థలు లేవని ఇజ్రాయెల్ సంస్థ స్పష్టం చేసిందన్నారు. ఈ నేపథ్యంలో కుమారుడికి అనుచిత లబ్ధి చేకూర్చారనే ప్రశ్నే ఉత్పన్నం కాదన్నారు. పిటిషనర్ ఒక్కడినే నిందితుడిగా పేర్కొన్నందున ఇతరులతో కలిసి కుట్రకు పాల్పడ్డారనే ప్రశ్నే ఉత్పన్నం కాదన్నారు. ఈ కేసుకు సెక్షన్ 120బీ వర్తించదన్నారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని కేసు కొట్టివేయాలని వాదనలు వినిపించారు. ఏసీబీ తరఫున స్టాండింగ్ కౌన్సిల్ శీతిరాజు శ్యామ్ సుందర్‌రావు వాదనలు వినిపిస్తూ.. అధికారులు కేసు దర్యాప్తు పూర్తిచేసి చార్జిషీటు దాఖలు చేశారన్నారు. ఏసీబీ కోర్టు చార్జిషీట్‌ను కాగ్నిజెన్స్‌లోకి తీసుకొని పిటిషనర్‌కు సమన్లు ఇచ్చిందన్నారు. పిటిషనర్‌కు అవినీతి నిరోధక చట్టం వర్తిస్తుందన్నారు. వాదనలు ముగియడంతో న్యాయమూర్తి తీర్పును రిజర్వు చేశారు.

పీవీ సునీల్ సస్పెన్షన్ పొడిగింపు



అమరావతి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): సీఐడీ మాజీ చీఫ్ పీవీ సునీల్‌కుమార్ సస్పెన్షన్‌ను రాష్ట్ర ప్రభుత్వం మరో నాలుగు నెలలు పొడిగించింది. ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించేలా విదేశీ పర్యటనలకు వెళ్లిన ఆయన, అఖిల భారత సర్వీసు నిబంధనలు ఉల్లంఘించారంటూ ఇప్పటికే వేటు పడింది. రివ్యూ కమిటీ సిఫారసుల మేరకు ఆగస్టు 28 వరకూ సస్పెన్షన్‌ను పొడిగిస్తూ సీఎస్ విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. జగన్ ప్రభుత్వ హయాంలో పీవీ సునీల్‌కుమార్ 2019 డిసెంబరు నుంచి 2024 మార్చి వరకూ పలుమార్లు విదేశీ పర్యటనలకు వెళ్లొచ్చారు. అమెరికా వెళ్లేందుకు అనుమతి తీసుకుని జార్జియాకు.. యూకే వెళుతున్నానంటూ దుబాయ్ వెళ్లొచ్చారు. ఉన్నతస్థానంలో ఉన్న సీనియర్ ఐపీఎస్ దేశం దాటి వెళ్లాలంటే ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. ఆయన భద్రతతోపాటు దేశభద్రతకు సంబంధించిన విషయాలు సీఐడీ అధిపతి లాంటి వారికి తెలుస్తాయి గనుక ప్రభుత్వ అనుమతి లేకుండా దేశం దాటకూడదు. డీజీపీ ర్యాంకు అధికారి అలా వెళ్లడాన్ని సీరియస్‌గా పరిగణించిన కూటమి ప్రభుత్వం ఆయనపై చర్యలు తీసుకుంది.

ఏపీ సీఐడీలో 28 హోంగార్డు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

» మే 1 నుంచి దరఖాస్తులు.. కంప్యూటర్, డ్రైవింగ్ తప్పనిసరి

అమరావతి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఏపీ సీఐడీలో 28 హోంగార్డు పోస్టుల భర్తీకి పోలీసు శాఖ సోమవారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన మహిళా, పురుష అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. 18 నుంచి 50 ఏళ్ల లోపు వయస్సు ఉన్నవారు అర్హులు. పురుష అభ్యర్థులు 160, మహిళా అభ్యర్థులు 150సెం.మీ.. ఎత్తు ఉండాలి. ఎస్‌టీ మహిళలకు 5సెం.మీ సడలింపు ఉంటుంది. దరఖాస్తుదారులకు కంప్యూటర్ పరిజ్ఞానం, లైట్, హెవీ మోటారు వాహన డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలి. మే 1నుంచి 15వరకూ దరఖాస్తులు స్వీకరిస్తారు. దరఖాస్తులు.. ఏపీ పోలీస్ సీఐడీ వెబ్‌సైట్ https://cid.appolice.gov.in లో అందుబాటులో ఉన్నాయి. దరఖాస్తుల పరిశీలన అనంతరం అర్హులైన అభ్యర్థులకు కంప్యూటర్, టైపింగ్, డ్రైవింగ్ పరీక్ష నిర్వహించి తుది ఎంపిక చేస్తామని సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ తెలిపారు. వివరాల కోసం 94407 00860 నంబర్‌కు ఆఫీసు పనివేళల్లో సంప్రదించవచ్చన్నారు.

విడదల గోపికి బెయిల్ ఇవ్వండి

» ఏసీబీ కోర్టులో ఆయన న్యాయవాది వాదనలు

» తదుపరి విచారణ నేటికి వాయిదా



విజయవాడ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): స్టోన్ క్రషర్ యజమానిని డబ్బుల కోసం బెదిరించిన కేసులో విడదల వేణుగోపాల కృష్ణ (గోపి)కి బెయిల్ మంజూరు చేయాలని విజయవాడలోని ఏసీబీ కోర్టులో ఆయన తరఫు న్యాయవాది నరేంద్ర సోమవారం అభ్యర్థించారు. బెయిల్ పిటిషన్‌పై వాదనల సమయంలోనే ఏసీబీ అధికారులు దాఖలు చేసిన కస్టడీ పిటిషన్‌పై కూడా వాదనలు వినిపించారు. ఈ కేసులో హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని కోరారు. మాజీ మంత్రి విడదల రజిని మరిది గోపిపై ఏసీబీ అధికారులు ముందుగా ఐపీసీ 384 సెక్షన్ కింద కేసు నమోదు చేశారన్నారు. ఇది బెయిలబుల్ సెక్షన్ కావడంతో తర్వాత బెయిల్ రాకుండా ఐపీసీ 386 సెక్షన్‌కు మార్పు చేశారన్నారు. ఈ కేసులో ఏ1, ఏ4 నిందితులకు 41ఏ నోటీసు ఇచ్చి విచారించాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చిందన్నారు. హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో గోపి పేరుందని చెప్పారు. గోపిని అరెస్టు చేసిన మర్నాడు హైకోర్టు ఆ తీర్పును ఇచ్చిందని వివరించారు. దీని ప్రకారం గోపికి బెయిల్ ఇవ్వొచ్చని అభిప్రాయపడ్డారు. అనంతరం ప్రాసిక్యూషన్ తరఫున వాదనల కోసం విచారణను మంగళవారానికి కోర్టు వాయిదా వేసింది.

రాష్ట్ర ప్రగతిపై పగ!

(మొదటి పేజీ తరువాయి)

అసత్యాలతో తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఇందులో భాగంగానే.. 'ఉర్సాకు ఉచితంగా భూములు ఇచ్చేశారు' అంటూ జగన్ రోత పత్రిక అక్కసు వెళ్లగక్కింది. ఉర్సా సంస్థ ఊరూపేరూ లేనిదన్నట్లుగా అభివర్ణించింది. పెట్టుబడుల విషయంలో వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ వైఖరికి ఈ కథనం అద్దం పట్టింది. అసలు విషయం ఏమిటంటే... ఉర్సా క్లస్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఒక అంతర్జాతీయ సంస్థ. మరో విషయం ఏమిటంటే... ఆ సంస్థకు భూములు ఉచితంగా ఇవ్వలేదు.

ఇది రియల్ ఎస్టేట్ వ్యాపారమా?

పరిశ్రమలు రావాలంటే... ప్రోత్సాహకాలు కల్పించాలి. అందులో... భూమిని రాయితీ ధరకు కేటాయించడం కూడా భాగం. వచ్చే పెట్టుబడి, కల్పించే ఉద్యోగాలు, భూమి ఇచ్చే ప్రాంతాన్ని బట్టి ధర నిర్ణయిస్తారు. ఇది అందరికీ తెలిసిన విషయమే. ముఖ్యమంత్రిగా పని చేసిన వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ఇంకా బాగా తెలిసి ఉండాలి. కానీ... పరిశ్రమలకు భూకేటాయింపులపై అడ్డగోలు ఆరోపణలు చేస్తున్నారు. పరిశ్రమలకు భూకేటాయింపులంటే రియల్ ఎస్టేట్ వ్యాపారం కాదు. కానీ, వైఎస్ హయాంలో భూకేటాయింపులను పక్కాగా 'క్విడ్ ప్రోకో' కోసం వాడుకున్నారు. ఊరూపేరూ లేని కంపెనీలకు అడ్డగోలుగా భూములు కేటాయించడం, వారు ఆ భూములను బ్యాంకుల్లో తాకట్టు పెట్టుకుని సొమ్ములు చేసుకుని దుకాణం మూసేసి వెళ్లిపోవడం! ఇదీ వైఎస్ హయాంలో జరిగింది. ఇప్పుడు జరుగుతున్నది అది కాదు! పరిశ్రమలకు భూకేటాయింపులపై ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఏఐ, డేటాబేస్ కంపెనీలపై ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. అందులో భాగంగా ఆ రంగంలో అంతర్జాతీయంగా పేరున్న కంపెనీలను రాష్ట్రానికి ఆహ్వానిస్తోంది. ఉర్సా క్లస్టర్స్ కూడా అందులో భాగంగానే రాష్ట్రానికి వచ్చేందుకు సిద్ధమైంది. కానీ... అదేదో అనామక సంస్థగా, ప్రభుత్వ పెద్దల బినామీది అన్నట్లుగా వైసీపీ విషం చిమ్ముతోంది.

ఇదీ... ఉర్సా నేపథ్యం...

అంతర్జాతీయ కంపెనీలు ఇతర దేశాల్లో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చేటప్పుడు ముందుగా అక్కడ స్పెషల్ పర్పస్ వెహికల్(ఎస్పీవీ)ను ఏర్పాటు చేసుకుంటాయి. ఉర్సా క్లస్టర్స్ అంతర్జాతీయంగా పేరున్న నిపుణులతో ఏర్పాటైన కంపెనీ. అభివృద్ధి చెందే రాష్ట్రాల్లో ఏపీని ఒకటిగా భావించడంతోపాటు సొంత రాష్ట్రంపై మమకారంతో... సంస్థ యాజమాన్యం ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చింది. అందులో భాగంగా ఇక్కడ రెండు నెలల క్రితం ఎస్పీవీని ఏర్పాటు చేసుకుంది. అంతర్జాతీయ కంపెనీలు పెట్టుబడులు గురించి అవగాహన ఉన్న వారికి ఎవరికైనా ఈ విషయం తెలుస్తుంది. కానీ జగన్ మాత్రం ఉర్సా కంపెనీ రెండు నెలలు ముందు పెట్టిన కంపెనీ అంటూ దుష్ప్రచారం చేస్తున్నారు. రెండు నెలల కిందట పెట్టింది ఎస్పీవీ మాత్రమే! అసలు కంపెనీ ఎప్పటి నుంచో ఉన్నదే! ఇది వాస్తవం!

'99 పైసలు'... పచ్చి అబద్ధం

'ఉర్సా క్లస్టర్స్‌కు ఎకరా 99 పైసలకు భూమి కేటాయించారు. ఇడ్లీ కూడా రూపాయికి రాదు' అంటూ వైఎస్ జగన్ వెకిలి వ్యాఖ్యలు చేస్తుండటం గమనార్హం. వాస్తవానికి... ప్రభుత్వం ప్రఖ్యాత ఐటీ సంస్థ టీసీఎస్‌కు విశాఖ ఐటీ పార్కులో 99 పైసలకు 21 ఎకరాలను లీజుకు కేటాయించింది. అదే ఐటీ పార్కులో ఉర్సాకు ఎకరా రూ.కోటికి, కాపులుప్పాడులో ఎకరా రూ.50 లక్షల చొప్పున ధర నిర్ణయించింది. భూకేటాయింపులు చేసినా వారికి సేల్ డీడ్ చేయలేదు. పెట్టుబడులు పెట్టిన తర్వాతే ఆ భూమిని వారికి అప్పగిస్తామని కేబినెట్ భేటీలో స్పష్టంగా తీర్మానించారు. ఇవన్నీ జగన్‌కు తెలియక కాదు. కానీ... రాష్ట్రానికి పరిశ్రమలు రాకుండా చేయడం, ప్రభుత్వంపై బురదజల్లడం లక్ష్యంతోనే ఆయన తప్పుడు ప్రచారం చేస్తున్నారనేది సుస్పష్టం.

నాడు జగన్ చేసిందీ ఇదే...

ప్రస్తుత ప్రభుత్వం ఉర్సాకు భూకేటాయింపులు చేసిన విశాఖలో డేటాసెంటర్ పార్కు ఏర్పాటు చేస్తామన్న అదానీ ఎంటర్‌ప్రైజస్‌కు 130 ఎకరాలు కేటాయిస్తూ 2021 అక్టోబరులో జగన్ కేబినెట్ తీర్మానించింది. అదానీతోపాటు చాలా కంపెనీలకు ఎకరా కోటి చొప్పున విశాఖ ఐటీ పార్కులో జగన్ హయాంలో భూకేటాయింపులు చేశారు. అప్పుడు సక్రమం అయింది ఇప్పుడు తప్పు ఎలా అవుతుందన్నది ప్రశ్న!

కియా మొదలు.. ఉర్సా వరకు..

అబద్ధాలు, అర్ధసత్యాలని తెలిసీ జగన్, ఆయన రోత పత్రిక తప్పుడు ప్రచారం ఎందుకు చేస్తోందంటారా? దీని వెనుక భారీ కుట్ర ఉందని ప్రభుత్వం అనుమానిస్తోంది. 2014-19 మధ్య కూడా జగన్ ఇలాగే వ్యవహరించారు. అనంతపురంలో కియా పరిశ్రమకు ఇచ్చిన రాయితీలు, భూకేటాయింపులపైనా ఇలాగే దుష్ప్రచారం చేశారు. ప్రస్తుతం... ఉపాధి కల్పనలో, రాష్ట్రానికి ఆదాయాన్ని సమకూర్చడంలోనూ కియా ముందు వరుసలో ఉంది. ఇక... రాజధాని అమరావతిపై వైసీపీ చేసిన దుష్ప్రచారం అంతా ఇంతా కాదు. వరదలు వస్తే మునిగిపోతుందని, రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కున్నారని రాజధానికి నిధులు సమకూరుస్తున్న ప్రపంచ బ్యాంకుకు, ఇతర అంతర్జాతీయ ఆర్థిక సంస్థలకు ఫిర్యాదులు చేశారు. కోర్టుల్లో కేసులు వేశారు. ఇన్‌సైడ్ ట్రేడింగ్ జరిగిందని ఆరోపించారు. అవన్నీ... తప్పుడు ఆరోపణలే అని స్పష్టంగా రుజువైంది. ఇప్పుడూ మళ్లీ అదే పంథాను అనుసరిస్తున్నారు. పెట్టుబడిదారుల విశ్వసనీయతపై సందేహాలు లేవనెత్తడం, వాళ్ల ప్రతిష్ఠను దెబ్బతీయడమనే వ్యూహాన్ని అనుసరిస్తున్నారు.

'ఉర్సా'పై దుష్ప్రచారం

» 99 పైసలకే భూములిచ్చినట్టు నిరూపించండి

» కొమ్మారెడ్డి పట్టాభి ఆగ్రహం



అమరావతి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఉర్సా కంపెనీకి విశాఖలో ఎకరం 99పైసల చొప్పున భూములు కేటాయించినట్లు ఆరోపిస్తున్న మాజీ సీఎం జగన్, అందుకు ఆధారాలు బయటపెట్టాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి డిమాండ్ చేశారు. జగన్ దొంగల ముఠా, ఫేక్ ముఠాది వట్టి దుష్ప్రచారమేనన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2019-24 మధ్యకాలంలో వైసీపీ ప్రభుత్వం పైసా పెట్టుబడి రాష్ట్రానికి తీసుకురాకపోగా, ఉన్న కంపెనీలను వెనక్కి తరిమేసిందని విమర్శించారు. ఇప్పుడు రాష్ట్రాభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. "అమెరికాకు చెందిన ఉర్సా క్లస్టర్స్ సుమారు రూ.5,196 కోట్ల పెట్టుబడితో డేటా సెంటర్‌ను నెలకొల్పేందుకు ముందుకు వచ్చింది. ఆ కంపెనీకి విశాఖ ఐటీ పార్కు వద్ద ఎకరా రూ.కోటికి, కాపులుప్పాడు వద్ద ఎకరా రూ.50 లక్షలకు భూములు కేటాయిస్తే, దిక్కుమాలిన జగన్ పత్రికలో ఊరుపేరు లేని కంపెనీకి ఎకరం 99 పైసలకే అంటూ తప్పుడు రాతలు రాస్తున్నారు. జగన్ హయాంలో విశాఖ ఐటీ పార్కులో వైజాగ్ టెక్‌పార్క్ లిమిటెడ్‌కి ఎకరా రూ.కోటి చొప్పున జగన్ భూమిని కేటాయించిన మాట వాస్తవం కాదా? మీరే కేటాయించిన రేటుకు మేం మరో కంపెనీకి భూమి కేటాయించి కేబినెట్‌లో తీర్మానం చేస్తే ఎందుకు దుష్ప్రచారం చేస్తున్నారు?" అని ప్రశ్నించారు. తాము జగన్‌లా రూ.500 కోట్లతో రుషికొండకు గుండు కొట్టించి ప్యాలెస్ కట్టుకోలేదన్నారు. "జగన్ హయాంలో ప్రతి జిల్లాలోనూ విలువైన భూములు ఆక్రమించుకుని ఎకరాకు నెలకు రూ.1000 చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 44 ఎకరాలు వైసీపీ కార్యాలయాలకు కేటాయించుకున్నారు. ఇదేనా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం అంటే? జగన్ తన తండ్రి హయాంలో క్విడ్‌ప్రోకో కింద వాన్‌పిక్ పేరుతో వేల ఎకరాలు దోచుకున్నారు. తనను కీర్తిస్తూ యాత్ర 1.2 తీసిన డైరెక్టర్‌కు హార్సిలీహిల్స్‌లో ఉచితంగా 2 ఎకరాలు, తన రాజగురువు శారదాపీఠానికి విశాఖలో కోట్లు విలువైన 15 ఎకరాలను రూ.15 లక్షల చొప్పున కేటాయించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి, పరిశ్రమలకు భూములు కేటాయిస్తే మాత్రం గగ్గోలు పెడుతూ దుష్ప్రచారం చేస్తున్నారు" అంటూ పట్టాభి మండిపడ్డారు.

వంశీ బెయిల్ పిటిషన్‌పై 2న నిర్ణయం

అమరావతి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): గన్నవరం టీడీపీ కార్యాలయంపై మూకదాడి వ్యవహారంలో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ, ఆయన అనుచరులు మరికొందరు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై సోమవారం హైకోర్టులో వాదనలు ముగిశాయి. దీంతో పిటిషన్లపై వచ్చే నెల 2న నిర్ణయం వెల్లడిస్తామని న్యాయస్థానం ప్రకటించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జున రావు సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నీలోత్పల్ వాదనలు వినిపించారు. కేసుకి సంబంధించి మే 2న ప్రాథమిక చార్జ్‌షీట్ దాఖలు చేస్తామన్నారు. ఛార్జ్‌షీట్ దాఖలుకు 90 రోజుల గడువు ఉందన్నారు. వంశీ, ఇతర నిందితులు ఫిర్యాదుదారుడిని కిడ్నాప్ చేసి, బెదిరింపులకు పాల్పడ్డారన్నారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.శ్రీరామ్, న్యాయవాది సత్యశ్రీ వాదనలు వినిపించారు. వంశీని అరెస్ట్ చేసి ఇప్పటికే 60 రోజులు గడిచాయని, పోలీసులు ఛార్జ్‌షీట్ దాఖలు చేయలేదని చెప్పారు. బెయిల్ మంజూరు చేయాలని కోరారు.

బోరుగడ్డ రిమాండ్ పొడిగింపు

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్ రిమాండ్‌ను మే 9వరకు పొడిగిస్తూ స్థానిక రెండవ అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.గాయత్రి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు ఫిరంగిపురం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆ కేసులో మార్చి 24న స్థానిక కోర్టులో బోరుగడ్డను ప్రవేశపెట్టగా న్యాయాధికారి రిమాండ్ విధించిన విషయం తెలిసిందే. మరో కేసులో అనంతపురం జిల్లా కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్న బోరుగడ్డను పోలీసులు సోమవారం నరసరావుపేట కోర్టులో హాజరుపరిచారు.

పాలేటి కృష్ణవేణి పోలీసు విచారణ పూర్తి

» అసత్య ప్రచారం కేసులో ఒకరోజు విచారణ

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తూ పోస్టులు పెట్టిన కేసులో వైసీపీ కార్యకర్త పాలేటి కృష్ణవేణిని పల్నాడు పోలీసులు సోమవారం విచారించారు. రిమాండ్ ఖైదీగా ఉన్న ఆమెను కస్టడీలోకి తీసుకుని ఉదయం నుంచి సాయంత్రం వరకు విచారించి తిరిగి సబ్ జైలులో అప్పగించారు. ఈనెల 11న వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా నరసరావుపేటలో నిర్వహించిన ప్రదర్శనలో సీఎం చంద్రబాబు, ప్రధాని మోదీ చిత్రపటాలపై చెప్పులతో కొట్టినట్లు కృష్ణవేణి సోషల్‌మీడియాలో అసత్య ప్రచారం చేశారు. దీనిపై నమోదైన కేసులో మే 5 వరకు కోర్టు రిమాండ్ విధించిన విషయం తెలిసిందే. విచారణ నిమిత్తం కృష్ణవేణిని తమ కస్టడీకి ఇవ్వాలని గత బుధవారం నరసరావుపేట మొదటి పట్టణ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు సోమవారం ఒకరోజు పోలీస్ కస్టడీకి అనుమతిస్తూ శనివారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు పోలీసులు కృష్ణవేణిని పోలీసులు విచారించారు.

జెత్వానీ ఎవరో తెలీదు!

(మొదటి పేజీ తరువాయి)

జవాబులిచ్చినట్లు తెలిసింది. జెత్వానీని వేధింపులకు గురిచేసిన కేసులో విజయవాడ జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న పీఎస్ఆర్(ఏ-2)ను మూడ్రోజులు కస్టడీలో విచారించేందుకు కోర్టు అనుమతించగా.. తొలిరోజు ఆదివారం విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించినప్పుడు బీపీ ఎక్కువగా ఉండడంతో సీఐడీ అధికారులు ఆయన్ను తిరిగి జైలులోనే అప్పగించారు. సోమవారం ఉదయం జైలు నుంచి ముందుగా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చేసిన పరీక్షల్లో బీపీ 160/95గా ఉండడంతో విచారణకు తీసుకెళ్లారు. కానూరులోని సీఐడీ ప్రాంతీయ కార్యాలయంలో సాయంత్రం 5 గంటల వరకు విచారించారు. దర్యాప్తు అధికారి (ఆర్ఐవో) ప్రసాద్ ఆధ్వర్యంలో రెండు బృందాలు ఆయన్ను ప్రశ్నించాయి. మొత్తం 82 ప్రశ్నలు సంధించాయి. జెత్వానీపై కేసు నమోదు చేయాలని ఎవరు ఆదేశించారని అడుగగా.. అసలామె ఎవరో తనకు తెలియదని పీఎస్ఆర్ బదులిచ్చారు. కుక్కల విద్యాసాగర్ ఎవరి ద్వారా కలిశారని అడుగగా.. ఆయన కూడా తనకు తెలియదని చెప్పారు. స్వాధీనం చేసుకున్న ఫోన్‌ను చూపించి అది ఎవరిదని ప్రశ్నిస్తే.. తనదేనని అంగీకరించారు. ఉపయోగించిన సిమ్ నంబర్‌ను ప్రస్తావించగా.. అది కూడా తనదేనని చెప్పారు. జెత్వానీపై కేసు నమోదు చేయడానికి ముందు జగన్ నివాసాని(సీఎంవో)కి వెళ్లారు కదా అని అడుగగా.. వెళ్తే వెళ్లి ఉండవచ్చని దాటవేశారు. కోర్టు ఇచ్చిన మూడ్రోజుల కస్టడీ గడువు మంగళవారంతో ముగియనుంది. చివరిరోజు సీఐడీ మరో 80 ప్రశ్నలు సిద్ధం చేసినట్లు సమాచారం. విచారణ అనంతరం పీఎస్ఆర్‌ను జైలుకు తరలిస్తారు.

మీ పోలీసు భోజనం వద్దు

విచారణకు హాజరైన పీఎస్ఆర్.. పోలీసులు అందించిన భోజనం తినడానికి ఇష్టపడలేదు.



సీఐడీ కార్యాలయం నుంచి పీఎస్సార్ ఆంజనేయులును ఆసుపత్రికి తీసుకెళ్తున్న పోలీసులు

ఉదయం సీఐడీ కార్యాలయానికి తీసుకెళ్లాక అల్పాహారం తీసుకోవాలని వారు కోరగా.. ఆయన సున్నితంగా తిరస్కరించారు. భోజన విరామ సమయంలో భోజనం చేయాలని సూచించగా.. 'మీ పోలీసు భోజనం నాకొద్దు' అని చెప్పారు. సీనియర్ పోలీసు అధికారిగా ఉన్న పీఎస్ఆర్.. తనకు, పోలీసు శాఖకు మధ్య గీత గీశారని పోలీసు వర్గాలు అంటున్నాయి. ఆయన కాఫీ మాత్రమే తాగినట్లు తెలిసింది.

ఇంటి భోజనం అనుమతించండి

» పీఎస్ఆర్ పిటిషన్

తనకు ఇంటి నుంచి భోజనం, మందులు, తాగునీరు అనుమతించాలని ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు విజయవాడలోని మూడో అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో సోమవారం పిటిషన్ దాఖలు చేశారు. జైలులో నిద్రపోవడానికి సౌకర్యంగా ఉండే పడకను ఏర్పాటు చేయాలని ఆయన తరఫున న్యాయవాది విష్ణువర్ధన్ దాఖలు చేసిన పిటిషన్‌లో కోరారు.

జెత్వాని కేసులో ఐపీఎస్‌ల క్వాష్ పిటిషన్లపై విచారణ 1కి వాయిదా

» తనపై కేసును కొట్టివేయాలని హైకోర్టులో పీఎస్ఆర్ మరో పిటిషన్

అమరావతి/విజయవాడ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): సినీనటి కాదంబరి జెత్వాని ఫిర్యాదు ఆధారంగా ఇబ్రహీంపట్నం పోలీసులు తమపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ ఐపీఎస్ అధికారులు కాంతిరాణా తాతా, విశాల్ గున్ని, అప్పటి ఏసీపీ కె.హనుమంతరావు, దర్యాప్తు అధికారి కె.సత్యనారాయణ వేసిన క్వాష్ పిటిషన్లపై విచారణను హైకోర్టు గురువారానికి వాయిదా వేసింది. సోమవారం వ్యాజ్యాలు విచారణకు వచ్చిన సమయంలో ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ స్పందిస్తూ.. ఈ కేసుల్లో అడ్వొకేట్ జనరల్ వాదనలు వినిపిస్తారని, విచారణను మే 1కి వాయిదా వేయాలని కోరారు. దీనికి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ అంగీకరించారు. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ నిందితులు ఇటీవల హైకోర్టును ఆశ్రయించారు. ఆ వ్యాజ్యాలు సోమవారం విచారణకు రాగా నిందితుల తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపించారు. కేసులో నిందితులను విచారణకు పిలవబోమని ఏజీ కోర్టుకు హామీ ఇచ్చారన్నారు. అందుకు విరుద్ధంగా సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులును అరెస్ట్ చేశారని చెప్పారు. పిటిషనర్ల విషయంలో సైతం తొందరపాటు చర్యలు తీసుకొనే అవకాశం లేకపోలేదన్నారు. తదుపరి విచారణ వరకు స్టే విధించాలని కోరారు. మరోవైపు ఇదే వ్యవహారంలో తనపై కేసును కొట్టివేయాలని కోరుతూ సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు సోమవారం హైకోర్టులో పిటిషన్ వేశారు.

మిథున్‌రెడ్డి బెయిల్‌పై ఉన్న ఉద్రిక్తత సరిహద్దుల్లోనూ లేదు!

» ఒక్క వ్యాజ్యంపై నలుగురు సీనియర్ లాయర్లు వాదనలు వినిపిస్తారా?

» సుప్రీంకోర్టు ధర్మాసనం వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి ముందస్తు బెయిల్ వ్యవహారంలో ఉన్నంత ఉద్రిక్తత దేశ సరిహద్దుల్లోనూ లేదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఏపీ మద్యం కుంభకోణం వ్యవహారంలో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ మిథున్‌రెడ్డి ఈ నెల 3న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్ న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పార్థీవాలా, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం ముందు సోమవారం విచారణకు వచ్చింది. ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, సిద్ధార్థ్ లూథ్ర, మిథున్ రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాదులు అభిషేక్ మను సింఘ్వీ, నిరంజన్ రెడ్డి హాజరయ్యారు.



ఒక ముందస్తు బెయిల్ పిటిషన్‌పై నలుగురు సీనియర్ న్యాయవాదులు వాదలను వినిపించడంపై జస్టిస్ పార్థీవాలా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ముందస్తు బెయిల్ వ్యవహారంలో ఉన్న ఉద్రిక్తత ప్రస్తుతం దేశ సరిహద్దుల్లోనూ లేదని అన్నారు. కాగా, తమకు కౌంటర్ అఫిడవిట్ ఇవ్వకుండా ప్రభుత్వ తరఫు న్యాయవాదులు ముందస్తు బెయిల్‌ను వ్యతిరేకించడం సరికాదని సింఘ్వీ అన్నారు. ప్రభుత్వ కౌంటర్ అన్ని విషయాలను బహిర్గతం చేస్తుందని లూథ్రా తెలిపారు. ఈ సందర్భంగా ధర్మాసనం.. మిథున్‌రెడ్డి అసలు విచారణాధికారి ముందు హాజరయ్యారా? అని ప్రశ్నించింది. హాజరయ్యారని న్యాయవాది నిరంజన్‌రెడ్డి సమాధానమిచ్చారు. ఇరుపక్షాల వాదనల అనంతరం విచారణను ధర్మాసనం 2 వారాలకు వాయిదా వేసింది. మిథున్ రెడ్డికి గతంలో ఇచ్చిన మధ్యంతర రక్షణ కొనసాగుతుందని తెలిపింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.